# సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు




శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి.



## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ పాదపద్మములకు


**ప్రథమ ముద్రణ : 2023**

**వెల : 20/-**

**ప్రాప్తిస్థానము :**

**శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్,**

**గొలగమూడి, నెల్లూరు జిల్లా - 524 321.**

Please Visit :: http://www.saimastersevatrust.org/


PDF బుక్ QR Code

సార్ ప్రవచనములు
(Audio) QR Code

## విషయ సూచిక


| | |
|---|---|
| **సమర్థ సద్గురువు** | **3** |
| గొప్ప మహనీయులు | 3 |
| సర్వజ్ఞుడు | 6 |
| సర్వ సమర్థుడు | 16 |
| సర్వ హృదయాంతర్వర్తి | 18 |
| సర్వ జీవ స్వరూపాయ నమః | 20 |
| సాధారణత్వం | 20 |
| యోగీశ్వరుడు | 21 |
| **దైవం మానుష రూపేణ** | **23** |
| **ఆశ్రిత కల్పవృక్షం** | **36** |
| విద్యా ప్రదాత | 41 |
| ఉద్యోగ ప్రదాత | 46 |
| ఆరోగ్య ప్రదాత | 48 |
| సత్సంగ ప్రదాత | 51 |
| భక్త భారభృతాయ నమః | 57 |
| కర్మ విధ్వంసకాయ నమః | 58 |
| **ధర్మాచరణ** | **64** |
| మహా మతిః | 67 |
| సద్ధర్మ సంరక్షకాయ నమః | 70 |
| కర్తవ్య బోధ | 72 |
| సన్మాత్రాయ నమః | 78 |
| సంస్కారాలను మార్చే మహా వైద్యులు | 81 |
| నిష్కామ కర్మ - సద్గురు సేవ | 83 |
| **సద్గురు అనుగ్రహం** | **86** |
| **మహా సమాధి** | **91** |
| **నిత్య సత్యులు శ్రీ సార్** | **92** |
| మహా సమాధి అనంతరం లీలలు | 93 |

## ముందుమాట

సామాన్యులమైన మనకు "భగవంతుడు" ఉనికి ఎలా తెలుస్తుంది? అత్యద్భుతమైన "భగవంతుని అనుగ్రహము" ఎలా అనుభవమవుతుంది? ఆశ-వ్యామోహాలకు లోబడక "ధర్మాచరణ" ఎలా సాధ్యము అవుతుంది? "నిష్కామ కర్మ" చేయాలి అన్న ప్రేరణ ఎక్కడ నుండి కలుగుతుంది?

ఈ ప్రశ్నలన్నింటికి సమాధానము - సద్గురువు, సద్గురుని జీవనం, సాంగత్యం, ఆశ్రయము, సేవ అని శ్రీ భరద్వాజ మాస్టారి ప్రతి రచనలో ప్రస్ఫుటిస్తుంది.

ఎవరు అట్టి సద్గురువు? ఆ సద్గురుని లక్షణాలు ఏమిటి? అను ప్రశ్న వెంటనే మనకు ఉదయిస్తుంది. దైవీ సంపద లక్షణాలు జీవనంలో ప్రతిబింబిస్తూ, "సర్వ సమర్థత్వం, సర్వజ్ఞత్వం, సర్వ వ్యాపకత్వం" ప్రకటమైన వారే "సద్గురువు" అని శ్రీ భరద్వాజ మాష్టారి రచనలో తెలుస్తుంది.

శ్రీ సుబ్బరామయ్య సార్ లో దైవీ సంపద ప్రస్ఫుటించటం "పరోపకారార్థ మిదం శరీరం" అనే పుస్తకంలో చూడవచ్చు. ఈ చిన్న పుస్తకంలో శ్రీ సార్ ద్వారా ఎందరో సన్నిహితులకు ప్రకటమైన అనుభవాలు శ్రీ సార్ సద్గురు తత్వానికి దర్పణం పట్టడమే కాక, అట్టి సద్గురువు తనను ఆశ్రయించిన వారికి "ఆశ్రిత కల్పవృక్షమై", వారిచే సులభ రీతిలో "ధర్మాచరణ" చేయించి, "నిష్కామకర్మ" లో భాగం చేసి, "సద్గురు అనుగ్రహానికి" పాత్రులు అయ్యేటట్లు ఎలా చేస్తారో తెలుపుతున్నాయి. ఈ పుస్తకము చదివిన వారందరూ "నిత్య సత్యులైన" శ్రీ సార్ కృపను పొందాలని ప్రార్థన.

\- శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

## సమర్ధ సద్గురువు

ఈ అధ్యాయములో శ్రీ సార్ తో సాంగత్యం లభించిన వారి అనుభవాల ననుసరించి, సమకాలిన మహాత్ముల ప్రశంసల ఆధారంగా, శ్రీ సుబ్బరామయ్య సార్ ను "సమర్ధ సద్గురువు" గా గుర్తింపు కలిగించే లీలలు సమీకరించుకుందాము.

### గొప్ప మహనీయులు

15. 8. 2020 శనివారం రాత్రి శ్రీ వేణుగోపాల్ గారికి మాస్టారు గారు ప్రసాదించిన స్వప్న దర్శనంలో **శ్రీ కసుమూరు మస్తానయ్య స్వామి, శ్రీ సుబ్బరామయ్య సార్ ఒకటే** అని చెప్పిన విషయాన్ని ఇలా తెలుపుతున్నారు-

వేణుగోపాల్ గారు గొలగమూడి లో ఉన్నారు. తనకు తెలిసిన మిత్రుల ద్వారా శ్రీ భరద్వాజ మాస్టర్ గారు విద్యానగర్ వచ్చి ఉన్నారు అని తెలిసింది. విద్యానగర్ వెళ్లి మాస్టర్ ని దర్శించుకోవాలి అని మనసులో అనుకుంటూ ఉండగానే మాస్టర్ గారు గూడూరు మీదుగా ఒంగోలు వెళ్లిపోయారని తెలిసి "అయ్యో మాస్టర్ గారిని చూచి చాలా కాలం అయ్యింది కదా దర్శించుకోలేక పోయానే" అని చాలా ఆవేదన చెందారు. అలానే స్వప్నంలో రెండు రోజులు గడిచిపోయాయి. తర్వాత మరలా మాస్టర్ గారు విద్యానగర్ వచ్చారని తెలిసింది. గొలగమూడి నుంచి వేణుగోపాల్ గారు మరికొంతమంది సత్సంగ సభ్యులతో (జయమ్మ, జయచంద్రా రెడ్డి గారు) కలిసి విద్యానగర్ వెళ్లారు. ఆ దంపతులు మాస్టారు గారు ఉండే తపోవనం లోపలికి వెళ్లారు. వీరు మాత్రం బయట చెట్టు కింద మాస్టారు గారు ఇంతకు ముందు నిలబడి ఉన్న ప్రదేశంలో నిలుచుని మాస్టార్ గారికి పాద నమస్కారం చేసుకొని చాలాకాలం అయింది కదా అనుకొని, లోపలికెళ్ళి మాస్టర్ గారికి తనివితీరా పాద నమస్కారం చేసుకొని, కుడి అరికాలి భాగాన్ని ముద్దు పెట్టు కున్నారు.

అంతలో మాస్టర్ గారు **కసుమూరు దర్గా లో ఉన్నది ఎవరు అనుకున్నావు? పి. సుబ్బరామయ్య అని చెప్పి, మహాత్ములను సేవించు అని ఒక కొబ్బరికాయ వీరికి ఇస్తూ దీనిని సమాధికి అర్పించు** అని చెప్పారు. ఆ తర్వాత మాస్టర్ గారి మీద ఇంకా పూర్తిగా విశ్వాసం లేని ఎవరో అపరిచిత వ్యక్తి కూడా అక్కడ కనిపించారు. మాస్టర్ గారు విదేశాల నుండి తిరిగి వచ్చి అందరికీ గిఫ్ట్ లు ఇస్తున్నారు వీరికి రెండు పెన్నులు, రెండు బ్రష్ లు, రెండు స్పూన్లు ఇచ్చారు. ఆ అపరిచిత వ్యక్తికి కూడా రెండు పెన్నులు, రెండు స్పూన్లు ఇచ్చారు. అంతలోనే ఆ వ్యక్తికి మాస్టర్ గారి మీద ఎంతో భక్తిశ్రద్ధలు ఏర్పడ్డాయి.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

ఆ సమయంలో లో వేణు గోపాల్ గారికి **శ్రీ సుబ్బరామయ్య సార్ నీ గురువు, వారిని గొప్పగా సేవించుకో అని మాస్టర్ గారు** ఆదేశించారని మనసులో స్ఫురించింది. అదేవిధంగా మాస్టర్ గారు ఇచ్చిన గిఫ్ట్ లు రెండు బ్రష్ లుకు సంకేతం శ్రీ సాయి మాస్టర్ నిలయాన్ని శుభ్రంగా ఉంచమని, రెండు స్పూన్లు అంటే అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వర్తించమని, రెండు పెన్నులకు సంకేతంగా శ్రీ సుబ్బరామయ్య సార్ రాసిన పుస్తకాల ముద్రణ, ప్రచారం కొనసాగించమని మాస్టర్ గారు చెప్పారనే భావన వీరికి కలిగింది.

పై స్వప్నం ద్వారా సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ అందరి మహాత్ముల రూపంలో ఉన్నారని మరియు వేణుగోపాల్ గారికి భవిష్యత్తు కర్తవ్యం శ్రీ మాస్టర్ గారు బోధించారనిపిస్తుంది. అంతేగాకుండా ఈ స్వప్నం కసుమూరు మస్తాన్ బాబా లీలలు సేకరించడానికి ప్రేరణగా నిలిచింది.

**ధర్మాచారణ : చుక్కాని - దారా నాగేశ్వర రావు గారు, దమ్మపేట**

ఆధ్యాత్మికతకి ధర్మాచరణ చాలా ముఖ్యము. సార్ నా చేత ఆచరింప చేయటం వలన సార్ దగ్గరికి రాకముందు, వచ్చిన తర్వాత జీవితానికి ఎంతో మార్పు ఉన్నది. నా దగ్గర డబ్బు ఉంటే సామాన్యంగా దాన్ని ఎలా ఎక్కువ చేసుకోవాలి అని ఆలోచిస్తూ వడ్డీలకు తిప్పటం జరిగేది. అలాంటిది సార్ గారు "బ్యాంకులో వేసుకుంటే అది నలుగురికి ఉపయోగపడుతుంది. అది ఎంతో పుణ్యం. అంతేగాని వడ్డీలకు తిప్పకూడదు" అని చెప్పారు. సార్ మాట, ఆ సంకల్పబలం వలన వెంబడే నాలో మార్పు వచ్చి ఇంక ఎన్నడూ అలా చేయలేదు. నేనే కాకుండా మా పిల్లలకి అలాంటి ఆలోచనలు రాలేదు. అంతేకాకుండా మా అల్లుడు గారు వారికి సంబంధించిన బంధువులకు కావాల్సిన ఆర్థిక సాయం చేసాడు. కొన్నాళ్ళ తరువాత 20 వేల రూపాయలు వడ్డీ మా అల్లుడు గారుకి ఇస్తే, దానిని వెనుకకు ఇచ్చి వేస్తూ 'నేను మీకు ఆర్థిక ఇబ్బంది ఉంది కాబట్టి ఇచ్చాను అంతేగానీ వడ్డీకి ఇవ్వలేదు' అని చెప్పారు.

**కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. గొలగమూడి కి వచ్చినప్పుడు ప్రదక్షిణలు చేయండి. తడిగుడ్డతో ప్రదక్షిణలు చేయండి** అని సార్ చెప్పేవారు. ఆయన యొక్క సంకల్పం వలన అప్పటి నుంచి ఇప్పటికి కూడా ఏ ఇబ్బంది రాలేదు. అంతేకాకుండా ఎంతటి వర్షం వచ్చినా ప్రదక్షిణలు చేయాలి అనే ఉత్సాహం సార్ సంకల్పం వలన మాత్రమే అది సాధ్యం అవుతున్నది.

**నెల నెలా గొలగమూడి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటే చాలా మంచిది** అని ఒకసారి సార్ చెప్పారు. అప్పటి నుండి ప్రతి నెల స్వామి దర్శనానికి వెళ్లడం జరుగుతోంది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అవన్నీ కూడా స్వామి దయ వలన ఆ ఇబ్బందులన్నీ ప్రక్కకు జరుగుతున్నాయి. ఒకసారి కాలు విరిగింది. కట్టు కట్టించుకున్నాను. ఆరాధనకు రావటానికి రిజర్వేషన్లు లేకుండా రైల్లో ప్రయాణం చేస్తూ గొలగమూడి స్వామి దర్శనానికి వచ్చాను. సార్ నాతో "మీరు స్వామి ప్రేరణ వలన వచ్చారు, అందువల్ల మీకు ఇబ్బంది జరగదు. మీకు ఏం చేయాలనిపిస్తే అది చేయండి" అని చెప్పారు. అప్పుడు స్వామికి ఎప్పుడు చేసే పొర్లుదండాలు కూడా పెట్టాను. ఏ ఇబ్బందీ కలగలేదు. ఇది కేవలము సుబ్బరామయ్య సార్ ప్రోత్సహించి ధైర్యం చెప్పి చేయించటం వల్ల మాత్రమే జరుగుతోంది. అంతా ఆయన దయ.

సార్ చెప్పినది: **మనము అధర్మంగా సంపాదించినది నలుగురికి ఇస్తే మనం చేసిన కర్మలో వారు కూడా భాగమవుతారు. ఆస్తులు ఎలా ఇస్తామో అలానే కర్మలు కూడా వస్తాయి. అందువలన చాలా జాగ్రత్తగా ఉండాలి** అని చెప్పారు. నేను ఇతరులకు ఉపయోగపడుతూ ఉంటాను, వీలైనంత ఎవరికైనా సహాయం చేయడం వలన స్వామి నా (నడవడిలో) తప్పులు ఉన్నా కూడా నన్ను మంచి మార్గంలో పెట్టారు అని సార్ బ్రహ్మం గారి మఠం దగ్గర సత్సంగంలో చెప్పారు.

స్వామి మందిరంలో ప్రదక్షిణలు చేసి వచ్చిన తర్వాత సాయి మాస్టర్ నిలయంలో ఉండి ఏదైనా ఊసుపోని కబుర్లు చెప్తూ ఉంటే సార్ వచ్చి ఎంతో పరుషంగా మాట్లాడుతూ **"మీరు ఎందుకు ఇక్కడికి వచ్చింది. మీరు ఇంకా కొత్తగా కర్మ తెచ్చుకోవటానికి కాదు కదా"** అని చెప్పి గొలగమూడిలో కాలాన్ని సద్వినియోగం అయ్యేటట్లు చేసేవారు.

ఒకసారి వెంకయ్య స్వామి కలలో **"అందరూ చెప్పే వాళ్లే చేసే వాళ్ళు లేరయ్యా"** అని చెప్పినప్పుడు ఆ విషయం సార్ కి చెప్పాను. వారు అవును ఎవరూ కూడా స్వామి చెప్పిన వెంబడే క్షుణ్ణంగా చేయలేరు. మనం ప్రయత్నం చేస్తూ ఉంటే తప్పులు జరుగుతున్నా, స్వామే మన చేత వాటిని సరి చేయిస్తారు అని అన్నారు.

ఒంటిపూట బడులు అని పొద్దున పూట స్వామికి ఇచ్చిన టైంకి రెండు నిమిషాలు ముందుగా వెళ్ళిపోతుంటే స్వామి ఒకరోజు రాత్రి కలలో రెండు నిమిషాలు సూచించారు. ఆ విషయం సార్ కి చెబితే సార్ **"స్వామికి ఇచ్చిన సమయం చేస్తూ ఉంటే ఎనలేని సంపద వస్తుంది. అనంత కరుణామయుడు యొక్క కృప కలగాలి అంటే ఆయనకు ఏది ఇస్తామని చెప్పామో దాన్ని**

**నిరంతరము ఇవ్వటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఆ భగవంతుడు ఎనలేని సంపదను ఇస్తాడు"** అని చెప్పారు. ఇదంతా కేవలము సుబ్బరామయ్య గారి యొక్క సూచన ప్రకారం, వారి సంకల్ప ప్రకారము జరుగుతున్నాయి, అంతేగాని నేనే చేస్తున్నాను అని అనుకోవటం అహంకారమే అవుతుంది.

ఆరాధనప్పుడు గొలగమూడిలో ఒకరోజు స్వామి యొక్క భిక్ష దొరకదు. అలాంటప్పుడు ఏ మాత్రం నీరసంగానీ అలసట ఉండదు. అది కేవలం సార్ నియమం పెట్టి ఆచరింప చేయిస్తున్నారు.

**సర్వజ్ఞుడు**

ఒకరోజు బ్రహ్మం గారి మఠంలో సార్ సాయి సుబ్రహ్మణ్యంతో మాట్లాడుతూ "నాంపల్లి బాబా గారి దగ్గర పూజారిగా ఉన్న రాజుకి ఉత్తరం వ్రాయాలని" చెప్పారు. సార్ ఆ ఉత్తరంలో **"నువ్వు కానీ, నేను కానీ ఎంత కాలం ఉంటామో తెలియదు. నాంపల్లిబాబా భక్తుల అనుభవాలు జాప్యం చేయక సేకరించు."** అని రాజు గారికి చెప్పారు. ఒక వారం తర్వాత ఒక రోజు బ్రహ్మంగారి మఠంలో సత్సంగం చేస్తున్న సార్, రాజు గారి నుండి వచ్చిన ఉత్తరంలో “నాంపల్లి బాబాగారు సమాధి అయ్యారు” అన్న విషయం చూపుతూ, సాయి సుబ్రహ్మణ్యం వంక చూసి కళ్ళతో సైగ చేసారు. ఈ విషయం గూర్చే క్రిందటి వారం నీచే వ్రాయించిన లెటర్ లో ప్రస్తావించినది అన్నట్లు. దానితో సార్ కి భవిష్యత్తులో జరిగే ప్రతి విషయం తెలుస్తుందని, మహనీయుల దివ్య లీలలు ఎంత ప్రాముఖ్యమో సాయి సుబ్రహ్మణ్యంకు మరోసారి ఎరుక కలిగింది. **శ్రీ సార్ త్రికాలజ్ఞులు!**

ప్రతి సంవత్సరం ఆగస్ట్ 24వ తేదీ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధన సందర్భంగా గొలగమూడి శ్రీ సాయిమాస్టర్ నిలయంలో 23, 24వ తేదీలు మూడు పూటలా భోజనాలు మరియు 25వ తేదీన ఉదయం ఫలహారం భక్తులకు పెడతారు. 2012 ఆగస్టు 25వ తేదీ ఉదయానికి శ్రీ సాయిమాస్టర్ నిలయంలో 20 మంది భక్తులు ఉన్నారు. ఆ రోజు ఉదయము ఫలహారం కింద ఉప్మా చేయాలని అనుకుని ఎంతమందికి వండాలి అని దమ్మపేట నాగేశ్వరరావు గారు సార్ ని అడిగారు. సార్ 10 కేజీలు వండమన్నారు. ఉన్నది 20 మంది కదా ఒకటి, రెండు కేజీలు సరిపోతుంది అని నాగమణి గారు రెండు కేజీలు ఉప్మా చేశారు. తినే సమయానికి చాలామంది భక్తులు వచ్చారు. వారందరికీ ప్రసాదం పెట్టినట్లు కొంచెం పెట్టారు. వెంటనే పది కేజీల ఉప్మా చేస్తే మొత్తం అయిపోయింది. సార్ కి ఎంతమంది వచ్చేది తెలుసు !

అట్టి **మహాత్ముల మాటలను మారు ప్రశ్న లేక ఆచరించిన వారు మేలుపొందటం తథ్యం!**

ఏ సమయంలో ఏ పని చేయిస్తే ఆ భక్తుడికి భగవంతుడి మీద మనస్సు లగ్నం అవుతుందో సార్ కి స్పష్టంగా తెలుసు.

ప్రసాద్ కి పెళ్ళయిన తర్వాత సుమారు రెండు నెలలకు సార్ ప్రసాద్ తో "స్వామి గురించి చిన్న పుస్తకాలలో ఉన్న ప్రతి లీలను ఒకటి రెండు వాక్యాలతో వ్రాసి పెట్టుకుంటే, ఎవరైనా ఏదైనా లీల చెపితే ఆ లీల గ్రంధస్థం చేసామో లేదో తెలుస్తుంది" అని చెప్పారు. స్వామి లీలలను ప్రసాద్ ఒకటి, రెండు వాక్యాలలో వ్రాస్తూ ఉండటం వలన అతని మనస్సు అంతా స్వామి మీదే లగ్నం అయ్యింది.

ఒకసారి ప్రసాద్ విజయవాడ నుండి గొలగమూడి వస్తూంటే సార్ ఫోన్ చేసి ఒక స్వామి లీల ఏ పుస్తకంలో ఉంది అని అడిగారు. ప్రసాద్ చెప్పలేక పోయాడు. ఆ క్షణం నుండి గొలగమూడి వెళ్ళే దాకా స్వామి స్మరణతో సమయాన్ని సద్వినియోగం చేసుకోగలిగాడు. సార్ ఫోన్ చేసే దాకా స్వామి స్మరణ లేదు. సర్వజ్ఞులైన సార్ ప్రసాద్ కి ఫోన్ చేసి **సద్గురు దర్శనానికి నామస్మరణతో రావాలి** అని చెప్పకనే చెపుతూ ఆ విధంగా దర్శనానికి రప్పించుకున్నారు.

సాయి సుబ్రహ్మణ్యం హాస్పిటలైజ్ అయినప్పుడు అచ్చటి ఆహారము, ఇతర పరిస్థితుల వల్ల రాత్రి నిద్ర సరిగా పట్టేది కాదు. అప్పటి వరకు గొలగమూడి లో సార్ సాంగత్యంలో ఉన్నంతగా భగవంతుని స్మరణ కూడా జరిగేది కాదు. రెండవరోజు శ్రీ సార్ ఫోన్ చేసి సాయి వాళ్ళ అమ్మగారితో "అమ్మ! మీరు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన తరువాత ఇంటికి వెళ్ళేటప్పుడు ఒకసారి కారులో అయినా సాయిని ఇక్కడకు తీసుకువచ్చి, స్వామికి కృతజ్ఞతగా దండం పెట్టి వెళ్లి పొండి" అని చెప్పారు. శ్రీ సార్ మాటలలో ఏమి మహత్యం ఉందో కానీ సాయి ఆలోచన అంతా శ్రీ సార్, స్వామి మీదకు వెళ్ళింది. సాయికి తాను పాలు ఎక్కువగా త్రాగటం వల్లనే నిద్ర పట్టటం లేదు అనే ఎరుక కలిగించారు. పగలు పడుకోబోతే ఒక డాక్టర్ వచ్చి పగలు పడుకుంటే రాత్రి నిద్ర ఎలా పడుతుంది అని అనటంతో పగలు అంతా సార్, స్వామి స్మరణతో గడవటం వల్ల రాత్రి నిద్ర పట్టేది. సాయి త్వరగా కోలుకొని, తిరుగు ప్రయాణంలో 3 రోజులు సార్, స్వామి సన్నిధిలో గడపడం జరిగింది. **ఏ పరిస్థితులలోనైనా సద్గురు స్మరణ ప్రదాత శ్రీ సార్.**

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

శ్రీ సార్ సత్సంగం, హెచ్చరికల కారణంగా తరువాత నెల రోజులు సాయి దమ్మపేటలో రెస్ట్ తెసుకోవలసి వచ్చినా, ఆ నెల వ్యర్ధ సంభాషణలతో (పరామర్శలతో) గడపక, అతను స్వామి స్మరణలో గడిపేలా చేసారు. లౌకికంగా కష్ట కాలమే అయినా, వ్యర్ధ ఆలోచనలతో సంభాషణలతో, ఆరోగ్య జాగ్రత్తల నెపంతో సార్ స్మరణ నుండి తొలగనీయక వారి కృప, సర్వ సమర్ధత, ప్రేమలతో నిరంతర స్మరణ ప్రదాతగా నిలిచారు. అలానే సాయి PhD చదివేటప్పుడు ఎన్నో భయాలను, అపోహలను తొలగించి, వారి సన్నిధికి రప్పించుకుంటూ, ఆరోగ్యం ప్రసాదిస్తూ, చదువులో ఏమాత్రం వెనకబడకుండా ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదిస్తూ నిరంతర స్మరణ తో ఎన్నో దివ్యానుభవాలతో నడిపించారు.

సాయి పోస్ట్ డాక్టరేట్ కోసం France చదువుకు వెళ్ళినప్పుడు మరల మరపు వచ్చిన సన్నివేశంలో “నువ్వు అక్కడ చేసేవి నాకు తెలుస్తాయి” అన్న అనుభవములు ఇస్తూ, వాచా “నువ్వు అక్కడ చేసేవి నాకు ఎలా తెలుస్తాయి?” అన్న చురకవేసి మరుపును తొలగించి మరల నిరంతర స్మరణ వైపు నడిపించారు. **నిరంతర స్మరణ ప్రదాత శ్రీ సార్ !**

హైమవతి (అమ్మలు, హైదరాబాద్ ) 2003 నుంచి నెలకు రెండుసార్లు రిజర్వేషన్ లేకుండా విజయవాడ - నెల్లూరు - విజయవాడకి ప్రయాణం చేసేవారు. ఒకసారి ఆమె సార్ కి చెప్పి పినాకిని ఎక్స్ప్రెస్ లో విజయవాడకు బయలుదేరాలని రైల్వే స్టేషన్ కి వచ్చేసరికి ట్రైన్ ప్లాట్ఫారం మీద ఉంది. ఆమె టికెట్ తీసుకోకుండానే ట్రైన్ ఎక్కి విజయవాడలో దిగిన తర్వాత టికెట్ కలెక్టర్ కి టికెట్ డబ్బులు ఇచ్చారు. రెండు వారాల తర్వాత ఆమె సార్ దగ్గరకి వెళ్లినప్పుడు సార్ ఆమెతో "అక్కడ ఎందుకు డబ్బులు ఇచ్చావు, ఇక్కడ కదా డబ్బులు ఇవ్వాల్సింది" అని అన్నారు. ఇట్టి చమత్కారముతో శ్రీ సార్ తమ కృపను, సర్వజ్ఞత్వాన్ని తెలియపరిచారు.

సర్వజ్ఞులైన శ్రీ సార్ మనం చేసే ప్రతి పనిని ఎల్లప్పుడూ గమనిస్తూ, మన మంచి పనులను, స్వామి కృపను కలిగించే ఆచరణను ప్రోత్సహిస్తూ ఉంటారు అనేది ఎందరి అనుభవమో ! "మాస్టర్ అంటే దైవం" అన్న పుస్తకం 15 రూపాయల ఖరీదు అయినా సార్ చాలా మందికి ఫ్రీగా ఇచ్చారు. కొంతమంది హైమవతిని ఆ పుస్తకం కావాలని అడిగారు. ఆమె తరువాత వారం సార్ ని ఆ పుస్తకాలు ఇవ్వమని అడిగింది. సార్ రెండు పుస్తకాలు మళ్ళీ ఫ్రీగా ఇచ్చారు. ఆమె మాత్రం హుండీలో 30 రూపాయలు వేసింది. ఆ విషయం ఆమె సార్ కి చెప్పలేదు. మళ్ళీ తర్వాత ఇంకో ఇద్దరు ఆ పుస్తకం కావాలని అడిగారు. తరువాత వారం గొలగమూడి వెళ్ళినప్పుడు మళ్లీ రెండు

పుస్తకాలు సార్ ని హైమవతి అడిగింది. సార్ ఫ్రీ గా ఇచ్చారు. 'సార్ డబ్బులు తీసుకోండి' అని హైమవతి అంటే సార్ “నువ్వు ఎలాగూ హుండీలో వేస్తావు కదా” అన్నారు!

స్వామి సేవలో ఇబ్బంది రాకుండా చూడటం, వచ్చే ఇబ్బందులను తొలగించటం శ్రీ సార్ వివిధ రీతులలో చేసేవారు.

ఒకరోజు ఉదయం గొలగమూడి నుండి బయలుదేరేటప్పుడు సార్ హైమవతితో ఎలా వెళతావో ఏమిటో అన్నారు. హైమవతి వెళ్లాల్సిన ట్రైన్ వెళ్ళిపోయి మళ్లీ వేరే ట్రైన్ కోసం వెయిట్ చేసి ఈవినింగ్ కి ఇంటికి వెళ్లింది. విజయవాడ నుండి గొలగమూడి, గొలగమూడి నుండి విజయవాడకు అర్ధరాత్రి, అపరాత్రి అయినా ప్రయాణం చేసేది కానీ ఎప్పుడూ ఆమెకు శ్రీ సార్ చిన్న ఇబ్బంది కూడా కలగనివ్వలేదు.

ఒకసారి ఒక తెలిసిన ఆవిడ హైమవతితో విజయవాడ నుండి గొలగమూడికి వస్తున్నారు. ఆమెతో హైమవతి 'నేను రైల్వే స్టేషన్ వచ్చేసరికి లేట్ అవుతుంది. అందువలన టికెట్ మీరు తీసుకోండి' అని చెప్పింది. ఆవిడకి ఆమె టికెట్ తీసుకోమన్నట్లు అర్ధమైంది. ఆమె అలానే ఆమె టికెట్ మాత్రమే తీసుకున్నారు. హైమవతి స్టేషన్ దగ్గరికి వెళ్ళేసరికి రెండు గంటల ఇరవై నిమిషాలు దాటింది. ఆవిడను టికెట్ అడిగితే ఆమె తీసుకోలేదన్నారు. కౌంటర్ దగ్గరికి వెళ్లి టికెట్ తీసుకొని మళ్ళీ ట్రైన్ ఎక్కేసరికి కనీసం 15 నిమిషాలు పడుతుంది. రెండు గంటల 30 నిమిషాలకు ఆ ట్రైన్ స్టార్ట్ అవుతుంది. అప్పుడు హైమవతి సార్ కి మనస్సులో ఇలా చెప్పుకున్నది 'సార్! మీ ఇష్టం. నేను టెన్షన్ తట్టుకోలేక పోతున్నాను. టికెట్ కొనటానికి వెళుతున్నాను. మీరే దిక్కు' అని. హైమవతి టికెట్ తెచ్చి తన సీట్ లో కూర్చున్న తరువాత మాత్రమే ట్రైన్ కదిలింది.

విజయవాడలో మాస్టర్ గారి పుస్తకాలు, జ్ఞానేశ్వరి భగవద్గీత పుస్తకాల మీద 25% డిస్కౌంట్ వచ్చేది. అందువలన సార్ హైమవతి చేత శని, ఆదివారాలు విజయవాడ నుండి ఒంగోలు వచ్చేటప్పుడు, ఆ పుస్తకాలను తెప్పించేవారు. వాటిని ఆ డిస్కౌంట్ ధరలకే భక్తులకు ఇచ్చే సేవ చేసేవారు. ఒకసారి హైమవతి గొలగమూడి నుండి బయలుదేరి వెళ్ళినప్పుడు సార్ ఆమెతో “నువ్వు ఈసారి వచ్చేటప్పుడు ఏ పుస్తకాలు తీసుకు రావాలో ఉత్తరం వ్రాస్తాను” అన్నారు. కానీ శుక్రవారం మధ్యాహ్నం దాకా సార్ దగ్గర నుండి హైమవతికి ఉత్తరం రాలేదు. ఆమె ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సార్ కి ఫోన్ చేద్దామనుకుని నిద్ర పోయింది. ఆమె లేటుగా నిద్ర లేచిన తర్వాత

బాధపడి సాయిబాబాకు క్షమాపణ చెప్పుకున్నది. తర్వాత 10 నిమిషాలకు ఆమె అన్నయ్య (ప్రసాద్) ఫోన్ చేసి ఇంతకు ముందే సార్ ఫోన్ చేసి నీవు తీసుకు రావలసిన పుస్తకాల లిస్ట్ చెప్పారు అని ఏ ఏ పుస్తకాలు తీసుకు రావాలో చెప్పాడు. ఆమె సాయిబాబాకు చెపితే సార్ వెంటనే ఫోన్ చేయటం బట్టి సాయిబాబా, సార్ ఒకటే అని అనిపించింది. అంతేగాకుండా ఆ విధంగా స్వామి పుస్తకాలు సార్ ఆమె చేత మోయించి, గురుసేవ చేయించి కర్మని క్షాళన చేశారు అని ఆమె విశ్వాసం.

శ్రీ సాయి మాస్టర్ సమ్మేళనం మందలపల్లిలో జరిగినప్పటి ప్రవచనాలు రికార్డు చేసిన టేప్ సార్ దగ్గరకి వస్తే అవి సార్ విన్నారు. హైమవతి వెళ్లినప్పుడు సార్ ఒక టేప్ ఇచ్చి “ఇందులో శ్రీ అనంత కృష్ణ గారు బాగా చెప్పారు. నువ్వు విను” అని చెప్పారు. శ్రీ అనంతకృష్ణ గారి ప్రవచనంలో **“గురువు దగ్గర ఏదీ దాచకూడదు”** అన్న విషయం ఆమెకు బాగా హత్తుకుంది. సార్ కి ముఖ్యమైన విషయాలు చెప్పలేదే అని ఆమెకు అనిపించి ఆ విషయాలను వివరిస్తూ ఆమె ఉత్తరం వ్రాసింది. తరువాత వారం సార్ ఆమె లెటర్ దగ్గర పెట్టుకుని సార్ ఇంట్లోని దేవుడి గదిలో కూర్చో పెట్టుకుని ఆమె ఏమి చేయాలో చెప్పారు. ఆమెకు సార్ గురువని ఆయనే చెప్పకనే చెప్పారు. అంతేగాకుండా గురువు దగ్గర ఎలా ప్రవర్తించాలో సారే చేయించారు.

పెళ్లికి ముందర సార్ హైమవతికి చెప్పిన మాట “స్వామి చెప్పినట్లు చేస్తే పెళ్లి తరువాత కూడా ఏమైనా ఇబ్బందులు వస్తే ఆయనే సరి చేస్తారు”. సార్ ఆమోదించిన సంబంధం ప్రకారం ఆమెకు పెళ్లి అయ్యింది. అలానే పెళ్లి తరువాత కొన్ని ఇబ్బందులు వస్తే సార్ సరిచేసి ఆమె కాపురాన్ని ఆనందంగా ఉంచారు.

హైమవతి పెళ్లిలో (ఆదివారం రాత్రి 11 గంటలకు ముహూర్తం) తలంబ్రాలు, మంగళ సూత్రం కనపడకుండా పోయాయి. ఆమె తల్లిదండ్రులు, మిగిలినవారు చాలా కంగారు పడ్డారు. ఆమె సార్ ను తలుచుకుంటున్న సందర్భంలో అవి కనపడి పెళ్లి సజావుగా జరిగింది. తర్వాత రోజు సార్ కి ఆమె అన్నయ్య ఫోన్ చేస్తే, శ్రీ సార్ “పెళ్లి సజావుగా జరగాలని స్వామి ధునిలో నిన్న సాయంత్రం 4 గంటలకు టెంకాయ సమర్పించాను. ముహూర్త సమయంలో స్వామి పటాల దగ్గర ప్రార్థించాను” అని చెప్పారు. ఆ విషయం విని ఆమె అన్నయ్యకు **సార్ కి ఎంత ప్రేమ అని, ఊహించని రీతి సద్గురువు సమస్యలను ఎలా తొలగిస్తారు, భగవంతుని ఎలా ప్రార్థించాలో అనేది కూడా తెలిసింది.**

హైమవతికి ఒక పాప, ఒక బాబు. పాప పుట్టే దాకా ఆమె ప్రతిరోజూ పారాయణ, ప్రదక్షిణలు చేసేది. తరువాత బద్ధకంతో ఆమె అవి చేసేది కాదు. ఆమెకు పాప పుట్టిన తర్వాత సంవత్సరానికి మరలా గర్భం ధరించింది. బాబు పుట్టే సరికి ఆమె 106 కేజీలు ఉన్నది. గొలగమూడికి వెళ్లినప్పుడు సార్ ఆమెను చూసి "నెత్తి మీద శని కూర్చొని ఉన్నాడు. పారాయణ, ప్రదక్షిణలు చేసి స్వామిని మెప్పించాలి" అని చెప్పి శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయి లీలామృతం, అవధూత లీల గ్రంధాలు ఇచ్చారు. అంతేగాకుండా ఆమెను నూనె తినవద్దని చెప్పారు. ఆమె సార్ చెప్పినట్లు పాటిస్తే ఒక సంవత్సరంలో ఆమె106 కేజీల నుండి 59 కేజీలకు వచ్చింది. ఆమె ఇంట్లో వాళ్ళు జాతకం చూపిస్తే అప్పుడు ఆమెకు ఏలినాటి శని నడుస్తోంది అని చెప్పారు. సార్ కి ఆమెను చూడంగానే ఏలినాటి శని విషయం ఎలా తెలిసింది? తరువాత సార్ దగ్గరకు వచ్చినప్పుడు సార్ అప్పటిదాకా ఆమె చేస్తున్న పారాయణ, ప్రదక్షిణలకు సంతసించి "స్వామే నిన్ను కరెక్ట్ (సెట్ రైట్) చేయటానికి ఏలినాటి శనిని నీ నెత్తి మీద పెట్టాడు" అని అన్నారు. చాలా చిత్రంగా ఆమె106 కేజీలు ఉన్నప్పుడు ఏనాడూ బి.పి. లేదు. డాక్టర్ కూడా చాలా ఆశ్చర్యపోయేది.

హైమవతి సార్ కి రెగ్యులర్ గా ఫోన్ చేసేది. ఒకసారి ఆమె ఫోన్ చేసినప్పుడు సార్ ఒక విషయం చెప్పి దీనిని మీ ఆయనకు చెప్పు, దానిని వ్రాసుకో అన్నారు. ఆమె 'సార్! పెన్ తెచ్చుకుంటాను. ప్లీజ్ సార్' అంటే సార్ "సరే! తెచ్చుకో" అన్నారు. ఆమెకు ఇంట్లో పెన్ కనపడక చాక్ పీస్ తెచ్చి చెప్పండి సార్ అంటూ భూమి మీద వ్రాస్తున్నది. సార్ "భూమి మీద వ్రాసుకో" అన్నారు. **సార్ మనకు కనబడే మామూలు మనిషి కాదు ఆయన అంతటా ఉన్న పరబ్రహ్మమే! లేకపోతే హైదరాబాద్ లో ఇంట్లో చేస్తున్న పని గొలగమూడిలో ఉన్న సార్ కి ఎలా తెలుస్తోంది?**

శివరత్నం (శివన్న) పిన్ని కూతురు సునీత. నెల్లూరులో 2004 నుండి 2007లో డిగ్రీ చేస్తున్న సమయంలో శివన్న గొలగమూడిలో ఉండటం వల్ల సునీత నెలకొకసారి గొలగమూడి వచ్చి స్వామి దర్శనం చేసుకుంటూ ఉండేది. అప్పుడు శ్రీ సుబ్బరామయ్య సార్ ఆమెతో "నువ్వు ప్రతి వారం స్వామి దర్శనానికి రావాలి. నీవు రావడానికి ఆరు రూపాయలు, పోవడానికి ఆరు రూపాయలు, ఒక మూడు రూపాయలతో స్వామికి అరటి పండ్లు కానీ ఏదైనా స్వామి కోసం సమర్పించు. మొత్తం 15 రూపాయలతో స్వామి దర్శనానికి రా" అని చెప్పారు. ఆమె అలానే చేసేది. డిగ్రీలో వచ్చిన సమ్మర్ హాలిడేస్ లో సునీత గొలగమూడిలో సాయి మాస్టర్ నిలయంలో ఉన్నది. సునీత ఆశ్రమంలో ఏదైనా

పని ఉంటే ఆ పని చేస్తూ ఉండేది. ఒకరోజు సునీతతో సార్ "నీ కష్టార్జితం ఎక్కడికి పోదు" అని అన్నారు. 2007లో డిగ్రీ అయిన తర్వాత ఐదు నెలలు సునీతకు “సాయి మాస్టర్ నిలయం” ఆశ్రమంలో ఉండగలిగే అవకాశం కలిగింది. ఒకసారి సార్ DKW కాలేజ్ లో జాబ్ ఓపెనింగ్స్ ఉన్నాయని చెప్పారు. అక్కడ సునీత ఒకటిన్నర సంవత్సరం ఉద్యోగం చేసింది. ఉద్యోగం చేస్తూ సునీత సార్ దగ్గరికి వస్తూ ఉండేది. సార్ ఆమెతో B.Ed చేయమని చెప్పారు. ఒకరోజు సార్ ఆమెతో "నీ పనులు నీవే చేసుకోవాలి. హైదరాబాద్ వెళ్లి రావాలన్నా నీవొక్కదానివే వెళ్ళి రావాలి" అని అన్నారు. అలానే సునీత B.Edలో చేరింది. తర్వాత హాస్టల్ లో ఉండాల్సి వచ్చింది. హాస్టల్ ఫీజు సునీత మొదటి రెండు నెలలు కట్టిన తర్వాత, ఆర్థిక స్తోమత లేకుంటే హాస్టల్ ఫీజు సార్ కట్టారు. ఆ సమయంలో సునీత నూనె లేకుండా ఆహారం తింటున్నది. హాస్టల్ లో ప్రత్యేకంగా నూనె లేకుండా చేయడం అంటే చాలా కష్టం అందువల్ల సునీత ఈ విషయం సార్ కి చెప్పింది. సార్ "హాస్టల్ లో నూనె లేకుండా వండమను వాళ్ళు వండుతారు" అని చెప్పారు. అదేమి చిత్రమో సార్ చెప్పిన మాట చెప్తే జాగ్రత్తగా హాస్టల్ వాళ్లు వంటలలో నూనె లేకుండా సునీతకు తీసి ప్రక్కన పెట్టిన తర్వాత మిగిలిన వాళ్లకి ఆయిల్ వేసి వండేవాళ్ళు. వారు అంత జాగ్రత్తగా వంట చేయడం అనేది సార్ యొక్క కృప. ఇట్టి చిత్రమైన అనుభవాలతో మనం నియమపాలన చేయదలిస్తే “విశ్వ ప్రేరణాధికారి” గా దానిని సుగమం చేస్తారని, **స్వామి, సార్ సన్నిధిలో వెచ్చించిన కష్టార్జితం కానీ, సమయం కానీ మన జీవనోపాధికి, మనకు శ్రీ రామ రక్ష అని గుర్తింప చేశారు.**

సునీత ఒకసారి నెల్లూరు నుండి గొలగమూడికి వస్తూ ఆటోలో ఎక్కింది. సునీత ఒక్కతే ఉంది. ఆమె నాంపల్లి బాబా పుస్తకాన్ని చదువుకుంటూ ఉన్నది. మధ్య దారిలో సునీతకు భయమేసి ఆటో దిగి పోదామనుకున్నా కానీ దిగలేదు. **గొలగమూడి వచ్చిన తర్వాత సునీత చెప్పకుండానే సార్ "ఆటో దిగుదామనుకుంటే దిగకుండా ఏం చేశావు, అయినా ఎందుకంత భయపడ్డావు" అని సునీతతో అన్నారు.** అంటే సునీత నెల్లూరులో బయలుదేరి గొలగమూడి వచ్చేదాకా ఆమె మనసులో వచ్చిన ఆలోచనలు కూడా సార్ కి తెలుసు అని నిరూపణ అవుతోంది. అమ్మగారు (సార్ ధర్మ పత్ని) జరిగిన విషయం తెలుసుకొని "ఈ కాలంలో పిల్లలు సరిగా ఉండటం లేదు. అందువల్ల నువ్వు ఒక్కదానివే ప్రయాణం చెయ్యకు! ఎవరైనా ఉంటేనే ప్రయాణం చెయ్యి" అని చెప్పారు. అమ్మగారు, సార్ ఎంతో ప్రేమతో ముఖ్యమైన సలహాలు ఇచ్చేవారు. **సర్వజ్ఞులు అయిన శ్రీ సార్ ముందే తగిన సూచనలు, ధైర్యం**

**ఇవ్వటమే కాక, సర్వవ్యాపిగా నిరంతరం మనతోనే ఉన్నారు** అని ఈ అనుభవం తెలుపుతోంది.

ఒకసారి సునీత ఫ్రెండ్ షాపింగ్ చేద్దాము అని సునీతను రమ్మంది. సునీత 'గొలగమూడి వెళ్ళాలి, రాలేను' అని గొలగమూడి వచ్చేసింది. సార్ సత్సంగంలో సునీత ఏమీ చెప్పకుండానే **"కొంతమంది షాపింగ్ చేయమని అడుగుతారు. వెళ్తే మనను మంచి వాళ్ళు అంటారు. లేకపోతే మనం చెడ్డవాళ్ళము అంటారు. కానీ షాపింగ్ లో టైం వేస్ట్ చేయకుండా స్వామి దగ్గరికి వస్తే అది చాలా పుణ్యం. అలా ఉండాలి"** అని చెప్పటం వల్ల సునీతకు సార్ కి అన్ని విషయాలు తెలుస్తాయి అనే భావన దృఢమైంది. **సర్వజ్ఞులైన శ్రీ సార్ మన ప్రతి పనిని చూస్తూ మన బుద్ధిని సన్మార్గంలో ప్రేరేపించి నడిపించే దైవ స్వరూపులు, సర్వ సమర్థులు!**

సునీత తమ్ముడు అమర్ కు చిన్నప్పటి నుంచి కూడా అనవసరంగా కోపం వచ్చేది. ఆ సమయంలో అతని చేతిలో ఏది ఉంటే దాన్ని విసిరివేయడం పగలగొట్టడం చేసేవాడు. అలాంటి సందర్భాలలో ఫిట్స్ కూడా వచ్చేవి. ఒకసారి గొలగమూడికి వచ్చినప్పుడు సార్ సత్సంగంలో ఉన్నారు. సత్సంగం అయిన తర్వాత అమర్ కి అలానే కోపం వచ్చి, తరువాత ఫిట్స్ వచ్చి పడిపోయాడు. సార్ అతన్ని చూసి వెంకయ్యస్వామి దగ్గరికి వెళ్లి ఒక అరగంట ఉండమని చెప్పారు. వారు అలానే చేశారు. అంతే అప్పటినుంచి అమర్ కి ఆ విపరీతమైన కోపం పోయింది. అంతేగాకుండా అతనికి fits కూడా మరెన్నడూ రాలేదు.

సాయి సుబ్రహ్మణ్యంకు ఒక రోజు ఉదయం సార్ బిస్కెట్ ఇస్తే అది అతను తినకుండా చేతిలో ఉంచుకొని సార్ లోనికి వెళ్ళిపోయాక కాకబలికి బయటపెట్టాడు. ఆ రోజు సాయంత్రం సార్ మరల బిస్కెట్ ఇస్తూ "ఇది కాకబలికి కాదు, నీకు!" అనటం ద్వారా నువ్వు ఇంతకు ముందు పెట్టింది నాకు తెలుసు అని చెప్పడమే కాక సద్గురువు మనపై ఎంతటి శ్రద్ధ వహిస్తారో తెలిసింది.

ఒకరోజు పాకలపాటి గురువుగారి చరిత్ర విశేషాలను చిన్నబాబు గారు చెప్పిన క్యాసెట్ విని సాయి సుబ్రహ్మణ్యంను శ్రీ సార్ వ్రాయమన్నారు. కొద్ది రోజుల తరువాత వ్రాయటం అయిపోయింది అని సాయి సార్ తో చెపితే "అయిపోయిందా?" అని ప్రశ్నార్ధకంగా అడిగారు. అప్పుడు సంశయం కల్గి సాయి వెళ్లి మరల చూసుకుంటే ఇంకా పూర్తి కాలేదని తెలిసి, పూర్తి చేయాల్సిన పని చేసి సార్ దగ్గరకు వెళ్లి ఇప్పుడు పూర్తి అయింది సార్ అని చెప్పాడు.

అప్పుడు సార్ "రైట్" అని చెప్పి అవి తీసుకున్నారు. ఈ విషయం ఎంతో చిన్నదిగా ఉన్నా సార్ కి అన్ని విషయాలు తెలుస్తాయి అన్నది సాయి సుబ్రహ్మణ్యం కు అప్పుడే మొదటిగా ఎరుక కలిగింది (కలిగించారు). అక్కడ చరిత్ర విశేషాలు పూర్తిగా వ్రాశారో లేదో అనేది కూడా తెలుస్తుందని చెప్పడమే కాకుండా సాయి చేత మిగిలిపోయిన చరిత్ర విశేషాలు కూడా వ్రాయించారు. ఈ అనుభవంతో సార్ సర్వజ్ఞతను తెలియపరుస్తూ సాయికి అసత్య దోషం అంటకుండా కాపాడారు.

విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రవికుమార్ గారి స్నేహితుడు నాగదత్త శ్రీనివాస్. రవికుమార్ గారి సలహా మీద గొలగమూడికి వచ్చి స్వామి దర్శనం చేసుకుని స్వామికి 'శ్రీ సుబ్బరామయ్య సార్ తో మాట్లాడే అవకాశం కల్పించమని' విన్నవించుకున్నాడు. నాగదత్త శ్రీనివాస్ సార్ దగ్గరికి వెళ్ళినప్పుడు సార్ అతనితో ఐదు గంటల సేపు మాట్లాడారు. ఇదంతా కూడా వెంకయ్య స్వామికి విన్నవించుకోవటం వలన జరిగింది అని నమ్ముతాడు.

6 ఫిబ్రవరి 2010 న శేషుకృష్ణ (చెన్నై) 'గత ఒక సంవత్సరం నుండి ప్రతి శని, ఆదివారాలు చెన్నై నుండి గొలగిమూడి వెళుతున్నాము కదా, ఈ ఒక్క శనివారం ఇక్కడే ఉందాంలే' అని బద్ధకించినాడు. ఆ రోజు రాత్రి శేషుకృష్ణ కలలో సార్ కనబడి "నువ్వు రా! మనకి ఇక్కడ పని ఉంది" అని చెప్పారు. శేషుకృష్ణ మనసులోని ఆలోచనకి రెస్పాన్స్ ఇచ్చారు సర్వవ్యాపి, సర్వజ్ఞులు, సమర్ధ సద్గురువు అయిన శ్రీ సార్.

2012 జనవరి రెండో వారంలో అఖండ దీపంలోకి నూనె అయిపో వచ్చింది. అమ్మగారు పాబోలు వెంకటేశ్వర్లు ని వెంకట సుబ్బయ్య అంగడి నుండి నూనె డబ్బా తీసుకురమ్మని చెప్పారు. వెంకట సుబ్బయ్య 'సంక్రాంతికి అన్ని సామాన్లు తీసుకు వచ్చాము. ఒక వారం పడుతుంది' అని అన్నారు. పాబోలు వెంకటేశ్వర్లు నెల్లూరు వెళ్తానని అమ్మగారితో అన్నాడు. నిద్ర పోతున్నట్లున్న సార్ 'ఆ నూనె డబ్బాలు బోర్లా పెట్టి వచ్చిన నూనెను ఉపయోగించండి. బుధవారంకి తీసుకు వస్తాడులే" అని అన్నారు. డబ్బాలు బోర్లా పెడితే అరకిలో నూనె వచ్చింది. బుధవారం కల్లా వెంకటసుబ్బయ్య నూనె డబ్బా తీసుకువచ్చి పెట్టాడు. శ్రీసాయిమాష్టర్ నిలయం లో అన్ని వ్యవహారాలూ సంపూర్ణశరణాగతి చెందిన శ్రీ సార్ ఎలా నిర్వహిస్తున్నారో ఈ అనుభవం తెలుపుతుంది.

హైదరాబాదులో ప్రింట్ అయిన ఆరతి పుస్తకాలు నెల్లూరు వచ్చి ఉన్నాయి. నెల్లూరు నుండి గొలగమూడికి పుస్తకాలు తీసుకురమ్మని ఆటోడ్రైవర్

కోదండంకి పాబోలు వెంకటేశ్వర్లు డబ్బులు ఇచ్చాడు. కొన్ని రోజులైనా కోదండం పుస్తకాలు తీసుకురాలేదు. సార్ కి చెప్పి నెల్లూరుకి వెళ్ళి తీసుకు వద్దామని అడిగితే సార్ "ఏం పర్లేదు. ఎల్లుండి తీసుకు వస్తాడు" అని అన్నారు. ఆటోడ్రైవర్ కోదండం రెండు రోజుల తర్వాత తనంత తానే పుస్తకాలు తీసుకువచ్చాడు. **సర్వ ప్రేరణాధికారి, సర్వ సమర్థులు శ్రీ సార్!**

కొమ్మిశెట్టి శ్రీనివాసరావు గారు శ్రీ భరద్వాజ మాస్టర్ గారి మాటల్లో సుబ్బరామయ్య గారి గురించి విన్నారు. శ్రీనివాసులు గారికి తనను భరద్వాజ మాస్టర్ గారు సుబ్బరామయ్య సార్ చేతికి పట్టించారు అని ఆయనకు అనిపించేది. ఆ విషయం శ్రీనివాసులు గారు సుబ్బరామయ్య సార్ కి చెపితే ఆయన నవ్వారు. సుబ్బరామయ్య గారు ధర్మం ఎంత నిక్కచ్చిగా పాటించేవారు అంటే స్వామి ఆజ్ఞ ప్రకారం వాలంటరీ రిటైర్మెంట్ నవంబర్ నెలలో తీసుకున్నా టెన్త్ క్లాస్ పిల్లలకి ఆ సంవత్సరం సిలబస్ పూర్తి చేయటానికి నవంబర్ నుంచి మార్చి దాకా స్కూల్ కి వెళ్లి జీతం తీసుకోకుండా పాఠాలు చెప్పారు. ఆ సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో అంతకు ముందు ఎప్పుడూ లేనంతగా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నారు. **అంతా స్వామి కృపగా సుబ్బరామయ్య సార్ చెప్పేవారు.**

ఒకసారి ఇంట్లో శ్రీనివాసులు గారు తన భార్యతో గొడవ పడి మధ్యాహ్నంకు గొలగమూడి వచ్చి నేరుగా సాయి మాస్టర్ నిలయంలో కూర్చుని ఉన్నారు. సుబ్బరామయ్య సార్ కుమారుడు శేషయ్య వచ్చి శ్రీనివాసులు గారిని 'నాన్న పిలుస్తున్నారని' చెప్పి తీసుకు వెళ్లారు. శ్రీనివాస్ గారు వెళ్ళగానే సార్ "శీనయ్యా! వచ్చావా, రా!" అంటూ పెద్ద జామకాయ కోసి ముక్కలు చేసి శ్రీనివాస్ గారికి పెట్టారు. చాలా మాటలు కూడా చెప్పారు ఆ మాటలతో శ్రీనివాస్ గారి మనస్సు శాంతించింది. అంతకు ముందు ఎక్కడికైనా వెళ్ళిపోదాం లేదా ఆత్మహత్య చేసుకుందామనుకున్న ఆలోచనలు పోయాయి. అప్పుడు శ్రీనివాస్ గారికి సుబ్బరామయ్య సార్ కి తన మనస్సులోని ఆలోచనలు అన్నీ తెలుసు అని అనిపించింది. సాయంత్రం సత్సంగం అయిన తర్వాత శ్రీనివాస్ గారితో సుబ్బరామయ్య సార్ "పూర్వజన్మలో నీ తల్లి ఇప్పుడు నీ భార్యగా వచ్చింది. ఆ జన్మలో నీ వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. అందువలన ఈ జన్మలో నిన్ను సాధిస్తోంది" అని చెప్పారు. శ్రీనివాస్ గారు అప్పుడు తల్లి ఇప్పుడు భార్య? అదేమిటి సార్ అని అడిగారు. సార్ "జన్మ జన్మకి బంధాలు ఒకలాగానే ఉండాలని లేదు" అని చెప్పారు. త్రికాలజ్ఞులు శ్రీ సార్ !

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

కొన్ని రోజులకు ఉచ్చూరు వాస్తవ్యులైన తెలిసిన వారు శ్రీనివాస్ గారి ఇంటికి వచ్చి 'నిన్ను సుబ్బరామయ్య సార్ రమ్మన్నారు' అని చెప్పి వెళ్లారు. శ్రీనివాస్ గారు వెంటనే గొలగమూడి సుబ్బరామయ్య సార్ దగ్గరకి వెళ్ళారు. అది చలికాలం అవటం వలన సార్ అప్పుడు నాలుగు షర్ట్లు వేసుకొని ఆయాసంతో ఉన్నారు. ఎందుకు ఈ ఆయాసం సార్ అని అడిగితే స్వామి చెప్పింది చేయలేదు అందువలన స్వామి పెట్టారు అని సార్ చెప్పారు. అప్పుడు శ్రీనివాస్ గారికి ఆ ఆయాసం రావటం కూడా స్వామి ప్రసాదంగా తీసుకుంటున్నారు అని అనిపించింది. శ్రీనివాస్ గారిని చూసి సుబ్బరామయ్య సార్ "మీ అబ్బాయి ఎలా ఉన్నాడు? ఇంట్లో విషయాలు ఎలా ఉన్నాయి?" అని ప్రేమగా అడిగారు. 'మా అబ్బాయి వలన నేను ఇబ్బందులు పడ్డాను' ఆ విషయం తెలిసే సార్ అడిగారు అని శ్రీనివాస్ గారు గ్రహించారు.

ఒకసారి శ్రీనివాస్ గారిని కుటుంబంతో సహా గొలగమూడికి వచ్చి ఉండమని చెప్పారు. అప్పుడు ఆయన రావటానికి జాప్యం చేశారు. వారు తమ ఇంట్లో ఉన్నారు. దాచుకున్న బంగారం పోయింది. శ్రీనివాస్ గారు తరువాత సార్ తో 'మీరు చెప్పినట్లు చేసినట్లయితే ఇబ్బందులు ఏమీ ఉండేవి కాదు' అని చెప్పి వాపోయారు.

పొత్తూరి వెంకటేశ్వరరావు (హైదరాబాద్ వాస్తవ్యులు) తన పిల్లవాడు పుట్టినప్పుడు పేరు పెట్టే విషయమై సార్ కి పేర్ల గురించి ఎక్కువ తెలియదు కదా అని సార్ యొక్క సలహాను అడగలేదు. సార్ అతనితో "మీ పిల్లవాడికి వెంకట అని పెట్టి ఆ తర్వాత ఏ పేరైనా పెట్టుకో" అన్నారు. వెంకటేశ్వర రావు ఇంటి ఆచారం ప్రకారం (ఇలవేల్పు) 'వెంకట' తో ప్రారంభం అవ్వాలి. సార్ కి ఆ విషయం తెలుసనీ వెంకటేశ్వర రావుకి తర్వాత అర్థమైంది !

### సర్వ సమర్థుడు

శివరత్నం తన ఊరిలోని పొలంలో మోటారు పని చేయిస్తుంటే అనుకోకుండా రెండు కరెంటు వైర్లు రాసుకుని చుట్టుపక్కల ఎలక్ట్రిక్ మోటార్లు అన్నీ కాలిపోయాయి. ఆయా పొలాల యజమానులందరూ శివరత్నం వలననే మోటర్లు కాలిపోయాయని శివరత్నాన్ని వారి మోటార్ ల ధర చెల్లించమని గట్టి వత్తిడి చేసారు. శివరత్నంకు దారిలేక ఆ గ్రామస్తులతో 'నేను ప్రతి శనివారం గొలగమూడి వెళ్ళి వస్తాను. ఈ రోజు శనివారం కాబట్టి గొలగమూడి వెళ్ళి వచ్చిన తర్వాత సోమవారం నాడు మాట్లాడుకుందాము" అని చెప్పి గొలగమూడికి వెళ్ళి సార్ తో విన్నవించుకున్నాడు. సార్ "శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధికి వెళ్లి అగ్ని గుండంలో కొబ్బరికాయ వేసి నిశ్చింతగా మీ వూరు

వెళ్ళమన్నారు". అలానే చేసి శివరత్నం తన ఊరికి వెళ్ళగా, ఇదివరకు ఏమీ జరగనట్లు ఆ విషయమై ఎవరూ ఏ ప్రస్తావనా తీసుకు రాలేదు! రెండు రోజుల ముందు పోలీసుల వరకు వెళ్ళిన తతంగం ఇప్పుడు ఇలా సద్దుమణిగేటట్లు చేయటం ఆ సర్వసమర్థునికే చెల్లింది.

ఒకసారి గొలగమూడి సత్సంగంలో మరల, మరల అన్యాయం జరుగుతుంటే చూస్తూ వూరుకున్నందుకు భీష్ముడంతటి వారికే చెల్లదని చెప్పారు. ఆ వారం చివరిలో శివరత్నం ప్రయాణిస్తున్న బస్సులో ఒక తాగిన వ్యక్తి తన భార్యతోనే ఎంతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అందరూ చూస్తున్నారు గాని ఏమీ పట్టించుకోలేదు. శివరత్నంకు ఏ (సార్) ప్రేరణ వల్లనో ఎదిరించే సరికి అందరూ తోడు నిలిచారు. అతను శివరత్నంను ఊరిలో ఎలా ఉంటావో చూస్తానని బెదిరించాడు. శివరత్నం సార్ కు చెబితే సార్ అభయం ఇచ్చారు. తరువాత ఎట్టి ఇబ్బందీ కలుగలేదు.

శివరత్నం అక్క కొడుకుని ఒక విషయమై అతను చదువుతున్న కాలేజీ ప్రిన్సిపాల్ అరిచాడు. ఆ పిల్లవాడు ఆ బాధను తట్టుకోలేక ఎవరికీ చెప్పక ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజులు చూసి శివరత్నం బావ శివరత్నంకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. శివరత్నం తన బావతో తాను గొలగమూడిలో ఉన్నానని చెప్పి, తన బావని గొలగమూడి రమ్మని చెప్పాడు. ఆయన వచ్చిన తర్వాత ఆ విషయం సుబ్బరామయ్య సార్ కి చెప్పాడు. సార్ ఒక నిమిషం మౌనంగా ఉండి తర్వాత శివరత్నం బావతో **"మీరు మీ పిల్లవాడి గురించి వెతకటం ఆపేసి వెంకయ్య స్వామి దగ్గర 108 ప్రదక్షిణలు చేసి ఇంటికి వెళ్ళండి"** అని చెప్పారు. శివరత్నం బావకు అంతకు కొద్ది రోజుల ముందరే చికెన్ గునియా వచ్చింది. అందువలన ఆయనకు ఒళ్ళు నొప్పులు విపరీతంగా ఉండటంతో ప్రదక్షిణలు చేయాలంటే భయపడ్డాడు. కానీ స్వామి దర్శనం అయిన తర్వాత ఆయన మనస్సు ఏమి మారిందో కానీ **ఒళ్లు నొప్పులతోనే ఏడుస్తూ 108 ప్రదక్షిణలు చేశాడు**. ప్రదక్షిణలు చేసిన తర్వాత వాళ్ల ఊరుకి వెళ్ళాడు. ఇంటిలోకి అడుగు పెట్టగానే వాళ్ళ అబ్బాయి తిరుపతి నుంచి ఫోన్ చేసి "నాన్నా! నేను తిరుపతిలో ఉన్నాను. మా కాలేజీ ప్రిన్సిపాల్ అరిచారని నేను చనిపోదామనుకున్నాను. కానీ నాకు మనసు మారింది. నేను ఇంటికి వచ్చేస్తాను" అని చెప్పాడు. ఇది కేవలం సుబ్బరామయ్య సార్ కృప. సార్ కి అన్ని విషయాలు తెలుసు. అంతేగాక ఆ పిల్లవాడి మనస్సు మార్చి ఇంటికి ఫోన్ చేయించి ఇంటికి తీసుకు వచ్చారు. **సారు సర్వ సమర్థుడు, సర్వ ప్రేరణాధికారి!**

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

చిత్తరంజన్ గారు హైదరాబాద్ లో నాంపల్లిబాబా గారి దర్శనం చేసుకుంటూ ఉండేవారు. తన స్నేహితుడు రామకృష్ణ ద్వారా గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ సార్ దర్శనం చేసుకున్నారు. సార్ వ్రాసిన గ్రంధాలు తీసుకుని చదువుకుంటుండే వారు. సార్ సమాధి అయిన తర్వాత సార్ లీలలు గల "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" అనే గ్రంధాన్ని నాంపల్లిబాబా సమాధి పూజారి అప్పారావు గారు ఇచ్చారు. ఒకరోజు హైదరాబాద్ నుండి ఇండోర్ కు ఇండిగో flight లో వెళుతూ ఆయన మనస్సులో తన ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోకూడదు. సాయిబాబాను ఆ సీట్లో కూర్చో పెడతాను అనుకున్నారు. మనస్సులో అనుకున్నట్టే వారి ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోలేదు. ఆ ప్రయాణంలో "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" గ్రంథం పారాయణ చేశారు. కొన్ని రోజులకు సార్ ఇప్పుడు లేరు కదా అనుకుంటే, ఆనాటి రాత్రి వారి కలలో "ఒక ఇంటి మధ్య సార్ ఇటుక రంగు షర్టు, గళ్ళ లుంగీ, గడ్డంతో కూర్చుని ఉన్నారు. సార్ ముఖం pleasing గా ఉంది". తర్వాత రోజు నుండి చిత్తరంజన్ మనస్సు ప్రశాంతంగా ఉంది.

వేణుగోపాల్ గారు శ్రీ సార్ ఆశీస్సులు తీసుకుని ఎల్ టి సి మీద డార్జిలింగ్ కి కుటుంబంతో సహా వెళ్లారు. డార్జిలింగ్లో అప్పటిదాకా వర్షం, మబ్బు పట్టి ఉన్న వాతావరణం వీరు వెళ్ళేసరికి పూర్తిగా మారిపోయింది. వేణుగోపాల్ గారు ఉన్నంతకాలం అక్కడ వాతావరణం ఎండగా ఉండి బయట తిరగటానికి అనుకూలంగా మారింది. వేణుగోపాల్ గారు డార్జిలింగ్ నుండి వెనక్కి వచ్చిన తర్వాత అంతకు ముందు ఎట్లా వర్షం ఉన్నదో అలాంటి వాతావరణం వచ్చేసింది. **సద్గురు ఆశీస్సులతో చేసిన యాత్రలు సఫలమవుతాయి** అని తెలుస్తోంది.

రవికుమార్ గారు తమ వివాహం విషయం చెప్పినప్పుడు సార్ ముఖములో సుముఖత వ్యక్తం కాలేదు. కారణము అడగలేదు. ఆయన పెళ్లి రోజు తోటి లెక్చరర్లు, ప్రొఫెసర్లు ప్రయాణం చేస్తున్న వ్యాన్ గొలగమూడి అడ్డరోడ్డు దగ్గర ఆక్సిడెంట్ అయ్యి తుక్కు తుక్కు అయ్యింది, అయినా కూడా వారికి ఏ మాత్రం దెబ్బలు తగలకుండా ఉండటం సార్ కృపే అని ఆయన నమ్మకం. సార్ సూచన మనకు అవగతం కాకున్నా వారి దయతో మనను సదా కాపాడుతూనే ఉంటారు అన్న దానికి మచ్చుతునక.

## సర్వ హృదయాంతర్వర్తి

శ్రీ సార్ లెటర్లు ఎంతోమంది భక్తుల స్వల్ప మనోభావాలకు కూడా సమాధానాలుగా నిలిచేవి. ఒకసారి సాయిశివకి భగవంతుడు, మహనీయుల

స్వప్న దర్శనాలు అవుతున్నా భౌతిక దర్శనం ప్రసాదించ లేదనుకుంటుంటే మరురోజే శ్రీ సార్ లెటర్లో **"మహనీయుల స్వప్న దర్శనం భౌతిక దర్శనంతో సమానం! వేరు కాదు"** అని వ్రాసారు.

**శ్రీ సార్ ఎంతో casualగా మాములుగా ఇచ్చిన సలహాలే భవిష్యత్తును సూచించేవిగా, వారికి సంబంధించిన హెచ్చరికలు సూచనలుగా ఉండేవి.** ఒకసారి సాయిశివ కుంగ్-ఫూ నేర్చుకుంటే బాల్యం నుండి ఉన్న కృత్రిమ బిగింపులు తొలగుతాయని మాస్టర్ వ్రాసిన దాని గురించి సార్ ను అడిగితే **"కుంగ్-ఫూ నేర్చుకుంటే నేర్చుకున్నావు కానీ, నలుగురులోకి వెళితే భ్రష్టుడవవుతావు"** అని సార్ హెచ్చరించారు. తరువాత దానికి ప్రత్యామ్నాయంగా ఆసనాలు సార్ సూచించారు. సాయిశివ ఒకసారి సెలవులకు ముందు గొలగమూడి దర్శించి తిరిగి వెళ్ళే ముందర సార్ కు వెళ్లి వస్తానని చెపుతున్నప్పుడు సార్ అతని చేతులు పట్టుకొని మరీ **"నలుగుర్లోకి వెళ్ళకు స్వామి"** అని హెచ్చరించారు. చుట్టాలే కదా అని సెలవులకు ఏదో ఫంక్షన్ కు వెళ్లి వారం పది రోజులు అక్కడ గడిపితే అనారోగ్యం పాలై కొన్నాళ్ళు సాయిశివ బెడ్-రిడ్డెన్ అవ్వాల్సి వచ్చింది. ఆ తరుణంలో సాయిశివ అడుగకనే శ్రీ సార్ **"ఏమీ బెంబేలు పడవద్దు. కొండంతను గోరంతలో అనుభవింప చేసి రక్షిస్తారు"** అని లెటర్లో స్పెషల్ నోట్ క్రింద వ్రాసారు. సార్ లాంటి సద్గురుని ద్వారా వచ్చే సూచనలు ఎంతటి మహత్తరమైనవో కొంతైనా అర్థమైంది అని సాయిశివ అంటాడు.

సాయి సుబ్రహ్మణ్యం ఒకసారి మద్రాసు లో fashion డ్రస్సులు వేసుకొని వెడుతున్న ఆడవాళ్ళను చూచి మనస్సులో 'భూతాలు కనబడ్డాయి' అని అనుకున్నాడు. ఆ తరువాత కొద్ది సమయానికి సార్ కు ఫోన్ చేయగానే అతనేమీ మాట్లాడక ముందరే "ఏం స్వామీ! భూతాలు కనబడ్డాయా?" అని అన్నారు. **మన తోడుగా వుండి ప్రతీ ఆలోచనను గుర్తిస్తున్న సర్వసాక్షే శ్రీ సార్** అన్న అనుభవాలు గుర్తుంచుకోమని అందరినీ హెచ్చరిస్తున్నారు.

ఒకసారి శేషుకృష్ణ వాళ్ళ అమ్మగారు, అక్క గొలగమూడిలో ఉన్నారు. సార్ వారి దగ్గరకు వచ్చి "అమ్మా! సాయి మాస్టర్ నిలయం పైన అంతా కూడా చాలా దుమ్ము, ధూళిగా ఉంది. అది శుభ్రం చేసి పెడతారా! నేను నా అనే వాళ్ళకు మాత్రమే చెపుతాను" అని చెప్పారు. అప్పుడు శేషు అమ్మగారు, అతని అక్క 'సార్! మీరు చెప్పింది మేము చేస్తాము' అని చెప్పి మొదటి అంతస్తులో ఉన్న రూమ్ ని శుభ్రం చేసారు. ముఖ్యంగా పని చేయటం కన్నా కూడా సార్

అన్న మాట **“నా అనే వాళ్ళకే చెప్తాను”** అనేది వారి మనసులో అలా నిలిచిపోయింది.

**సర్వ జీవ స్వరూపాయ నమః**

ఒకరోజు సార్ పెరట్లో నాగుపామును అక్కడ ఉన్న భక్తులకు చూపుతూ ఇక్కడ ఒకరు ఉన్నారు అని చెప్పి పాముతో నువ్విక్కడ ఉంటే భయపడతారు అని అనగానే ఆ పాము బయటకు వెళ్లి మాయమయిపోయింది.

వేణుగారు గొలగమూడిలో ఇల్లు కట్టిన కొత్తలో దేవుని గదిలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నారు. శ్రీ సార్ ఉత్తరం ప్రక్క ఉన్న కిటికీ లోంచి చూస్తూ “ఎవరు వచ్చారో చూడు!” అని అన్నారు. వేణు గారు చూచి ‘పాము సార్ ‘ అని అరిస్తే అది ఏమీ చేయదని శ్రీ సార్ చెప్పారు. కొంతసేపటికి ఆ పాము బయటకు వచ్చి సార్ వాళ్ళ ఇంటి ముందర ఉన్న కస్తూరి చెట్టు మీదకి పాకి వెళ్ళింది. వేణు గోపాల్ గారు సార్ తో ఆ పాము చెట్టు మీదకు వెళ్ళింది, దాన్ని పంపించేద్దాం అని అంటుంటే సార్ ఆయనతో ఎక్కడ ఉంది అని అన్నారు. వేణు గోపాల్ గారు చూస్తే అక్కడ ఆ పాము లేదు.

ఒకసారి సార్ ఇంటి పెరట్లో ఒక బండ క్రింద పాము ఉంది. సాయి మాస్టర్ నిలయంలో పని చేస్తున్న బేలుదారు సుబ్బారావుని పిలిచి ఆ బండ క్రింద ఒక జంతువు ఉంది తీయి అని చెపితే బేలుదారు బండ క్రింద పామును చూసి భయపడుతుంటే అది ఏమి చేయదు అని చెప్పారు. ఆ పాము మెల్లగా వెళ్ళిపోయింది.

**సాధారణత్వం**


ఒకసారి శ్రీనివాస్ గారు పదివేల రూపాయలకి చిల్లరగా 50 పైసలు, ఒక రూపాయి చిల్లర బిళ్ళలు- రెండు బస్తాలు సుబ్బరామయ్య సార్ దగ్గర పెట్టారు. తరువాత తీసుకు వెళ్దామనుకుని తమ ఇంటికి వెళ్ళిపోయారు. రెండు నెలల తర్వాత శ్రీనివాస్ గారు గొలగమూడికి వచ్చి తమ ఇంటికి బయలు దేరినప్పుడు సుబ్బరామయ్య సార్ అంత బరువైన చిల్లర బస్తాలు రెండింటినీ మోసుకుంటూ ఆటో స్టాండ్ తీసుకువచ్చి ఆటోలో పెట్టి శ్రీనివాస్ గారితో బస్సులో జాగ్రత్తగా పెట్టించుకుని ఇంటికి తీసుకు వెళ్ళు అని చెప్పారు. శ్రీనివాస్ గారికి “సాధారణత్వమంటే ఇలానే ఉంటుందా ?” అని అనిపించింది.

శ్రీనివాసులు గారికి మాస్టర్ గారితో పరిచయం ఉండటం వలన సుబ్బరామయ్య సార్ శ్రీనివాస్ గారిని గురుబంధువుగా చూసేవారు. ఒకసారి

సత్సంగంలో అవధూత లీల చదువుతూ ఉంటే ఒకతను వచ్చి సార్ కాళ్ల మీద పడి 'మీరు అంత గొప్ప పుస్తకాన్ని మాకు ఇచ్చారు. మీరు పూజ్యులు. మీకు నమస్కారం చేసుకోవాలనుకుంటున్నాను సార్' అని అన్నారు. అప్పుడు సార్ అతనితో "ఈ భూమి మీద నేను బ్రతకాలని లేదా! భరద్వాజ మాస్టర్ గారు వ్రాసారు. నేను సేకరణ మాత్రమే చేశాను. అది ఆ గ్రంధంలో వ్రాసి ఉన్నది. అది నువ్వు చూడలేదా?" అని చెప్పి అతనిని మందలించారు.

**యోగీశ్వరుడు**

ఒకానొక సమయంలో శివరత్నం స్వగ్రామంలో తీవ్రమైన కరువు, అనావృష్టి ఏర్పడి పంటలకు ఎంతో నష్టం వాటిల్లడం వల్ల ఎంతోమంది అన్నానికి సైతం ఇబ్బంది పడటం జరిగింది. ఆ సమయంలో అతనికి అందరికీ మేలుగా బాబా సేవగా ఏదో ఒకటి చేయాలనిపించింది. బియ్యం దొరకడమే ఇబ్బందిగా ఉన్న ఆ సమయంలో వర్తకులు బియ్యం రేటు కూడా మూడింతలు పెంచేసారు. అతను గూడూరులో బియ్యం మిల్లులో తక్కువ ధరకు దొరికే బియ్యం అచ్చట కొని స్వయంగా తెచ్చి వాళ్ళ ఊరులో లాభం తీసుకోకుండా అమ్మటం గొప్ప సేవ అనిపించి సార్ కి చెపితే 2000 రూపాయలు ఇచ్చి ఆ డబ్బు పెట్టుబడిగా పెట్టి ఆ పని ప్రారంభించమన్నారు. సారు చెప్పినట్లే అలా చేయగలగటం జరిగింది. ఆ సమయంలోనే అతని ఊరిలో ఎన్నో మందిరాలు బీడు పట్టి ఉండటం బాధనిపించి, ఆ విషయాన్ని అతను సార్ తో విన్నవించాడు. సార్ అతనికి 116 రూపాయలు ఇచ్చి "వాటిని ఖర్చు చేయక, పూజలో పెట్టి విరాళాలు సేకరించి ఆ మందిరాలలో దీపం పెట్టమన్నారు. ఆ తర్వాత భక్తుల నుండి డబ్బు, బియ్యం, సరుకులు, సిమ్మెంటు, ఇసుక, రాళ్లు మొదలైనవి విరాళాలుగా కొన్ని వేలు వచ్చాయి. దానితో సంతర్పణ చేసిన రోజునే కుంభవృష్టి కురిసి అనావృష్టి తీరటం జరిగింది. **యోగీశ్వరుడైన శ్రీ సార్ కు నివేదించి చేసిన పుణ్య కార్యానికి ఫలితం అనంతము. పంచభూతాలు శ్రీసద్గురుని ఆదేశాలను అనుసరిస్తాయి.**



# దైవం మానుష రూపేణ

**సాయికి వాళ్ళ కుటుంబానికి శ్రీ సార్ ఎన్నో రీతుల సహకరిస్తూ నడిపించిన కొన్ని సంఘటనలను ఇచ్చట స్మరించు కుంటున్నాడు.**

శ్రీ సార్ బ్రహ్మం గారి మఠం వద్ద సత్సంగం లో **"స్వామి కృప కలిగితే అన్నీ వారే చూసుకుంటారు, మనను వారి ఇష్ట ప్రకారం నడిపిస్తారు, మన భాద్యత వారే వహిస్తారు"** అని చెప్పారు. లక్ష్మి గారు (దమ్మపేట) స్వామి కృప ఎలా కలుగుతుంది సార్? అని అడిగారు. **శ్రీ సార్ "మీరు నెల నెల గొలగమూడి రండమ్మ ! స్వామి కృప కలుగుతుంది"** అని చెప్పారు. మొదటి నెల అలానే వచ్చారు. అప్పుడు అన్నశాలలో (బయట) అన్నం తినడం వల్ల లక్ష్మి గారికి అనారోగ్యం అయింది. గొలగమూడి వచ్చినప్పుడల్లా బయట తినడం, అనారోగ్యం అవటం ఇబ్బంది అని, 'ఇంక రాలేను సార్' అని చెప్పి సార్ కి లెటర్ రాశారు.

శ్రీ సార్ రిప్లై లో స్వామి సన్నిధిలో గడపడానికి బయట తినడం వల్ల ఇబ్బంది అయితే మీరు మా ఇంట్లో ని ఒక రూమ్ లో వంట చేసుకుని తింటూ స్వామి దర్శనము, సేవ చేసుకోవచ్చు. ఆ రూమ్ మీకే ఇచ్చేస్తాను. అలా చేయాలి కానీ స్వామి సన్నిధిని వదులుకోవద్దు అని చెప్పి వ్రాశారు. శ్రీ స్వామిని ఆశ్రయించిన వారికి సైతం స్వామితో అభేదులైన శ్రీ సార్ అవ్యాజ కరుణతో ఆశ్రితకల్పవృక్షమై స్వామికృపను వారి కుటుంబమంతటికి అందించుటకు అవధులు లేవు. మచ్చుకు కొన్ని సన్నివేశాలు :

1. శ్రీ సార్ ఇంట్లోనే ఒక రూమ్ అప్పటినుండి భక్తులకి, స్వామిని దర్శించి వంట చేసుకొని సేవించుకునే భక్తులకు, అక్కడ వండుకుని ఉండేందుకై శ్రీ సార్ ఇచ్చి వేశారు. **"నీ భక్తుల దాసుని కరుణించుము శ్రీహరి"** అన్న రీతిలో శ్రీ సార్, భక్తులకు స్వామిని సేవించుకొనే అవకాశం కలిగించడం కోసం తన స్వంత ఖర్చుతో నిర్మించుకొన్న రూమ్ ను ఇవ్వటమే కాక ఆ రూమ్ లో గ్యాస్, వంటపాత్రలు మొ|| అవసరమైన వసతులు అన్నీ ఏర్పాటు చేసి సహకారం అందించడం శ్రీ సార్ కే చెల్లింది. సార్ తాము చేసిన సేవకు ఏనాడూ ధన సహాయం ఆశించలేదు, అడగలేదు. సార్ మాత్రమే గాక సార్ కుటుంబ సభ్యులు ఎవరికీ అలాంటి ఆలోచన సార్ భౌతికంగా ఉన్నప్పుడే గాక, సార్ సమాధి అయిన తర్వాత కూడా లేదు. వచ్చిన వాళ్ళు శ్రీ స్వామివారి సేవ చేసుకుని వెళితే శ్రీ సార్ ఎంతో తృప్తి పడేవారు.

2. సాయి సుబ్రహ్మణ్యంకు ఒక సమయంలో అనారోగ్యమై ఒకసారి (మైనర్) హార్ట్ ఆపరేషన్ అవసరం అనుకున్నప్పుడు శ్రీ సార్ "నీకు అవసరమైతే 50,000 రూపాయలు నేను ఇస్తాను" అని సాధారణంగా (casual గా) అన్నారు. తరువాత ఆపరేషన్ అవసరమన్నప్పుడు అడగకనే శ్రీ సార్ 50 వేల రూపాయలు అప్పటికప్పుడు బ్యాంకుకు వెళ్లి తీసుకోమని ఇచ్చారు. సత్య సంధులు శ్రీ సార్. స్వామిని / తనను ఆశ్రయించి ఉన్న భక్తుల కష్టాలను తనవిగా భావించి అడుగకనే సేవ / సాయం అందివ్వటం శ్రీ సార్ కు సహజ దివ్య గుణము.

3. సాయి సుబ్రహ్మణ్యంకు PhD లో సీటు వచ్చాక అక్కడ చదువుకునేటప్పుడు అన్నం అరగకుండా ఉంటే శ్రీ సార్ ఒక రోజు సత్సంగానికి ఒక కవర్ లో ఏదో (మూట) తీసుకొని వచ్చారు. ఆ మూట సత్సంగం తర్వాత సాయికి ఇస్తూ "ఇది ఆడించిన బియ్యం రవ్వ. నీవు రోజు ఇది వండుకుని తిని రాత్రి హాయిగా నిద్రపో" అని చెప్పారు. అలా ఏమీ అడగకనే ఎంతో శ్రమించి తన పరిధిలోకి వచ్చిన వారందరిలో స్వామిని దర్శించి వారి సాయం అందించేవారు. అది సాయికి ఆశీస్సులే కాకుండా దివ్యమైన ఔషధంగా పని చేసి, అప్పటిలో అరుగుదల, నిద్ర వంటి అతని ఇబ్బందులు తొలగాయి. కరుణాసముద్రులు, సర్వసమర్థులే కాక, అంతటి సాధారణత్వం నరనరాలలో జీర్ణించుకుని సద్గురుసేవ చేసే ఉత్తమ మార్గదర్శకులు శ్రీ సార్.

4. ఒక సమయంలో సాయికి ఉడికించిన కూరలు కూడా సరిగా అరగకుండా ఉంటే సాయి Chennai వెళ్ళేటప్పుడు శ్రీ సార్ ఇంట్లో నుండి వారి మిక్సీ తీసుకు వచ్చి సాయికిచ్చి కూరలు ఉడికించాక మిక్సీ వేసుకొని తినమని, ఫ్రూట్ జ్యూస్ మొ|| చేసుకోవడానికి ఉంటుంది అని, అలా చేసి ఆరోగ్యం ఎలా ఉందో లెటర్ల ద్వారా తెలుపమన్నారు. అసలు సార్ ను సాయి ఏమీ అడగకనే, కనీసం ఇది అవసరం ఉంటుందని కూడా అనుకోకనే ఇలా అవసరమైనది, సార్ వ్యక్తిగతమైన వస్తువులను, ధనాన్ని, శ్రమను వెచ్చించి చేయడం "సార్ అనంత పద సేవలో భాగం". నిజానికి శ్రీ సార్ జీవితము మొత్తం వారి సద్గురు "అనంతమైన పదసేవలో భాగం" అని చూసిన వారికందరికీ తేటతెల్లమైన విషయమే.

5. ఆ సమయంలోనే సాయికి విరోచనం సాఫీగా అయ్యేది కాదు. సాయితో శ్రీ సార్ దాని వల్లనే అన్ని ప్రాబ్లమ్స్ వస్తాయి అని చెప్పి, ఎనీమా తీసుకోవచ్చని సలహా ఇచ్చి, ఎలా తీసుకోవాలో సాయికి తెలియకుంటే శ్రీ సార్ చేసి చూపించి

నేర్పించారు. ఆశ్రితులకు ఆరోగ్యము, స్వామిసేవ చేకూర్చేందుకు శ్రీ సార్ చేసిన కృషి అనన్యము.

6. Ph.D. చేసేటప్పుడు మొదటి సంవత్సరంలో సాయి సుబ్రహ్మణ్యం వారం వారం శ్రీ స్వామివారి సన్నిధికి వస్తుంటే శ్రీ సార్ ప్రోత్సహించే వారు. అతని ఆరోగ్యం కూడా స్వామి వారు తగ్గిస్తారు అని చెప్పేవారు. సంవత్సరానికి కొంత ఆరోగ్యం చేకూరటం, Ph.D. సూపర్వైజర్ వర్క్ జరగడానికి నెలకు ఒకసారి మాత్రమే గొలగమూడి వెళ్ళమని చెప్పడం జరిగింది. శ్రీ సార్ ఈ మార్పులకు ముందే అలా నెలకొక సారి రమ్మని మార్చి చెప్పారు. సాయికి వారం వారం వచ్చే అలవాటు నుండి, నెలకు ఒక్కసారి మాత్రం రావటం చాలా ఇబ్బందిగా ఉండేది. సాయికి సార్ సందేశం ప్రతి చిన్న విషయంలో లేకుంటే చాలా బాధగా, భయంగా ఉండేది. **సాయి చింత తొలగించుటకు , ధైర్యం ఇవ్వడానికి రోజుకొక లెటర్ వ్రాసి పోస్ట్ చేసేవారు శ్రీ సార్.** ఎంత పని ఒత్తిడిలో ఉన్నా శ్రీ సార్ **"ఈరోజు ఒక్క క్షణం తీరిక లేదు. ఏమీ వ్రాయ లేకుండా ఉన్నాను, నీవు వ్రాయలేదు అనుకుంటావని వ్రాస్తున్నాను"** అనైన వ్రాసి లెటర్ పోస్ట్ చేసేవారు. ఇలా కొన్ని నెలల పాటు తన భక్తులకు రోజూ సమయం కేటాయించి రాయడం, శ్రమ తీసుకుని లెటర్ ( తో పలకరించటం ) వ్రాసి పోస్ట్ చేయడం లాంటి శ్రద్ధ వహించడం శ్రీ సార్ కే చెందింది.

**పరేంగిత అవగాహి, హితులకు సర్వ శుభములను ఇచ్చు వారు శ్రీ సార్.**

7. PhD అయిపోయాక గొలగమూడి లో ఉండే ప్రేరణ శ్రీ సార్ సాయి కి పెట్టారు. అయితే సాయికి సార్ దగ్గరే, సార్ వాళ్ళ ఇంట్లోనే ఉండాలని ఉద్దేశ్యము (అలా కాకపోతే ఉండ లేనని భావన). సర్వజ్ఞులైన (పరేంగిత అవగాహి అయిన) శ్రీ సార్ ఆ విషయం చెప్పకనే గ్రహించి కనీసం ఏ విధమైన లౌకిక ఆలోచన లేక శ్రీసార్ తమ పూజా మందిరం, ముందు రూమ్ కలుపుకొని, వెనకాల ఇంకొక రూమ్ నిర్మాణం చేసి మొత్తం మూడు గదులను ఒక పోర్షన్ గా సాయి నివాసానికి, పెళ్లి తర్వాత కూడా నివసించేందుకు వసతి కల్పించారు. మనం లౌకిక ఊహకు అందని విధంగా శ్రీ సార్ అక్కడ సాయి నివసించడానికి అంతటి నిర్మాణం చేసినా, సాయి నుంచి ఒక రూపాయి ఎప్పుడూ ఆశించింది లేదు. సాయి కూడా నిర్మాణానికి అసలు ఇచ్చింది లేదు. తరువాత అచ్చటనే సాయి ఇంచుమించు రెండు సంవత్సరాలు ఉండడం జరిగింది. అన్ని రోజులలో కూడా సార్ ఎప్పుడు అడిగినది కానీ, డబ్బు విషయమై మాట్లాడింది కానీ లేదు. సాయి సార్ కు ఇచ్చేవి (దక్షిణ) సాయి మాస్టర్ నిలయంకు ఇచ్చేవారు. **శ్రీ సార్ అసలు వారి పరిధిలో ఉన్నవారిని తన**

**వారు, స్వామి వారిగా భావించడమే కాని అన్యభావం రాదు / లేదు అనిపిస్తుంది.**

8. సాయి గొలగమూడిలో ఉండే రోజుల్లో రోజూ సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి పెరటి లోని ఆకుకూరను ఆకు, ఆకు కోసి శ్రీ సార్ తో పాటు సాయికి కూడా వలిచి రోజంతటికీ కూరకు మెండుగా సరిపోయే అంత మొదటి గది కిటికీ లోంచి లోనికి వేసేవారు. అంతటి ఆకు, ఆకు కోయాలి అంటే కనీసం గంట పైన ఖచ్చితంగా పడుతుంది. **రోజూ అంత సమయం వెచ్చించి తనే సేవకులకు సేవచేయటం శ్రీ సార్ కే చెల్లింది.** "నీ భక్తుల దాసుని" అన్నమాట ఆచరణలో భోధించిన సద్గురువు శ్రీ సార్. సాయికి శ్రీ సార్ ఇచ్చిన ఆ ఆకుకూర వల్లనే మోషన్ ఇబ్బంది తొలగింది, ఆరోగ్యం సరి అయ్యింది. ఇట్టి **శ్రీ సార్ కరుణ, కృప, సాధారణత్వాల సమ్మేళనం మరెక్కడా చూడ లేము అంటే ఆశ్చర్యం కాదేమో.**

9. సాయి గొలగమూడిలో ఉండేటప్పుడు ఒక సమయంలో శ్రీ సార్ వారి ఇంటి ఆవరణలో ఆరు బయట పడుకునేవారు. శ్రీ సార్ ప్రక్కన పడుకోవాలని సాయి ఆరాటంతో సార్ మంచం ప్రక్కన కింద పడుకున్నాడు. కుక్కలు మొదలగునవి వస్తూంటాయని, సాయి పడుకోవడానికి ఒక బెడ్ లాంటిది ఉంటే బాగుంటుందని నాపరాయితో సార్ ఒక బెడ్ (పాన్పు) నిర్మించి, ఆ రోజు నుంచి (సాయిని) దాని మీద పడుకోమన్నారు. అలా కొన్ని రోజులు సార్ సాంగత్యంలో నిద్రించే అవకాశం శ్రీ సారే కల్పించారు. **కన్నతండ్రి కూడా అంత త్వరగా ఆలోచించి సమకూర్చలేరు. అన్ని జీవుల్లో వెంకయ్య స్వామిని దర్శించటం శ్రీ సార్ ఆచరణలో అణువు అణువునా కనిపిస్తుంది.**

10. తర్వాత కొన్ని రోజులకు సాయి మాస్టార్ నిలయంలో సేవకు ఎవరూ లేరు. అప్పుడు ఎవరైన రాత్రి వచ్చిన వారికి సాయి మాస్టర్ నిలయం మూసి ఉండటం వల్ల ఇబ్బంది కలుగుతుందని శ్రీసార్ వారిలోని భగవంతుని సేవకై "సాయి మాస్టర్ నిలయం" బయట పడుకోవడం ప్రారంభించారు. "సాయిబాబా శిరిడీలో వసతులు లేని రోజుల్లో రాత్రి వచ్చినా సరే, భక్తులను ఒక లాంతరు తీసుకొని ఎదురుపడి "కౌన్ రే !" అనే పలకరింపుతో వారి సేవ చేసేవారు. తరువాత వారిని రాధాకృష్ణ ఆయీ ఇంటికి పంపేవారు. **శ్రీ భరద్వాజ మాస్టర్ ఆశీస్సులతో "శ్రీ సాయి మాస్టర్ నిలయం" నిర్మాణం జరగటాన్ని సార్ ఆ భవనం భరద్వాజ మాస్టర్ కట్టించారని ప్రగాఢ విశ్వాసం. ఆలా కట్టించిన తర్వాత కూడా మనం సాయిబాబా సేవ చేసినట్లు చేయకపోతే శ్రీ మాస్టారు పాత చెప్పుకు పేడ అద్ది కొడతారు" అని సార్ చెప్పేవారు.** శ్రీ సార్

తో వారి మంచం పక్కనే నిద్రించిన అవకాశం శ్రీ సాయికి ఆ సమయంలో కూడా కల్పించారు.

**ఇలా తనకంటూ, తనదంటూ ఏదీ లేకుండా ఏదీ ఆశించకుండా జీవితం అంతా గురుసేవ గా చేయడం శ్రీ సార్ కే చెల్లింది.** "పరోపకారార్థం ఇదం శరీరం" అని శ్రీ దర్గాస్వామి వారిచే కీర్తించబడిన శిష్య శ్రేష్ఠులు శ్రీ సార్.

**శ్రీ సార్ సాధారణత్వానికి మరో మచ్చు తునక:**

ఒకరోజు శ్రీ సార్ సైకిల్ మీద బియ్యం మూట తీసుకురావడానికి (సార్ వాళ్ళ అబ్బాయి) శేషయ్యను పంపుతున్నారు. సాయి 'సార్!, సార్! నేను కూడా శేషయ్యతో పాటు వెళ్లి బియ్యం మూట తెస్తాను సార్!' అంటే సార్ అన్నం పెట్టడం ఎంతవరకు వచ్చింది? అని అడిగారు. సాయి 'కుక్కర్ పెట్టడం ఇప్పుడే అయింది' అన్నాడు. సార్ "సరే! నేను కుక్కర్ కడతాను, తలుపు వేస్తాను నీవు వెళ్ళు" అని చెప్పి వెళ్ళమన్నారు. సాయి అప్పుడే కూర తరగటం, కుక్కర్ పెట్టడం పూర్తి చేసి కూర తొక్కు వదిలేసే బయల్దేరాడు. **కుక్కర్ కట్టడానికి వెళ్ళినప్పుడు సార్ ఆ రూమ్ లో కూర తుక్కు చూసి అది కూడా ఎత్తి వేశారు.** కనీసం సాయికి చెప్పను కూడా చెప్పలేదు. తర్వాత ఎప్పుడో సాయికి అది ఎరుకలోకి వచ్చింది. **ఇంతటి సాధారణత్వం నరనరాలలో జీర్ణించుకుని, సంపన్నత్వం, సద్గురుసేవలతో పునీతులై మన మధ్య చరించిన శ్రీ సార్ స్మరణ నిస్సంశయంగా అత్యంత ఆనందకరము, పాపనాశకము.**

**ప్రసాద్ కి సార్ చేసిన ఎన్నో విషయాలలో కొన్ని వ్రాస్తున్నాడు :**

- ప్రసాద్ కి వడదెబ్బ తగిలినప్పుడు ఏమీ చెప్పకుండానే సార్ చల్లటి మజ్జిగ త్రాగించి స్వస్తుడిని చేశారు.
- ప్రసాద్ కి ఒక బస్సు ప్రమాదం తప్పినప్పుడు ఆ సంఘటన వల్ల దడుపు జ్వరం వస్తే అతనికి కావలసిన పథ్యం సారే స్వయంగా చేసి పెట్టి స్వస్తుడిని చేశారు.
- హైదరాబాద్ నివాసి సాయిలక్ష్మికి ఒళ్ళంతా కురుపులు వచ్చి శరీరం శిథిలమవుతున్నప్పుడు సార్ ఆమెకు సమయం ప్రకారం జ్యూస్ చేయటం, మందులు ఇప్పించటం మొ|| చేశారు
- కాళ్ళులేని ఒక భక్తునికి సాయి మాస్టర్ నిలయంలోకి wheelchair లో వెళ్ళటానికి వెంటనే ramp ను కట్టించారు.

- హైదరాబాద్ లో ఉండి సార్ పుస్తకాలు అన్నీ ప్రింట్ చేయిస్తాడు వెంకటేశ్వర రావు. అది సార్ సేవగా భావిస్తాడు. ఒకసారి అతను గొలగమూడి వస్తే సార్ ఆనందంగా వెంకటేశ్వరరావు వచ్చాడంటూ భోజనానికి అరటి ఆకుకోసుకు రమ్మని ప్రసాద్ ను పురమాయించి అతనికి భోజనం వడ్డించారు. సేవకుడు, భక్తుడైన వారి కోసం భగవంతుని ఆనందమెంతటిదో! మరియు అసామాన్య సాధారణత్వం!

- హైమావతి (అమ్మలు) పెళ్లి చేసుకుని తన భర్తతో కలసి గొలగమూడి సార్ దర్శనం చేసుకుంటే ఆ దంపతులకు సార్ స్వయంగా వంట చేసి పెట్టారు. అంతేగాకుండా వారిద్దరూ భోజనం చేస్తున్నప్పుడు సార్ వారి ప్రక్కనే కూర్చుని కబుర్లు చెపుతూ కూర్చున్నారు. ఎంతటి అదృష్టమో! ఆ దేవ దేవుడే ప్రక్కన కూర్చోవటమూ, స్వయంగా ప్రసాదం ఇవ్వటమంటే!!

- గొలగమూడి వీధి కాలువలు త్రవ్విస్తున్నప్పుడు రోడ్డు ప్రక్కగా త్రవ్వారు. పూర్తి చేయటానికి కాలయాపన జరిగింది. ఆ సమయంలో స్వామి మందిరం మెయిన్ రోడ్ నుండి బ్రహ్మం గారి మఠంకు వెళ్లే దారిలో ఉన్న గుంటను దాటడానికి అక్కడ ఉండే వారు ఇబ్బంది పడుతుంటే సార్ ఒక భక్తుని చేత కాలువకు అడ్డంగా చెక్క వేయించారు. ఆ చెక్క వేసిన వెంటనే దాని మీద నడిచి వెళ్లిన ఒక వృద్ధురాలు ఆనందంగా కృతజ్ఞతలు, ఆశీస్సులు ఇచ్చింది. అది చూసిన సార్ మురిసిపోయారు.

- సాయి మాస్టర్ నిలయంలో ఉండే ఒక ఆడ కుక్క కడుపుతో ఉంటే సార్ ఆ కుక్కకు ప్రతిరోజూ పంచదార కలిపిన ఉత్త అన్నం పెట్టేవారు.

**తిరుమల శెట్టి నారాయణ** 10వ తరగతి పరీక్షలు అయిన తర్వాత తరచుగా స్వామి దగ్గర సేవ చేస్తుండేవాడు. సుబ్బరామయ్య సార్ అతనిని చూసి స్వామి సేవ చేయటానికి ఎక్కువ ప్రోత్సహించే వారు.

ఒకసారి సార్ అతనితో "అరేయ్! నువ్విక్కడుంటే మీ నాయన ఎక్కడికీ వెళ్ళనివ్వడు. నీవు చదువుకోలేవు. అందువలన నీవు నెల్లూరులో ట్యూషన్ కి వెళ్లి 10 వ తరగతిలో తప్పిపోయిన సబ్జెక్ట్ లని క్లియర్ చేయి" అని చెప్పారు. అతను సుబ్బరామయ్య సార్ చెప్పినట్లే నెల్లూరులో ట్యూషన్ కి వెళ్లి సెప్టెంబర్ కల్లా అన్ని సబ్జెక్ట్ లని క్లియర్ చేశాడు.

పరీక్షల తర్వాత గొలగమూడిలో అతను తన నాన్నతో వ్యవసాయం, బర్రెలను చూసుకోవటం, స్వామి మందిరంలో సేవ చేస్తూ ఉండటంలో అతనికి ఒక్క క్షణం తీరిక ఉండేది కాదు. కొన్ని రోజుల తర్వాత ఎవరికీ చెప్పకుండా

అతను స్వామి దగ్గర చీట్లు పెట్టాడు - ఏమని ఇంటర్మీడియట్లో చేరాలా, ఐ టి ఐ లో చేరాలా, పాలిటెక్నిక్ లో చేరాలా అని పెడితే స్వామి పాలిటెక్నిక్ లో చేరమని స్వామి ఆదేశం ఇచ్చారు. దాన్ని తగ్గట్లుగా అతను ఫిబ్రవరి-మార్చిలో అప్లికేషన్ తీసుకువచ్చి సార్ కి ఇచ్చాడు. అప్పుడు సార్ వాళ్ళ అమ్మాయి సుమతి రాహుకాలం చూసి మంచి ముహూర్తంలో పాలిటెక్నిక్ అప్లికేషన్ పూర్తి చేసింది. అతను పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష రాస్తే 12,000 ర్యాంక్ వచ్చింది. రెండు నెలల తర్వాత పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ కి కాల్ లెటర్ వచ్చింది. **సార్ అతని నాన్నతో పాలిటెక్నిక్ ఇంగ్లీష్ మీడియం అయితే నారాయణ ఎట్లా చేస్తాడు అని ఎన్నోసార్లు వాపోయేవారు. కానీ నారాయణ ఎప్పుడైతే వచ్చి 'స్వామి దగ్గర చీట్లు పెడితే స్వామి పాలిటెక్నిక్ లో చేరమని చెప్పారని' చెప్పాడో అప్పటినుండి సుబ్బరామయ్య అయ్యవారు స్వామి చెప్పినట్లే పాలిటెక్నిక్ చదవటానికి ప్రోత్సహించారు.** 1990 అక్టోబర్ లో కౌన్సిలింగ్ కి పిలిచారు. సుబ్బరామయ్య సార్ 'మీ నాయనకి తెలియదు నేను వస్తాను' అని చెప్పి అతనిని తిరుపతికి తీసుకుని బయలుదేరారు. ప్రయాణంలో ఒక చిత్రం జరిగింది. గూడూరులో వారు రైల్వేస్టేషన్ నుండి బస్టాండ్ కి రిక్షాలో వస్తున్నారు. వారు రిక్షా దిగుతున్నప్పుడు సార్ ఒక బస్సును చూపి అది తిరుపతి బస్ ఏమో చూడమని చెప్పారు. అతను పరుగున వెళ్లి చూస్తే అది తిరుపతి బస్సు కాదని తెలిసింది. ఈ లోపల రిక్షావాడు వెళ్ళిపోయాడు. దాంట్లో అతని సర్టిఫికెట్లు ఉన్న బాగ్ ను మర్చిపోయాడు. వారు బస్టాండ్లో వెయిట్ చేస్తూ ఉంటే రిక్షా తొక్కే అతను వారిని వెతుక్కుంటూ వచ్చి ఆ సర్టిఫికెట్లు ఇచ్చాడు. అది భగవంతుని కృప అని అనుకున్నారు. తిరుపతి వెళ్ళిన తర్వాత కౌన్సిలింగ్లో శ్రీశైలంలో మెకానికల్ ఇంజనీరింగ్ సీటు ఉంది కానీ అతని నాన్న నెల్లూరు దగ్గర మాత్రమే చేర్పించమని, అలా చేస్తేనే డబ్బులు తక్కువ ఖర్చు అవుతాయని చెప్పటం వలన ఆ సీట్ అతను తీసుకోలేదు. గూడూరులో సివిల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్ లో సీట్లు ఉన్నాయి. అప్పుడు సార్ "మనకు మైనింగ్లో తెలిసిన వాళ్ళు ఉన్నారు. నువ్వు తీసుకో అందువలన దాంట్లో మంచి ఉద్యోగాలు ఉంటాయి, జాయిన్ అవ్వు" అని అన్నారు. అందువలన అతను మైనింగ్ కోర్సులో జాయిన్ అయ్యాడు.

కాలేజీలో ఇంగ్లీష్ మీడియం వలన నారాయణకు పాఠాలు అర్థంగాక ఇంటికి వచ్చేసాడు. సుబ్బరామయ్య అయ్యవారికి ఈ విషయం చెప్పలేదు. అంతేగాక సార్ అంటే భయం వలన సార్ కి కనపడకుండా ఇంటి దగ్గరే ఉండేవాడు. ఒకసారి బోర్ లో నీళ్లు తీసుకొస్తుంటే, దూరం నుంచి

సుబ్బరామయ్య సార్ అతనిని చూసి పిలిపించి కాలేజీ ఎలా ఉంది, ఏంటి సంగతులు అని అడిగారు. **అతను 'ఇంగ్లీష్ మీడియం పాఠాలు అర్థం కావట్లేదని, కాలేజీకి వెళ్ళను' అని చెప్పాడు. "అరే! స్వామిని అడిగితే పాలిటెక్నిక్ తీసుకోమని చెప్పారు కదా అందువలన ఆయనే చూసుకుంటాడు. నీకంటే మొద్దు వాళ్ళు ఉంటారు. కాలేజీకి వెళ్ళు, అన్నీ స్వామి చూసుకుంటాడు" అని సార్ ప్రోత్సహించారు.** సార్ మాట కాదనలేక భయంగానే అతను కాలేజీకి వెళ్లాడు. అక్కడ ప్రతిరోజు క్రికెట్ ఆడటం, క్లాసులకు హాజరు అవడం, పాఠాలకి నోట్స్ ప్రిపేర్ చేసుకోవడంతో రోజంతా గడిచిపోయేది. అందువలన ఇంటికి వెళ్ళాలి అనే భావన పోయింది. అట్లానే చిత్రంగా అతనికి గవర్నమెంట్ వాళ్లు హాస్టల్ రూమ్ ని ఇచ్చారు. తర్వాత రెండు మూడు నెలలకి గొలగమూడికి వచ్చినప్పుడు సుబ్బరామయ్య సార్ అతనిని చూసి "ఏమోయ్ ఎలా ఉంది కాలేజీ" అని అడిగారు. అతను ఆనందంగా 'చాలా బాగుంది సార్, నాకంటే చదవని వాళ్ళు ఉన్నారు' అని చెప్పాడు. అలా అతనికి మూడు సంవత్సరాలు జరిగిపోయింది. చివర్లో ఆరు సబ్జెక్టులు మిగిలిపోయాయి. అతను ఇంటికి వచ్చి సార్ దగ్గర కూడా వెళ్లలేదు. తన నాన్న చేత చెప్పి పంపించాడు. అతని నాన్నని సార్ అడిగి వాడిని ఒకసారి నా దగ్గరికి వచ్చి మాట్లాడమను అని చెప్పారు. అతను వెళ్లి సార్ తో మాట్లాడితే "తడవుకు రెండు చొప్పున వ్రాస్తే సంవత్సరంలో సబ్జక్ట్స్ అయిపోతాయిరా, నువ్వు ట్యూషన్ చెప్పించుకొని సబ్జెక్టులు వ్రాయి" అన్నారు. అతను అట్లానే సార్ చెప్పినట్టు చేశాడు. నాలుగు సబ్జెక్టులు పూర్తి అయిపోయాయి.

నారాయణ నాన్నకి సుబ్బరామయ్య సార్ సాధన చేస్తున్నారని, అక్కడున్న స్వామి సేవకులు అందరికీ సార్ అంటే ఇష్టం కాబట్టి అభిమానం. అతని నాన్న సుబ్బరామయ్య సార్ కి ఏదైనా పని ఉంటే అతనిని ప్రోత్సహించి మిగిలిన పనులు ఏమీ చెప్పకుండా ఉండేవాడు. అందువలన సార్ అమ్మాయి సుమతి పెళ్లికి సార్ తో పాటు దగ్గరుండి నారాయణ పనిచేశాడు. సుమతక్క పెళ్లి అయిన తర్వాత సార్ అతనిని కలిచేడులో తనతో పాటు పనిచేసిన నారాయణరావు అనే ఫ్రెండ్ తో మాట్లాడి ఆయన దగ్గర మ్యాథమెటిక్స్ ట్యూషన్ చేరమన్నారు. అంతేకాదు చూపించడానికి సార్ స్వయంగా వచ్చి, ఆయనతో మాట్లాడి ఆయన్ని సార్ తనదైన శైలిలో బలవంతం చేసి ఒప్పించారు. ఆయనకి ఏదో శాస్త్రం తెలుసు- అందువలన సార్, నారాయణ ఏ దిక్కు నుండి వచ్చారు అనే విషయాలు చూసి సుబ్బరామయ్య సార్ తో నారాయణ పాస్ అవుతాడు అని, సాయంత్రం మాత్రమే చెప్తాను రమ్మని చెప్పారు. ఆయన చెప్పినట్లు

నారాయణ రోజుకి ఏడు గంటలు కష్టపడేవాడు. దానితో అప్పుడు రాసిన మ్యాథమెటిక్స్ సబ్జెక్టు క్లియర్ అయిపోయింది.

ఇంకొక సబ్జెక్టు సర్వేయింగ్ ఉంది. నారాయణ గూడూరు వెళ్లి అక్కడే కాలేజీ దగ్గర హాస్టల్లో ఉండి ప్రిపేర్ అవుతూ ఉండేవాడు. ఒకసారి ప్రిపేర్ అవుతూ ఉంటే అతని మైనింగ్ హెడ్ అతనిని చూసి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు చదువుకోమని చెప్పారు. అతను అట్లానే చదివాడు. ఆ క్వశ్చన్స్ ఎగ్జామ్లో రావటం, అతను ఆ సబ్జెక్టు క్లియర్ చేయటం చాలా చిత్రంగా జరిగిపోయింది. స్వామి పాలిటెక్నిక్ అని చీట్ల ద్వారా చెప్పటమే గాక పాలిటెక్నిక్ డిగ్రీ కూడా స్వామి ఇప్పించారు. అతనికి మంచి ఉద్యోగం వచ్చి ఆ ఉద్యోగంలో మంచి పేరు వచ్చింది. అతని పై ఆఫీసర్ కి అతని పనితనం మీద చాలా నమ్మకం. అది అతని అదృష్టం.

సుబ్బరామయ్య వారు చెప్పినట్లు చేస్తే ఇబ్బందులన్నీ తొలగిపోతాయి, చెప్పినది చేయకుండా ఉంటే ఇబ్బందులు వస్తాయి అనటానికి ఇది ఒక ఉదాహరణ: నారాయణ అక్కకు, ఆమె భర్తకు తగువై ఆమె పుట్టింటికి వచ్చింది. నారాయణ నాన్నతో సుబ్బరామయ్య సార్ "మనం ఆడపిల్ల వాళ్ళం తగ్గి ఉండాలి. నువ్వు వెళ్లి మీ అల్లుడితో మాట్లాడి అమ్మాయి కాపురం సరిచేసి రా" అని చెప్పారు. కానీ నారాయణ నాన్న మొండి పట్టుదలతో వెళ్లలేదు. కొంతకాలం తర్వాత నారాయణ బావ రెండో పెళ్లి చేసుకున్నాడు. నారాయణ అక్క ఆత్మహత్య చేసుకుంది. సార్ మాట వింటే బాగుండేది అని అతనికి అనిపించింది.

నారాయణకు మ్యారేజ్ విషయంలో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు అని సార్ తో చెప్పాడు. ఇప్పుడు పెళ్లి చేసుకున్న అమ్మాయి గురించి "ఆమెకు ఏమీ రాదు ఎక్కువ చదువుకోలేదు, ప్రపంచ జ్ఞానం లేదు" అని సార్ తో చెప్పాడు. సార్ "పెళ్లి చేస్తే నీకే బయట ప్రపంచం గురించి నేర్పిస్తుంది లేరా" అని చెప్పారు. ఆ అమ్మాయితోనే అతని పెళ్లి జరిగింది. ఇప్పుడు ఆ అమ్మాయే అతనికి వాట్సాప్ ఎలా ఉపయోగించాలో, వాట్సాప్ లో కాలింగ్ ఎలా చేయాలో, మెసేజ్ లు ఎలా చూడాలి అన్నీ కూడా నేర్పిస్తుంది. సార్ చెప్పిన మాట జరుగుతోంది.

నారాయణ సార్ ని సామాన్య మనిషిగానే చూశాడు. కానీ ఆయన గొప్ప మహనీయుడని అతనికి తెలియదు. వేణుగోపాల్ గారు ఎప్పుడైతే సార్ కి నమస్కారం చేసి, సార్ కి అన్నీ తెలుసు నారాయణ అన్నప్పుడు మాత్రమే అతను సార్ కి నమస్కారం చేసుకోవటం మొదలు పెట్టాడు. అంతేకాకుండా

సార్ ఇంటి దగ్గర బావి త్రవ్వేటప్పుడు ఒక రాత్రి వర్షం వచ్చింది. సార్, నారాయణ దగ్గరగా వదుక్కొని పడుకొని ఉన్న సంఘటనను గుర్తు చేసుకుంటుంటే **సార్ అంత గొప్ప మహనీయులైనా ఎంత సామాన్యంగా ప్రవర్తించారు** అనేది అర్థం అవుతోంది.

సార్ దగ్గర అతనికి ఎన్నో సార్లు 'సార్ కి అన్ని విషయాలు' తెలుసు అనే సంఘటనలు కొన్ని ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

1. సాయి మాస్టర్ నిలయం నిర్మాణం జరుగుతున్నప్పుడు కసుమూరు వెళ్లి బెడ్ కంకర తీసుకురా అని చెప్పి అతనిని పంపించారు. అక్కడ ఎవరితో మాట్లాడాలి, అడ్రస్ అన్నీ చెప్పారు. అతను అక్కడికి వెళ్ళి సార్ చెప్పిన అడ్రస్ ప్రకారం వెళితే అన్ని పనులు చాలా త్వరగా అయిపోయాయి. సార్ దగ్గరికి వచ్చి మీకు అక్కడ అడ్రస్ ఎలా తెలుసు అంత కరెక్ట్ గా చెప్పారు అని అడిగితే ఒక నవ్వు నవ్వారు.
2. ఇంకొకసారి స్టోన్ హౌస్ పేట మస్తానయ్య అనే మెడికల్ రిప్రజెంటేటివ్ ఇంటి అడ్రస్ ఇచ్చి జ్వరానికి, విరోచనాలకు, ఒళ్లునొప్పులకు మందులు తీసుకురమ్మన్నారు. ఈ మందులను సార్ దగ్గరకు ఎవరైనా అనారోగ్యంతో వచ్చి అడిగితే వాటిని వాళ్లకి ఇచ్చేవారు. సార్ 'కరెక్టుగా అడ్రస్ చెప్పారు. మీరెప్పుడైనా మస్తానయ్య ఇంటికి వెళ్లారా' అంటే "ఎప్పుడూ వెళ్ళలేదు. ఎప్పుడో నా చిన్నప్పుడు ఆ ఏరియా చూశాను. అందువల్ల నాకు తెలిసింది అట్లా" అన్నారు. మస్తానయ్య అమ్మాయి చాలా బాధపడుతూ ఒక ఉత్తరం రాసి సార్ కి అందించమంది. నారాయణ గొలగమూడిలో సార్ కి ఇస్తే సార్ చూడకుండా "అంటు రాకూడదు, బొంటు రాకూడదు" వ్రాసి ఉంటుంది అని ఆ ఉత్తరం ప్రక్కన పెట్టి సార్ స్నానానికి వెళ్లారు. నారాయణ ఆ లెటర్ తీసుకుని చదివాడు. దాంట్లో కరెక్ట్ గా ఆ అమ్మాయి తన పెళ్లికి అంటు రాకుండా చేయమని వెంకయ్య స్వామిని ప్రార్థించమని వ్రాసింది.

కేవలం 'సార్ చెప్పడం వల్ల మాత్రమే భరద్వాజ మాస్టర్ కృప పొందగలిగాను' అని నారాయణ చెపుతాడు.

ఒకసారి నారాయణ అతని నాన్న గురించి 'స్వామి దగ్గర ఉన్నా ఏం లాభం, కొన్ని పనులు చేస్తున్నాడు' అని అన్నాడు. సార్ **"(స్వామి సన్నిధిలో ఉండటం) వాళ్ల పూర్వజన్మ సుకృతం. వాళ్ళ తప్పులు కాకుండా వాళ్ళలో ఉన్న మంచిని గుర్తించి అది తీసుకోవాలి"** అని చెప్పారు.

నారాయణ ఇంటికి సార్ ప్రత్యేకంగా వచ్చి గుంట త్రవ్వించి శంకుస్థాపన చేశారు. సార్ చెప్పినట్లుగానే వారు ఇల్లు కట్టుకొన్నారు.

నారాయణ పెళ్లప్పుడు సార్ అతనితో "ఒక 30 నిమిషాలు పూజ చేయరా, తర్వాత నువ్వు చేయలేవురా" అన్నారు. సార్ చెప్పినట్లే చేసాడు. పెళ్లి అయిన తర్వాత నుంచి అతనికి పూజ చేయటానికి బొత్తిగా సమయం దొరకటం లేదు.

2011 సంక్రాంతినాడు నారాయణ సార్ దగ్గర పని చేసిన తర్వాత అక్కడే కూర్చుని ఉన్నాడు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సార్ అతనితో "ఇక్కడే ఉంటే ఆ అమ్మాయి తినదురా! నీ కోసం ఎదురు చూస్తుంది. వెళ్లి తిను" అన్నారు. అలానే నారాయణ ఇంటికి వెళ్ళేసరికి అతని భార్య అన్నం తినకుండా అతని కోసం ఎదురు చూస్తున్నది.

నారాయణకు ఏ ఇబ్బందులు వచ్చినా కూడా సార్ దగ్గరకు వస్తే ఆ బాధలు తొలగి పోతాయి.

పని రీత్యా చీమకుర్తిలో అతను ఇల్లు తీసుకున్నాడు. అక్కడి నుండి ఒంగోలుకి రావాలని చాలా ప్రయత్నించాడు కానీ ఎక్కడా ఇల్లు దొరకలేదు. అతను సార్ దగ్గరకు వచ్చి చెప్పాడు. సార్ “దొరుకుతుందిలే” అని ఉత్సాహపరిచారు. తరువాత అతను ఏ ప్రయత్నం చేయకుండా ఉన్నాడు. అతని మేనేజరు తనకు తెలిసిన వాళ్ళు ఒంగోలులో ఉన్నారు. వాళ్ళ ఇల్లు అద్దెకు ఇస్తారు అంటే అక్కడ నారాయణ పై పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు. కానీ అది మేడ మీది పోర్షన్ అవడంవల్ల అతను ఇంకొక ఇల్లు కోసం ప్రయత్నిస్తే 4500 రూపాయల బాడుగకు గ్రౌండ్ ఫ్లోర్ లో ఒక ఇల్లు దొరికింది.

**ప్రాణాపాయం నుండి కాపాడిన సార్** : ఒకసారి ఏప్రిల్ 24, 2016 నారాయణ పని చేసే మైన్స్ లో ఒక చోట పై నుండి ఒక బండ క్రింద పడింది. నారాయణ ఒక సంవత్సరం క్రితం ఆ బండనే తీసేయాలి అని చెప్పాడు కానీ అప్పుడు ఎవరు ఆ మాట వినలేదు. సార్ దయ వలన ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

2016 ఏప్రిల్ 2 నారాయణ మైన్ లో పని చేస్తున్నప్పుడు అతని కాలికింద బండ జారిపోయింది. అతను వెనక్కి పడ్డాడు, బండ ముందుకు పడింది. అలా కాకుండా అతను ముందరకు పడినట్లయితే అతనికి ప్రాణాపాయం కలిగేది. ఇది కేవలం సార్ కృప వలన మాత్రమే జరిగింది. ఎందుకంటే అంతకు ముందు ఒకరోజు రాత్రి కలలో సార్ కనబడ్డారు, నవ్వుతున్నారు. స్వామి ఈ రూపంలో కనబడ్డారు అని అతను అనుకున్నాడు. అంతే కాకుండా అతను

అంతకు ముందు దర్గా స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామి అతనితో "నీవు కష్టపడి పని చెయ్, నేను చూసుకుంటాను. మంచి పేరు వస్తుంది" అని ఆశీస్సులు ఇచ్చారు. సుబ్బరామయ్య సార్, దర్గాస్వామి, వెంకయ్యస్వామి వేరు కాదు. అతను పని బాగా చేస్తాడని అతని ఆఫీసులో అతనంటే చాలా అభిమానం.

**సార్, భరద్వాజ మాస్టారు వేరు కాదు:** చాలాసార్లు నారాయణ తన ఇంట్లో ఇబ్బందుల గురించి ఒంగోలు మాస్టర్ గారి సమాధి దగ్గర బాధపడితే ఆ రోజు రాత్రి గానీ ఆ తర్వాత రోజు రాత్రి కానీ సార్ కలలో కనబడి అతని మనసుని సమాధాన పరుస్తారు. స్వప్న దర్శనం ద్వారా మేము ఇద్దరం ఒకటే అని మాస్టర్ గారు, సార్ చెపుతున్నారు అని నారాయణ చెపుతాడు. సార్ ఒకసారి నారాయణతో "నీవు నాలుగు రూమ్ లు వేసుకుంటే నీ జీవితం గడిచిపోతుంది" అన్నారు.

**పొత్తూరి వెంకటేశ్వరరావు** గారు సార్ దగ్గర చీట్లు పెట్టి ఆ ఆజ్ఞల ప్రకారం ఇల్లు కట్టిస్తున్నారు. చాలా రోజులపాటు అనుకున్న విధంగా కట్టుబడి జరగట్లేదు. దాన్ని చూసి వెంకటేశ్వరరావు సార్ పటం దగ్గర 'ఏమిటి సార్! మీరు చెప్పినట్లు చేయిస్తుంటే కూడా పని సరిగ్గా జరగట్లేదు' అని వాపోయాడు. తర్వాత సోమవారం వస్తామన్న బేలుదారు శుక్రవారం వచ్చి ఆదివారం కూడా పనిచేస్తూ ఒక వారం లోపల అంతకు ముందు జరగని పని కూడా అయిపోయింది. దానితో సార్ నిత్య సత్యులు అని వెంకటేశ్వరరావుకు దృఢపడింది.

వేణుగోపాల్ గారి నాన్నగారికి అనారోగ్యంతో ఒకనాడు స్పృహ లేకుండా పడిపోయారు. వేణుగోపాల్ గారి తమ్ముడు, తిరుమల శెట్టి నారాయణ ఆయనను పరీక్ష చేసి చనిపోయారని తెలుసుకున్నారు. వెంటనే గుజరాత్ లో పని చేస్తున్న వేణుగోపాల్ కి ఫోన్ చేసి త్వరగా రమ్మని చెప్పారు. వేణుగోపాల్ నెల్లూరుకి ట్రైన్ లో దిగిన తర్వాత ఇంటికి వెళ్ళే ముందర గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనం చేసుకుని వెళదామని సార్ దగ్గరకు వచ్చారు. ఆయన ఏమీ చెప్పకుండానే సార్ అతనితో "మీ నాన్న బాగానే ఉన్నాడు. నువ్వు స్వామి దర్శనం చేసుకుని వెళ్ళు" అని చెప్పారు. అలానే వేణుగోపాల్ గారు ఇంటికి వెళ్లేసరికి వాళ్ళ నాన్నగారు అంగడిలో కూర్చుని పని చేసుకోవటం చూసి వేణుగోపాల్ గారు ఆశ్చర్య పోయారు. భోజనాల దగ్గర వాళ్ళ నాన్నగారు 'నేను యమ భటుల దగ్గరకి వెళ్ళాను. కానీ నన్ను మరలా పంపించేశారు' అని చెప్పారు. అక్కడ నుండి 2-3 రోజుల తర్వాత వేణు

గోపాల్ వాళ్ళ అత్తగారింటికి వెళ్లారు. తర్వాత 2 రోజులకు వాళ్ళ నాన్నగారు శరీరం వదిలివేశారు. వేణుగోపాల్ అంటుంటారు **"సార్ కి మా నాన్నకి బాగాలేదని ఎలా తెలుసు, అంతేగాకుండా మా నాన్న ప్రాణాలు విడిచినప్పుడు ఎంతో దూరంగా ఉన్న సార్ ఆయనకు ప్రాణభిక్ష పెట్టటం, శరీరం వదిలే ముందర 4 రోజులు హాయిగా ఉంచటం అంటే సార్ సర్వసమర్థత్వము, ఈ జగత్తు అంతా ఆయన (ఆ విశ్వ చైతన్య) క్రీడ, కృప మాత్రమే అని"**.

**కిషోర్** 2004లో మొదటిసారి గొలగమూడి కి వచ్చాడు. ఆ తర్వాత ప్రతి నెల ఒకసారి శ్రీ వెంకయ్య స్వామి దర్శనం చేసుకుంటూ ఉండేవాడు. సార్ దగ్గరికి వచ్చినప్పుడు సార్ మాటలు అతను వినేవాడే కానీ ఏనాడూ మాట్లాడలేదు. ఒకరోజు మధ్యాహ్న ఆరతి చేస్తున్నప్పుడు సార్ తో మాట్లాడాలనిపించింది. మధ్యాహ్న హారతి అయిన తర్వాత సార్ శ్రీ సాయి మాస్టర్ నిలయం నుండి బయటకు వస్తూ అతనితో ఏమైనా మాట్లాడాలా అని అడిగారు. కిషోర్ అవునని చెప్పేసరికి కిషోర్ ని సార్ తమ ఇంటి మేడ మీదకి తీసుకెళ్లి మాట్లాడారు. అంటే అతని మనస్సులోని ఆలోచనలు సార్ కి తెలుసు.

కిషోర్ శ్రీపాద శ్రీవల్లభ స్వామి అంతర్ధానమైన కురువపురం వెళ్ళినప్పుడు క్రింద పడ్డాడు. ప్రక్కటెముకలు దగ్గర నొప్పి ఉండేది. స్వామి విభూతి రాసినా నొప్పి తగ్గలేదు. బ్రహ్మం గారి మఠం దగ్గర సార్ కి చెపితే విభూతి రాయమన్నారు. సార్ చెప్పినట్లు విభూతి రాసిన రెండు రోజులకు నొప్పి తగ్గిపోయింది.

కిషోర్ 40 రోజులు సమ్మర్ హాలిడేస్ లో గొలగమూడిలో దీక్ష చేస్తున్నాడు. దీక్ష మధ్యలో అతనికి మోకాలు నుంచి కాళ్ల క్రింద వరకూ దురద పుట్టింది. అతను తన కాళ్ళను దాదాపు ప్రతి నిమిషం గీక్కునేవాడు. ఒకరోజు బాధ భరించలేక మనసులో శ్రీ సుబ్బరామయ్య సార్ మహనీయులయితే తనకు దురద తగ్గిపోవాలి అని అనుకున్నాడు. చాలా చిత్రంగా రెండు మూడు గంటల తర్వాత దురద పోయింది.

**మదన్ కుమార్** పిల్లవాడికి మార్చి 2020 లో జలుబు దగ్గుగా ఉండేది. కనీసం మూడు నెలల నుంచి ఇబ్బంది పడుతున్నాడు. ఆ సమయంలో కరోనా అని చెప్పి డాక్టర్ దగ్గరికి తీసుకు వెళ్లి పరీక్షించడానికి భయపడ్డారు. ఎప్పుడైతే ప్రతిరోజూ 8:30 గంటలకు పిల్లల (Kids) సత్సంగం స్టార్ట్ అయిందో, ఆ తర్వాత మూడు రోజులకల్లా మదన్ కుమార్ పిల్లవాడికి జలుబు, దగ్గు తగ్గిపోయాయి.

# ఆశ్రిత కల్పవృక్షం

సద్గురువును "భుక్తి -ముక్తి ప్రదంతం" అని ఆరతులలో కీర్తిస్తారు. సద్గురువు మనకు ఆధ్యాత్మిక మార్గదర్శనము చేయటమే కాక, మన లౌకిక కర్తవ్యాలను సమకూర్చుటకు కూడా వారి మార్గదర్శనము - అండ ఉంటాయని ఈ వాక్యాల అర్ధము. కనుక మన చింతలను అన్నింటిని వదిలి సద్గురు చింతనలో, వారి ఆశ్రయంలో జీవించ వచ్చని, అలా జీవనము సాగించుటకు సిద్ధమైన వెంటనే సద్గురువు ఏ లోటు రాని లౌకిక జీవనాన్ని వారి దివ్య సామర్థ్యంతో ప్రసాదించి, సద్గురు స్మరణను కూడా ప్రసాదిస్తారని ఈ "ఆశ్రిత కల్ప వృక్షము" అన్న అధ్యాయము లోని అనుభవాలు తెలుపుతున్నాయి. శ్రీ సుబ్బరామయ్య సార్ తనను తెలిసో తెలియకనైన ఆశ్రయించిన వారందరికీ విద్య, ఉద్యోగము, ఆరోగ్యము, సత్సంగము ప్రసాదించి వారి, వారి కుటుంబ సమస్యలను సులభముగా పరిష్కరిస్తూ , వారి కర్మ విధ్వంసనం చేసుకొనే సన్మార్గంలో ఎలా నడిపించారో, నడిపిస్తున్నారో ఈ అధ్యాయం లో చూడవచ్చు.

**ఆశ్రిత కల్పవృక్షం - [సతీష్ కి ఉద్యోగం + మెరుగైన ఆర్థిక పరిస్థితి + ప్రతి చిన్న పనికి ఆధార పడేటట్లు చేయటం]**

వెంకయ్యస్వామి దగ్గరకు సతీష్ తన ఆరో క్లాసు నుంచి వస్తున్నా సుబ్బరామయ్య సార్ గురించి తెలియదు. బీటెక్ అయిన తర్వాత మొట్టమొదటిసారి గొలగమూడి లో సార్ దర్శనం అయ్యింది. బీటెక్ అయిన మూడు సంవత్సరాల దాకా సతీష్ కి ఉద్యోగం రాలేదు. ఒకసారి స్వప్నంలో ఒక పెద్ద సముద్రపు అల సతీష్ వైపు వస్తోంది. దాంట్లో మునిగిపోతాడని భయం వేసి పరిగెడుతున్నాడు. ఇంతలో జనాల మధ్యలో నుంచి సుబ్బరామయ్య సార్ వచ్చి సతీష్ చేతిలో ఉన్న బరువైన బ్యాగు ఒకచేత్తో పట్టుకుని రెండో చేత్తో సతీష్ ని పట్టుకొని నడుస్తున్నారు. సార్ కి అప్పుడు కాలు సరిగా లేక నడక సరిగ్గా లేదు. సతీష్ సార్ తో 'మీరు ఎందుకు సార్ బ్యాగ్ పట్టుకునేది, నాకు ఇవ్వండి' అని అన్నాడు. సుబ్బరామయ్య సార్ ఏమీ మాట్లాడకుండా నడుస్తున్నారు. నేరుగా గొలగమూడి వెంకయ్య స్వామి అగ్నిగుండం దగ్గరకు తీసుకువచ్చి సతీష్ ని అక్కడ వదిలిపెట్టారు. అక్కడ నుండి సార్ ఇంకొక వ్యక్తితో వెళ్ళిపోయారు. ఆ సంఘటన బట్టి సతీష్ కు తన

పాపకర్మలు సుబ్బరామయ్య సార్ తీసివేశారు అని అనిపించింది. ఆ స్వప్న దర్శనం తర్వాత రెండు నెలలకు సతీష్ కు ఉద్యోగం వచ్చింది.

కేరళలో ఉద్యోగం వచ్చినందుకు ఆనందంగా ఉన్నా గొలగమూడికి దూరంగా కేరళలో కాకుండా ఏదైనా బెంగళూరులో కానీ చెన్నై లో కానీ పోస్టింగ్ వస్తే బాగుండేది కదా అని ఆలోచనలు వచ్చాయి. ఆ సమయంలో ఒకసారి గొలగమూడికి వచ్చి వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని 108 ప్రదక్షిణలు చేసి స్వామికి మనసులోనే 'సార్ ఉద్యోగం విషయం ఏదైనా చెప్పాలి' అని అనుకున్నాడు. సాయంత్రం సత్సంగంలో సార్ మాట్లాడుతూ "నీటి ఋణం, నిద్ర ఋణం తీరాలి. స్వామి ఎక్కడ పెడితే అక్కడికి వెళ్లాలి. స్వామి దగ్గరే ఉంటాను, వారం వారం గొలగమూడి రావాలి, స్వామి అన్నం తింటాను అంటే కుదరదు" అని చెబుతూ సతీష్ తో "అర్థమైందా స్వామి?" అని అడిగారు. దానితో సతీష్ కు తన మనసులో ఉన్న ఆలోచనలు సుబ్బరామయ్య సార్ కు తెలుస్తున్నాయని తెలిసింది.

ఉద్యోగంలో చేరిన తరువాత డెన్మార్క్ లో ఒక ప్రాజెక్టు కోసం సతీష్ ను వెళ్ళమన్నారు. వీసాకి అప్లై చేయడానికి అతని ఇంజనీరింగ్ సర్టిఫికెట్ ఒకటి కావాలి. అది యూనివర్సిటీ లోనే ఉంది. సామాన్యంగా దాని కోసం అప్లై చేస్తే మూడు నెలల తర్వాత వస్తుంది. సతీష్ కు త్వరగా కావాలని చెప్పి గొలగమూడిలో సార్ కు చెప్పుకొని అనంతపురం వెళ్లాడు. యూనివర్సిటీలో ఆ సర్టిఫికెట్ కోసం అప్లై చేస్తే అక్కడ ఉన్న క్లర్క్ "మీకు మూడు నెలల తర్వాత మేం పంపిస్తాం" అని చెప్పాడు. ఆఫీసులో అతని వెనకాల సాయిబాబా ఫోటో ఉంది. సతీష్ బాబా నామం చెప్పుకుంటూ అక్కడే ఉన్నాడు. కొంతసేపటికి సతీష్ ఆ క్లర్క్ కి తన విషయం మొత్తం చెప్పాడు. అతను అర్థం చేసుకుని మూడు నాలుగు గంటల లోపల ఆ సర్టిఫికేట్ ఇచ్చేశాడు. మూడు నెలల తరువాత రావలసిన సర్టిఫికెట్ మూడు గంటల్లో చేతికి రావడం అంటే అది కేవలం సుబ్బరామయ్య సార్ కృప మాత్రమే.

నిజానికి అప్పట్లో సతీష్ వాళ్ళ ఆర్థిక పరిస్థితి అప్పుల వల్ల బాగా లేదు. అతను చేసే ఉద్యోగం ఒక మూడు నాలుగు సంవత్సరాలు చేస్తే గాని ఆ అప్పులు తీరవు. అలాంటిది డెన్మార్క్ పంపించి సార్ సతీష్ కు ఆరు ఏడు నెలల పాటు రెండు జీతాలు (ఒకటి ఇండియా లోది, రెండవది డెన్మార్క్ లోది) ఇప్పించారు. అంతేగాకుండా అతను ఉండటానికి ఇల్లు కూడా కంపెనీ వారే ఇచ్చారు. దానితో అతనికి ఖర్చు ఏమీ ఉండేది కాదు. అందువలన వారికి ఉన్న అప్పులన్నీ కూడా ఆ ఆరు నెలలలో తీర్చేశారు.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

డెన్మార్క్ లో సతీష్ ఒక పాకిస్తానీ మేనేజర్ క్రింద పని చేయాల్సి వచ్చింది. అంతకు ముందు అతని దగ్గర ఏడుగురు ఉద్యోగస్తులు మూడు నెలల్లో వెళ్లిపోయారు. సతీష్ మనసులోనే సార్ కి మీరే రక్షించాలి అని చెప్పుకున్నాడు. ఒక నెల తరువాత ఆ మేనేజర్ సతీష్ ని అభినందిస్తూ ఈ-మెయిల్ చేశాడు.

డెన్మార్క్ నుంచి వచ్చిన తర్వాత సతీష్ వాళ్ల కంపెనీ వాళ్ళు H1 వీసా ప్రాసెస్ చేసి యూఎస్ కి పంపించారు. 2020 మొదట్లో ఒక పెద్ద ప్రాజెక్టు వచ్చింది. చేసేయగలమని ఆ ప్రాజెక్టు సతీష్ ఒప్పుకున్నాడు. ఆ ప్రాజెక్టు మీద కొన్ని నెలలు కష్టపడి చేసినా పూర్తి కావట్లేదు. చివరికి తన తప్పు తెలుసుకున్నాడు. అంటే సతీష్ ఏ ప్రాజెక్టులోకి వెళ్లాలన్నా, టైమ్ లైన్స్ కి ఒప్పుకోవాలన్నా సుబ్బరామయ్య సార్ (పటానికి) దగ్గర చెప్పుకున్న తర్వాత మాత్రమే ఆఫీసులో వారికి చెప్పేవాడు. ఆఫీసులో ఈ పెద్ద ప్రాజెక్టు వచ్చినప్పుడు సుబ్బరామయ్య వారికి చెప్పకుండా తను చేసేయగలడు అనే నమ్మకంతో ఒప్పుకొన్నాడు. కానీ పని జరగక పోయేసరికి సార్ కు 'పూర్తి ప్రయత్నం చేశాను, నా వల్ల కావట్లేదు మీరే హెల్ప్ చేయాలి" అని చెప్పుకుని పడుకున్నాడు. తర్వాత రోజు ఉదయం ఆఫీసులో వర్క్ గురించి కొత్త ఐడియాలు వచ్చి తొందరగా పని పూర్తయింది. అన్ని ప్రోగ్రామ్స్ సక్సెస్ ఫుల్ గా రన్ అయ్యాయి టెస్టింగ్ పూర్తయిపోయింది. ఈ సంఘటనతో **ప్రతి చిన్న దానికి గురువు మీద ఆధారపడాలి** అనేది సతీష్ కి మాత్రమే కాక మనందరికీ మార్గదర్శకం.

**ఆశ్రితకల్పవృక్షం - [ భవానీగారికి ప్రాణభిక్ష + సత్సంగ పవిత్రకార్యం చేయించటం + అడగకుండానే ఉత్తరాల ద్వారా ఓదార్పు, దిశా నిర్దేశం ]**

భవాని గారు (మక్కినవారి గూడెం) ఇలా చెబుతున్నారు: నేను ఈరోజు ఇలా ఉన్నాను, బ్రతికి ఉన్నాను అంటే సుబ్బరామయ్య సార్ గారి దయ కారణం. నేను ఏ కష్టం వచ్చి ఏ బాధ లో ఉన్నా నేనేమీ చెప్పకుండానే సార్ దగ్గర నుండి లెటర్ వచ్చేది.

భవానీగారి అక్కగారికి ప్రమాద పరిస్థితి వచ్చినప్పుడు అన్ని వైద్య ప్రయత్నాలు విఫలమై చివరి ఆశగా గొలగమూడిలో 120 రోజులు (3 మండలాలు) వెంకయ్యస్వామి దగ్గర ఉన్నారు. ఆ సమయంలో సుబ్బరామయ్య సార్ తమ ఇంటిని వారికి ఇచ్చేశారు. అలాంటి సమయంలో ప్రతిరోజూ సార్ చేసే సత్సంగానికి వెళ్ళేవారు. సార్ సత్సంగం అద్భుతంగా ఉండేది. సార్ ఎంతో ధైర్యం చెప్పి భవానీ గారి అక్కగారికి అండగా ఉన్నారు. అప్పుడే భవానీ

గారి అమ్మాయికి థైరాయిడ్ ఉంటే 40 రోజులు స్వామి దగ్గర ఉండి ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోయింది. అప్పుడు భవానీ గారు సుబ్బరామయ్య సార్ కి పాద నమస్కారం చేస్తే కరెంట్ షాక్ కొట్టినట్లు అయ్యింది. అప్పటి నుండి భవానీ గారికి సార్ దైవాంశ సంభూతులు అనే భావన కలిగింది.

ఒకసారి భవాని గారి నాన్నగారు చనిపోయినప్పుడు ఆమె చాలా బాధపడుతున్నారు. ఆమె ఏమీ అడక్కుండానే సార్ ఉత్తరం వ్రాస్తూ, దాంట్లో భరద్వాజ మాస్టర్ గారి సతీమణి అమ్మగారి గురించి వ్రాశారు. అందులో "మన అందరినీ కాపాడేది భగవంతుడు. భరద్వాజ మాస్టారు గారు సమాధి అయినప్పుడు అమ్మగారికి ఇద్దరు పిల్లలు, ఒంట్లో అనారోగ్యము, చేతిలో చిల్లిగవ్వ లేదు. కానీ ఆమె బాధపడ్డారా? అన్నింటికీ బాబా ఉన్నాడు అన్నారు. ఆవిడ ఎలా ఉన్నారు ఇప్పుడు? నీకు, పిల్లలకి స్వామి ఆశీస్సులు ఉంటాయి" అని వ్రాసారు.

భవానీ గారి నాన్న గారు చనిపోయిన తరువాత కొన్ని రోజులు బద్ధకించి రోజు చేసే ప్రదక్షిణలు, పారాయణ చేయలేదు. సార్ ఒక లెటర్ లో "ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకపోతే బూడిదై రాలిపోతావు" అని వ్రాసారు. ఆ సందేశంతో మరలా ప్రదక్షిణలు, పారాయణ ప్రారంభమైనాయి.

భవానీ గారి నాన్న గారు చనిపోయిన తరువాత ఆమె అమ్మగారిని చూడాల్సి వచ్చింది. అప్పుడు సుబ్బరామయ్య సార్ గారు చెప్పినది ఏమిటంటే "మీ అమ్మ అనే భావంతో చూడకు. వెంకయ్య స్వామికి సేవ చేస్తున్నాను అని భావనతో చెయ్యి" అని చెప్పారు. అలానే ఆమె తన అమ్మగారి సేవ చేసుకోవడం జరిగింది. ఇదంతా సార్ కృప.

భవాని గారికి ఆమె భర్తతో ఇబ్బందులు రావటం వలన వారిరువురూ విడిపోయారు. ఆ విషయమై భవాని గారు బాధపడుతూ సాయిబాబా, వెంకయ్య స్వామి వారి చరిత్రలో అలాంటి సంఘటన జరిగినవి గుర్తుచేసుకుంటూ మనసులో బాబాతో రాత్రి ఒంటి గంటకు 'మీరు సర్వజ్ఞులు కదా! ఇలా అయింది ఏమిటి స్వామి' అని చెప్పి వాపోయారు. తర్వాత రోజు ఉదయం పది గంటలకి సార్ దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఉత్తరంలో సార్ "నీ చేత పవిత్రమైన కార్యం జరిపించాలని సాయిబాబా యొక్క ఆజ్ఞ" అని చెప్పారు. తరువాత సార్ చెప్పినట్లే చుట్టుపక్కల గ్రామాలలో సత్సంగం చేయటం జరుగుతోంది. 2019 దాకా వారం వారం సత్సంగం చేసేవారు. ఒకరోజు సార్ కలలో "మందిరం బ్రహ్మం గారి మఠం అంత దూరం ఉంటుందా" అని అడిగారు. ఆ రోజు నుండి ప్రతిరోజు మందిరంలో సత్సంగం

చేస్తున్నారు. సత్సంగాల వలన చాలామంది ఇప్పుడు గురు చరిత్ర పారాయణ, సాయి లీలామృతం పారాయణం చేస్తూ ఉన్నారు. ఆ పవిత్ర కార్యానికి భవానీ గారిని నిమిత్తంగా చేసుకొని సాయిబాబా చేయిస్తున్నారు అనేది సార్ కి ఎలా తెలుసు? వారిద్దరూ ఒకటి కాకపోతే తప్ప?

ఒకసారి రాత్రి పన్నెండు గంటలకి భవానీ గారు బాధపడితే తెల్లవారుజామున 11 గంటల కల్లా సార్ దగ్గర నుంచి లెటర్ వచ్చింది. తరువాత భవానీ గారు సార్ తో 'నేను బాధపడుతున్నది మీకు ఎలా తెలిసింది? ఎందుకు లెటర్ వ్రాసారు' అని అడిగితే "ఏమోనమ్మా బాబా చెప్పారు. నేను వ్రాశాను" అని సార్ అన్నారు. దాన్నిబట్టి సార్ ఎంతటి సర్వజ్ఞులో అర్థం చేసుకోవచ్చు. ఈ చుట్టుపక్కల అంతా కూడా లక్ష్మి గారికి **భరద్వాజ మాస్టర్ గారు సత్సంగం చేయమని చెప్పటం, ఆయన సంకల్పంగా సత్సంగం జరగడం వల్ల ఇక్కడ ప్రతి ఒక్క ఇంట్లో సాయి లీలామృతము, గురుచరిత్ర పారాయణ చేయని ఇల్లు లేదు** అంటే అతిశయోక్తి కాదు!

ఒకసారి భవానీ గారి అమ్మగారికి ఒంట్లో బాగా లేకపోవడం వల్ల రాయవెల్లూరు హాస్పిటల్లో చేర్చారు. వాళ్ళ అమ్మ గారు భవాని గారిని చేతికి వెంకయ్య స్వామి దారం కట్టమంటే ఆమె కట్ట లేదు ఎందువలన అంటే భవాని గారు ఎప్పుడూ కూడా గొలగమూడి వచ్చినప్పుడు సుబ్బరామయ్య సార్ గారి ద్వారా స్వామి దారం కట్టించుకునే వారు. అందువల్ల వాళ్ళ అమ్మగారికి కట్టలేదు. తర్వాత భవాని గారి అక్క గారు (నాగమణి గారు), వాళ్ళ అబ్బాయి గొలగమూడి వెళ్తున్నప్పుడు, భవాని గారు హాస్పిటల్ లో రూమ్ అడ్రస్ ఇచ్చి సార్ ను స్వామి దారం పంపించమని కోరారు. ఆ విషయం చెబితే సార్ 3 మాస్టర్ గారి ఫోటోలు, 3 బాబా గారి ఫోటోలు, 3 వెంకయ్య స్వామి ఫోటోలు పంపిస్తూ దానితో ఒక చిన్న పేపర్ లో "**ఆధ్యాత్మికత అంటే సుఖానికి పొంగక, కష్టానికి కృంగక జీవితాన్ని గడపడమే"** అని వ్రాశారు. సార్ యొక్క ఉత్తరం, స్వామి దారం చూసి ఆమెకు ధైర్యం వచ్చింది. సార్ పంపించిన దారం భవానీ గారి అమ్మగారికి, పురుడురాదు ఆపరేషన్ చేయించుకోవలసిన ఆవిడకి, ఇంట్లో కేకలు వేశారని పురుగుల మందు త్రాగి చావు బ్రతుకుల మధ్య నున్న పిల్లకి కట్టారు. భవానీ గారి అమ్మగారికి జబ్బు నయమైంది, ఆపరేషన్ చేయించుకోవలసిన గర్భవతికి సుఖ ప్రసవం, పురుగు మందు త్రాగిన పిల్లకు ప్రమాదం తప్పటం జరిగింది. ఈ విధంగా సార్, స్వామి ముగ్గురు ప్రాణాలు కాపాడారు మరియు భవానీ గారికి ధైర్యమిచ్చారు. సత్సంగ మహిమ వల్ల సార్

గొలగమూడిలో ఉన్నా ప్రతి ఒక్క విషయానికి అడిగిన అడగకపోయినా సమాధానమిస్తూ నడిపిస్తున్నారు. అలాంటి సార్ కు శతకోటి వందనాలు.

**పూజ్య గురు బంధువులకు నమస్కారములతో వెంకటేశ్వరరావు (హైదరాబాద్) వ్రాయుట :**

నేను 2009 వ సంవత్సరం లో సార్ తో హైదరాబాదు లో ఇల్లు కొనుక్కోవాలని అని అడిగితే స్వామి దగ్గర గాని, ఇంట్లో పూజించే పటాల వద్ద గాని చీటీలు వేసి, కొనమని వస్తే కొనుక్కోమని చెప్పారు. 2010లో అలా చీట్లు వేస్తే ఒక స్థలం కొనమని వచ్చింది. కానీ అది రేటు ఎక్కువగా ఉండటం వలన సార్ తో నేను అందులో ఒక పార్ట్ మాత్రమే తీసుకుంటాను, మొత్తం తీసుకోలేను అని చెప్పాను. సార్ "స్వామి తీసుకో అని చెప్పిన స్థలం కాబట్టి తీసుకోవాలని, ఎంత డబ్బులు తగ్గింది?" అని అడిగారు. మూడు లక్షలు తగ్గితే అవి నా అకౌంట్ లో వేసి నాతో ఆ స్థలం కొనుక్కోమని చెప్పినారు. ఇలా నాకు **ప్రతి పనిలో, ప్రతి విషయంలో కూడా సర్వవేళలా సహాయం చేస్తున్నారు.** నాకు శక్తి ప్రసాదించి పదిమందికి ఉపయోగపడేలా తీర్చిదిద్దమని ప్రార్థిస్తున్నాను.

**విద్యా ప్రదాత**

వేణు గోపాల్ గారు 10వ తరగతి పాసైన తర్వాత వారి ఇంటి ఆర్థిక పరిస్థితుల వల్ల వారి నాన్నగారు 'చదివినది చాలు, అంగడి చూసుకోమని' చెప్పారు. ఈ విషయం తెలిసిన శ్రీ సార్ వేణుగోపాల్ గారి ప్రమేయం లేకనే నెల్లూరు, గూడూరు పాలిటెక్నిక్ కాలేజీల అప్లికేషన్స్ తీసుకొచ్చి అప్లై చేయించారు. రెండు కాలేజీలలో సీటు వస్తే సార్ వేణుగోపాల్ గారితో "మీ నాన్నగారి అనుమతి తీసుకోమని, ఆయన ఏమి చెపితే అది చేయమని" చెప్పారు. వేణుగోపాల్ గారి నాన్నగారు 'మీరింత చెపుతుంటే ఎంత కష్టమైన చదివిస్తాను, కాలేజీ లో చేర్పించమన్నారు'. శ్రీ సార్ తన తోటి టీచర్స్ సహాయం కూడా అడిగి ప్రతి నెలా కొంత డబ్బు ఇప్పించి గూడూరు పాలిటెక్నిక్ కాలేజీలో వేణుగోపాల్ గారిని చేర్పించారు. మొదటి సంవత్సరం సార్ డబ్బులు ఇచ్చి చదివించారు. చక్కగా మొదటి సంవత్సరం మార్కులు రావటంతో, రెండవ సంవత్సరం నుండి హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు సహాయంతో ఏ ఇబ్బందులు లేకుండా వేణుగోపాల్ గారి చదువు పూర్తయ్యింది. ఇలా సార్ వేణుగోపాల్ గారిని చదివించారు.

ఎక్కడ ఉన్నా శ్రీ సార్ కృప మనపై ఉంటుందని, మనం బాధ, కష్టంలో స్మరించగానే మనకు శ్రీ సార్ పలుకుతారు అనే ఎందరి అనుభవాలలో ఇది ఒకటి.

శివరత్నం గొలగమూడిలో ఉన్నప్పుడు సార్ మీద ఆధారపడి ఉన్నప్పుడు శ్రీ సార్ శివరత్నం చేత B.Ed., M.Ed చదివించారు. అతని తమ్ముడు శివ శంకరయ్య 2009 లో గేట్ ఎగ్జామ్ రాసి 2010 లో ఇండోర్ లో M.Tech కు జాయిన్ అయ్యాడు. M.Tech లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్ చేయడానికి అక్కడ ఒక గైడ్ వద్ద చేరాడు. తర్వాత తెలిసిన విషయమేమిటంటే ఆ గైడ్ వద్ద ఎవరూ నిర్ణీత సమయంలో ప్రాజెక్టు complete చేయలేదని, ఆమె చాలా tough guide అని. ఆమె శివ శంకరయ్యను చదవమని చెప్పేటప్పుడు చాలా తీవ్రంగా చెప్పేది. శివ శంకరయ్య భయంతో దిక్కు తోచక శ్రీ గురు చరిత్ర పారాయణ చేశాడు. పారాయణ పూర్తయ్యేటప్పటికి శ్రీ సార్ స్వప్నంలో కనబడి ఒక చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వుతో అతనికి ఎంతో ఉరట, సంతోషం, ఉత్సాహము కలిగాయి. అంతకు ముందు కూడా అలాంటి ప్రేమ పూర్వక నవ్వుకు ఎంతటి కష్టమైనా కరిగి పోవాల్సిందే. ఆ స్వప్నంతో అతని బాధంతా తీసిపారేసినట్లయ్యింది. అప్పటి నుండి అతని guide ఎంతో ఆప్యాయంగా అతని డౌట్లు క్లారిఫై చేయడం, అతని సీనియర్లకు చెప్పి అవసరమైన సాయం చేయించడం చేసింది. అన్నీ సవ్యంగా జరిగి ప్రాజెక్ట్ నిర్ణీత సమయంలో విజయవంతంగా complete అవ్వడం జరిగింది. సార్ చిరునవ్వుతో ఎలాంటి సమస్యలు అయినా దూరం అవ్వడం అతనికి, మరెందరి భక్తులకో కూడా అనుభవం. వారి వాత్సల్యము, కరుణ, సర్వజ్ఞత, సర్వ సమర్ధతను ఏమి వర్ణించగలం?

సాయి సుబ్రహ్మణ్యం గొలగమూడి లో ఉన్న ఒక సందర్భంలో Ph.D. చేసే ఆవకాశం ఉందని అతను M.S. చదివిన బెంగుళూరు IISc నుండి letter, విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్ ఇంటర్వ్యూ కు రమ్మని ఒక letter ఒకేసారి వచ్చాయి. సాయి మాస్టర్ నిలయం ఎదురుగా పని చేసుకుంటున్న శ్రీ సార్ తో “సార్ ఏమిచేయమంటారు ?” అని అడిగితే, సార్ “మనం own decisions తీసుకోరాదని స్వామి వద్ద చీటీలు వేసి నిర్ణయం అడుగుదాము” అన్నారు. సాయి చేత పెట్టించి తీయించారు. సాయి సుబ్రహ్మణ్యం చీటీలు వేయబోతుంటే ఏమి వ్రాశావు అని అడిగారు. 1) Ph.D.చేయమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ 2) విద్యానగర్ లెక్చరర్ job ఇంటర్వ్యూ కి వెళ్ళమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ అని చెబితే సార్ “స్వామివారికి ఏ option

ఇవ్వవా?” అన్నారు. అప్పుడు ఇంకొక చీటిగా “ఇంకొన్ని రోజులు ఇచ్చటనే ఉండమని” అని సాయి అంటే Right అని సార్ అన్నారు. చీటీలు స్వామి సమాధిపై వుంచి ప్రదక్షిణలు చేయమన్నారు. ప్రదక్షిణల తర్వాత Ph.D.చేయమని చీటి వచ్చింది. సార్ సాయి చేత Ph.D.కి apply చేయించారు.

IIT మద్రాసులో Ph.D. join అయ్యాక ఆహారం నిర్ణీత సమయంలో తీసుకునే అలవాటు లేక, weekends లో ఏమి చేయాలో తోచక గొలగమూడి వస్తుండేవాడు. సార్ సాయితో IIT MADRAS HIGHER AUTHORITIES కి అతనికి చిన్నప్పుడు జరిగిన heart operation గూర్చి చెప్పి quarters అడగమని చెప్పారు. IIT MADRAS వారు సాయి విన్నపాన్ని special case క్రింద consider చేసి quarters ఇప్పించారు. అందువల్ల అతని అమ్మగారు అతనితో ఉండి వండిపెడుతుండటమే గాక ఇంట్లోనే సత్సంగం లభించింది.

సాయికి ఇంకా అనారోగ్యంగా ఉన్న ఆ సమయంలో ఒకసారి శ్రీ వెంకయ్యస్వామి వద్ద 'exam దగ్గర పడింది నీవే ఎలా స్థిమిత పరుస్తావో' అని సాయి ప్రార్థించుకొని సార్ దగ్గరకు వచ్చాడు. చెక్క పని చేయిస్తున్న శ్రీ సార్ “Sit quite. I will do the needful” అని మూడుసార్లు అక్కడ జరిగే చెక్క పనితో సంబంధం లేకుండానే అన్నారు. ఆ మాటలతో సాయి మనః పరిస్థితిని స్థిమిత పరిచారు. సార్ కు సాయి తన ఎగ్జామ్ విషయం కాని, గ్రేడ్ల విషయం కాని, మానసిక పరిస్థితి వాచా చెప్పింది లేదు. గొలగమూడి నుండి వెళ్ళేటప్పుడు సార్ సత్సంగం, వారి సన్నిధి, కృపతో అతని మనస్సును ఎంతో స్వస్థపరచి “S” అని పంపించారు. ఎంతో కష్టమైన ఎగ్జామ్స్, top competition లో సైతం జావ మాత్రమే త్రాగి ఉండే శారీరిక అస్వస్థతతో, చదువుకు సమయం వెచ్చించలేని స్థితిలో వున్నా సార్ అనుగ్రహించిన మానసిక ప్రశాంతతతో ఊహకందనంతగా అతనికి top గ్రేడ్ (S) వచ్చింది. అలా సార్ సర్వజ్ఞులు, సర్వ సమర్థులుగా అప్పటి ఎన్నో సన్నివేశాల్లో, సాయి వ్యక్తం చేయకుండానే అతని బాహ్య ఆరోగ్య పరిస్థితితో సంబందం లేకుండానే, జరిపించడంవల్ల average మార్కుల్లో పాస్ కావడం కూడా కష్టమైన ఆ సమయంలో టాప్ మార్కులతో course work చేయించారు.

గొర్తి సాయి శివకి Ph.D. సీట్ Switzerland లోని ఒక పెద్ద యూనివర్సిటీ (EPFL) లో వచ్చింది. ఇంటర్వ్యూలో సాయి శివను ‘బాగా వర్క్ చేస్తావా? అక్కడ ఉన్న సీనియర్ స్టూడెంట్ 20 research పేపర్లు వ్రాసాడు, నువ్వు అలా చేయాలి’ అని అడిగినప్పుడు అతను అలాగే చేస్తాను అన్నాడు.

కానీ అలా చేయటం తన వల్ల ఏమి అవుతుందని తలచి సార్ కి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. సార్ **"ఈ సీట్ వెంకయ్యస్వామి ఇచ్చాడు. వెంకయ్యస్వామి ఏమన్నా తక్కువ వాడా? నీ చేత అంతకంటే ఎక్కువ పేపర్స్ వ్రాయిస్తారని"** అన్నారు. సార్ చెప్పినట్లుగానే సాయి శివ 40 కి పైగా research పేపర్లు వ్రాసాడు.

సాయిశివ Ph.D. అయ్యాక పోస్ట్ డాక్టరేట్ కు అప్లై చేస్తుంటే ఏ యూనివర్సిటీ నుండి ఆఫర్ ఇంకా రాలేదు. ఆ సమయంలో అతని అన్నయ్య సాయి సుబ్రహ్మణ్యంతో సార్ "సాయిశివకు వరల్డ్ టాప్ యూనివర్సిటీలో వస్తుందని" చెప్పారు. సార్ చెప్పినట్లే హార్వర్డ్ యూనివర్సిటీ లో పోస్ట్ డాక్టరేట్ సీట్ వచ్చింది.

శ్రీ సార్ సూచించిన విధంగా విద్య ద్వారా నిష్కామ కర్మ, విశ్వ గురు సేవ చేసుకొనుటకు శ్రీ సార్ ఏర్పరచిన అద్భుత, అనూహ్య వసతులు, సానుకూల్యాలు, Ph.D.లో సీట్, చదువులలో సాయిశివ ని శ్రీ సార్ నడిపిన విధం ఇంకా వివరంగా “నమ్మితే సొమ్ము- నమ్మకుంటే దుమ్ము” పుస్తకం లో చూడవచ్చు.

సాయి శివ ఇండియా IISc లో ఉద్యోగం ప్రయత్నం చేస్తున్న సమయంలో సార్ ఆశీస్సులు అడిగాడు. సార్ “నీ సేవలు ఇండియా కి కావాలి” అని చెప్పారు.

సాయి శివ చేత సార్ చేయించిన అద్వితీయమైన ప్రజా శ్రేయస్సు కు ఉపయోగపడే పనుల్లో కొన్ని ఇక్కడ పొందుపరచాము.

❖ Ph.D. చేసేటప్పుడు సాయిశివకి వచ్చిన ఐడియాస్ తో మరో ముగ్గురి Ph.D. లు జరగటం
❖ హార్వర్డ్ యూనివర్సిటీ లో పోస్ట్ డాక్ చేస్తున్నప్పుడు హ్యూమన్ బ్లడ్ సెల్స్ డైమెన్షన్స్ కనుక్కోవటం
❖ ఒక చిన్న డ్రాప్ ఆఫ్ బ్లడ్ తో రక్త పరీక్ష పూర్తి చేయచ్చని, మలేరియాను గుర్తించగలం అని తెలుసుకోవటం
❖ IISc లో చేరిన తర్వాత అతను చేసిన సేవ:
❖ రక్త పరీక్ష చేసుకోవటానికి ఎన్నో కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన గ్రామ ప్రజలకు, వారు తమ ఇంటిలోనే ఉండి పరీక్ష చేసుకునే ఒక మొబైల్ ఫోన్ అంతటి పరికరాన్ని డిజైన్ చేయటం.

- ❖ ఆ పరికరాన్ని ప్రతి ఒక్కరికీ అందేవరకు చేర్చాలని దానికి శ్రమ అయినా అవసరమని IISc అనుబంధంగా ఒక కంపెనీ పెట్టించారు. దానికి కావలసిన ఆర్థిక, మానవ వనరులను కల్పించటం.
- ❖ శ్రీ సార్ పెట్టిన బోధ, అనుభవ, సానుకూల పరిస్థితుల భిక్షను సద్వినియోగం చేసుకునేలా సార్ కోరిన విధంగా విద్య ద్వారా నిష్కామ కర్మను, సంపూర్ణ శరణాగతిని సాధించగల్గేలా నడిపించమని సాయిశివ సార్ ని ప్రార్థిస్తున్నాడు.

నగేష్ GENPACT కంపెనీలో పని చేస్తుండగా ఐఐఎం కోర్స్ చేద్దామనుకుంటున్నానని సార్ ని అడిగితే సార్ జాయిన్ అవ్వమన్నారు. ఆ కోర్సులో చేరిన తర్వాత ఫైనల్ ఎగ్జామ్స్ డేట్స్ మర్చిపోయాడు. ఫైనల్ ఎగ్జామ్స్ రెండు వారాల ముందర నుంచి నగేష్ తో సార్ "నువ్వు చదవటం లేదు" అని అంటున్నారు. నగేష్ 'ఇప్పుడేం చదవాలి' అనుకుంటున్నాడు కానీ అతనికి ఎగ్జామ్స్ గురించి గుర్తు లేదు. ఒక శనివారం ఉదయం సార్ నగేష్ ను గుడి మూసే వరకు ప్రదక్షిణలు చెయ్యమన్నారు. అతను ఆనందంగా వెళ్లి ప్రదక్షిణలు మొదలు పెట్టాడు. శనివారం రోజు కావటం వలన గుడిని రాత్రి కూడా ముయ్యలేదు. తరువాత రోజు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి గుడిని మూసారు. అప్పటిదాకా నగేష్ ప్రదక్షిణలు పూర్తి చేసి సార్ దగ్గరకు వచ్చాడు. ఆదివారం రోజు రాత్రి గొలగమూడి నుండి బయలుదేరి ఉదయం బెంగుళూరు చేరాడు. ఆ రోజు ఉదయం ఆఫీస్ ఫ్రెండ్ ఫోన్ చేసి 'నగేష్! HOW IS THE PREPARATION? ARE YOU READY FOR THE EXAM?' అని అడిగాడు. ఆ ప్రశ్నతో నగేష్ కి మైండ్ బ్లాంక్ అయిపోయింది. అతనికి కొన్ని వారాల నుంచి వెతుకుతున్న కోర్స్ MATERIAL వెను వెంటనే దొరికింది. అతను ఆఫీసుకి చేరేలోపు రెండు గంటలు చదివాడు. నగేష్ ABOVE AVERAGE గ్రేడ్ తో ఎగ్జామ్స్ పాస్ అయ్యాడు. అతను పరీక్షల గురించి మర్చిపోయినా సార్ హెచ్చరించి చదవమనడం, ఇంకా గుర్తు రాకపోతే సార్ స్వామి దగ్గర దీక్ష చేయించి నగేష్ ని పాస్ చేయించడం సార్ అనుగ్రహం కాదా?

## ఉద్యోగ ప్రదాత

నగేష్ బెంగుళూరు వచ్చిన తరువాత GENPACT company లో టెక్నికల్ ఇంటర్వ్యూ అయ్యి 6 నెలలు అయినా HR రౌండ్ ఇంటర్వ్యూ కాలేదు. ఆ కంపెనీ వారు ఆ నిర్ణయాన్ని హోల్డ్ లో పెట్టారు. సార్ ఒకరోజు నగేష్ కి ఫోన్ చేసి "నగేష్! నువ్వు గొలగమూడికి రానక్కరలేదు. నీ ఇంటికి దగ్గరలో ఉండే గుడిలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రదక్షిణలు చెయ్యి. ఆ సమయంలో ద్రవాహారం తీసుకో. నువ్వు నీకు జాబ్ రావాలి అని కోరుకోవాలి. కోరుకోకపోతే ఎలా? నువ్వు అక్కడ ఎలా ప్రదక్షిణలు చేస్తావో నేను ఇక్కడ (గొలగమూడి) నుంచి చూస్తుంటాను" అన్నారు. సార్ ఫోన్ చేయటం, సార్ చెప్పిన మాటలకి నగేష్ కి చాలా ఆనందం వేసింది. 'సార్ చెప్పింది (ప్రదక్షిణాలు) చెయ్యటం నా పని – నా బాధ్యత సార్ పని, నేనింక టెన్షన్ పడక్కరలేదు' అని నగేష్ అనుకుని ఒక రోజు సార్ చెప్పినట్లు అతికష్టం మీద కూర్చోకుండా ఉదయం నుంచి రాత్రి గుడి మూసినంత వరకు కంప్లీట్ చేశాడు. సార్ కి ఫోన్ చేసి చెప్తే ఒక రోజు గ్యాప్ తీసుకుని మళ్లీ ఇంకో రోజు చెయ్యమన్నారు. అలానే చేసి నగేష్ సార్ కి ఫోన్ చేసి చెప్పాడు. అప్పుడు సార్ కొంచెం కోపంగా "ఒక రోజు చేస్తాను, రెండు రోజులు చేస్తాను అని కాదు. జాబ్ వచ్చినంత వరకు రోజు మార్చి రోజు అలానే చెయ్యాలి" అన్నారు. సార్ అంత ప్రేమతో చెప్పేసరికి నగేష్ సార్ తో 'సార్! నాకు వెంకయ్యస్వామి, భరద్వాజ మాస్టర్ ఏం చేసారో తెలియదు కానీ మీరు మాత్రం చాలా చేస్తున్నారు' అన్నాడు. సార్ **"సుబ్బరాయుడు, భరద్వాజ మాస్టారు, వెంకయ్యస్వామి వేరు కాదు. ఒకే దివ్య చైతన్యం! అన్నీ వేరుగా లేవు"** అన్నారు. సార్ ఒక్కసారి అంత డైరెక్ట్ గా చెప్పేసరికి నగేష్ కి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. ఎందుకంటే సార్ "నేనేం చేస్తాను, నేనేమైనా దేవుడినా ? వెంకయ్య స్వామికి చెప్పుకోండి" అని తనను పొగిడిన వారితో అంటారు. ఇంక నగేష్ ప్రతిరోజూ non stop ప్రదక్షిణలు మొదలుపెట్టాడు (మధ్యలో బ్రేక్ ఉండకూడదు కాబట్టి 1 or 2 చిన్న పెరుగు పేకట్ లే అతని ఆహారం. కొన్నాళ్ళ తరువాత తెలిసింది ఏమిటంటే నగేష్ బరువు 48 kg లు అయ్యింది అని ). ప్రదక్షిణలు ప్రారంభించిన 8వ రోజు Genpact కంపెనీ నుంచి ఫోన్ వచ్చింది. 'Congratulations Nagesh! you are selected as Business analyst' అని. 'ఇది పూర్తిగా సార్ కృపే. ఏ మాత్రం నా తెలివితేటలు , అర్హతల వల్ల కానే కాదు' అని నగేష్ చెపుతాడు.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

పొత్తూరి వేంకటేశ్వరరావుని అతని నాన్నగారు ఉద్యోగం బదులు హాయిగా వ్యాపారం చేసుకోవచ్చు కదా అని అన్నప్పుడు అతను 'మూడు నెలలు ఉద్యోగ ప్రయత్నం చేస్తాను, అప్పటికీ ఉద్యోగం రాకపోతే అప్పుడు వ్యాపారం చేస్తా' అని చెప్పి ప్రయత్నాలు చేస్తున్నాడు. అతను టీచర్ పోస్టింగ్ కి JNTU (హైదరాబాద్), SV యూనివర్సిటీ (తిరుపతి) లకి అప్లై చేశాడు. రెండు యూనివర్సిటీల నుంచి అతనికి ఉద్యోగం వచ్చింది. ఏ ఉద్యోగంలో చేరాలో సార్ ను అడిగితే సార్ "మొదట ఏ యూనివర్సిటీ నుంచి ఉద్యోగం వచ్చింది?" అని అడిగారు. వేంకటేశ్వరరావు 'JNTU యూనివర్సిటీ నుంచి వచ్చింది' అని చెప్తే సార్ అతనిని ఆ యూనివర్సిటీలో జాయిన్ అవమన్నారు. జాయిన్ అయిన మూడు నెలల తర్వాత వాసవి ఇన్స్టిట్యూట్ లో పర్మినెంట్ లెక్చరర్స్ కి ఉద్యోగాలు పడ్డాయి, "మీరు అప్లై చేయండి" అని ఒక సీనియర్ ఉద్యోగి చెప్తే వేంకటేశ్వరరావు వెళ్లి వాసవి కాలేజీలో ఒక ప్రొఫెసర్ ను ఎలా చేస్తే అతనికి ఉద్యోగం వస్తుందో మెలకువలు చెప్పమన్నాడు. ఆయన వేంకటేశ్వరరావుని ఎవరు అని కూడా ప్రశ్నించకుండా ఎలా అప్లై చేయాలో, ప్రిపేర్ అవ్వాలో కూడా చెప్పారు. వేంకటేశ్వరరావు అలానే ఉద్యోగానికి అప్లై చేశాడు. అతనికి శాశ్వత ఉద్యోగం వచ్చింది. సార్ ముందుచూపుతో వేంకటేశ్వర రావుని హైదరాబాద్ కి తీసుకువెళ్లి అతనికి అక్కడ శాశ్వత ఉద్యోగమే గాక స్వామి పుస్తకాలు ప్రింట్ చేసే శాశ్వత సేవను అనుగ్రహించారు.

రవికుమార్ గారు విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగంలో చేరిన మొదట్లో ఆయనకు మనస్సు గందరగోళంగా ఉండేది. ఆ సందర్భంలో విద్యార్థులకు సరిగ్గా పాఠం చెప్పలేకపోతున్నానని ఆయన బాధగా సార్ తో చెప్పుకున్నారు. సార్ ఆయనను శ్రీ వెంకయ్యస్వామి ధుని మందిరంలో 3 గంటలు ఉండమన్నారు. ఆయన అలానే 5 గంటలుకు పైగా ధుని మందిరంలో ఉన్నారు. అప్పటి నుండి ఆయన మనస్సు చాలా ప్రశాంతమయ్యి విద్యార్థులకు పాఠం చక్కగా చెప్పగలుగుతున్నారు.

రవికుమార్ గారి అక్కయ్య MTech REC Calicut లో కంప్యూటర్ ఇంజనీరింగ్ లో చేరింది. ఆమె బాగా చదివేది. ఆమెకు క్లాసు మొదటి రాంక్ వచ్చినా, రెండవ సెమిస్టర్ నుండి ఎందుకు చదవాలి అనే విషయమై ఆలోచిస్తూ ఏమీ చదవకుండా ఉంది. అప్పుడు ఆమె అమ్మగారు ఆమె విషయం సార్ కి చెపితే సార్ ఆమెకు లెటర్లు వ్రాసి, స్వామి స్మరణలో ఉండేటట్లు చేసారు. అంతేగాకుండా తన క్లాసులో మొదటి ర్యాంక్ రావటం,

ఉద్యోగం రావటంలో సార్ పాత్ర గణనీయమైనది. ఈ వివరాలు "నమ్మితే సొమ్ము- నమ్మకుంటే దుమ్ము" అనే గ్రంధంలో 32 వ పేజీలో చూడవచ్చు.

దారా నాగేశ్వరరావు గారి అబ్బాయి సంపత్ శ్రీ సుబ్బరామయ్య సార్ తో 'తాను ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నానని, దొంగ (ఫేక్) సర్టిఫికెట్ పెడితే కానీ ఉద్యోగం రాదని తన ఫ్రెండ్స్ అందరూ పెడుతున్నారు. ఏం చేయమంటారు' అని అడిగాడు. సార్ "మీ నాన్నగారు నెల నెలా స్వామి వద్దకు వస్తుండగా నీవు అలా ఫేక్ సర్టిఫికెట్ పెట్టడం నాకు ఇష్టం లేదు, ధర్మం కాదు. ఉద్యోగం రాకుంటే మీ నాన్నగారు పోషిస్తారు" అన్నారు. సంపత్ ఏ ఫేక్ సర్టిఫికెట్ పెట్టకనే చిన్న టీచింగ్ జాబ్ లో జాయిన్ అయ్యి ఇప్పుడు పెద్ద లెక్చరర్ గా, డిపార్టుమెంటు హెడ్ అయ్యి మంచి జీతంతో హాయిగా ఉన్నాడు.

## ఆరోగ్య ప్రదాత

దారా నాగేశ్వర రావు గారి అమ్మాయికి (హైదరాబాద్) పెళ్లి అయిన కొన్ని సంవత్సరాల వరకూ సంతానం కలగలేదు. ఆ అమ్మాయి తన నాన్నగారిని ఆ విషయాన్ని సార్ కి చెప్పి ప్రార్థన చేయమని చెప్పిన విధంగా, నాగేశ్వరరావుగారు సార్ కు విన్నవించారు. సార్ "ఎవరి ప్రారబ్ధం వారే కడిగేసుకోవాలి, వారిని వీలున్నప్పుడల్లా క్రమం తప్పకుండా స్వామిని దర్శించుకోమన్నారు". సార్ చెప్పినట్లు చేయగా కొద్ది సంవత్సరాల్లోనే వారికి సంతానం కలిగింది. తరువాత వారు గొలగమూడికి వచ్చినప్పుడు సార్ వారితో "మీకు దగ్గరలో ఉన్న నాంపల్లిబాబా సమాధి, స్వామి సమాధి ఒక్కటే. అందువలన మీ దగ్గరలో ఉన్న నాంపల్లి బాబా గారిని సేవించుకో" మన్నారు. వారు ఇప్పటికీ తరచు శ్రద్ధగా నాంపల్లి బాబా గారి సమాధి దర్శించుకొని, పారాయణ కూడా చేసుకుంటారు.

పొత్తూరి వేంకటేశ్వరరావు భార్య గర్భం ధరించిన తర్వాత 5 వ నెలలో గొలగమూడి వెళ్లి సార్ ని దర్శించుకున్నారు. అప్పట్లో నడక కష్టమని స్వామి గుడిలో ఆమె 3 ప్రదక్షిణలు చేసింది. సార్ దగ్గరకి రాగానే ఆమెతో సార్ "ప్రదక్షిణలు చేసావా, అమ్మా?" అని అడిగారు. ఆమె మూడు ప్రదక్షిణలు చేశాను అని తృప్తిగా చెప్పింది. సార్ నవ్వి రోజూ కనీసం అర గంట అయినా టైం పెట్టుకుని ప్రదక్షిణలు చేయమన్నారు. అలా చేయటం వల్ల అప్పటికి ఉన్న శారీరక బాధలు తగ్గి, తర్వాత నార్మల్ డెలివరీ అయ్యింది. అప్పటి వరకు (అంటే

నెలలు నిండే వరకు) గర్భవతులు వ్యాయామం గానీ, నడవటం గానీ చేయాలని ఆమెకు తెలియదు. సార్ ఆ రీతిన అవసరమైనది చేయించి అనుగ్రహించారు.

అలానే రెండవ సారి గర్భం ధరించిన సమయంలో కూడా సార్ ఇది వరలో చెప్పిన రీతిలో నామస్మరణ చేస్తూ ఉండేది. ఏ పని చేస్తున్నా స్మరణతో చేయటం కూడా ఆమెకు అలవాటు అయ్యింది. నెలలు నిండిన తరువాత డాక్టర్ గారికి చూపించుకుని delivery కి హాస్పిటల్ కు వెళుతుంటే ఉమ్మ నీరు పోయింది. అచ్చట స్కానింగ్ ద్వారా బిడ్డ కండిషన్ చూద్దామని డాక్టర్ ప్రయత్నిస్తే ఆస్పత్రిలో ఉన్న 3 స్కానర్లు ఆ రోజు పనిచేయలేదు. నామస్మరణలో ఉండటం వల్ల ఈ తతంగం అంతా ఏ మాత్రమూ భయం అనిపించక డాక్టర్ తో "స్టెతస్కోప్ తో చెక్ చేస్తే బిడ్డ condition తెలుస్తుంది" కదా అని అడిగితే డాక్టర్ అలానే చూసి డెలివరీ చేసారు. నార్మల్ డెలివరీ అయ్యాక, ఆమెతో డాక్టర్ 'మీకు కొద్దిలో ఆపరేషన్ తప్పిపోయింది. బిడ్డ మెడకు ప్రేగు చుట్టుకుని ఉంది. స్కానర్ పనిచేసి ఉంటే ఆపరేషన్ చేసే వాళ్ళము' అన్నారు. శ్రీ సార్ స్మృతి రహిత ప్రసన్నులుగా వారి ప్రార్థన లేకుండానే ఆపద తప్పించి, ఆపరేషన్ తప్పించారు.

వేంకటేశ్వరరావు వాళ్ళ అబ్బాయికి చిన్న వయస్సులో గవద బిళ్ళలు, జ్వరం వచ్చాయి. వాటి నొప్పి భరించటం కష్టంగా ఉండేది. ఆరు నెలల వరకూ తగ్గదన్నారు. ఇంక ఉండలేక వేంకటేశ్వర రావు సార్ కు ఫోన్ చేస్తే "గుండంలో కొబ్బరికాయ వేస్తాను బాగుంటుంది లే" అని సార్ చెప్పారు. అప్పటి నుండీ క్రమంగా సర్దుకుని ఒక నెలలో పూర్తిగా తగ్గిపోయింది. అలానే మరోసారి నీటిలో ఎలుక చనిపోతే తెలియక ఆ నీటిని త్రాగడం వల్ల టైఫాయిడ్ జ్వరం వచ్చి వేంకటేశ్వరరావు పిల్లాడికి చాలా అనారోగ్యమైంది. మరలా ధునిలో కొబ్బరికాయ వేయడం, రోజూ తీర్థం, విబూది స్వీకరించటం వల్ల ఆ పిల్లవాడు త్వరగా కోలుకున్నాడు.

సామాన్యంగా ఎప్పుడైనా అనారోగ్యం చేస్తే సార్ "ఆహార నియమం పాటించలేదు కాబట్టి స్వామి అలా చేశాడు" అంటారు. ఒకరోజు సాయిశివతో సార్ మాట్లాడుతూ "నాకు తలకాయ నొప్పి, జలుబు, కళ్ళు ఎర్రబడటం పెట్టాడు స్వామి" అని నాలుగైదు సార్లు అన్నారు. సార్ ఎందుకు అలా చెపుతున్నారో సాయిశివకి అర్థం కాలేదు. కొన్నిరోజుల తరువాత సాయిశివ గొలగమూడి నుండి తను ఇంజనీరింగ్ చదువుకునే పాల్వంచకి వెళ్ళాడు. ప్రతిరోజు అక్కడ కడుతున్న బిల్డింగ్ క్రింద పడుకునేవాడు. ఒకరోజు తెల్లవారేసరికి కారణం లేకుండా సాయిశివకి తలకాయ నొప్పి, జలుబు, కళ్ళు

ఎర్రబడ్డాయి. ఆ బాధలు ఆ ఒక్క రోజు మాత్రమే ఉండి, ఏ మందూ అవసరం లేకుండా తెల్లవారేసరికి మటుమాయం అయిపోయినాయి. ఇలా వస్తుందని తెలియపరచటమే కాకుండా సాయిశివకి ఎక్కువ రోజుల ఉండవలసిన అనారోగ్యం తన మీదకు తీసుకుని అతనిని ఒక్కరోజు మాత్రమే ఆ బాధలు అనుభవించేలా చేసిన భక్త వత్సలుడు, కరుణా సముద్రులు, సర్వ సమర్ధులు శ్రీ సార్ .

పాబోలు వేంకటేశ్వర రావుకు (సార్ వాళ్ళ అక్కగారి అబ్బాయి, అంటే మేనల్లుడి వరుస) పెళ్ళయి మొదటి పిల్లవాడు పుట్టిన తర్వాత అతని తల్లిగారికి ఒంట్లో బాగోలేదు. నెల్లూరు డాక్టర్లు చెప్పినట్లు వైద్యానికి చెన్నై (అప్పట్లో మద్రాస్) కి ఆమెను తీసుకు వెళ్ళాడు. చెన్నైలో డాక్టర్లు చెప్పినట్లు ప్రతి పదిహేను రోజులకి వాళ్ళ అమ్మగారిని చికిత్స కోసం తీసుకు వెళ్లినప్పుడు 50 వేల రూపాయల వైద్య పరీక్షలకి అయ్యేవి. కొన్ని కుటుంబ సమస్యల వల్ల అతని అక్కల నుండి ఏ మాత్రం సహాయం అందేది కాదు. అంతేగాక అతని తల్లికి, అతని భార్యకి మధ్య సయోధ్య లేక అతని భార్య సుమారు రెండు సంవత్సరాలు అతని అత్తగారింట్లో ఉన్నది. అందువలన అతను ఒక్కడే అన్నీ చూసుకోవాల్సి వచ్చేది. అందువలన ఒక్కొక్క సారి నిద్ర ఉండేది కాదు.

అలాంటి సమయంలో సార్ దగ్గరకి వారానికి ఒకసారి అతను తన తల్లిని ఇద్దరి మనుష్యుల సహాయంతో ఆటోలో తీసుకువెళ్ళేవాడు. సార్ ఒకసారి అమ్మగారితో అతని ముందరే వాళ్ళ అమ్మగారి గురించి చెపుతూ "వాడికి నమ్మకముంటే గొలగమూడి తీసుకు వచ్చి ఉండమన్నారు".

అతని తల్లికి ఆరోగ్య పరిస్థితి బాగా విషమించింది. మద్రాసు డాక్టర్లు కామెర్లకు బదులు టి.బి.కి మందు ఇచ్చారు. దాంతో ఆమెకు పక్షవాతం వచ్చింది. సుమారు 10 లక్షల రూపాయల దాకా అప్పు అయ్యింది. దిక్కు తెలియని స్థితిలో అతను సార్ ని ఆశ్రయించాడు.

సార్ మద్రాస్ డాక్టర్ల మందు ఆపించి, అతని తల్లికి పచ్చ కామెర్లకు నాటు వైద్యం చేయించారు. చాలకొద్ది కాలంలో (రెండు వారాల లోపు) ఆమెకు పక్షవాతం తగ్గి ఆరోగ్యం కూడా బాగుపడింది. ఆమె తనంత తానే వాకర్ సహాయంతో నడుచుకుంటూ స్వామి దర్శనం చేసుకోగలిగేది. స్వామి దర్శనం అయిన తరువాత సార్ దగ్గరకి వెళ్ళేది. అతను, అతని అమ్మగారు స్వామి అన్నశాలకి తూర్పు ప్రక్కరోడ్డులో ఉన్న కట్టెల వెంకయ్య గారి ఇంట్లో అద్దెకున్నారు. రాత్రి పూట చీకటిగా ఉండటం వల్ల ఆ రోడ్డులో ఎక్కువ మంది ఉచ్చలు పోసేవారు. అతని తల్లి స్వామి దర్శనానికి ఉచ్చలు తొక్కుకుంటూ

వెళ్ళటం సార్ చూసారు. సార్ తర్వాత రోజు కల్లా మట్టి తెప్పించి ఆ ఉచ్చులు పోసినంత వరకు వెంకటేశ్వర్లు చేత మట్టి వేయించి అతని తల్లి స్వామి దర్శనానికి వెళ్ళడానికి ఇబ్బంది లేకుండా చేసారు.

**సత్సంగ ప్రదాత**

వేణుగోపాల్ గారు చదువుకునేటప్పుడు శ్రీ సుబ్బరామయ్య సార్ అతనికి ఒక మహద్భాగ్యం కలిగించారు. అది ఏమిటంటే శ్రీ సుబ్బరామయ్య సార్ తమ గురువుగారైన శ్రీ భరద్వాజ మాస్టర్ గారి దగ్గరకి వేణుగోపాల్ గారిని తరచు తీసుకు వెళ్ళి, అక్కడ సేవ చేయించడం. ఆ ఇద్దరి మహనీయుల సాన్నిధ్య ప్రభావం వలన వేణుగోపాల్ గారి జీవితం ధర్మ మార్గంలో నడిచింది.

బట్టు శ్రీరామకృష్ణ అనుభవము:

నాకు ఎప్పుడన్నా నిద్ర పట్టకపోతే relaxation music లాంటివి వింటూ నిద్ర కోసం ప్రయత్నించే వాడిని. "శ్రమతో సేవ - సేవతో కైవల్యం: సెప్టెంబరు నెల E- Magazine" లో సాయి సుబ్రహ్మణ్యం అనుభవాలు చదువుతుంటే, అందులో SIR "పడుకుని సమాధి మందిరం లో శ్రీ స్వామి వారిని గాని, స్వామి భౌతికమైన రూపాన్ని గానీ చూస్తూ ఉంటే అలానే హాయిగా నిద్రలోకి జారుకుంటాను" అని చెప్పటం నన్ను ఆకర్షించింది. సెప్టెంబరు 2వ తేదీ రాత్రి నేను కూడా అలానే SIR భౌతిక రూపాన్ని ధ్యానించటం మొదలు పెట్టగానే వెంటనే హాయిగా నిద్ర పట్టింది. అంతే కాక ఆ రోజు స్వప్నంలో సార్ దర్శనం, స్పర్శనం ఇచ్చి అనుగ్రహించారు.

**శ్రీ సుబ్బరామయ్య సార్ దగ్గరకు వచ్చే అనేకమంది మధ్య, ఆ వ్యక్తుల విశేష ప్రయత్నం లేకుండానే, స్వామివారి (లేక సార్) అనుగ్రహం వలన, ఎంతో చక్కటి అనుబంధం ఏర్పడింది. ఇలా గురు బంధువులందరిని ఒక బృందంగా చేసి, అందరూ కలసి సత్సంగాలు, సత్కాలక్షేపం, సేవ చేసుకునేటట్లుగా చేయడం స్వామి (సార్) ప్రసాదించిన అదృష్టము. ఎవరికి వారుగా అన్ని సమయాలలో స్వామి చింతన, సేవ చేసుకోవడం చాలా కష్టం. అలా చింతన, సేవ చేసుకునే ఆసక్తి ఉన్నవారందరూ ఒకచోట కూడడం ఇంకా కష్టం. అలా కలిసి సేవ, చింతన చేసుకోగలిగితే, ఒక్కొక్కరూ విడివిడిగా ఉండి చేసుకునే దానికంటే ఎన్నోరెట్లు ఎక్కువుగా సేవ, చింతన చేసుకోగలుగుతాము అన్నది అందరి అనుభవము. సార్ మా అందరికీ అటువంటి అదృష్టమును**

**కలుగజేసినందుకు కృతజ్ఞతోపాటు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేటట్లు చేయమని వారినే హృదయపూర్వకముగా ప్రార్ధించుకుందాము.**

గొర్తి రవి తన అనుభవం ఇలా చెబుతున్నారు:

నా పేరు గొర్తి రవి. 2007వ సం|| లో బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తూ ఉండేవాడిని. ఒకసారి శని, ఆదివారములలో గొలగమూడిలో ఉండడానికి తమ్ముడు సాయి శివతో శ్రీ సాయిమాష్టరు నిలయమునకు వచ్చాము. ఆ సాయి మాష్టరు నిలయమునకు ఆనుకుని మేడపైకి వెళ్ళే మెట్ల దగ్గర సుమారు 5-6 అడుగుల ఎత్తుగల ప్లాస్టిక్ వాటర్ టాంక్ ఉంది. అచ్చటకు వచ్చిన భక్తుల అవసరములకు కావలసిన నీటిని, దగ్గరలో ఉన్న బావి నుండి మోటరు ద్వారా ఆ టాంక్ లోనికి తోడేవారు. ఆదివారం సాయంత్రం నేను, శివ, ప్రసాద్ మరి కొంతమంది శ్రీ సుబ్బరామయ్య సార్ ఇంటి బయట సార్ దగ్గర కూర్చుని ఉన్నాము. అప్పుడు సార్, "సాయిమాష్టరు నిలయము వద్దనున్న వాటర్ టాంక్ కడిగి చాలారోజులు అయింది" అని అన్నారు. ఆ టాంకుని శుభ్రం చెయ్యడానికి అక్కడ ఉన్న అందరము సంసిద్ధత తెలియజేసాము. అప్పుడు సార్ నాతో, "ఇక్కడ ఉన్న అందరిలో నువ్వు పొడుగుగా ఉన్నవు కదా! కాబట్టి నువ్వు శుభ్రం చేద్దువుగాని" అని అన్నారు. అప్పుడు అందరము ఆ టాంక్ దగ్గరకు వెళ్ళాము. నేను ఉత్సాహంగా ఆ టాంక్ లోకి దిగి లోపల శుభ్రం చేసాను. సార్ అక్కడే నిలబడి పర్యవేక్షిస్తున్నారు. క్లీనింగ్ పూర్తవడంతో ఆ టాంక్ బయట ఉన్న అంచుల మీద చేతులు ఉంచి, టాంక్ లోపలనుండి ఫోర్స్‌గా పైకి లేచాను. అలా ఫోర్స్‌గా రావడంలో, ఆ టాంక్‌ని ఆనుకుని ఉన్న సాయిమాష్టర్ నిలయం యొక్క సన్-షేడ్ నా తలకు బలంగా తగిలి, బొప్పి కట్టింది. అలా జరిగిన వెంటనే సార్ శ్రీ వెంకయ్యస్వామి వారి మందిరం వైపు తిరిగి, స్వామికి నమస్కారం పెట్టి, నాతో, "మరేం ఫరవాలేదు. నీ తలకు ఏదో పెద్దదెబ్బ తగలాల్సి ఉంటే, శ్రీ వెంకయ్యస్వామి వారు నీకు ఈ చిన్న దెబ్బతో తొలగించారు" అన్నారు. కొంత సేపటికి ఆ నొప్పి తగ్గిపోయింది. ఆ రోజు రాత్రి బయలుదేరి బెంగుళూరు తిరిగి వెళ్ళిపోయాము.

కొద్ది వారాలు గడిచాయి. తమ్ముడు సాయిశివ ఉపనయనం దమ్మపేటలో చేస్తున్నారు. నేను కూడా అక్కడకు వెళ్ళి ఉత్సాహంగా పనులలో పాలు పంచుకుంటున్నాను. అక్కడివారికి వంటలు చేయడం కోసం పెద్ద గిన్నెలు అవసరమయ్యాయి. వారి ఇంటి గదిలో పైన ఉన్న సిమెంటుతో కట్టిన

షేడ్ మీద ఉన్న గిన్నెలు అవసరమయ్యాయి. నేను ఒక నిచ్చెన ఎక్కి వారికి కావలసిన పాత్రలను ఇచ్చి, క్రిందకు దిగిపోయాను. ఆ తరువాత ఆ గదిలోనే చాలా మంది కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాము. ఇంతలో హఠాత్తుగా పెద్ద శబ్దమయింది. ఏమిటా అని చూస్తే పాత్రలు సద్దిన షేడ్ మీదనుండి (సుమారు 10 అడుగుల ఎత్తు ) ఒక పెద్ద గుండ్రటి బరువయిన (సుమారు 30 కిలోలు) ఇత్తడి గుండుగ పైనుండి దొర్లి, నాకు కొద్ది అంగుళముల దూరములో క్రింద పడినది. నేను అంతకు ముందు గిన్నెలు సర్దినపుడు అవి సరిగా బేలెన్స్ అవ్వకపోవడం వలన కొద్దిసేపటికే దొర్లుతో క్రింద పడింది. నేను ఒకవేళ కొద్ది అంగుళములు అటుగా కూర్చుని ఉంటే, ఆ గుండుగ నేరుగా నా తలపై పడి, నా తల అక్కడికక్కడే పగిలి ఉండేది! ఈ సంఘటన జరిగిన వెంటనే, కేవలం స్వామివారి అనుగ్రహం వలన, కొద్ది వారాల ముందు గొలగమూడిలో జరిగిన ఇంతకు ముందు వివరించిన సంఘటన స్ఫురణకు వచ్చింది. టాంక్ క్లీన్‌చేసి బయటకు వస్తుండగా సన్-షేడ్ తగిలి నాకు బొప్పి కట్టినప్పుడు, శ్రీ సుబ్బరామయ్య సార్ వెంటనే వెంకయ్య స్వామి వారికి నమస్కరించి, నాతో, **"నీకు ఎంతో పెద్ద దెబ్బ తగలవలసి ఉంటే స్వామివారు ఈ చిన్న దెబ్బతో ఆ కర్మను తొలగించారు"** అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

భవిష్యత్తులో ఎటువంటి ఆపదలు రాబోతున్నాయో మనలాంటి వారికి ఎంత మాత్రము తెలియదు. మనపై అపారమైన ప్రేమ, కారుణ్యములతో మహనీయులు తమ వద్దకు వచ్చేవారిని **అట్టి ఆపదలను - గొడ్డలి దెబ్బ అంతటి తీవ్రత అనుభవించవలసినవి - గోరు గీసుకున్నంత సులభంగా తొలగించడం ఎంతటి అదృష్టమో! అలా తొలగించడమే గాకుండా, వారి కృప వలన అలా తొలగబోతున్నది అని చెప్పడం, అట్టి సంఘటన జరిగిన క్షణములోనే, వారి కృప వలన మాత్రమే మనము రక్షింపబడ్డాము అని మన మనసులో స్ఫురింపజేయడము ఇంకెంత అదృష్టమో!** ఆవిధంగా సద్గురువుపట్ల కృతజ్ఞతను మరింతగా నిలుపుకునేందుకు ఆసరాగా నిలబడిన మహనీయులయిన శ్రీ సుబ్బరామయ్య సార్ గారి పాదపద్మములకు హృదయ పూర్వకముగా నమస్కరించుచున్నాను.

బట్టు శ్రీరామకృష్ణ అనుభవాలు:

ఓం శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః

కరోనా టైములో మా మేడ మీద గదిలో అద్దెకి ఉండే బాచిలర్ కుర్రవాళ్ళు ఊరికి వెళ్ళటం వల్లనూ, స్కూళ్ళు తెరవకపోవటం వల్లనూ, ప్రతిరోజూ సాయంకాలం మా 5 సం|| పాప లక్ష్మశ్రీ ని మేడ మీద ఆడించడం అలవాటు అయింది. ఆటలో భాగంగా రోజూ ఆ గది పైన ఉన్న వాటర్ ట్యాంక్ కోసం వేసిన ఇనుప నిచ్చెన ఎక్కటం దిగటం నేర్చుకుంది. ఆ నిచ్చెనకి handrails లేకపోవటం వల్ల జాగ్రత్తగా ఉండే వాళ్ళం. కానీ జులై 31వ తేదీ, శుక్రవారం నాడు వాటర్ ట్యాంక్ మీదకి ఎక్కి తిరిగి దిగేటప్పుడు, 2 మెట్లు దిగగానే చేయి పట్టుతప్పి, దాదాపు 9-10 అడుగుల ఎత్తు నుండి "ధబ్"మని పెద్ద శబ్దంతో నిచ్చెన మీద నుండి మా అమ్మాయి క్రింద పడ్డది. ఆ శబ్దానికి ప్రక్క మేడ మీద ఉన్నవాళ్ళు కూడా గాభరాగా ఏమైంది అని అడిగారు. అప్పటికి ఇంకా వాటర్ ట్యాంక్ పైననే ఉన్న నేను గబగబా దిగి చూసే సరికి బోర్లా పడడం వల్ల నుదుటి మీద దెబ్బ తగిలిందని ఏడుస్తోంది. నుదుటి మీద బొప్పి కడుతుందేమో, ఒళ్ళు అదరటం వల్ల జ్వరం వస్తుందేమో, లోపల ఇంకా ఏమైనా fractures అయ్యాయేమో, ఈ కరోనా టైములో ఏ హాస్పిటల్ కి వెళ్లినా risk కదా అని పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాము. కానీ, SIR దయ వల్ల బొప్పి కాదు కదా, కనీసం చిన్న గీత కూడా పడకుండా, ఏ జ్వరం లాంటివి రాకుండా రక్షించబడ్డాము. నిజానికి ఆ నిచ్చెన పక్కనే ఉన్న సిమెంట్ రాళ్ళపై పడకుండా ఉండటం కూడా SIR కృపే.

అలాగే మరుసటి వారం, ఆగష్టు 4వ తేదీన, మా 13 సం|| అబ్బాయి సాయి షణ్ముఖ్ ని కూడా రక్షించారు. వాడు మా ఇంటర్నెట్ కేబుల్ మీద ఒరిగిన చెట్టు కొమ్మని తొలగించే క్రమంలో పిట్టగోడ మీద ఎక్కినప్పుడు ఆ కొమ్మ బరువుకి విసురుగా లాగి వేయబడి, పదునైన రాళ్ళూ రప్పలతో నిండి ఉన్న ప్రక్క స్థలంలో పడినా కూడా ఎటువంటి దెబ్బ తగలలేదు.

G. సాయి సుబ్రహ్మణ్యం (తిరుపతి), శ్రీ సుబ్బరామయ్య సార్ తో తనకు గల అనుబంధాన్ని ఇలా పంచు కొంటున్నాడు. సద్గురు నిర్ణయానుసారమే సర్వం జరుగుతుంది అన్న అనుభవాలు :

❖ బెంగుళూరు లో చదువుకుంటూ గొలగమూడి వచ్చిన తొలి సందర్భాలలోనే 2001లో నాకు శ్రీ సార్ గొప్పదనం ఏ మాత్రం తెలియకున్నా నేనెవరితో ప్రస్తావించని నా బలహీనతల వలన పడే బాధలను శ్రీ సార్ కు

విన్నవించుకోనేలా (అంతఃప్రేరణ ద్వారా) చేయించారు. అదే సార్ బోధనా విధానమని తరువాత తెలిసింది. అది నాకు ఇప్పటికి ఆశ్చర్యమే! నా చదువులో వచ్చే ఆ ఇబ్బందికి వాచా అతి స్వల్పంగా చెప్పినా నాచే చివటం అమ్మ, సుధీంద్రబాబు గార్ల రూపాలలోని దైవానికి నివేదించుకోనేలా చేసి ఆ వ్యామోహం తాత్కాలికంగా అయినా ఇబ్బంది కాకుండా చేసి దివ్యంగా అతి తక్కువ సమయంలో నాచే నా మాస్టర్స్ చేయించారు.

❖ బెంగుళూరులో చదువుకోనేటపుడు నేను వ్రాసిన 3 నుంచి 5 పేజీల ఉత్తరాలను ఎంతో శ్రద్ధగా చదివి నాకు చెప్పవలసిన విషయాలు underline లు చేసి నేను గొలగమూడి వెళ్లినపుడు ఎంతో సమయం వారి సాంగత్యం ప్రసాదించి వివరించటమే కాక దానికి అనువైన పరిస్థితులు కల్పించి చేయించేవారు.

ఆ కాలంలో (2002 సం||) పెద్దగా నేను పరిచయం లేకున్నా సార్ వ్రాసిన ప్రత్యుత్తరంలో నా సంస్కారానికి తగ్గ సందేశం, ఫ్యూచర్ లో వచ్చే ఇబ్బందితో సహా వ్రాసి అందించేవారు. నేను అలా నడుచుకోలేకున్నా ప్రత్యామ్నాయ మార్గాలను వారే ఏర్పరిచి జరిపించేవారు. అలా ఒక రకమైన ప్రేమ పాశంతో నన్ను మొదటగా హరించారు.

❖ ఉదాహరణకు శ్రీ సార్ వ్రాసిన ఒక లెటర్ లో ఆహరనియమం చేసి చూడమని, గొప్పదనం వివరిస్తూ “PhD వారికి చక్కగా వివరించే కుశలత లేదు. కానీ అవసరమని మాత్రం గట్టిగా చెప్పగలను. అది అనుభవం నేర్పిన పాఠం” అని చెప్పి ముగించారు. చిత్రము ఏమిటంటే అప్పటికి నేను M.S అయి జాబ్లో join అయ్యాను. ఈ విషయం శ్రీ సార్ కూ తెలుసు. **PhD ఆలోచన కూడా పెద్దగా లేదు! కాలాంతరంలో PhD చేయటం శ్రీ సార్ అప్పటికే నిర్ణయించారేమో!**

శ్రీ సార్ భవిష్యత్తు చెప్పినట్లు ప్రత్యేకంగా చెప్పకున్నా చెప్పి చేయించిన సందర్భాలు కుడా ఎన్నో ! తరువాత శ్రీ సార్ కు క్లియర్ గా ఫ్యూచర్ లో జరిగేవి తెలిసే శ్రీ సార్ కరుణతో ఆ సందర్భాలలో మనను అద్భుత రీతి సద్గురు సార్ కృపను పొందేలా, తమ ఇష్టానుసారం వారి దివ్య శక్తితో నడిపించారు అని తరువాత తెలుస్తుంది.

❖ ఒక ఉదాహరణ : ఇండస్ట్రియల్ job లో join అయిన తరువాత నాలో (శారీరక, మానసిక) ఇబ్బందులు రాకముందే, శ్రీ సార్ మా నాన్నగారికి letter వ్రాసి మా అమ్మగారు ఉంటే నాకు కొంత బాగుంటుందని మా అమ్మ

గారు బెంగుళూరు వచ్చేలా చేసారు. తరువాత నాకు అరుగుదల బాగా ఇబ్బంది రావటం జరిగింది.

❖ అప్పట్లో నేను, మా అమ్మగారు గొలగమూడి వచ్చి బెంగళూరు వెళ్ళే ఒక మధ్యాహ్నం, శ్రీ సార్ సాయి మాస్టర్ నిలయంలో ఆరతి అయ్యాక సాగనంపుతూ, వెళ్ళాక నీకు ఎలా ఉందో లెటర్ వ్రాయి అని వెంటనే సవరిస్తూ **"నీవు ఎలాగా 15 రోజులలో వస్తావు కదా !"** అన్నారు. తిరిగి వెళ్ళాక రెండవ వారం లో సాయంత్రం job నుండి ఇంటికి వచ్చేటప్పటికి కండ్లు తిరగటం జరిగేది. ముందే మా అమ్మగారు వచ్చేలా శ్రీ సార్ ఏర్పాటు వల్ల బెంబేలు పడనవసరం లేకుండా జరిగింది. ఒక రోజు పూర్తిగా unconscious కావటంతో మా అమ్మగారు డాక్టర్ ల వద్దకు తీసుకు వెళితే ఏమి ఇబ్బంది లేదు అన్నారు. నాకు స్పృహ వచ్చి ఇంటికి వచ్చేసాము. కానీ మా అమ్మగారు మరల ఇట్టి పరిస్థితి వస్తే ఎలాగ అనటం (మా చుట్టాలు ఉన్న) హైదరాబాద్ వెళ్లి వైద్యం చేయించుకుంటే మంచిది అనుకున్నాము. కాని చిత్రంగా మరురోజు మా మామయ్య లకు కానీ, మా నాన్న గారికి కానీ, దర్గాస్వామి వారికి కానీ ఎవరికీ హైదరాబాద్ వెళ్దామని చెబుదామనుకున్నా నా ఫోన్ కలవలేదు. అప్పుడు ఇక ఇంటికి వెళ్లి సాయినాధుని వద్ద ఒక గంట నామస్మరణ చేయడానికి కూర్చుంటే, శ్రీ సార్ **"నీవు ఎలాగా 15 రోజుల్లో వస్తావు కదా!"** అన్న మాట నాకు మెదులుతోంది. మా అమ్మ గారికి కూడా చిత్రంగా "గుండెలో 3 వాల్వులు చెడి పోయిన ఒక వ్యక్తి స్వామి వద్దకు నడచుకొని వస్తే ఏమి అవ్వక, అతని ఆరోగ్యం నయం కావటం" అనే లీల మనస్సులో మెదులుతోంది. ఇద్దరి మనసులు అలా గొలగమూడి వైపు త్రిప్పటంతో బయలుదేరి రాత్రికి వెళ్ళాము. మరురోజు నుండి శ్రీ సార్ సూచనను అనుసరించి ఎన్ని ప్రదక్షిణలు చేసినా కళ్ళు తిరగడం కాదు కదా అలుపే లేదు! ఇంతటి చిత్రమైన అనుభవానికి సూత్రధారి అయిన శ్రీ సార్ సర్వజ్ఞత్వము, సర్వ సమర్ధత్వము తరువాత ఎప్పటికో కాని గుర్తింపు కలగలేదు. అప్పటికైనా వారి కృప సంకల్పము వల్లనే !

మదన్ కుమార్ కి జనవరి 30, 2017 లో తనకు వచ్చిన కల గురించి ఇలా చెప్తున్నాడు. శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు గొలగమూడిలో తమ ఇంట్లో సత్సంగం చేస్తున్నారు. అక్కడ సాయి గారు, ప్రసాద్ గారు ఇంకా కొంతమంది సేవకులు ఉన్నారు. శ్రీ సార్ అంత అనర్గళంగా మాట్లాడడం చూసి (తను సార్ ప్రత్యక్షంగా మాట్లాడడం అప్పటివరకు ఎప్పుడూ వినలేదు

కాబట్టి) ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత ఆయన పాదాలకు నమస్కరించి 'సార్ సర్వజ్ఞుడు కదా! ఈనాడు, ఈ క్షణం తన మనసులో ఇతని తమ్ముడి గురించి ఉన్న ఆలోచన సార్ కి తెలిస్తే తను చెప్పకుండానే సార్ దాని గురించి తనతో మాట్లాడాలి' అని కలలో మనసులోనే అనుకున్నాడు.

అప్పుడు సార్ తనకి సంభ్రమాశ్చర్యాలు కలిగేటట్లు "అవునయ్యా! అవ్వట్లేదు, ఏం చేయమంటావు ఆయన్ని అక్కడికి (ఢిల్లీ) పంపిస్తే అలా అయింది, ఇక్కడికి (హైదరాబాద్) పంపిస్తే ఇలా అయింది. కష్టంగానే ఉందయ్యా" అని అన్నారు. ఇతను ఒక్క నిమిషం మౌనంగా ఉన్నాడు. సార్ అంతలో ఆయన చెప్పే సత్సంగం కంటిన్యూ చేశారు. ఇతను వెంటనే సార్ పాదాలకు మరొకసారి నమస్కారం చేసుకొని 'సార్ ఎక్కడా అవ్వట్లేదు అనే కదా మీ దగ్గరికి వచ్చింది' అని మనసులోనే చెప్పుకున్నాడు. అప్పుడు సార్ ఒక్క క్షణం ఆలోచించి **"సరే ఇక్కడికి తీసుకొని రా! దాని (కష్టం) సంగతి ఏమిటో చూద్దాం"** అని అభయమిచ్చారు. అంతటితో ఇతనికి ఎక్కడ లేని సంతోషం, ఉత్సాహం కలిగింది.

సార్ చెప్పినట్లే తన తమ్ముణ్ణి గొలగమూడి తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత నుంచి అతని తమ్ముడిలో ఆందోళన, గందరగోళం తగ్గి తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించ గలుగుతున్నాడు. ఇతని మనసులో అనుకున్నది చెప్పడం ద్వారా శ్రీ సార్ తమ సర్వజ్ఞతను, తమకు అప్పటివరకు ఉన్న కష్టాన్ని తొలగించడం ద్వారా వారి సర్వ సమర్థతను నిరూపించుకున్నారు.

## భక్త భారభృతాయ నమః

గిరిజగారు (USA), తన అనుభవాన్ని ఇలా చెబుతున్నారు:

నా భర్త అమెరికా వాషింగ్టన్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్ గా, టీచర్ గా పని చేసేవారు. అది నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ అందువలన భగవంతుని సేవగా (తక్కువ జీతానికే) చేసేవారు. వారి టీచింగ్ స్టూడెంట్స్ బాగా లైక్ చేసేవారు. ఐదు సంవత్సరాలలో నాలుగు సార్లు బెస్ట్ టీచర్ అవార్డు వచ్చింది. దానితో కొంతమందికి ఇబ్బంది కలిగింది. కొన్ని సంవత్సరాల తరువాత అంటే దాదాపు ఏడేళ్ళ తర్వాత కొత్త మేనేజర్ వచ్చి మా వారికి ఎక్స్ట్రా డ్యూటీ ఇవ్వటంతో పాటు సూటిపోటి మాటలు అనేవాడు. మా వారికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఒకసారి మేనేజర్ పిలిచి నువ్వు మెడికల్ అసిస్టెంట్స్ తో రూడ్ గా ప్రవర్తించావు. అందువల్ల ఈ విషయం కోర్ట్ దాకా వెళ్తుంది అని

చెప్పి భయపెట్టాడు. అంతేకాకుండా HR మీటింగ్ ఏర్పాటు చేసి ఆ విషయాలే చెప్పాడు. సంఘటన జరిగిన తర్వాత నాకు చాలా బాధ వేసింది. అంతకుముందు చాలా మంది మమ్మల్ని మోసం చేశారు. కానీ మా కర్మ పోయిందిలే అని అనుకునేదానిని. ఈ విషయంలో మానసికంగా చాలా బాధపడ్డాను. అప్పుడు నేను శివరత్నంతో మాట్లాడినప్పుడు, సార్ చూసుకుంటారు అన్న తర్వాత కొంత స్వాంతన కలిగింది. శివరత్నం వెంకయ్య స్వామి ధునిలో కొబ్బరికాయ సమర్పించారు. ఆ తర్వాత రోజు HR మీటింగ్ జరిగింది. చాలా చిత్రంగా HR మేనేజర్ 'మీలాంటి డాక్టరు, టీచర్ దొరకటం కష్టం! నేను అన్ని ఇన్వెస్టిగేషన్ చేశాను. మీరు ఎవరికి భయపడనక్కర్లేదు. మీరు జాబ్ మానకండి' అని చెప్పే సరికి మా వారు ఆశ్చర్యపడ్డారు. అది విని నేను చాలా ఆనందించాను. అది కేవలం సార్ కృపే అని అనుకున్నాము. **ఏ లౌకిక సమస్యకైనా ఎవరినీ ఆశ్రయించ పని లేదనీ వారికి విన్నవించుకుంటే సృష్టిలో ఏ మార్పు అయినా సంభవమేనని ఎరుక పరిచారు ఆ ఉత్తమోత్తమ సద్గురు మూర్తి.**

**కర్మ విధ్వంసకాయ నమః**

వేణు గోపాల్ గారు బాగా చదివేవారు. ఆ విషయం సుబ్బరామయ్య సార్ గుర్తించి ప్రోత్సహించేవారు. కానీ వాళ్ళ ఇంట్లో ఆర్థిక పరిస్థితి వల్ల వేణుగోపాల్ గారి టెన్త్ క్లాస్ అయిపోయిన తర్వాత వాళ్ళ నాన్నగారు వ్యాపారం చేయమని చెప్పారు. కానీ వేణుగోపాల్ గారికి ఇంకా చదువుకోవాలని ఉండేది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. సుబ్బరామయ్య గారు పాలిటెక్నిక్ అప్లికేషన్ తెప్పించి వేణుగోపాల్ గారి చేత పెట్టించి దాంట్లో చేర్పించారు. అంతేగాక వాళ్ళ నాన్నగారిని ఒప్పించి సుబ్బరామయ్య గారు తన తోటి టీచర్లను అడిగి ప్రతినెల కొంత పైకం వేణుగోపాల్ సార్ కి పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదివించారు. ఆ సమయంలో కాలేజీ హాస్టల్ నుండి ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళ నాన్నగారు ఆయనను చింతచెట్టు దగ్గరకు చింతకాయలు ఏరుకోవటానికి తీసుకువెళ్లారు. వేణుగోపాల్ గారికి సమయం దొరికితే చదువుకోవాలని ఉండేది. కానీ బాధ పడిపోయేవారు. ఆ సమయంలో ఆయనకీ "నా జీవితంలో ఈ కాయలు ఏరుకునేది పోదా" అని బాధపడుతున్నారు. ఆ చెట్టుకు ఎదురుగా స్కూల్ లో పాఠం చెపుతున్న సుబ్బరామయ్య గారు వేణుగోపాల్ గారిని పిలిచి విషయం తెలుసుకుని పొమ్మన్నారు. దాని తర్వాత ఏనాడూ వేణుగోపాల్ గారి వాళ్ళ నాన్నగారు

చింతకాయలు ఏరుకోవటానికి పిలవలేదు. వేణుగోపాల్ గారు హాయిగా చదువుకునేవారు. రెండవ సంవత్సరం వేణుగోపాల్ గారి కాలేజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ వేణుగోపాల్ గారికి చదువు మీద ఉన్న శ్రద్ధ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని తన ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేయించారు. అలా చదువుకున్న వేణుగోపాల్ సారు ఏనాడు వెనక్కి తిరిగి చూడలేదు. వేణుగోపాల్ గారికి చదువుకునే అవకాశం, తరువాత జీవితం ఆ భగవంతుడు నిర్దేశించింది.

అల్లా-భగవంతుని స్వరూపమైన సద్గురువు సన్నిధి, సాంగత్యం, శరణ్యం లభించినప్పుడు మన జీవితాలలో కొన్ని ముఖ్య సంఘటనలు మన ప్రమేయం గానీ మన కర్మ ప్రమేయం వల్ల గాక ఆ భగవంతుడే (మాలిక్ గా) దగ్గర ఉండి నడిపిస్తాడు. ఆ సందర్భాలలో "నేను, నాది" అనే అహంకార మమకారాలు భగవంతుడు చాలా చిత్రంగా తీసేస్తాడు (తలెత్తకుండా చేస్తారు). కొంతకాలం అయిన తరువాత తిరిగి చూసుకుంటే ఆ సందర్భంలో మన స్వతహాగా కానీ, మన ఖర్మ ప్రకారంగా జరిగింది అని అనిపించదు. మన అతితెలివి ఆలోచనలు చేయనందుకు, సద్గురు కృపకు మనమే ఆశ్చర్య పోతాము. అటువంటి వాటిని కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించుకొందాము.

ప్రసాదు తను చేస్తున్న బెంగళూరులోని ఉద్యోగం మానేసి నెల్లూరు దగ్గర ఇంజనీరింగ్ కాలేజీలో జాయిన్ అవుదామనుకున్నాడు. ఆ విషయమై తన గైడ్ అయిన రవికుమార్ సార్ ప్రసాద్ ని ఉద్యోగం మానద్దని చెప్పినా ప్రసాద్ కి అర్థం కాలేదు. ఈ విషయం సుబ్బరామయ్య సార్ కి చెప్పలేదు. ఒకరోజు ఉదయం సుబ్బరామయ్య సార్ సత్సంగంలో భరద్వాజ మాస్టారు గురించి చెపుతూ ఏ ప్రస్తావన లేకుండా ప్రసాద్ తో **"నీవు ఉద్యోగానికి రాజీనామా చేయొద్దు"** అని చెప్పారు. ఆ మాటలో ఏ ప్రభావం ఉందోగానీ ప్రసాద్ కి ఉద్యోగం మానేయాలనే ఆలోచన పూర్తిగా పోయింది. అంతకుముందు రవికుమార్ సార్ ఎంత చెప్పినా అర్థం కానీ ప్రసాద్ కు మరెన్నడూ ఉద్యోగం మానేయాలనే ఆలోచన రాలేదు. సార్ చెప్పినట్లు చేయటం వలన ఈనాడు ప్రసాద్ కు ఏ ఆర్థిక ఇబ్బందులు లేవు.

ప్రసాదు తను చేస్తున్న ఉద్యోగం కాక వ్యాపారం చేద్దామనుకున్నాడు. ఈ విషయం సుబ్బరామయ్య సార్ కి ఏనాడూ చెప్పలేదు. ఒకరోజు సార్ దగ్గరికి వచ్చిన ఒక భక్తుడు పెట్టిన వ్యాపారంలో చాలామంది కస్టమర్లు డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. ఆ నష్టాల గురించి అతను సార్ కి చెపుతున్నప్పుడు ప్రసాద్ శ్రీ సుబ్బరామయ్య సార్ దగ్గరకి వెళ్ళాడు. సార్ ప్రసాద్ కి చెబుతూ **"నువ్వెప్పుడూ బిజినెస్ చేయకు. మనకు ఎంత కావాలి?**

**నెలకి వెయ్యి రూపాయలు ఉంటే సరిపోతుంది"** అని చెప్పారు ప్రసాద్ కి. అంతటితో ప్రసాద్ కి వ్యాపారం చెయ్యాలనే ఆలోచన శాశ్వతంగా తుడుచుకు పోయింది.

ఒక భక్తురాలు తనని ఒక పెళ్లి సంబంధం వారు చూసి ఇష్టపడిన విషయం సార్ కి చెప్పింది. సార్ ఆ సంబంధం మంచిది అని ఖాయం చేసారు. ఒక వారం తరువాత ఆ భక్తురాలు సార్ తో తనకి ఆ సంబంధం వద్దని, తనకు ఇలాంటి ఉద్యోగాలు చేసేవారు అంటే ఇష్టమని చెప్పింది. సార్ ఆమెతో **"అమ్మా! వెంకయ్యస్వామి చూపెట్టిన సంబంధం చేసుకుంటే, ఉత్తరోత్తర సంసారంలో ఏమన్నా ఇబ్బంది వస్తే ఆయనే చూసుకుంటారు. అలాగాక మన ఇష్ట ప్రకారం చేసుకుంటే స్వామి పట్టించుకోడు"** అని చెప్పారు. రెండు వారాల తరువాత ఆ భక్తురాలు సార్ దగ్గరకి వచ్చి మరలా ఆమెకు ఆ సంబంధం ఇష్టం లేదు అని చెపితే సార్ "నీ ఇష్టాయిష్టాలు తీసెయ్యమ్మా!" అని చెప్పారు. రెండు వారాల తర్వాత అదే విషయం సార్ కి చెపితే **"నీ ఇష్టాయిష్టాలు సబ్బుతో కడిగేయమ్మా!"** అని చెప్పారు. ఆ భక్తురాలు సార్ చెప్పినట్లే తన ఇష్టాఇష్టాలని ప్రక్కకు పెట్టి పెళ్లి చేసుకుంది. పెళ్లి అయిన ఒక నెలకల్లా ఆ భక్తురాలికి తన భర్త ఎంతో నచ్చాడు. అంతకు ముందు ఉన్న అయిష్టపు ఆలోచన ఆమెకు ఎన్నడూ రాలేదు. పెళ్లి అయిన మూడు సంవత్సరాల తరువాత ఆ భక్తురాలి సంసారంలో ఇబ్బందులు వచ్చాయి. ఆ ఇబ్బందులు వచ్చినప్పుడు ఆ భక్తురాలు విడాకులు ఇచ్చేద్దామనుకున్నది. కానీ సార్ ఆమెను అరచి "నీకు డిగ్రీ సర్టిఫికెట్ ఉందని అహంకరిస్తున్నావు, విడాకులు ఇస్తే సర్వనాశనం అవుతావు" అని మందలించారు. ఆ ఇబ్బందులన్నింటినీ సార్ తమ దివ్య శక్తితో తొలగించారు. ఇప్పుడు ఆ భక్తురాలి కాపురం హాయిగా, ఆనందంగా సాగుతోంది.

సాయి సుబ్రహ్మణ్యం బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడు అనారోగ్యమైంది. గొలగమూడి సుబ్బరామయ్య సార్ సంరక్షణలో అతను స్వస్థుడైనాడు. అనారోగ్యమైనప్పుడు సార్ సూచన మేరకు అతను ఆ ఉద్యోగం మానేశాడు, అతని ఇంటిలోని వారంతా సార్ చెప్పారని సంతోషంతో సహకరించారు. సార్ సంరక్షణలో ఆరోగ్యవంతుడైనపుడు తరువాత ఏమి చెయ్యాలనే విషయమై సందేశం కోసం అడిగితే, మన స్వంత నిర్ణయం తీసుకోరాదని శ్రీ సార్ సూచించి వెంకయ్యస్వామి మీద ఆధారపడేటట్లు చేసారు. శ్రీ సార్ సూచించినట్లు చీట్లు వేస్తె IIT మద్రాస్ లో PhD చేయమని శ్రీవెంకయ్యస్వామి చెప్పారు. IIT కి సాయి వెళ్లాడనే గానీ అతనికి ఎప్పుడూ

సార్ తో ఉండాలని గొలగమూడి వచ్చేవాడు. ఒక సంవత్సరం పాటు అలా వారం వారం సందర్శనాలతో ఎన్నో అనుభవాలు ఇస్తూ ఆరోగ్యం చేకూర్చి తరువాత, సార్ అతనితో నెలకు ఒకసారి మాత్రమే గొలగమూడికి రమ్మని, వెంకయ్యస్వామి చెప్పినట్లు Ph.D చేయమని సాయిని సముదాయించి పంపారు. ఆ సమయంలో సాయి ఎలిజిబిలిటీ టెస్ట్ లో ఒక సబ్జెక్టు తప్పాడు. బాగా చదివే సాయి ఇలా తప్పడంతో అతని గైడ్ చాలా ఆశ్చర్యపోయాడు. అలాంటి సమయంలో జరిగిన ఇంటర్వ్యూలో హెడ్ అఫ్ ది డిపార్టుమెంటు వచ్చి సాయిని చూసి ఇంకేమీ చూడకుండా, ప్రశ్నించకుండా **"అడ్మిట్ హిమ్"** అని చెప్పి వెళ్లిపోయాడు. ఇదంతా చూస్తే శ్రీ వెంకయ్య స్వామే ఆ హెడ్ అఫ్ ది డిపార్టుమెంటుకి ప్రేరణ పెట్టి సాయి యొక్క PhD అవటానికి అవకాశం కలిగించారు. శ్రీ సార్ సాయిని ఉత్సాహపరచాల్సినపుడు స్వామి "Admit Him అన్నారు కదా! అయన చూసుకుంటారు" అని సాయి విశ్వాసాన్ని ఎన్నోరెట్లు పెంచేవారు.

నగేష్ గుర్గావ్ లో ఉద్యోగం మానేసి హైదరాబాద్ లో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న రోజులవి. ఒకరోజు తన ఇంట్లోని వారు అతనితో నీకు పెళ్లి అయితే అన్నీ బాగుంటాయని చెప్పి జ్యోతిష్కుడు చెప్పాడని, ఒక పెళ్లి చూపులకి తీసుకు వెళ్తున్నప్పుడు సార్ ఫోన్ చేశారు. విషయం తెలుసుకుని ఇప్పుడు పెళ్లి చేసుకుని ఏమి చేస్తావు అని మందలించారు. దానితో నగేష్ ఆ పెళ్లి సంబంధం చూడటానికి వెళ్ళలేదు. ఆ నిర్ణయం నగేష్ జీవితంలో ఒక మలుపు. దాని తర్వాత శ్రీ సుబ్బరామయ్య సార్ ని సేవించుకునే అవకాశం కలిగింది. సార్ కి సేవ చేయటమే అతని పెళ్లి ఏమో? ఆ సద్గురువుని సేవించి తరించే మార్గంలో నడవటమే అతనికి పెళ్లి తరువాత బాగుండటమా?

గిరిజ గారు (USA), తన అనుభవాన్ని ఇలా చెబుతున్నారు:

2010-11 సంవత్సరం ముందు భరద్వాజ మాస్టర్ గురించి గానీ, శ్రీ సుబ్బరామయ్య సార్ గురించి గానీ నాకు ఏమీ తెలియదు. మా కుటుంబంలో కూడా ఎవరికి తెలియదు. అప్పటికే నాకు వివాహం అయ్యి మేము అమెరికాలో ఉన్నాము. నాకు ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బందులు వచ్చి నేను ఎవరితోనూ కలవకుండా ఒక షెల్ లోకి వెళ్ళిపోయాను. నా చిన్నప్పుడు మా నాన్నగారి దగ్గర పరమహంస యోగానంద గారి బుక్కు ఉండేది. ఏమైనా ఇబ్బందులు వస్తే ఆ పుస్తకం చదివితే నాకు ఎంతో సాంత్వన కలిగేది. ఇప్పుడు అలాంటి బుక్స్ కోసమే వెతుకుతుంటే

భరద్వాజ మాస్టారి సందేశం ఒక వెబ్సైట్లో కనబడింది. ఆ తర్వాత మాస్టారి పుస్తకాలు వెబ్సైటు లో చూసి ఎవరో రచయిత అనుకున్నాను. కానీ ఆ పుస్తకాలు అన్నీ ఉచితంగా ఆన్లైన్ లో ఉండటంతో ఆయన మీద గౌరవం పెరిగింది. "నేను దర్శించిన మహాత్ములు" అనే శీర్షిక మీద వ్రాసిన గ్రంథాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి, అయస్కాంతంలా నా మనస్సును లాగేసాయి. మాస్టర్ గారి రచనలు చదువుతుంటే నేను ఒంటరిగా ఉన్నాను అనే భావన అంతా పోయింది.

ఒకసారి మా నాన్నగారి హెల్త్ బాగోలేదు. అన్ని పరీక్షలు జరిగాయి. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న రోజు మధ్యాహ్నం నా స్వప్నంలో నేను, మా నాన్న ఉన్నాము. అప్పుడు భరద్వాజ మాస్టారు గారు వచ్చి మాకు కమలాకాయ ప్రసాదంగా ఇచ్చారు. మా నాన్నగారికి అన్ని పాజిటివ్ గా వచ్చాయి. అంతే అప్పుడు మా నాన్న గారికి హెల్త్ ప్రాబ్లం పోయింది.

ఒకసారి 2012 సంవత్సరంలో నా కలలో నేను నా చెల్లెలు ఒక ఆశ్రమంలో ఉన్నాము. అక్కడ వచ్చిన భక్తులకు భోజనాలు పెడుతుంటే మేమిద్దరం కూడా కూర్చున్నాము. అంతలో గురువు గారు వస్తున్నారు అని అందరూ గౌరవంగా లేచి నిల్చున్నారు. మేమిద్దరం కూడా లేచి నిలిచియున్నాము. ఆ గురువు గారు వచ్చి నా నోట్లో మజ్జిగన్నం ఒక ముద్ద పెట్టారు. ఇప్పటికీ ఆ రుచి గుర్తు ఉన్నది. తర్వాత 2013 లో శ్రీ సార్ ను దర్శించుకున్నాక తెలిసింది, ఆ గురువుగారు శ్రీ సుబ్బరామయ్య సార్ అని !

2012 లో వెబ్ సైట్స్ చూస్తూ ఉంటే సాయి సేవా ట్రస్ట్ వెబ్సైట్లో సుబ్బరామయ్య సార్ సత్సంగంలో ఆయన గొంతు (వాయిస్) వింటుంటే నాకు కన్నీళ్లు అప్రయత్నంగా వస్తుండేవి. 2013 లో అమెరికా నుండి ఇండియా వెళ్తున్నప్పుడు నా భర్తను కోరుకున్నది ఒకటే. నన్ను ఎక్కడికి తీసుకెళ్లినా, తీసుకెళ్లక పోయినా గొలగమూడికి తీసుకు వెళ్లి అక్కడ సుబ్బరామయ్య గారి దర్శనం చేయించండి అని అడిగాను. అప్పుడు సార్ దగ్గరికి వచ్చిన తర్వాత ఆయనతో మాట్లాడాలని ఉంది కానీ ఆయన్ని చూస్తూ ఉండి ఎమోషనల్ అయ్యి ఏమీ మాట్లాడలేకపోయాను. సార్ అక్కడే ఉన్న నగేష్ ద్వారా మమ్మల్ని సాయి మాస్టర్ నిలయంలోకి వెళ్ళమన్నారు. సాయి మాస్టర్ నిలయంలో కూర్చున్నప్పుడు అప్రయత్నంగా నాకు ఏడుపు వస్తోంది. నా మనసులో ఇదే నా ఫైనల్ డెస్టినేషన్. ఇక్కడ చచ్చిపోయినా ఏమీ భయం లేదు అని అనిపించింది. ఆ విషయమే నా భర్తకు చెప్తే, మా ఆయన సుబ్బరామయ్య సార్ దగ్గర అలౌకిక శక్తి ఉంది. అందువల్లనే అలా అనిపిస్తుంది అన్నారు.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

సార్ దగ్గర నుంచి వచ్చిన తర్వాత నాకు, నా భర్తకి మధ్య ఉన్న కొన్ని పర్సనల్ సమస్యలు సమసిపోయాయి. నన్ను ఎవరైనా అంటే వాళ్ళని మనస్సులో తిట్టుకునే దాన్ని. కానీ సుబ్బరామయ్య సార్ దగ్గరికి వెళ్లి వచ్చిన తర్వాత నుంచి ఎవరైనా అన్నా ఆలా మన కర్మలు తీసేశారు అనే భావన వచ్చేది. ఒకసారి కలలో నేను గొలగమూడి సాయిమాస్టర్ నిలయంలో ఉన్నాను. అక్కడ లెట్రిన్లు కడుగుతున్నాను. కడిగిన తర్వాత అన్నీ క్లీన్ గా కడిగాను అనుకున్నాను. ఇంతలో ఒక అతను వచ్చి ఇంకా క్లీన్ చేయాలి అని చెప్పాడు. అవునా అని చెప్పి క్లీన్ చేస్తుంటే సుబ్బరామయ్య సార్ వచ్చి ఇంకేమీ క్లీన్ చేయనక్కర్లేదు, బాగుంది అన్నారు. ఈ కల యొక్క అర్థం సార్ కి మాత్రమే తెలుసు అని అనుకుంటున్నాను. **"శాంతిని నెలకొల్పు వారు ధన్యులు" అన్న రీతి శ్రీ సార్ చరిత్రలు, సత్సంగంలో వారి వాక్కు, వారి సందర్శనం, సాంగత్యం మాకు ఆరోగ్యాన్ని, సామరస్యాన్నీ, మనశాంతినీ, గురుసన్నిధిని, సంతృప్తినీ ప్రసాదించాయి.**



# ధర్మాచరణ

ధర్మము, అర్ధము, కామములను శ్రద్ధతో ఆచరిస్తే మోక్షము వస్తుంది అని మన వేదములు చెపుతున్నాయి. అలా ఆచరించి ఎందరో మహనీయులు భగవంతుడే (చైతన్య స్వరూపులు) అయినారు. మనలో చాలామందిమి "నేనేమి భగవంతుడిని కానక్కర్లేదు, ఎదో ఇలా బ్రతికి, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఏ రోగమూ లేకుండా మంచాన పడకుండా శరీరం వదిలేస్తే చాలు! అంతకన్నా నాకేమీ అక్కర్లేదు అని అంటాము. ఆ మాటతో మభ్యపెట్టుకొని మనల్ని మోసగించుకుంటున్నామనే విషయమే తెలుసుకోకుండా జీవిస్తున్నాము. మొదట మోక్షం అంటే ఏమిటంటే "తనలోనే అన్నింటినీ, అన్నింటిలో తననే చూసుకోవటం" అని భగవద్గీత చెపుతుంది. ఈ థియరీ (సిద్ధాంతం) బాగానే ఉంది కానీ "నాకేమి వస్తుంది" అనే వ్యాపార శైలి మనది. మతం ఎందుకు అనే గ్రంధంలో ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టారు వ్రాస్తూ "పరిపూర్ణుడయిన మహనీయుని యొక్క ఆనందము ముందు సృష్టిలోని అన్ని జీవుల ఆనందమునంతటినీ కలిపినా లేశమాత్రమైనా ఉండదు" అని చెపుతారు. మన కోరికల వెనుక మనం మనకు తెలియకుండా కోరుకునేది తృప్తి, శాంతి, తరుగులేని ఆనందాన్నే! అంటే మనం కొంచెం ఆలోచిస్తే మన కోరిక తీరినా తీరకున్నా మనం కోరేది ఆనందాన్నే! అలా అయితే సరే, ధర్మాన్ని ఆచరించేస్తాము చెప్పండి ఏమి చేయాలో అంటే మొదట ధర్మం అంటే ఏమిటో తెలుసుకుందాము.

"యజ్ఞము, అధ్యయనము (వేదాదులు చదువుట), దానము, తపము, సత్యము, ధృతి, క్షమ, లోభం లేకుండుట అని ధర్మమూ ఎనిమిది రకాలు" - అని వార్తాలాపం (11 వ ప్రసంగం, పేజీ 238) చెబుతుంది.

"తనకితరులు ఏమి చేయాలనుకుంటాడో అలా తానితరులకు చేయడం, తన కితరులు ఏమి చేయకూడదనుకుంటాడో అలా తానితరులకు చేయకుండడమే ధర్మము" అని మహాభారత భాగవతాలూ, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదు - అందరూ చెప్పారు - శ్రీ సాయినాధ ప్రబోధామృతం పేజీ 23

"బుద్ధి, శక్తిగల మానవుడికి స్వల్పమైన యోచనతో ప్రతివారికి 'నేను' అన్న అనుభవం ఒక్కటేనని గుర్తించడం సాధ్యం. 'సాయినాధపూజ, ఏదినిజం?' 'విజ్ఞాన వీచికలు' లో వివరించినట్లు 'నేను' అన్నది సర్వగతమని తెలుసుకుంటే 'నాలో నీవున్నావు. నీలో నేనున్నాను' 'అన్ని జీవుల రూపాలలో

నేనే సంచరిస్తున్నాను' అన్న సాయి వాక్యాలు అర్థమౌతాయి. అట్టి అవగాహన ఎంతగా కలిగితే అంతగా ధర్మాచరణ సులభమౌతుంది. అట్టి గుర్తింపుతో కూడిన ధర్మాచరణే ప్రేమ అంటే!" - శ్రీ సాయినాథ ప్రబోధామృతం పేజీ 23

ప్రస్తుతము ఉన్న పరిస్థితుల దృష్ట్యా మన మనస్సు పరి పరి భావాలతో, దురభిప్రాయాలతో ఉండి కనీసం ఒక వ్యక్తితో కూడా సరిగ్గా వ్యవహారం జరుపలేము. అలాంటిది అనుక్షణము అందరితో ధర్మబద్ధంగా మన తెలివితేటలతో వ్యవహరించగలమా? అనేది ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి, సమాధానం వెతుక్కోవాలి. అందుకోసం మనకి సహాయం చేసేవారు, జాగ్రత్తగా మార్గదర్శనం చేయించేవారు కావాలి. ధర్మాచరణలో పరిపూర్ణులై, ధర్మమే తామైన ధర్మస్వరూపులైన వారు మాత్రమే మనకు మార్గదర్శకం చేయగలరు. **శ్రీ సుబ్బరామయ్య సార్ అవధూత లీల (శ్రీ వెంకయ్య స్వామి జీవిత చరిత్ర)లో** ధర్మాచరణ అనే అధ్యాయానికి ముందుమాటలో **"ప్రతి మానవుడు సుఖశాంతులతో తృప్తిగా జీవించాలని తలుస్తాడు. కానీ అట్టి సుఖము, శాంతి, తృప్తి అనునవి మన మాచరించే ధర్మము వల్ల మాత్రమే లభిస్తాయని ఎన్ని శాస్త్రాలు ఘోషించినా, మహాత్ములందరూ ఎలుగెత్తి చాటినా ఆశాబద్ధుడైన మానవునకు అట్టి ఆచరణ దుస్సాధ్యమైంది. ఇట్టి ధర్మాచరణ మన నిత్యజీవితంలో సహజసిద్ధమయ్యేందుకు మహనీయుల సాంగత్యమొక్కటే శరణ్యమని భగవద్గీతాది గ్రంథాలన్నీ చెపుతున్నాయి. వారి ప్రత్యక్ష సాన్నిధ్యము లభించనప్పుడు మహాత్ముల చరిత్ర పారాయణ కూడా మహాత్ముల ప్రత్యక్ష సాన్నిధ్యముతో సమానమని ఎందరో భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నవి. మహనీయుల చరిత్ర పారాయణ ద్వారా అనేకమంది భక్తులలో కల్గిన హృదయ పరివర్తనే ఇందుకు నిదర్శనము"** అని, మహనీయులు చరిత్ర పారాయణ వలననే ధర్మాచరణ సాధ్యమవుతుంది అని నొక్కి వక్కాణించారు.

**"మహాత్ముల చరిత్రలు పదే పదే పారాయణం చెయ్యడం వల్ల, వారిని దర్శించడం వల్ల ఆధ్యాత్మిక వైభవం మన మనస్సుని ఆకర్షించి ఆ స్థితిని మనమూ పొందాలనే కోరికతో ఉత్తేజ పరుస్తుంది. ఈ ఉత్తేజం వివేకాన్ని, వైరాగ్యాన్ని బలపరుస్తుంది, ఆ రెండూ బలపడితే ఇటు బ్రహ్మజిజ్ఞాస మరింత తీవ్రమౌతుంది. అపుడు సాధనలో ఉత్సాహమూ పట్టుదలా పెరుగుతాయి. అన్య విషయాలలో ఆసక్తి అంతరిస్తుంది". - మతం ఎందుకు?, పేజీ 50**

మంచి విధానం మనకు శ్రీ భరద్వాజ మాస్టారు చెప్పారు కానీ ఒక వ్యక్తి ధర్మాచరణ చేస్తూ పూర్ణత్వం పొందటానికి ఎంతైనా కొంత సమయం పడుతుంది కదా మరి ఆ లోపల కొన్ని కుటుంబ అవసరాలు ఉంటాయి, పై

పెచ్చు సమాజంలో అందరూ (మనం తప్ప) అధర్మంగా ప్రవర్తిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు, వాళ్ళే రాజ్యమేలుతున్నారు మరి మనం బ్రతికేదేలా? నేనొక్కడినే పూర్ణత్వం పొంది ఏమి బావుకుంటాను, సమాజాన్ని బాగుపరిచేదెలా? అనే ప్రశ్నలు మనకు వస్తాయనే శ్రీ భరద్వాజ మాస్టారు వాటన్నింటికీ ఈ క్రింది విధంగా పరిష్కారమిచ్చారు.

"ఈ (మహనీయుల) చరిత్ర పారాయణ దేశంలో ఎక్కువమంది ప్రజలు చేయడం వలన దేశమంతటికీ గూడా ఎంతో మేలు జరుగుతుంది. "శ్రీ గురుచరిత్ర రచన జరిగాక 16వ శతాబ్దంనుండి మహారాష్ట్రంలో తరతరాలుగా ఎందరో దానిని పారాయణ చేస్తుండడం వలన సద్గురువును సేవించగల పరిపాకం ఎక్కువమందికి కలగడం వల్ల కాబోలు, శ్రీ అక్కల్కోట స్వామి, శ్రీ సాయిబాబా, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ ధునివాలా దాదా రూపాలలో దత్తాత్రేయుడు ఆ రాష్ట్రంలోనే అవతరించారు. దేశమంతటా 'శ్రీ గురుచరిత్ర', 'శ్రీ సాయిబాబా జీవిత చరిత్రలు విరివిగా పారాయణలు, శ్రవణము చేస్తుంటే దేశమంతటికీ ప్రత్యేకమైన శ్రీ దత్తానుగ్రహం కల్గుతుంది. ప్రజలలో ధర్మము, దేశానికి మానసిక, సాంస్కృతిక స్థాయిలలో గూడ శక్తివంతమైన స్వారాజ్యము, సంపద చేకూరుతాయి. వెనుకటి యుగాలలోనే ప్రపంచానికి దూరంగా వుండి అరణ్యాలలో తపస్సు చేసుకుంటున్న శౌనకుడు మొ||న మహర్షులకు గూడా సూతమహర్షి నుండి భగవంతుడి లీలలు పురాణాలుగా శ్రవణం చేయడం, వారి తపస్సులో ఎంతో ముఖ్యమయింది. ఇక యీ కాలంలో యీ చరిత్ర పారాయణ చేయడం ఎంత అవసరమో తెలుసుకోవాలి" - శ్రీ సాయి లీలామృతం.

శ్రీ భరద్వాజ మాస్టారు "ఎక్కడైతే మహనీయుల పారాయణలు దీక్షగా ఎక్కువమంది పరాయణత్వంతో చేస్తారో అక్కడ సమాజ శ్రేయస్సు కోసం దత్తస్వామి మహనీయుల రూపంలో ప్రకటమౌతారు" అని అభయమిచ్చారు.

పారాయణ ఎలా చెయ్యాలో ఒక భక్తునికి చురక వేస్తూ సుబ్బరామయ్య సార్ చెప్పినది మనందరికీ కూడా మార్గదర్శకం:

"Hello సత్యనారాయణ గారు!

ఏమైనా చదవటం మొదలు పెట్టావా? లేక వీళ్లకు తెలియదు, ఏదో కోతలని మానేశావా? మన sincerity హృదయపూర్వకమైనదని లెటర్ ద్వారా కాదు నీ ఆచరణ ద్వారా ఋజువు చేసుకో, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఆ సత్యం తెలుసుకోవాలని ఉందన్నావుగా మరి. ముందు జాగ్రత్తగా ఏది నిజం?,

మతం ఎందుకు?, విజ్ఞాన వీచికలు, సాయిలీలామృతం, గురుచరిత్ర. శ్రీ స్వామివారి చరిత్రలు దీక్షగా అర్ధఆకలితోనే పారాయణ చేయాలి. దీక్షా కాలంలో ఎవ్వరితోనూ తగాదాలు, జోకులు, సినిమాలు, అమ్మాయిల కబుర్లు పనికి రావు, ఎప్పుడూ అర్ధకడుపు నిండగానే లేయాలి. నీవు ఆధ్యాత్మిక విద్య కోరుతున్నావు. కనుక విద్యార్థికి చెప్పబడ్డ నియమాలు పాటించాలి.

(1) మితాహారం (2) జీర్ణ వస్త్రం (3) కాక దృష్టి (4) బక ధ్యానం.

ఈ నియమాలు పాటించకుండా నీకు పుస్తకంలో చెప్పబడ్డ సత్యం హృదయగతం కాదు. దిల్ కే బాత్ కావాలి. దిమాక్ కే బాత్ కాదు. నిత్యం నియమం తప్పకుండా పెట్టుకున్న కాలాని కంటే ముందే (ఐదు నిమిషాలు) వచ్చి ప్రశాంత చిత్తముతో మాష్టారి పటం ముందు కూర్చోవాలి. వారు తప్పక సందేహనివృత్తి చేసి శుభ్రమార్గాన నడుపుతారనే విశ్వాసముండాలి. విశ్వాసం లేకుండా సంశయ హృదయుడవై కూర్చున్నా ప్రయోజనం లేదు.

ఏకలవ్యుడు కేవలం విశ్వాసం వలననే అర్జునుడిని మించిన విలుకాడయ్యాడు. తన ఎదుట ఉన్నది మట్టి బొమ్మ అని ఎప్పుడూ కలలో కూడా పొరపాటున గూడ అనుకోలేదు. అందుకే శబ్దభేది బాణ ప్రయోగం మంత్రపూర్వకంగా నేర్చుకున్నాడు. నీకూ అలాంటి విశ్వాసముంటే శ్రీ మాష్టారి పటమే, ఆయన అంతటా ఎలా ఉన్నారో అనుభవపూర్వకంగా భోదిస్తారు". - సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు, పేజీ 64

సద్గురువు ఆశ్రిత కల్ప వృక్షమై మన లౌకిక కర్తవ్యాలను, అవసరాలను ఎంతో అద్భుతముగా, సులభసాధ్యం చేసి (మనకంటే ముందు వుండి) నెరవేరుస్తారని ఎందరి అనుభవాలలోనో చూస్తాము. అట్టి సద్గురువు "భుక్తి" ని ప్రసాదించటమే కాక, ఆత్మప్రాప్తి, దు:ఖనివృత్తికి అవసరమైన ప్రాధమిక సూత్రాన్ని, "ధర్మాచరణ" ను కూడా మనచేత ఎలా ఆచరింప చేస్తారు? "తృప్తి"ని ఎలా సమకూరుస్తారు అనేది క్రింది అనుభవాలో చూడగలము. "మహా మతి" అయిన సద్గురు సాంగత్యం "సద్ధర్మాచరణకు", మనలోని "సంస్కారాల మార్పుకు" అద్భుతమైన మంత్రంలా ఎలా పనిచేస్తుందో శ్రీ సార్ వివిధ భక్తులకు ప్రసాదించిన జీవితనుభవాలు నుండి గుర్తించవచ్చు.

**మహా మతిః**

Nuclear Power Corporation (NPC) లో వేణుగోపాల్ గారు సర్వీస్ maintenance కి ఇన్-చార్జ్. దానిలో వర్కర్స్ సరిగ్గా పని చేసేవారు కాదు. ఈ విషయం వేణుగోపాల్ గారు శ్రీ సార్ కు విన్నవిస్తే దానికి ఒక

చిట్కా చెప్పారు. దాని వలన వర్కర్స్ తో ఉన్న అన్ని ఇబ్బందులు తొలగిపోయాయి. పని సామర్ధ్యము కూడా పెరిగింది. ఆ చిట్కా ఏమిటంటే -

వర్కర్స్ ని ఎప్పుడైనా పని చేయమను. కానీ కస్టమర్స్ కి ఏ మాత్రం ఇబ్బంది కలుగకూడదు. అనుకున్న సమయంలో చేసిన వారు కావలిసినప్పుడు లీవ్స్ తీసుకోమను.

అందరి వర్కర్స్ లో సేవాభావం ఉన్న ఇద్దరు ముగ్గురుని నీ దగ్గర 24 గంటలు ఉంచుకుని ఎవరైనా కంప్లైంట్ ఇస్తే ఆ పని త్వరగా చేయించు. వారికి కావలసినప్పుడు లీవ్స్ ఇవ్వటమే కాకుండా ఇంక్రిమెంట్, ప్రమోషన్ లు వచ్చేటట్లు చూడమని చెప్పారు. **ధర్మసూక్ష్మము తెలిసి చెప్పిన సార్ సూచన అనుసరించి వేణుగోపాల్ గారు, వారి కో-వర్కర్స్ కుడా ఎంతో లబ్ధి పొందారు.**

సాయిశివ PhD స్విట్జర్లాండ్ లో చేసే మొదటి కొద్ది నెలల్లో వీలున్నప్పుడల్లా తీవ్రంగా నామస్మరణ చేసే రోజుల్లో, సద్గురుకృప వల్ల కొన్ని వారాల పాటు సాయంత్రం త్వరగా ఇంటికి వచ్చి, రాత్రి - ఉదయము అతని మనస్సులో ఏ ఆలోచనలు లేక నిశ్చలమయ్యేది. నీ చదువే పూజ అని సార్ ఇదివరలో చెప్పారు కదా నేను ధ్యానానికి సమయం ఎక్కువ కేటా ఇస్తున్ననే పరవాలేదా అనే సందేహం సార్ ను అడిగితె **"నిశ్చలంగా ఉన్న మనస్సులో ఆయన ఐడియాలు ఇస్తాడు. నువ్వు ఆలోచిస్తే కాదు. అలాగే కంటిన్యూ చేయి అన్నారు".** అలాంటి ధ్యాన సమయంలో అతనికి ఒకరోజు తెల్లవారుజామున కొన్ని ఐడియాలు వరుసగా తట్టాయి. ఆ ఐడియాలను సాయిశివ తన గైడ్ కి చెపితే, ఆయన ఈ ఐడియాలు రివల్యూషనరీ అని చెప్తూ "మీ గురువు గారికి నా నమస్కారాలు చెప్పు" అని అన్నారు. అప్పుడు శివకు ఆ ఐడియాస్ ప్రేరేపించింది సార్ అనే విశ్వాసం బలపడింది.

శ్రీ రఘురామరాజు గారు తమకు 30 సంవత్సరాల నుండి శ్రీ సుబ్బరామయ్య గారు తెలుసనీ, తను-మన-ప్రాణాలను సద్గురువుకు సార్ అర్పించిన గొప్ప వ్యక్తి అని చెప్పారు.

ఆయన భార్యకి ఈ సత్సంగాలు, మహాత్ముల సందర్శనములు అనేవి నచ్చవు. ఆమె రాకపోవటమే గాక ఆయనని కూడా వెళ్లనివ్వరు. అందువలన ఆయన ఏ మహనీయుల దగ్గరకి వెళ్ళినా ఆమె మనస్సు బాగుండాలని కోరుకునే వారు. ఒకసారి సార్ మాటల సందర్భంలో సుబ్బరామయ్య సార్ "ఎందుకయ్యా మీ ఆవిడంటే అంత ద్వేషము?" అన్నారు. ఆ మాటలకు ఆయన అదిరిపోయారు. ఆయన ఎప్పుడూ తన భార్యకు మంచి జరగాలని

కోరుకుంటుంటే సార్ ఇలా అన్నారే అనుకున్నారు. తరువాత తరచి చూసుకొంటే ఆమెకు తన పట్ల ద్వేషం ఉండటం తనకు ఇదివరలో ఆమె పట్ల ద్వేషం ఉండటం వల్లనే అని, ఇప్పటికి సబ్ కాన్సష్ లెవెల్ లో ఆమె అంటే ఆయనకు ద్వేషం ఉంది అని అర్ధమైంది. అందువలన ఆయన ఎన్ని చేసినా వృధాయే కానీ సఫలం కాదు. సార్ ఆ ఒక్క మాటతో ఆయనకు తన భార్య పట్ల దృక్పధాన్ని మార్చారు. **సదవగాహనతో సద్గురు సేవ - గృహస్థ ధర్మాచరణలో ముందుకు వెళ్ళే సహకారం అందింది**.

శ్రీ సుబ్బరామయ్య గారిని ఒకరు సాయిమాస్టర్ నిలయంలో అనరాని మాటలు అంటున్నా సార్ ఒక్క మాట మాట్లాడలేదు. అంతటి సహనం చూసి శ్రీ రఘురామ రాజు గారు అబ్బుర పడ్డారు. ఆయనకు వేమన చెప్పిన పద్యం గుర్తు చేస్తూ 'ఎన్నో శాస్త్రాలు తెలియవచ్చు, సత్సంగాలు చేయవచ్చు, కానీ సహనం అనేది అంత తేలికగా రాదు. అలాంటి **సహనం ఎన్నో జన్మల పుణ్య ఫలం వలననే, నిష్కామకర్మ వలననే, గురు కృప వలననే, సద్గురు సేవ వలననే వస్తుంది**' అని చెప్పారు. అలా శ్రీ భరద్వాజ గారు చేశారు, సుబ్బరామయ్య గారు చేశారు.

**సార్ ని ఎన్నడూ నిరాశ, నిస్పృహతో చూసింది లేదు. ఎప్పుడూ ఏదో పని చేస్తూ, సత్సంగం చేస్తూ ఉండేవారు. సత్సంగం చేసేటప్పుడు లోపల ఏమీ లేకుండా, చెప్పేది ఒకటి చేసేదీ ఇంకొకటి కాకుండా చిన్న పిల్లవాడిలా చేసేవారు.** సుబ్బరామయ్య సార్ నాలుకను జయించారు అని శ్రీ దర్గాస్వామి చెప్పారు అంటే ఆయన ఎంత గొప్పవారో అర్థం చేసుకోవచ్చు.

సుబ్బరామయ్య సార్ వాళ్ళ కూతురు సుమతి గారు సుబ్బరామయ్య సార్ జీవితంలో కొన్ని సంఘటనలు చెప్పారు.

“జితే జిహ్వే సర్వం జితే” అన్నట్లు సార్ ఉప్పు, పులుపు, కారం లేకుండా ఎన్నో సంవత్సరాలు ఉన్నా ఎంతో శ్రమ చేసేవారు. సమయ పాలన అనేది సార్ దగ్గర నేర్చుకోవచ్చు.

సార్ కాలెండర్ వెనకాల 'ఈ జన్మలోనే జన్మ రాహిత్యం సాధించాలి' అని వ్రాసుకున్నారు.

సార్ కి ఎప్పుడు పడుకున్నా నిద్ర పట్టేది. నిద్ర లేక పోయినా ఆవలింతలు, తూగుగానీ, నీరసం గానీ ఉండేది కాదు. ఎప్పుడూ హుషారుగా ఉండేవారు.

## సద్ధర్మ సంరక్షకాయ నమః

శివశంకరయ్య గూడూరులో ఉద్యోగం చేసేటప్పుడు అతనికి ఒకసారి ఆత్మకూరులో ఒక ఇంటర్ కాలేజీలో ఎగ్జామ్స్ ఇన్విజిలేషన్ డ్యూటీ పడింది. అతను చూస్తుండగానే కాలేజీ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు తెచ్చి కాపీ కొట్టించమని, వారికి బెస్ట్ మార్క్స్ వచ్చేలా చేయమని force చేశారు. వాళ్ళు అతని కాలేజీ ప్రిన్సిపాల్ కు కూడా చెప్పి ఆయనతో శివ శంకరయ్యకు చెప్పించారు. అలా చేయటం తన వల్ల వీలుకాదని, స్టూడెంట్స్ ల్యాబ్ చేసి వ్రాయగలిగిన అంత వ్రాయడమే అని శివశంకరయ్య చెప్పాడు. కాలేజీ వాళ్లు ఎక్కువ ఇచ్చే డబ్బులు ఇవ్వము అన్నా, మరి ఏం చెప్పినా వినకపోవడంతో రూమ్ లో కొట్టడానికి రెడీ అయినట్లు స్టూడెంట్స్ అరవటం మొదలు పెట్టారు. శివశంకరయ్య ధైర్యంగా ఎదురు నిలబడేటప్పటికీ వాళ్ళు కాళ్ల బేరానికి వచ్చారు. అతను తన డ్యూటీ మేరకు చేసి వచ్చేసాడు. తర్వాత ఈ విషయం శ్రీ సార్ కు చెబితే **"నీవు అలాగే ధర్మానికి అంటి పెట్టుకొని ఉండు. నువ్వు ఎక్కడ ఉన్నా స్వామి రక్షణగా ఉంటారు"** అని సార్ చెప్పారు. **ధర్మాచరణ చేయగల శక్తి శ్రీ సార్ సాంగత్య ప్రభావమే, ప్రసాదమే** అని శంకరయ్య చెపుతాడు.

శ్రీ సాయి మాస్టర్ నిలయం లో గ్రౌండ్ ఫ్లోర్ లో ఆడవాళ్లకు, మొదటి అంతస్తులో మగవాళ్లకు అని కేటాయించారు. భక్తులు అలానే మెలిగేవారు. శివ శంకరయ్య కొన్నాళ్ళ పాటు సాయి మాస్టర్ నిలయంలో తన అన్న శివరత్నంతో పాటు ఉండేవాడు. ఒకరోజు రాత్రి శ్రీ సార్ ఉన్నట్లుండి చెకింగ్ కు వచ్చారు. అచట ఒకళ్ళిద్దరు మగవాళ్ళు క్రింద రూమ్ లో ఉంటే వారిని విపరీతంగా తిడుతున్నారు. సార్ అంత గట్టిగా తిట్టడం అతనెప్పుడూ చూడలేదు. అందువల్ల అతను ఆశ్చర్యపోయాడు. ఆ మగవాళ్లు వెళ్లిపోయారు. శివ శంకరయ్య సార్ ఎందుకు ఇంతలా తిడుతున్నారు? అని మనస్సులో అనుకున్నాడు. మరురోజు అతను సార్ వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు, సార్ నవ్వుతూ శివ శంకరయ్యతో "నిన్న నేను అంత అలా ఎందుకు తిడుతున్నాను, అనుకున్నావా? వాళ్ళు త్రాగి వచ్చి క్రింది ఆడవాళ్లు ఉండే రూములో పడుకుని, వాళ్లను డిస్టర్బ్ చేస్తున్నారు. అందుకు తిట్టవలసి వచ్చింది" అన్నారు. అతని మనస్సులో ఉన్న సందేహానికి శ్రీ సార్ అతడు అడుగకనే చెప్పటం వలన ఆయన సర్వజ్ఞత్వం ఎరుకపడింది.

ఒకరోజు ఆఫీస్ లో తెల్ల కాగితాలు వేణుగోపాల్ గారు తమ స్వంత పనికి ఉపయోగించుకోవాలనుకున్నారు. ఆ రోజే శ్రీ సుబ్బరామయ్యగారి

నుండి లెటర్ వచ్చింది. దాంట్లో ద్రోహం, రాజద్రోహం (నమ్మక ద్రోహం) గురించి ప్రస్తావించటం వల్ల వేణుగోపాల్ గారు ఆఫీస్ లో తెల్ల కాగితాలు ఉపయోగించకుండా చేసారు. **సార్ ఏమరుపాటు లేకుండా వేణుగోపాల్ గారిని గమనిస్తూ ఆయన  తప్పు చేయబోయే విషయం ముందుగానే తెలిసి, ఉత్తరం వ్రాసి ఆయన ప్రవర్తనను సరిదిద్దారు. ఇది సమర్థ  సద్గురువు తప్ప మరి ఎవరు చేయగలరు.**

సార్ వ్రాసిన **శ్రీ అవధూత బోధామృతం** లక్ష్మి గారికి, దమ్మపేట సత్సంగంలో వారికి మార్గదర్శకమైంది. దానిలో శ్రీ స్వామివారు కార్యదీక్ష (పని అయితేనే గంజి ముట్టాలని) ఎంత శ్రద్ధగా చేసారో అనే స్వామి ఆచరణ, దమ్మపేట సత్సంగ సభ్యులందరికీ శ్రద్ధగా మహనీయుల చరిత్ర పారాయణ చేయాలనిపించేది. **"ఎంత పడితే అంత, ఎక్కడ పడితే అక్కడ, ఎవరు పెడితే అది తినటం కూడదు"** అని ఆ గ్రంథంలో వివరించిన స్వామి బోధలు లక్ష్మిగారికి హృదయగతమవుతూ ఆ గ్రంథాన్ని మరలా మరలా మననం చేసుకునేవారు. ఆ పుస్తకం ద్వారా సత్సంగం చేసేవారు. **తీసుకోవలసిన జాగ్రత్తలు, అది సజావుగా జరుగుటకు అవసరమైన మార్పులు చిత్రంగా, శ్రీ సార్ లెటర్ల ద్వారా సరైన సమయానికి అవ్యక్తంగా లక్ష్మిగారికి అందేవి.**

ఒక సమయంలో సత్సంగంపై దమ్మపేట ఊళ్ళో వాళ్ళకే గాక, చుట్టుప్రక్కల ఎన్నో ఊళ్ళ వారికీ శ్రద్ధ కలిగి లక్ష్మిగారిని వారి గ్రామాలకు సత్సంగం కోసం తీసుకు వెళ్ళేవారు. అలాంటి సమయంలో లక్ష్మిగారు అక్కడే భోజనం చేస్తుండేవారు. అంతేగాక అక్కడి భక్తులు కృతజ్ఞత కొద్దీ లక్ష్మి గారికి ఇచ్చిన ప్రసాదాలు తమ పిల్లలకు ఇవ్వడం, జాకెట్ గుడ్డలలాంటివి ఏమి చేయాలో తోచక తెచ్చి ఇంట్లో ఉంచేవారు. ఆ సందర్భంలో అనుకోకుండా సార్ వద్ద నుండి ఒక లెటర్ వచ్చింది. దాంట్లో "రాజద్రోహం అంటే రాజు లేదా గురువు యొక్క సేవకులు, భక్తులు అయిన వారి సొమ్మును మనం స్వీకరించటం, దానితో మనం అన్ని రూపాలలోని గురువుకు ఎంతో ఋణపడతామని ప్రస్తావిస్తూ గుజరాత్ లో వుండే వేణుగోపాల్ గారికి ఉద్యోగ ధర్మం గురించి వ్రాస్తూ చిత్రంగా ఎందుకో మీకు పంపాలనిపించి పంపానని" వ్రాసారు. అప్పటి ఆమె పరిస్థితికి అది స్వామి సందేశం అనిపించింది. అప్పటి నుండీ లక్ష్మిగారు ఎచ్చటకు వెళ్ళినా ఏమీ స్వీకరించేవారు కాదు. ఇదివరలో ఇతరులు యిచ్చిన (ఇంట్లో ఉన్న) ఎన్నో జాకెట్ గుడ్డలు మొ|| పేదలకు పంచేసారు, ఊళ్ళో వాళ్ళు సైతం ఇచ్చే ఎన్నో పళ్ళు (మామిడిపళ్ళు) మొ|| కూడా లక్ష్మిగారు తమ పిల్లలకు కాకుండా ఆకలితో ఉండే జీవులకు, బిచ్చగాళ్లకు

సాయినాధుని రూపాలుగా భావించి ఇచ్చేవారు. **"సత్సంగం చేసుకొని శ్రీ మాస్టారి ఆశీస్సులు పదిలపరచు కోడానికి, వారి కృప సద్వినియోగము అవటానికి ఈ అపరిగ్రహం ఎంత ముఖ్యమో తర్వాత శ్రీ సార్ సూచన, సందేశంతో గానీ బోధపడలేదు, ఆచరణలోకి రాలేదు"** అని లక్ష్మిగారు అంటారు.

సార్ లెటర్ తో ఇచ్చిన సందేశం వలన అంతకుముందు నుండి అవధూత బోధామృతంలో మరలా మరలా సూచించే బోధ "ఎవ్వరి దగ్గర పడితే, ఎంత పడితే అంత తినటం సాధకులకు తగదు" అన్నది, "విమర్శలు వింటే గంజి క్రింద పెట్టు", "స్వామి సేవకు తగము" అన్నవి అన్నీ లక్ష్మిగారి హృదయంలో సమన్వయమై బయట ఊళ్లకు వెళ్ళినప్పుడు తినటం వల్లనే తరువాత బాబాపై సరిగా మనస్సు నిలప లేకపోవటం, అనవసరపు ఋణానుబంధాలు, చికాకులలో చిక్కుకోవటం జరుగుతున్నాయని గుర్తింపు కలిగింది. అప్పటి నుండి ఆమె బయట తినటం, ఇతరులు ఇచ్చినవి, వండినవి తినటం మానేశారు. వారి చిన్నబ్బాయికి (సాయిశివకు) శ్రీ సార్ స్వయంగా చాలా స్పష్టంగా లెటర్ లో వ్రాసిన, చేసిన సూచన కూడా దీన్ని బలపరచటంతో అప్పటినుండి వారిద్దరిచే బయట తినకుండా ఉండే నియమం శ్రీ సార్ ఆచరింప చేసారు.

## కర్తవ్య బోధ

సార్ ప్రసాద్ కు 1999 లో మొదట నేర్పించిన పాఠం - దేవుడు మననుండి కోరేది ఏమిటి? మన మనస్సు, కాలము, కృతజ్ఞత. ఆ విషయాన్ని ప్రసాద్ తన పుస్తకంలో వ్రాసుకుంటూ కృతజ్ఞత దగ్గర 'జ్ఞ' వ్రాయాలా, 'ఘ్న' వ్రాయాలా అని సందిగ్ధంలో పడ్డాడు. సుమారు 6 అడుగుల దూరంలో కూర్చున్న సార్ వెంటనే "ఏమి వ్రాస్తున్నావు" అని అడుగగానే కృతజ్ఞత అని ప్రసాద్ కు తట్టింది. ఈ రోజు సార్ చేసిన మేలును గుర్తుంచుకుని సార్ కి కొంతైనా కృతజ్ఞత కలిగి ప్రసాద్ ఉన్నాడంటే కేవలం సార్ కృప.

ఒకసారి ప్రసాద్ వారం రోజులు గొలగమూడిలో ఉన్నాడు. ఆ సమయంలో చాగంటి కోటేశ్వరరావు గారు ప్రవచించిన భాగవతం వింటున్నప్పుడు అతనికి గజేంద్రమోక్షం, ప్రహ్లాదోపాఖ్యానం లోని శ్లోకాలు కంఠస్థం చేయాలనిపించింది. సార్ కి చెపితే ఏమీ మాట్లాడలేదు. తరవాత రోజు ప్రసాద్ కి ఆరు నెలల క్రితం తన చెల్లెలు అతనితో తన స్నేహితురాలికి

సార్ వ్రాసిన క్రొత్త గ్రంధాలు పంపించమన్న విషయం గుర్తొచ్చి సార్ తో పుస్తకాలు కావాలని చెప్పాడు. సార్ పుస్తకాలను ఇవ్వటానికి వస్తుంటే 'ఎందుకు సార్! నేను తెచ్చుకుంటాను, మీరు తాళాలు ఇవ్వండి' అన్నాడు ప్రసాద్. సార్ "నేను రావాలి" అని ప్రసాద్ తో పాటు వచ్చారు. ప్రసాద్ పుస్తకాలు తీసుకుంటుంటే సార్ మాధవదాసు చరిత్ర కూడా పంపించమన్నారు. కొత్త పుస్తకాలు పంపించమన్నారు అని ప్రసాద్ నోటిదాకా వచ్చినా సార్ తో ఆ మాట చెప్పకుండా మాధవదాసు చరిత్ర ఒక కాపీని ప్రసాద్ తనకు కూడా తీసుకున్నాడు. ఆ గ్రంధంలో మాధవదాసు గారి గురువుగారు చెపుతూ **"శ్లోకాలు వల్లెవేయటం వల్ల ఏమీ రాదు అని ఇంకా చాలా విషయాలు చెప్పి వాటి వేటి వల్ల ఆత్మజ్ఞానం రాదు. కేవలం సద్గురు సేవ వల్ల మాత్రమే వస్తుంది"** అని చెప్పి ఉంది. అది చదివిన తర్వాత ప్రసాద్ కు భాగవతంలోని శ్లోకాలు కంఠస్థం చేయాలనే కోరిక పోయింది. కృతజ్ఞత, నియమ పాలన, సద్గురు సూచించిన రీతి విద్యుక్త, ధర్మాచరణ, సేవలతో సాగాలని నిర్ణయించుకున్నాడు.

శ్రీ బ్రహ్మం గారి మఠం నిర్మాణమప్పుడు శ్రీ రఘురామరాజు గారికి సార్ చందా పుస్తకం పంపించి చందాలు వసూలు చెయ్యి అన్నారు. అప్పుడు ఆయన సార్ కి ఉత్తరం వ్రాస్తూ 'ఇలా చందాలు దండితే నలుగురూ నాలుగు రకాలుగా అంటారు అందువలన నాకు  అలవాటు లేదు, ఇష్టం లేదు' అని వ్రాసారు. సార్ ప్రత్యుత్తరంలో "ఇది అది పోవటానికే! మఠం ఎలా అయినా నిర్మించబడుతుంది. నీలో 'ఎవరినైనా ఎట్లా అడగాలి, నీ గురించి వాళ్లు అనుకుంటారు కదా!' అని అనుకుంటున్నావే. నీవు నిజాయితీ పరుడవని నీకు తెలుసు, కానీ సిగ్గుపడుతున్నావంటే ఆ మేరకు జయించాల్సిన బలహీనత ఉంది. దాన్ని జయించటానికి నీకు చందా పుస్తకం పంపించాను. అంతేగానీ నీవు ఇవ్వకపోయినా, నీవు చందాలు వసూలు చెయ్యక పోయినా మఠం నిర్మాణం జరుగుతుంది" అని వ్రాసారు. ఆ తర్వాత రఘురామరాజు గారు చందాలు వసూలు చేసి సార్ కి పంపించారు. **సార్ ఆంతర్యం ఏమిటంటే మనమేమి చేసినా మన లోపల భావాలను శుద్ధి చేసుకోవటమే కానీ ఇంకొకళ్లను బాగు చేస్తున్నామా, మందిరాలు కట్టిస్తున్నామా అనేది కాదు అనేది స్పష్టమైంది. అంటే శ్రీ సార్ మనలో అంతర్గతంగా ఉన్న బలహీనతలని గుర్తింప చేసి వాటిని తొలగిస్తారు.**

సార్ శివరత్నంను సాయి మాస్టర్ నిలయంలో ఉన్న లెట్రిన్ టాంక్ నిండిపోయినప్పుడు దాన్లోని నీళ్లను బకెట్ తో తోడి తీసేయమన్నారు.

శివరత్నం అలా చేయటానికి సంశయిస్తూ రెండు రోజులు జాప్యం చేశాడు. మూడవ రోజు సార్ వచ్చి బకెట్ తో పెంట నీళ్ళను తీస్తుండే సరికి శివరత్నం వెళ్ళి ఆ పని పూర్తి చేశాడు. సార్ చేసింది చెప్తారు, చెప్పిందే చేస్తారు.

సాయిశివ ఇలా చెపుతున్నాడు: తన చిన్నప్పుడు శ్రద్ధ లేదు, సరిగ్గా చదువుకో లేదు. 25 మార్కులు కి ఏడు ఎనిమిది మార్కులు దాటితే చాలా గొప్ప అన్నమాట. అలా ఉన్న పరిస్థితి నుంచి సార్ ఎంత ట్రాన్స్ఫర్మేషన్ తీసుకొచ్చారంటే చెప్పలేము. సార్ “నిత్య సత్యులు” అంటే సమాధి అనంతరం కొన్ని రోజులు ఉండి తర్వాత వదిలివేయటం కాదు కదా! ఎన్ని జన్మలైనా ఎప్పుడూ మనకు తోడుగా ఉంటూ మనల్ని నడిపించే వాళ్ళని నిత్యసత్యులు అంటారు, లేకపోతే అందరూ  నిత్య సత్యులు అవరు కదా!

సార్ తో పరిచయం కాకముందు ఒక రకంగా, పరిచయం అయినప్పుడు ఒక విధంగా వివిధ  మహాత్ముల రూపంలో చెప్పటం,  కరెక్ట్ గా వేరువేరు రూపాలలో అనుక్షణం భగవంతుడు నడిపిస్తున్నారు. సార్ దగ్గరికి వచ్చేదాకా చదువు మీద శ్రద్ధ మాత్రం లేదు. ఇది చదవాలి, ఇది సేవ దీని ద్వారా ఆయన సేవ ఇలా చేయాలి అనేది లేదు. మనము భగవంతునికి సాధన అనుకున్నా,  పారాయణ అనుకున్నా, పూజ అనుకున్నా ఆయన ఇచ్చిన పనిని, కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించకుండా ఇచ్చిన అవకాశాన్ని వినియోగించు కోకుండా వేరే ఎంత చేసినా  ఆయన ఏక్సెప్ట్ చెయ్యరు (ఆంగీకరించరు)  అని కొట్టొచ్చినట్లు చెప్పింది సారే!
అంతేకాకుండా కావలసిన మార్పులు సార్ తెప్పించారు.

ఐఐటి ఎంట్రన్స్ లో నేను క్వాలిఫై అవ్వలేదు. నాకు ఐఐటీలో చేయాలని చెప్పి మనసులో బలంగా ఉంది. ఎంసెట్లో 5776 ర్యాంకు వచ్చింది అందువల్ల మంచి కాలేజీలో ఇంజనీరింగ్ సీటు రాదు. అప్పటికి నా మనసులో వచ్చే సంవత్సరం ఐఐటి ఎంట్రెన్స్ టెస్ట్ లో బాగా వ్రాసి ఐఐటీలో ఇంజనీరింగ్ చేద్దాం అని ఉంది. కానీ నా మామయ్యకు  భగవంతుడు ప్రేరణ పెట్టి నాతో 'నువ్వు ప్రస్తుతానికి ఇంజనీరింగ్ కాలేజీలో చేరు. ఎందువలన అంటే నీకు మంచి గ్రూపులో (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) సీటు, కాలేజీ కూడా దమ్మపేటకు దగ్గరగా పాల్వంచ లో  వచ్చింది. నువ్వు చేరిన తర్వాత ఐఐటీకి ప్రిపేర్ అవ్వు. మంచి సీట్ వస్తే అప్పుడు వెళ్ళవచ్చు. ప్రస్తుతానికి ఈ కాలేజీలో చేరు' అని ప్రోత్సహించి నన్ను కన్విన్స్ చేసి చేర్పించారు.

సాయిశివ తనకు చదువు, ఆధ్యాత్మికతల గురించి ఉన్న దురవగాహనాలను సార్ కూలంకషంగా తీసివేసిన అనుభవం:

శివకి ఎంత మాత్రము ఇంజనీరింగ్ కోర్సు కంటిన్యూ చేద్దామనే ఆలోచన లేదు. అప్పటికి అతని అభిప్రాయంలో ఒక ప్రక్క ఈ చదువులన్నీ పొట్టకూటి చదువులు అంత ముఖ్యమైనవి కావు, భగవంతుని మన పూజ, పారాయణతో మెప్పించాలని ఉండేది. మరొక ప్రక్క పాల్వంచ కాలేజీ అంత పెద్ద కాలేజీ కాదు కాబట్టి అక్కడ చదవటం గాక ఒక సంవత్సరం కష్టపడి IIT కి ప్రిపేర్ అవ్వాలని ఉండేది. ఒక సరైన సమన్వయం లేని ఈ రెండు భిన్న అభిప్రాయలు సాయిశివకు ఉండేవి. అతని నాన్నగారు సాయిశివకి EAMCETలో సీట్ వస్తే శ్రీ వెంకయ్యస్వామి వద్ద నిద్ర చేస్తామన్న మ్రొక్కుననుసరించి గొలగమూడి వచ్చి మూడు నిద్రలు చేసారు.

శివ వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని, అతని శక్తి మేరకు స్వామిని ప్రార్థించి, శ్రీ సుబ్బరామయ్య సార్ తో పెద్దగా పరిచయం లేకున్నా 'స్వామీ! సార్ రూపంలో నేను ఏమి చేయాలో చెప్పాలి. నేను అది చేస్తాను' అని మొక్కుకున్నాడు. శివ ఉద్దేశం సాధన గురించి అది చెయ్యి, ఇది చెయ్యి అని చెబుతారని అనుకున్నాడు. ఎందువలన ? మిగిలినవన్నీ లౌకికాలు కాబట్టి. అందువల్ల ఆధ్యాత్మికంగా చెబుతారని అనుకున్నాడు. చదువులు ఉద్యోగాలు అంతకంటే ఎక్కువ ఏదో ఉంది దాని గురించి చెప్పాలి అనుకున్నాడు.

ఇంటికి తిరిగి వచ్చే ముందు శ్రీ సార్ ను సాయిశివ, అతని నాన్నగారు కలిసారు. సార్ ''వెంకయ్యస్వామి నీకు పాల్వంచ ఇంజనీరింగ్ కాలేజీలో సీట్ ఇప్పించారు. కనుక ఆ పనిని టాప్ మోస్ట్ గా ఎవ్వరూ చేయలేనంతగా చేసి ఆయనను సంతోషపరిచేటట్లు చేయాలి. **క్షుణ్ణంగా ఆయనను మెప్పించేంతగా చేయటమే అయన (భగవంతుని) సేవ**" అని చెప్పారు. "ఎన్ని సార్లు పారాయణ చేయాలో చెప్తారు" అనుకుంటే ఇలా చెప్పారు ఏమిటీ? సరేలే అనుకున్నాడే గానీ సార్ చెప్పిన విషయాన్ని అంత సీరియస్ గా తీసుకోలేదు. ఇది ఎంత చిత్రమో సాయిశివకు అప్పుడు అవగతం కాలేదు. అతను అనుకున్న ఆధ్యాత్మిక సందేశమో, లేక IIT కోచింగ్ గురించో గాకుండా, పాల్వంచ కాలేజీ లో సీట్ ఇచ్చినదని స్వామే అని చెప్పటం, స్వామి ఇచ్చిన దానిని ఆయనకు మెప్పించేలా చేయాలనే దివ్య సందేశం ఇచ్చారు (కొద్దిగా కూడా ఉహించని విధంగా).

కానీ మునుపు తనకు ఉన్న అలవాటు, అవగాహన అనుసరించి పాల్వంచ కాలేజీలో చేరాక భరద్వాజ మాస్టారు వ్రాసిన మహాత్ముల చరిత్రలెన్నో

సాయిశివ పాల్వంచకు తీసుకు వెళ్ళాడు. ఆ పుస్తకాలు చదవటంలో "'నిష్కామ కర్మ శ్రీ అనంతాచార్యులు ఎలా చేసారు?" అనే ప్రశ్న వస్తే, శ్రీ సుబ్బరామయ్య సార్ కు లెటర్ వ్రాసాడు. శ్రీ సార్ వద్ద నుండి ఆ ప్రశ్నకు ప్రతిగా ఒక లెటర్ వచ్చింది. అందులో అతని ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ సార్ **"భగవంతుడు నీకు నిర్దేశించిన పని చదువును. నీ ఆశ్రమ ధర్మాన్ననుసరించి బ్రహ్మచర్యంతోనూ, ఇంద్రియ చాపల్యాలకు, చిరుతిండ్లకు దూరంగా ఉండి ఆచరిస్తే లక్ష్యసిద్ధి కుదురుతుందని, మొహమాటాలకు లొంగక, బురదలో లాగే ఫ్రెండ్స్ నుండి దూరంగా ఉంటూ చక్కని చదువునే ముఖ్య పూజగా సాధించి ఆ విద్య ద్వారా నిష్కామ కర్మ చేయమని"** వ్రాసారు. సాయిశివ కోరకనే అతని జీవితానికి తగ్గ సందేశాన్ని ప్రసాదించారు.

తర్వాత శివకు తెలియకుండానే సార్ కి లెటర్లు వ్రాయించటం స్టార్ట్ చేయించారు. అప్పటిదాకా ఐఐటీ కి ప్రిపేర్ అవ్వాలి. లాంగ్ టర్మ్ కి ప్రిపేర్ అవ్వాలి అనే ఆలోచనలు పోయి స్వామి మెచ్చుకునే అంతగా చదవాలి, టాప్ మోస్ట్ గా చదవాలి అనే భావన తెప్పించారు, చేయించారు శ్రీ సార్. ఆ లెటర్ వ్రాసి ఆయనే మోటివేట్ చేసి చేయించారు. అతనికి తెలియకనే సార్ లెటర్స్ లను పారాయణలా మరలా మరలా చదువుకుని జీర్ణించుకుని ఆచరించాలనే బుద్ధి సాయిశివకు శ్రీ సుబ్బరామయ్య సార్ కలిగించారు. లెటర్ల ద్వారా విద్యార్థి లక్షణాలు గూర్చి, బ్రహ్మచర్యం గూర్చి వ్రాస్తుండటం, భగవంతుడు ఇచ్చిన పనిని శక్తినంతా వినియోగించి చేయటం ముఖ్యము అని శ్రీ సార్ సూచించటం తో సాయిశివ ఎక్కువ సమయం చదువుపై లగ్నం చేసి మిగిలిన సమయంలో భగవంతునిపై మనస్సు నిలిపేవాడు. **శ్రీ సార్ లెటర్లు లోని ప్రతి వాఖ్యము మంత్రము గా పనిచేసేవి.**

తర్వాత ఎక్కడైనా బయట తింటే శివ ఆరోగ్యం పాడవుతూ ఉన్నప్పుడు, సార్ కి లెటర్ రాసి సార్ చెప్పినట్లు చేయటం శివ స్టార్ట్ చేశాడు. అప్పుడు సార్ మాటే వేదం. శ్రీ సార్ శివను ఎక్కడకు వెళ్ళినా తన వంట తనే చేసుకొని తినమని వ్రాసారు. "తన వంట తనే తినటం" అనేది అప్పట్లో వింతగా కొత్తగా ఉండేది. కానీ ఎక్కడికి వెళ్ళినా ఏ ఊరు వెళ్లినా అలానే చేసేవాడు. ఎప్పుడైనా ఎవరైనా ఆ విషయమై తిట్టినప్పుడు సార్ కు లెటర్ రాస్తే సార్ ప్రత్యుత్తరంతో సమాధాన పరిచేవారు. సార్ చెప్పిన దాన్ని ఆచరించేవాడు. **అప్పుడు ఎలా మార్చారు అంటే తక్కిన ప్రపంచమంతా ఒక ప్రక్క, సార్ మాట మాత్రం ఒక ప్రక్క ఉండేది. సార్ చెపితే రెండో ఆలోచన లేకుండా సార్ మాట ఖచ్చితంగా పాటించాలి అనేది ఉండేది.** అది చాలా గొప్ప విషయం. ఎందువలన? సార్

యొక్క గొప్పతనం ఎట్లానో తెలియదు. కానీ ఆయన గొప్పతనం తెలియకుండా ఆయన మాట ఖచ్చితంగా చేయాలి, ఆయన డైరెక్షన్ ఫాలో అవ్వాలి అనేది సామాన్యంగా జరగదు. అది కేవలం సద్గురు సార్ కరుణ, కృప మాత్రమే!





**సన్మాత్రాయ నమః**

"ఎవరికి ఏమి చేసినా ఎలా చేసినా భగవంతునికే చెందుతుంది" నిత్యసత్యులు గా శ్రీ సార్ సందేశం

ఒక విషయం ఇలా చేయాలి అనుకున్నది, కొన్ని సంవత్సరాలు అయినా కొన్ని కొన్ని విషయాలు ఎన్ని జన్మలైనా చేయలేము కానీ చాలా విషయాల్లో అలా చేయించటం సార్ తమ తపశ్శక్తిని ధారపోసి అనుక్షణము ఇక్కడ సర్వాంతర్యామిగా చూస్తూ చేయిస్తున్నారు అనే అనుభవాలు ఎన్నో ఇచ్చారు.

శ్రీ సార్ సమాధి అయ్యాక 2019 లో ఒకసారి కలలో సార్ వారి ఇంట్లో ఉన్నారు. శివను పిలిచి T V చూడద్దు అని చెప్పారు అంటే సార్ అనుక్షణం ఇప్పటికి మనను గమనిస్తూ ఎప్పుడు ఏమి చేయాలో ఎలా చెప్పాలో చెబుతున్నారు.

కొంతకాలమైన తరువాత ఆఫీసులో మాట్లాడుతున్నప్పుడు వారు ఇలా చేశారు, వీరు ఇలా చేశారు అని, ఎవరికి ఎలా చెప్పాలి? అనే ఆలోచనలు సాయి శివకి వస్తూ ఉండేవి.

డిసెంబర్ 20 2019 రాత్రి అతని కలలో సుబ్బరామయ్య సార్ కనబడ్డారు : కలలో సాయి అన్నయ్య, ప్రసాదు, శివ సార్ దగ్గర సార్ ఇంటి ముందర వరండాలో కూర్చున్నాము. ఎప్పటిలాగే సుబ్బరామయ్య సార్ చెబుతున్నారు "ఎవరితో ఏమన్నా, ఎవరికి ఏమి చేసినా, ఎవరి గురించి ఆలోచనలు వచ్చినా అది భగవంతునికే చెందుతుంది" అని చెప్పారు. సార్ చెప్పినది ప్రసాద్ కు అర్థం కాకపోవడం వలన సార్ ఏమి చెప్పారు? అని శివను అడిగాడు. శివ తనకు అర్థమైనది ప్రసాద్ తో 'ఇతరులతో ప్రవర్తించేటప్పుడు వారిలో భగవంతునే చూస్తూ ఏమి చేసినా అది భగవంతునికే చెందుతుంది అని చెప్పారు' అని అన్నాడు. అంటే శివ భావమేమంటే అలా భగవంతుని చూడకుండా చేస్తే ఎదురుగా ఉన్న మనిషికి చెందుతుంది అని. వెంటనే సార్ నవ్వుతూ **"అది కాదు స్వామీ! నేను చెప్పింది. వారిలో నువ్వు భగవంతుని చూసినా, చూడక పోయినా ఆ ప్రతి చర్యలూ, ఆలోచనలు, మాటలు, పనులూ కూడా భగవంతునికే చెందుతుంది"** అని చెప్పారు. అంటే నువ్వు ఎదుటి వ్యక్తిలో భగవంతుని చూసినా చూడకపోయినా నువ్వు చేసేది అనుకునేది ఆ భగవంతునికే చెందుతుంది అని చెప్పారు.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

ఎప్పుడు ఏది అవసరమో ఆయా సమయానికి అది చేస్తూ ఆయన నిత్య సత్యులుగా నడిపిస్తున్నారు. మన పిల్లల్ని ఏదైనా పని చెప్పినప్పుడు వారు చేయకపోతే ఒకటి రెండు సార్లు చెప్తాము. అప్పటికీ చేయకపోతే మీకైనా సిగ్గుండాలి, నాకైనా సిగ్గుండాలి ఇంక చెప్పకూడదు, అని ఎన్నటికీ ఈ విషయం వాళ్ల దగ్గర ప్రస్తావన చేయకూడదు అని అనిపిస్తుంది. అలాంటిది సుబ్బరామయ్య సార్ ఎన్నిసార్లు చెప్పారు? ఎన్ని జన్మల నుంచి చెబుతూ ఉన్నారు? మనం చెయ్యకపోయినా ఆయన ఏ మాత్రం పట్టు వదలకుండా ప్రేమతో, కరుణతో మనకు చెప్పే విధానం చూస్తే వారి అనంత కరుణ తెలుస్తుంది. లేకపోతే మనం మన పిల్లల్ని రెండుసార్లు చెప్పి చేయకపోతే వదిలేద్దాం అనుకుంటాము. మరి సార్ ఏనాడూ కూడా ఎన్ని సార్లు చెప్పాలి అని వదేలేసినది, లేకపోతే అసహనంగా మాట్లాడిన సందర్భాలు లేవు. అనంత కరుణమయులు శ్రీ సార్.

సార్ నిత్య సత్యులై అనుక్షణము చూస్తూ నేర్పించినది సాయిశివ ఇంకా ఇలా చెపుతున్నారు:

ఆఫీస్ లో గానీ ల్యాబ్ లో గానీ సెక్రటరీకి ఏమి చేయాలో చెప్పాను. తర్వాత ఆ సెక్రెటరీ చేసే పని తీరును బట్టీ ఆమెకి మినిమం ఏమి చెయ్యాలో కూడా తెలియకుండా ఎలా ఉంటారు?, ఈ మాత్రం కూడా తెలియదు అని మనసులో భావన ఉండేది. అంతేకాకుండా కొన్నిసార్లు సెక్రటరీతో ప్రతి ఒక్క విషయము నేను చెప్పాలా? ఈ మాత్రం కూడా తెలియదా నీవు నాకు సెక్రటరీనా?, లేక నీకు నేను సెక్రటరీనా? అనే ఆలోచనలు వచ్చాయి. వాళ్ళలో భగవంతుడిని చూడటం కాక, వారి పట్ల మన భావాలు ఎలా ఉన్నాయో చూపించటానికా? అన్నట్లు ఒకరోజు స్వప్నంలో సార్ శివకు కరెంట్ మీటర్ బిల్లు ఇచ్చి, ఒక ఇల్లు చూపించి పని చేయమని చెప్పారు. సార్ ఏమి చేయమన్నారో శివకు అర్థం కాలేదు. సార్ వెంటనే గబా గబా వచ్చి ఇది చెప్పాను, ఇలా చెయ్యాలని చెప్పాను అని చెపుతున్నారు. (సార్ భౌతికంగా ఉన్నప్పుడూ కూడా చెప్పిన చిన్న పనులు అర్థం కాకపోయినా సార్ ఏనాడూ ఇది కూడా అర్థం కాలేదా? ఎందుకయ్యా ఈ చదువులు? అని ఏనాడూ అనలేదు. కానీ నేను ఏమి చేస్తున్నాను? ఈ మాత్రం తెలియకపోతే వీళ్ళు ఇంత చదువుకుని ఉపయోగం ఏముంది? అని అనుకుంటున్నాను, అంటున్నాను.) అంటే నాకు ఏమి చెయ్యాలో నేర్పిస్తున్నారు చెబుతున్నారు ఆ సంఘటనతో

## మీకు ఎన్ని సార్లు చెప్పాను, ఎలా చేశాను. మీరు అవతల వారితో ఏమి చేస్తున్నారు అని చెపుతున్నట్లున్నది.

భగవంతునికి ఇష్టమైన మనస్సు, కాలము అర్పించేటట్లు శిక్షణ శ్రీ సార్ ఎలా ఇచ్చారో సునీత ఇలా పంచుకుంటోంది.

సునీత ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల కల్లా శ్రీ వెంకయ్య స్వామి వారి సమాధి మందిరం దగ్గరికి వెళ్ళి ప్రదక్షిణలు చేసేది. సరిగ్గా సమయానికి స్వామి దగ్గరకి వెళ్ళటమే ప్రధానంగా చేసేది. ఉదయం నాలుగు గంటలకు స్వామి దగ్గరికి వెళ్లడానికి ఒక్కొక్కసారి దంతధావనం చేయటానికి వీలు లేనప్పుడు సాయి మాస్టర్ నిలయం నుండి బయలు దేరే ముందర అక్కడ వేప పుల్ల తీసుకుని దంతధావనం చేసుకుంటూ, మందిరం ముందర ఉన్న కుళాయి దగ్గర శుభ్రం చేసుకొని స్వామి దర్శనానికి వెళ్ళేది. సార్ కి కరెక్ట్ టైంకి మందిరంలోకి వెళ్ళటం ముఖ్యంగా ఉండేది అంతేగానీ  స్నానం చేసావా ? లేదా ? అనేది అసలు లెక్కలోకి తీసుకునే వారు కాదు.

నగేష్, హైమావతి అనే భక్తులు ఇలా చెప్తున్నారు:

'ఏ పనైనా అవ్వకపోయినా భగవంతునికి సమయం ఇవ్వటం అనేది తప్పకుండా జరుగుతుంది అది కేవలం సుబ్బరామయ్య సార్ కృప'.

వేణుగోపాల్ గారు ఇలా చెబుతున్నారు:

'మమ్మల్ని అందర్నీ కూడా కన్స్ట్రక్షన్ వర్క్ లో సారు ఇన్వాల్వ్ చేసేవారు. అందరికీ ఒకటే అభిప్రాయము. అంత పని చేసినా ఏ ఒక్కరూ కూడా అలసిపోయే వారు కాదు. అదంతా సార్ తమ శక్తి పాతము చేత ఆ పనులను చేయించి, అక్కడ పనిచేసిన వారికి సర్వ శుభములు కలిగిస్తున్నారు. మహాత్ముల సన్నిధికి వెళ్ళినప్పుడు వారు తమ శక్తి పాతము చేత ఎవరికి కావలసింది వారికి అనుగ్రహిస్తారు. మనందరినీ సుబ్బరామయ్య సార్ ఎన్నో నెపాల మీద గొలగమూడి రప్పించారు. అందరి చేత కర్మ క్షాళన చేయించారు. ప్రదక్షిణలు చేయించేవారు, కన్స్ట్రక్షన్ వర్క్ లో ఇన్వాల్వ్ చేసేవారు, ఎవరికైతే ఏ పని అయితే ఇష్టం లేదో ఆ పనే చేయించేవారు. అలా చేయించి మనందరినీ ఆయన దగ్గరే ఉంచుకున్నారు'.

## సంస్కారాలను మార్చే మహా వైద్యులు

సాయిశివ ఇలా చెబుతున్నాడు:

సుబ్బరామయ్య సారు చాలా సందర్భాలలో మనకి డైరెక్ట్ గా చెబితే మనం బాధ పడతామని, ఇన్ఫీరియారిటీ ఫీల్ అవుతామన్న సందర్భాలలో ఆ విషయాన్ని తన మీద పెట్టుకుని చెప్పుకోవడం చెప్పటం కానీ, వేరే వారిని వారు చేసే తప్పులు ఎంచుతున్నట్టు చెప్పేవారు. కానీ ఎవరికైతే ఆ మాటలు ఉద్దేశించారో వారికి సరిగ్గా హెచ్చరిస్తున్నట్లు గుర్తింపు కలుగ చేసే వారు. చూడటానికి సార్ ఇతరులను ఎందుకు ఇలా విమర్శిస్తున్నారని ఉంటుంది. కానీ ఎవరికీ ఆ విషయం చెప్పదలుచుకున్నారో వారికి మాత్రం సూటిగా అర్థం అయ్యేది.

ఉదాహరణకు వారం వారం గొలగమూడి వెళుతున్నప్పుడు సాయిశివకు జరిగిన ఒక సన్నివేశం. సామాన్యంగా ఆ వారంలో చేసిన వాటిలో తప్పులు, పొరపాట్లు గుర్తించేటట్లు చేసి, ఏమి చేసుకోవాలో శ్రీ సార్ సత్సంగం ద్వారా, లేదా మామూలుగా మాట్లాడుతూ కూడా చెప్పేవారు. ఒకసారి రవి, సాయిశివ బెంగుళూరు ఐఐఎస్సి హాస్టల్ రూమ్ లో కూర్చుని అంతకుముందు చేసినవి, చిన్నప్పుడు ఎలా ఉన్నారు మొదలైన పాత విషయాలను గుర్తు చేసుకోవడంలో కాలం వ్యర్థం చేశారు. ఆ విషయం వారు సరదాగా చెప్పుకున్నారు కానీ అది తప్పు అని వారికి తట్టలేదు. తర్వాత గొలగమూడికి వెళ్ళినప్పుడు సాయిమాస్టర్ నిలయంకి నడిచి వస్తుంటే సార్ సడెన్ గా ఆగి కొంచెం వెనక్కి వచ్చి ఒకరిని చూపిస్తూ, ముందుకు నడుస్తూ ఇలా చెప్పారు. "ఎప్పుడు అక్కర్లేని న్యూస్ పేపర్ చదువుతూ ఉండటం, లేదంటే ఎప్పుడూ చిన్నప్పుడు జరిగినవి గుర్తుతెచ్చుకుంటూ ఊసుపోని కబుర్లు చెప్పటం" చేస్తూ ఉంటారు. దానివలన ఎవరికి ఏమి ఉపయోగముంది. **"వెంకయ్య స్వామి దగ్గర ఉండి కూడా చేసే పని ఏమంటే అలా చిన్నప్పటివి తలుచుకుంటూ అక్కరలేని సంభాషణల్లో కాలాన్ని వ్యర్థం చేసుకుంటారు" అని** గట్టిగా ఆయనను తిట్టినట్లు తిట్టారు. వెంటనే ఆ వారంలో **వారు చేసిన తప్పును గుర్తించేటట్లు, సరిదిద్దుకునేటట్లు చేశారు**.

ఒక సమయంలో ప్రసాద్ అందరితోనూ వంతు పెట్టుకునేవాడు. "నాకంటే వాళ్ళు ఏం గొప్ప? నేను ఎవరి కంటే తక్కువ' అనే భావాలు ప్రసాద్ కి ఉండేవి. ప్రసాద్ శ్రీ సార్ కి ఈ విషయం చెప్పాడు. సార్ ప్రసాద్ ను "కాక

బలి” పెట్టమని చెప్పారు. బెంగళూరు వచ్చిన తర్వాత ఒక మూడు రోజులు అంటే సోమవారం నుంచి బుధవారం దాకా మనస్ఫూర్తిగా ప్రసాద్ అన్నం తినే ముందర భావయుక్తంగా కాకబలి పెట్టాడు. బుధవారం రోజు ప్రసాద్ కి వచ్చిన భావ పరంపర ఇలా ఉన్నది : ఎంత మంది శ్రమ వల్ల ఆహారం నా చేతికి వచ్చింది. అన్నం మనకు రావటానికి వడ్లు కోసేవారు, వడ్ల నుండి బియ్యం తీసే మోటార్, దానిని తయారు చేసిన వాళ్ళు, ఇలా ఎంతో మంది కష్టపడ్డారు. అది నా కోసం కాదు అందరి కోసం చేశారు. వంతు పెట్టుకోవాలంటే ప్రపంచంలోని ప్రతి ఒక్క వ్యక్తితో పెట్టుకోవాలి అందువలన వంతులు పెట్టుకోవటం అవివేకము అనిపించింది. అప్పటి నుండి ప్రసాద్ కి ఇంకొకరితో వంతు పెట్టుకోవటం తగ్గి పోయింది.

ప్రసాద్ ఆఫీస్ లో చేరిన మొట్టమొదటలో తన సహోద్యోగులతో కలిసి కెఫేటేరియాలో పిచ్చాపాటి కబుర్లు చెప్పేవాడు. ఒకసారి సార్ తో ఈ విషయం చెపుతూ ‘ఒక్కొక్కసారి అతనికి మాట్లాడటం ఇష్టం లేకపోయినా కూడా వారితో మాట్లాడకపోతే బాగుండదని మాట్లాడుతుంటాను’ అని చెప్పాడు. వెంటనే సార్ తన నోటి మీద కుడి చేతి చూపుడు వేలు వేసుకొని (అది తప్పు అన్నట్లు చెప్తూ) **“అలాంటి కబుర్లు చెప్పటం వల్ల ఎంత ఎనర్జీ వేస్ట్ అయిపోతుందో తెలుసా?”** అని అన్నారు. తర్వాత నుంచి ప్రసాద్ కెఫేటేరియాలో పిచ్చాపాటి కబుర్లు మానేశాడు.

ఒకసారి ఆఫీసు పని మీద ప్రసాద్ అమెరికాకు 9 నెలలు వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు అమెరికాలో ఉన్న అమ్మాయిలని చూసి పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయటం, రొమాంటిక్ సీరియల్స్, సినిమాలు చూసేవాడు. సార్ కి ఈ విషయం చెప్తూ ఉత్తరం వ్రాశాడు. దానికి సారు రిప్లై ఇస్తూ సొల్యూషన్ చెప్పారు.

ఇలాంటి ఆలోచనలకు కారణం-

**ఒకటి దుష్ట సాంగత్యం : మనుషులు గాని పుస్తకాలు గాని ఉంటుంది**

**రెండవ కారణం మనం తినే ఆహారం. ఆహారం కూడా కామ వాసనలు రేకెత్తిస్తుంది. ఏ ఆహారం తింటే ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి? అనేది నీవే గమనించి అలాంటి ఆహారం వర్జించు అని చెప్పారు.**

ఈ లెటర్ చేరిన తర్వాత ప్రసాద్ కు తను చాక్లెట్ తిన్న తర్వాత కామపు ఆలోచనలు ఎక్కువగా రావడం గుర్తింపు కలిగి, వాటిని తినటం మానేశాడు. ఆనాటి నుండి ప్రసాద్ మనసును ప్రశాంత పరిచారు.

## నిష్కామ కర్మ - సద్గురు సేవ

వేంకటేశ్వర రావు తనకు సార్ ప్రసాదించిన పుస్తకాల ముద్రణ సేవ గురించి ఇలా చెపుతున్నారు :

వేంకటేశ్వర రావు (హైదరాబాదు) ఉద్యోగంలో జాయిన్ అయిన తర్వాత సార్ దగ్గరికి వెళితే సార్ 70 వేలు రూపాయలు ఇచ్చి వార్తాలాపం ప్రింట్ చేయించమన్నారు. వేంకటేశ్వర రావుకు ప్రింటింగ్ గురించి ఏమీ తెలియకపోయినా సార్ మాటకు మాత్రం అడ్డు చెప్పలేదు. అతను హైదరాబాద్ కు వెళ్ళిన తర్వాత సార్ సూచన ప్రకారం ఓం సాయి గ్రాఫిక్స్ లో ప్రింట్ చేయించాడు. ఒక రకంగా చెప్పాలంటే శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారికి ఇష్టమైన వార్తాలాపం గ్రంథం ముద్రణలో లేదు. ఈ బుక్ printing చేయించడంలో అతనికొచ్చిన అవకాశాన్ని తన మహద్భాగ్యంగా భావిస్తున్నాడు.

హైదరాబాదులో వేంకటేశ్వరరావు రూమ్మేట్ టైపింగ్ చేసేవాడు. అందువలన వేంకటేశ్వరరావు ఒక కంప్యూటర్ సిస్టమ్ కొన్నాడు. సార్ పంపించిన గ్రంధాలని అతని రూమ్మేట్ టైపు చేసేవాడు. వేంకటేశ్వర రావు ప్రూఫ్ రీడింగ్ చేసేవాడు. అలా గ్రంథ ముద్రణకి తన వంతు సేవ చేసే భాగ్యం కలిగించారు.

అంతకు ముందు దాకా నెల్లూరులో పుస్తకాల ప్రింటింగ్ ఎక్కువ ఖరీదుగా ఉండేది. ఎప్పుడైతే హైదరాబాద్ కు ప్రింటింగ్ మార్చారో అప్పటి నుండి చిన్న చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి ఒక రూపాయికి ప్రింటింగ్ జరిగేది. సార్ ప్రతి సంవత్సరం దాదాపు రెండు నుంచి మూడు లక్షల రూపాయల పుస్తకాలు ప్రింటింగ్ చేయిస్తుంటారు. అంతేకాకుండా ఎక్కడ తక్కువ ఖర్చుకి ప్రింటింగ్ చేస్తారో తెలుసుకొని చేయించడం ద్వారా సార్ గ్రంధాలు తక్కువ ఖర్చుకి ప్రింటింగ్ అయ్యేవి, మన అందరికి తక్కువ ధరలో స్వామి లీలలు, చరిత్రలు లభ్యం కావటానికి సార్ ఆరాటం, చేయించే యత్నం మనకు మార్గ దర్శకం.

రవికుమార్ గారు శ్రీ సుబ్బరామయ్య సార్ యొక్క సేవను గురించి ఇలా చెపుతున్నారు : సార్ చెప్పింది చేస్తారు. చేసేదే చెపుతారు. ఒకసారి సార్ అమ్మగారికి చెయ్యి విరిగితే ఆమెను వైద్యానికి పుత్తూరు ఊరికి రెండు మూడు కిలోమీటర్ల శివార్లలో ఉన్న వైద్యాలయానికి తీసుకు వెళ్లారు. సార్ అక్కడికి

వెళ్ళిన రోజు రాత్రి 11గంటలకు కాలు విరిగిన ఒకతనిని కొందరు మోసుకు వచ్చారు. వారు చాలా దూరం నుండి వచ్చినట్లున్నారు అందువలన అలసిపోయారు. అందువలన అతని తీసుకు వచ్చిన వెంబడే వాళ్ళు నిద్రపోయారు. కానీ ఆ కాలు విరిగిన అతను నొప్పని, ఆకలి అని అంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. సార్ అతని ఆకలి బాధకు చలించి అంత రాత్రి పూట రెండు మూడు కిలోమీటర్ల దూరం నడిచి ఊర్లోకి వెళ్లి అక్కడ ఏదో ఒక ఇంటిలో వెలుగు కనిపిస్తే ఆ ఇంటి వారిని విచారించి, ఆ దగ్గరలో ఉన్న హోటల్ కు వెళ్లి, వాళ్ళను నిద్ర లేపి, అల్పాహారాన్ని చేయించి, దాన్ని తీసుకు వెళ్లి ఆ కాలు విరిగిన అతని ఆకలి తీర్చారు. సార్ కి సంబంధం లేని ఎవరి కోసమో అంత చేసే సరికి ఆయనకి ఎంతటి కరుణ అని అనిపిస్తుంది. అంతేగాక సార్ రిస్క్ టేకర్ అనిపిస్తుంది.

'నేను భగవంతునికి కాలం ఇస్తున్నాను అంటే కేవలం సార్ కృప మాత్రమే' అని రవికుమార్ గారు చెపుతారు. ఆయన శ్రీ సార్ పుస్తకాలు చదివి భగవంతునికి ఒకే సమయం ఇవ్వటం ప్రారంభించారు. ఆరతులు ఒకే సమయంలో చేయలేక పోతున్నాను అని సార్ కి లెటర్ వ్రాస్తే సార్ ప్రత్యుత్తరంలో "నాకు ఆరోగ్యం బాగుండే ప్రొద్దున్న రెండు గంటలకు లేస్తున్నానా, స్నానం చేస్తున్నానా, పూజ చేస్తున్నానా?" అని చెప్పినది రవికుమార్ గారిని మార్చేసినది. తర్వాత నుండి రవికుమార్ గారు ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా పూజ కోసం సమయం కేటాయించగలిగారు అంటే సార్ స్ఫూర్తిదాయక జీవిత విధానం మాత్రమే!

ఒకసారి శేషుకృష్ణ వాళ్ళ అమ్మగారు, అక్కగారు గొలగమూడిలో ఉన్నారు. సారు వారి దగ్గరకు వచ్చి "అమ్మా! సాయి మాస్టర్ నిలయం పైన అంతా కూడా చాలా దుమ్ము, ధూళిగా ఉంది. అది శుభ్రం చేసి పెడతారా! నేను నా అనే వాళ్ళకు మాత్రమే చెపుతాను" అని చెప్పారు. అప్పుడు శేషుకృష్ణ అమ్మ, అతని అక్క 'సార్! మీరు చెప్పింది మేము చేస్తాము' అని చెప్పి మొదటి అంతస్తులో ఉన్న గదిని శుభ్రం చేసారు. ముఖ్యంగా పని చేయటం కన్నా కూడా సార్ అన్న మాట "నా అనే వాళ్ళకే చెప్తాను" అనేది వారి మనసులో అలా నిలిచిపోయింది.

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు

వెంకటేశ్వర రావు గారు (హైదరాబాద్, వాసవి కాలేజీ ప్రొఫెసర్) సద్గురువు శ్రీ సుబ్బరామయ్య సార్ ఆచరింప చేసిన ధర్మాచరణ గూర్చి ఇలా పంచుకుంటున్నారు:

- ❖ తల్లిదండ్రులను సేవించటం.
- ❖ ఉద్యోగంలో బాధ్యతలను సరిగా చేసేలా ప్రోత్సహించటం ద్వారా పని కష్టంగా ఉన్నా ఇష్టంగా చేసేటట్లు మనసు మార్చడం.
- ❖ క్లాస్ కి వెళ్లే ముందు సరిగ్గా ప్రిపేర్ అయ్యి క్లాస్ చెప్పేటట్టు చేయడం.
- ❖ గవర్నమెంట్ కి కట్టవలసిన టాక్స్ పూర్తిగా కట్టేటట్టు చేయడం.
- ❖ దానం చేసేటప్పుడు మనిషి కుంటి వాడా, వికలాంగులాంగుడా అని చూడకుండా మనసుకు ఇవ్వాలనిపిస్తే ఇవ్వవలెను. నువ్వు ఇచ్చే రూపాయికి వాళ్ళు వికలాంగులు కానవసరం లేదు అని చెప్పారు. అడిగినవారు సాయి, స్వామి అనే భావంతో చేతనైన సాయం చేయమని చెప్పారు.
- ❖ సినిమాకి వెళితే ఆ డబ్బు బ్లాక్ మనీ రూపంలో పోతుంది. భగవంతుని మీద మనసు నిలబడదు అని చెప్పారు. అప్పటినుంచి సినిమాలకు పోకుండా మానేశాను.
- ❖ మన దగ్గర ఉన్న డబ్బులు వడ్డీలకు మార్చవద్దు. వడ్డికి ఇస్తే కుమార్తెకు వేశ్య వృత్తి నేర్పినట్లు అని చెప్పేవారు. అప్పటినుంచి మిగిలిన డబ్బులు గవర్నమెంట్ బ్యాంక్ లోనే వేసుకుంటున్నాను.
- ❖ నాకు ఆహారం తీసుకోవటం లో కంట్రోల్ ఉండదు. అందువల్ల సోమరితనం ఎక్కువ గా ఉండేవి. ఆహార నియమం పాటించడం, కంట్రోల్ గా తినటం సార్ దయవల్ల కొద్దిగా నేర్చుకున్నాను.

# సద్గురు అనుగ్రహం

సద్గురు అనుగ్రహం కలిగే మార్గం గూర్చి శ్రీ సార్ - భరద్వాజ మాష్టర్ గారు భోధించిన సన్నివేశాలు స్మరించుకొని సార్ వివిధ భక్తులకు ప్రసాదించిన అనుభవాలను ఇచ్చట స్మరించుకొందాము.

**శ్రీ సార్ తో - సన్నివేశం 1**

ప్ర 1. పారాయణలు పూజలు చేయడం కూడా ముందు నిర్ణయం ప్రకారం జరుగుతుంటాయా?

ఆన్సర్: అంతా ముందు నిర్ణయమే - అలా కాకుంటే అందరూ పారాయణలు పూజలు చేయడం లేదు గదా. మనం 100 మార్లు చెప్పినా చేయరు. ఉదా: నేనే. 8 నెలలు పాడు చేసాను. ఈ 8 నెలలలో నాకు తెలియకనే పుణ్యం పెరిగి పారాయణ, పూజ చేసాను.

ప్ర 2. స్వప్రయత్నం ఎందుకు?

ఆన్సర్: నీ ప్రయత్నం సఫలమైతే ఆనందంతో గంతులు వేయకు. విఫలమైతే క్రుంగిపోకు. విఫలమైనప్పుడు ఆ విధంగా ఆర్థికంగానూ, శారీరక శ్రమ ద్వారానూ మన కర్మ క్షాళన అయిందని భావించాలి గానీ క్రుంగిపోవడం విజ్ఞుల లక్షణం కాదు.

ప్ర 3. భక్తుడు (నగేష్): అన్నీ ముందు నిర్ణయానుసారమే జరుగుతాయంటే మరి సద్గురువుల అనుగ్రహం కూడా అంతేనా?

శ్రీ సార్ ఆన్సర్: అనుగ్రహం ఎప్పుడూ ఉంటుందట. (అనుగ్రహం విషయంలో) ముందు నిర్ణయం, వెనుక నిర్ణయం అంటూ లేదు. ఆ అనుగ్రహం మనకు దక్కకుండా మన అహం అనే గొడుగు అడ్డుందంటారు. నీకు ప్రస్తుతం ఉద్యోగం రాలేదని అనుగ్రహమే లేదని అనుకొనడం గొప్ప అజ్ఞానం. మనకెప్పుడు ఏది మంచిదో అది చేస్తారుగానీ మనం కోరినవన్నీ కాదు కదా?

ప్ర 4. కేవలం అనుగ్రహం నమ్మక ముంటేనే వస్తుందా? లేకపోతే రాదా? ఏ బేసిస్ మీద నమ్మాలి?

ఆన్సర్: 3. అనుగ్రహము <--- 2. నమ్మకము <-- 1. పుణ్యము. పుణ్యముంటే నమ్మకమొస్తుంది. అనుగ్రహం కల్గుతుంది. చూచి నమ్మిన వారికంటే చూడక నమ్మినవారు ఘనులు అన్నారు క్రీస్తు. చూడక నమ్మేవారికి బేసిస్ అక్కరలేదు. పుణ్యాన్ని బట్టి సింపుల్ గా నమ్మేస్తారు.

## శ్రీ భరద్వాజ మాస్టారి తో - సన్నివేశం 2

ధ్యానంలో మాష్టారు, వారి సంభాషణ రీల్ తిరిగసాగింది.

మా గ్రామంలో రామ మందిరంలో సత్సంగం చేయమని పదే పదే చెబుతున్నారు. సార్ నాకు పుస్తక జ్ఞానం లేదు. దానికి తోడు తెలిసింది ఆచరించలేను. సత్సంగం చేయలేను సార్, అంటే వారన్నారు. "ఆచరించగలిగితే సత్సంగం ఎందుకు? అందరినీ అనుగ్రహించడమే. అలా అనుగ్రహించేందుకు ఆచరణ, ఆచరణ కొరకు సత్సంగం ఎంతో అవసరం. నీవు ఒక్కడివే పారాయణ చేసేటప్పటి కంటే పదిమంది ఎదుట బాబా లీలలు చెప్పుకునేటప్పుడు నీ హృదయానికి నీవే ఘాటుగా సుత్తి దెబ్బ కొట్టుకోవడం జరుగుతుంది. గనుక మనకు ఆచరణ కుదరాలంటే సత్సంగం చచ్చిన దాకా చేయవలసిందే." అందరూ అంతేనా సార్ ? అని అనక ముందే మాష్టారు అందుకున్నారు.

"శ్రీ సాయి, శ్రీ స్వామి, శ్రీ స్వామి సమర్ధులతో మనం పోల్చుకోకూడదు. నేను చేస్తున్నది కూడా అదే. విద్యానగర్ రాగానే బాబాను ప్రార్ధించింది సత్సంగం కొరకే. ఒక్కడవే పారాయణ చేస్తుంటే అంత తీవ్రంగా దెబ్బ తగలదు. దెబ్బ తీవ్రంగా తగలనిదే మన సంస్కారాలు మారవు." "ఇక పుస్తక జ్ఞానం లేదంటావా - అది నీవు ఎన్ని పుస్తకాలు చదివినా రాదు. సాయినాధుల అనుగ్రహంతో సర్వం సిద్ధిస్తుంది. సత్సంగం చేసి చూస్తే నీకే తెలుస్తుంది అన్నారు." అది అక్షరాల నిజం.

## శ్రీ రమణ భగవాన్ తో - సన్నివేశం 3

"భగవాన్ ఇట్లా బోధించారు – "మనుష్యులు శతకోటి ప్లానులు వేస్తూ వుంటారు అవి స్వయంగా ఫలించవు. దేవుని అనుగ్రహం చేతనే ఫలిస్తాయి. కనుక ఉత్తమ భక్తుడు అసలు ప్లానులు వేయడు"

ఈ మహార్ధం నా హృదయగతం కాలేదు. తిరుగుబోతైన నా మనస్సును అదుపు చేయలేకపోతున్నాను. "ఓ భగవాన్! అసాధారణమైన ఓ మహా గురూ, నీవు బోధించిన మహోన్నతమైన మార్గాన్ని అనుసరించలేక పోతున్నాను. ఓ ప్రభూ, గురుదేవుడా! నన్ను ఉద్ధరించవా? ఈ జన్మలోకాని, వచ్చే జన్మలో కాని నీవు తప్ప నాకు గతెవ్వరు? సహాయకులెవ్వరు? నన్ను ఏమి చేయదలచుకొన్నావు? నీ నిజమైన వినోదం ఏమిటి ? ఇట్లా హింస పడుతుంటే చూడటమా? లేక నన్ను రక్షించటమా? ఇది నాకు చాలా క్రూరమైన క్రీడగా కనపడుతోంది. ఓ నా గురుమూర్తీ ఇది నీకు న్యాయం కాదు". ఇట్లా నా

ఆవేదనాగ్ని తో నిండిన నా ప్రార్ధన ముగిసింది. భగవాన్ గంభీరులై రెండు మూడు నిముషాలు ఉండి , అవధి లేని అనుగ్రహంతో ఇట్లా అనుగ్రహించారు.

**“నా శయ్యరేన్, ఇల్లే నీ “సరెండర్” - పణ్ణిపట్టు సుమ్మా ఇరుక్కవేండియమ నానే”**

**దీనికి తెలుగు తాత్పర్యము : నేను చేస్తాను, చెయ్యను. ఇది నీకు సంబంధించినది కాదు. నీవు చేయవలసినదల్లా, శరణాగతి. ఇది, అది అని తలచకుండా మౌనంగా ఉండటమే!**

*పుణ్యకర్మలు, సత్సంగము, శరణాగతి సద్గురు అనుగ్రహానికి మూలము అనీ, సద్గురు అనుగ్రహంతో సర్వము (మేలు, జ్ఞానము, ఆలోచనారహిత స్థితి) సిద్ధిస్తుంది అని ఈ మహనీయుల సన్నిధిలోని సన్నివేశాలు తెలపడం కాదా?*

## మాతృ ప్రేమ

వేణుగోపాల్ గారు డిప్లొమా చేసేటప్పుడు ఒకసారి స్ట్రైక్ జరిగింది. అప్పుడు ఆయన తమ స్వంత ఊరు తలుపూరు వచ్చి ఉన్నారు. అక్కడ ఆయన చదివిన హైస్కూల్ లో డ్రాయింగ్స్ వేసుకుంటూ ఉండేవారు. ఆ సమయంలో సుబ్బరామయ్య సార్ ధునీవాలా దాదా గారి చరిత్ర హిందీలో ఉన్నది తెలుగులోకి తర్జుమా చేస్తున్నారు. తలుపూరులోని ఒక హిందీ పండిట్ (ఎమ్ సి కృష్ణమూర్తి గారు, టి. మల్లిఖార్జున రావు గార్లు) హిందీలో ఉన్న చరిత్ర చదివి తెలుగులో చెపితే సుబ్బరామయ్య సార్ అది వ్రాసుకునేవారు. వేణుగోపాల్ గారు వారికి మంచి నీళ్ళు కానీ, అవసరమైనప్పుడు టీ కానీ తీసుకు వచ్చి ఇచ్చేవారు. ఒకరోజు పని అయ్యేసరికి రాత్రి 10 గంటలు దాటింది. సార్ కలిచేడులో ఉన్న ఇంటికి వెళ్లాలంటే 4 కి.మీ. వెళ్ళాలి అందువలన ఆ రాత్రికి స్కూల్ ల్యాబ్ లో పడుకున్నారు. వేణు గారు కూడా సార్ తో పాటు స్కూల్ లోని ల్యాబ్ లో పడుకున్నారు. అది చలికాలం (డిసెంబర్ లేదా జనవరి). పైగా వారు దుప్పట్లు ఏమి తెచ్చుకోలేదు. వేణుగోపాల్ గారు మధ్య రాత్రి చూసుకుంటే సార్ తన లుంగీని వేణుగోపాల్ గారికి కప్పి ఆయన తమ లోపల నిక్కరు మీద పడుకున్నారు. అప్పటికే సార్ కి చలి వలన ఆయాసం ఉండేది. కానీ సార్ తమని నమ్మి వచ్చిన అతని బాధ్యత తమదే అన్న వారి అవ్యాజ ప్రేమను ఈ సంఘటన సూచిస్తున్నది.


వేణుగోపాల్ గారికి సమయం దొరికితే చదువుకుంటూ ఉండేవారు. డిప్లొమా చేరిన తర్వాత కూడా వారి నాన్నగారు ఆయనని చింతకాయలు కోసి

తీసుకు రావటానికి తోడుగా తీసుకుని వెళ్లారు. వేణుగోపాల్ గారి నాన్నగారు చెట్టు ఎక్కి చింతకాయలు కోస్తారు. క్రింద పడిన కాయలని వేణుగోపాల్ గారు ఏరి మూట కట్టాలి. వారి నాన్నగారు చెట్టు పైకెక్కి కోసేటప్పుడు క్రింద వున్న వేణుగోపాల్ గారు 'ఏమిటి ఈ జీవితం? ఈ చింతకాయలు కోసుకోవటం, ఏరుకోవటం, చదువుకునే భాగ్యం లేదా?' అని మనస్సులో వాపోతున్నారు. ఎదురుగా స్కూల్ క్లాస్ లో ఉన్న సుబ్బరామయ్య సార్ వేణుగోపాల్ గారిని పిలిచి, ఎందుకు చింతకాయ చెట్టు క్రింద ఉన్నారనే విషయం తెలుసుకున్నారు. అదే సమయంలో వేణు గారు తన మనస్సులోని ఆవేదనను చెప్పుకున్నారు. అది విన్న తర్వాత "సర్లే! వెళ్ళు" అని సుబ్బరామయ్య సార్ అన్నారు. ఆ సంఘటన తర్వాత ఎన్నడూ వేణుగోపాల్ గారు చింతకాయలు ఏరవలసిన అవసరం రాలేదు. ఒక్క మాటతో సార్ ఆయన బాధను శాశ్వతంగా నివారించారు. అంతేగాక వేణుగోపాల్ గారు పై చదువులు చదువుకోవటానికి చివరి వరకు సార్ ఎంతో కృషి చేశారు.

డిప్లొమా చివరి పరీక్షలు జరుగుతున్నప్పుడు వేణు గారి దగ్గర డబ్బులు లేక మూడు రోజులు పస్తులుండాల్సి వచ్చింది. ఆ సమయంలో సుబ్బరామయ్య సార్ భరద్వాజ మాస్టారి దర్శనానికి విద్యానగర్ లో దిగి మాస్టారి ఇంటిలో అడుగు పెట్టబోతుంటే భరద్వాజ మాస్టారు సుబ్బరామయ్య గారితో "సుబ్బరామయ్యా! నువ్వు అర్జెంట్ గా ఒక పని చెయ్యాలి. గూడూరులో వేణు ఎలా ఉన్నాడో చూసి రా!" అని చెప్పారు. వెంటనే సుబ్బరామయ్య గారు గూడూరుకి వెళ్ళేసరికి వేణుగారు తన రూమ్ లో లేరు. భరద్వాజ మాస్టర్ గారు చెప్పారు కాబట్టి సార్ వేణుగోపాల్ గారు ఎక్కడ ఉన్నారు వెతకాలని తమకు తెలిసిన గూడూరు స్కూల్ హెడ్ మాస్టర్ ఇంటికి వెళుతున్నారు. స్కూల్ హెడ్ మాస్టర్ ఇంటికి అవతల మూడవ ఇంటి బయట (తన ఫ్రెండ్ రూము దగ్గర) మంచం మీద పడుకున్న వేణు గారిని సార్ చూసి విషయం తెలుసుకుని, ఆయనను రూమ్ కి తీసుకు వెళ్లారు. అక్కడ కరెంట్ లేకపోతే సార్ తమతో పాటు తెచ్చుకున్న కొవ్వొత్తి, అగ్గిపెట్టె తీసి వెలిగించి తాము తెచ్చుకున్న పులిహోర పెట్టారు. తర్వాత 50 రూపాయలు ఇచ్చి హోటల్ లో తినమని చెప్పి పరీక్షలు అయిన తర్వాత ఇంటికి వెళ్లకుండా విద్యానగర్ మాస్టర్ గారి దగ్గరకి రమ్మన్నారు. వేణుగారు అలానే మాస్టర్ దగ్గరకి వెళ్ళి అక్కడ మందిర నిర్మాణంలో పని చేస్తూ అక్కడే 50 రోజులు ఉన్నారు. ఆ సేవ చేయటం ద్వారా ఆయన ఖర్మను తీసేశారు అనిపించింది. ఎందువలన అంటే తర్వాత జీవితం ఎంతో సుఖమయం అవటమే గాక సార్థకమైనది. వీరు కాలాంతరంలో NTPC

లో చీఫ్ ఇంజనీర్ గా పనిచేసి ఈ మధ్యనే రిటైర్ మెంట్ తరువాత గొలగమూడిలో సార్ సేవలో స్థిరపడ్డారు.





## మహా సమాధి

2017 ఏప్రిల్ ఎనిమిదో తారీఖున గొలగమూడి శ్రీ సాయి మాస్టర్ విద్యాలయం ఆన్యువల్ day ఫంక్షన్ కి శివకుమారి టీచర్ గారు వచ్చారు. ఆ రోజు సాయంత్రం సార్ కి పాద పూజ చేశారు. ఆ రోజు రాత్రి శివకుమారి టీచర్ గారు గుంటూర్ కి బస్సులో బయలుదేరారు. ఏప్రిల్ 9 వ తారీఖు తెల్లవారుఝామున బస్సులో కునుకు పట్టింది. అప్పుడు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో సార్ ని నాలుగు వైపులా పట్టుకుని ఎత్తి పూలు జల్లుతున్నట్లు వచ్చింది. గుంటూర్ లో ఇంటికి చేరుకున్న తర్వాత నాగలక్ష్మికి (ప్రసాద్ భార్య) ఫోన్ చేసి ఆ విషయం చెప్పి, అంతకు ముందు ఒక మహనీయుడు సమాధి చెందే ముందర కూడా ఇలానే స్వప్నం వచ్చింది, కొన్ని రోజులకి సమాధి అయ్యారు అందువలన ఈ రోజు ఉదయం వచ్చిన కలను బట్టి సార్ త్వరలో సమాధి అవుతారని బాధ పడింది. ఆమెకు స్వప్నం వచ్చిన రెండు నెలల తర్వాత అంటే జూన్ 9 వ తారీకు 2017 న (జ్యేష్ట పౌర్ణమి శుక్రవారం) సార్ సమాధి అయ్యారు.

సార్ తమ శరీరం చాలించటానికి ఒక వారం ముందర (2017 జూన్ 2) గురువారం సాయంత్రం స్నానం చేయించిన తర్వాత కోటేశ్వరరావుతో (కోటితో) సార్ మాట్లాడుతూ “వారం తర్వాత ఉండను” అని ఒకసారి, “వారం తర్వాత ఉండను” అని మరొకసారి చెప్పి “ఎవరితోను చెప్పవద్దు“ అని అన్నారు. కోటికి సార్ అన్న మాటలు పూర్తిగా అర్ధం కాలేదు. సార్ చెప్పవద్దు అన్నారు కాబట్టి అతను ఎవ్వరితోను చెప్పలేదు. ఒక రోజు రాత్రి అతనికి కలలో ఒక దివ్య దర్శనం అయ్యింది. ఆ కల ఈ విధంగా ఉంది "శ్రీ సార్ వాళ్ళ ఇంటి వద్ద ఎందరో గుమిగూడి ఉన్నారు. షామియానాలు వేసి ఉన్నాయ్. సార్ వాళ్ళ ఇంటి దగ్గరకు అందరిని తోసుకుంటూ వెళుతుంటే కొందరు అక్కడ ఏడుస్తూ ఉన్నారు. లోపల చూస్తే సార్ కూర్చొని నవ్వుతూ **“వీళ్ళంతా పిచ్చి వాళ్ళు. ఏమిటి వీళ్ళు అందరూ ఏడుస్తున్నారు? నేనెక్కడిపోయాను. ఇక్కడే ఉన్నాను కదా!”** అంటున్నారు. మరు రోజు ఉదయం బయలుదేరి కోటేశ్వరరావు వారి బంధువుల ఇంటికి వెళ్ళవలసి గొలగమూడి విడిచి వెళ్ళారు. వారం గడిచింది. శుక్రవారం రోజు ఉదయమే సార్ చెప్పినది ఏమవుతుందో చూడాలనే ఉత్సుకతతో గొలగమూడి బయలుదేరుతుండగా పాబోలు వేంకటేశ్వర్లు వద్ద నుండి సార్ కు బాగోలేదని ఫోన్ వచ్చింది. వెళ్లి చూస్తే సార్ చెప్పినట్లే ఆయన శరీరం చాలించారు అని తెలిసింది. పూర్తి స్పృహతో, ఎరుకతో సార్ తనువు చాలించారు అనటానికి ఇది ఒక నిదర్శనం.

# నిత్య సత్యులు శ్రీ సార్

(గూడూరు) నందకుమార్ గారి భార్య ( హేమలత ) తమ హై స్కూల్ లో సుబ్బరామయ్య సార్ స్టూడెంట్. ఆమెకు పెళ్లి అయినా తర్వాత కూడా గొలగమూడికి వచ్చి సార్ ని దర్శించుకుని వెళ్లేవారు. ఒకసారి ఆమెకు కాళ్ళ, మోకాళ్ళ నొప్పులు ఉంటే సార్ ఆమెను మొదట రోజూ గొలగమూడికి వచ్చి శ్రీ వెంకయ్యస్వామి దర్శనం చేసుకొని ప్రదక్షిణాలు చేయమన్నారు. ఆమె సార్ తో గూడూరు అవతల పల్లెటూరు నుండి రోజూ రావటం కష్టమంటే వారానికి ఒకసారి రమ్మన్నారు. ఆమె సార్ చెప్పినట్లు వారం వారం స్వామి దర్శనం చేసుకునేది. కొన్ని వారల కల్లా ఆమె నొప్పులు తగ్గిపోయాయి. సార్ చెప్పిన స్పూర్తితో ప్రతిరోజూ తమ ఇంట్లోని తులసి కోట చుట్టూ ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల మధ్య ప్రదక్షిణలు చేసేవారు. కొన్ని నెలల తర్వాత అనారోగ్యమై మంచం పట్టారు. డాక్టర్లకు రోగం అంతుబట్టలేదు. ఇంక ఆమె చనిపోతారని డాక్టర్లు చెప్పేసారు. అప్పుడు నందకుమార్ గారు శ్రీ దత్తాత్రేయునికి మనస్సులో “నువ్వు చచ్చిన వారిని బ్రతికించావు, నా భార్యను బ్రతికించలేవా” అని వేడుకుని శ్రీ గురు చరిత్ర పారాయణ చేశారు. ఒక రోజు మధ్యాహ్నం ఆమెకు కలలో వారింట్లో వున్న భరద్వాజ మాస్టారు పటంలో నుండి భరద్వాజ మాస్టారు వస్తూ ఆమె పడుకున్న మంచం దగ్గరకు వచ్చి ఆ మంచం మీద పడుకున్నారు. ఆ రోజు నుండి ఆమె ఆరోగ్యం బాగుపడి కోలుకుంది. ఆమెకు ఇప్పటికీ ఆమె చేసిన ప్రదక్షిణలు ఆమెను రక్షించాయని చెపుతుంది.

సుబ్బరామయ్య సార్ సమాధి అవటానికి ముందు నుండి ఆమెకు సార్ తర్వాత వారసులు (ఆధ్యాత్మిక) ఎవరు అనే సందేహం మనస్సులో ఉండేది. ఒకరోజు ఆమెకు స్వప్నంలో ఒక పెద్ద స్కూల్ బిల్డింగ్ ఆవరణలో తన స్నేహితులు ‘సుబ్బరామయ్య అయ్యవారు (సార్) అక్కడ ఉన్నారు, పోయి దండం పెట్టుకో’ అని చెప్పారు. ఆమె సార్ దగ్గరకి వెళ్లి కాళ్లకు నమస్కారం చేసుకుని (తెలియకుండానే కళ్లనీరు కారుతుండెను) పైకి చూసే సరికి సార్ ముఖం కాకుండా వెంకయ్య స్వామి ముఖం కనపడింది. వెంకయ్యస్వామి లాగా పోయేదెక్కడికయ్యా! సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఇక్క ఉండేది కదయ్యా! అన్నట్లుంది.

## మహా సమాధి అనంతరం లీలలు

శ్రీ సుబ్బరామయ్య సార్ సమాధి చెందిన రెండవ రోజు సార్ సమాధి కార్యక్రమం అయిన తరువాత అచ్చటివారు 13వ రోజు ఏమి చేయాలో నిర్ణయించారు. సార్ కి మనము పిల్లలుగా ఏమి చేయాలా అనే ప్రస్తావన వచ్చింది. సాయి సుబ్రహ్మణ్యం మరురోజు ప్రయాణం చేస్తూ గురుబంధువు నగేష్ తో సంభాషణలో "సార్ మనల్ని సొంత బిడ్డలలాగా చూసారు, మనకు తండ్రి కంటే ఎక్కువ కదా సార్ సమాధి అనంతరం మహాత్ములకు ఏ కార్యం చేస్తే బాగుంటుంది" అని కొంత చర్చ జరిగింది. మనస్సులో తండ్రి ఉత్తమగతుల కోసం కుమారులు చేసే క్రియలు ముఖ్యమని భరద్వాజ మాస్టర్, సార్ చెప్పినది (శివనేశన్ స్వామి మాటలు) గుర్తుకు వచ్చి రోజూ ఏదో కొంచెమైనా సార్ కు చేయాలనిపించింది. ఆ రోజు రాత్రి సాయి సుబ్రహ్మణ్యం కలలో "ప్రాణం లేకుండా ఉన్న సార్ కు స్నానం చేయించడానికి కూర్చోబెట్టడం చేస్తున్నారు. అంతలో సార్ శరీరంలోకి ప్రాణం వచ్చి 'ఓం సాయినాధాయ నమః, ఓం గురుదేవ' అని పలుకుతున్నారు. వెంటనే కొంతమంది సార్ కి ప్రాణం వచ్చిందని ఫ్యాన్ తీసుకువస్తున్నారు". ఈ స్వప్న దర్శనంతో ఉత్తమగతికై సామాన్యులకు చేసే క్రియల కన్నా మిలరేపాచరిత్రలో మృత్యువు పై ఘనవిజయం సాధించిన మహాత్ములకు ఉత్తమ లోకాల నుండి వారి ఆశీస్సులు మనకు అందేందుకు కృతజ్ఞతగా చేయవలసిన పూజ, నిత్య నైవేద్యం (ప్రతి పూట) చేస్తే బాగుంటుందనే భావనను సాయి తనకు సార్ ఇచ్చిన ప్రేరణగా భావించాడు.

ఆ ప్రేరణతో సాయి రోజూ లఘు పూజ, సార్ కు ప్రతిపూట నైవేద్యంగా నివేదించటం ప్రారంభించాడు. కొన్ని రోజుల తర్వాత ఆఫీసు పని మీద ఒక టూర్ కు వెళ్ళవలసి వచ్చి ఆ ప్రయాణాలలో రెండు మూడు రోజులు శ్రద్ధగా నివేదన చేయలేదు. ఆ తర్వాత రోజు రాత్రి సార్ కలలో "నగేష్ ఒడిలో తలపెట్టుకుని పడుకొని కనిపించారు. సార్ సాయికి ఏదో పనులు వరుసగా ఆదేశించి చేయిస్తున్నారు. ఇంతలో ఒకరెవరో అవధూత లీల గ్రంథాన్ని ఇమ్మని అడిగారు. సాయి 'నేను ఇస్తాను' అన్నాడు కానీ, సాయి సార్ దగ్గరే కూర్చున్నాడు. సార్ అతనిని 'పద పద, ఒప్పుకున్న పని క్షుణ్ణంగా చేయాలి' అన్నారు". మెలకువ వచ్చాక సాయి అనుకున్న లఘుపూజ, మూడుపూటలా నివేదన అతనిని శ్రద్ధగా చేయమని సార్ హెచ్చరిస్తున్నారని స్ఫురింపచేసారు. సార్ సమాధి చెందినా నిత్యసత్యులని తెలిపి వారి కృపకు కృతజ్ఞతగా

లఘుపూజ, నైవేద్యం చేయటం మొదలుపెట్టించి దానిలో జాప్యాన్ని భౌతికంగా వున్నప్పుడు ఎలా హెచ్చరించేవారో అదే రీతిలో ఇప్పటికి హెచ్చరిస్తూ నడిపిస్తున్నారు.

సార్ సమాధి అనంతరం అమ్మగారికి వచ్చిన ఎన్నో కలలతో సార్ అనుక్షణం అమ్మగారి తోనూ, మనందరితోనూ ఉన్నారని, వారు మనం చేసేవి చూస్తూ, మనను నడిపిస్తూ ఉంటారని తెలుపుతున్నాయి. సార్ సమాధి అయిన రెండవ రోజు సార్ గారి భార్యగారికి (అమ్మగారికి) 27 జూన్ 2017 రాత్రి వచ్చిన స్వప్న వృత్తాంతం: ''అయ్యవారు పిలుస్తున్నారని చెప్పటం వలన అమ్మగారు సాయి మాస్టర్ నిలయంకి వచ్చారు. అక్కడ సార్ చాలామందితో కలసి పనిచేస్తున్నారు. అమ్మగారిని చూసిన సార్ ఒక వస్తువిచ్చి కడుక్కురమన్నారు. కడిగి తీసుకు వచ్చిన తర్వాత సార్, అమ్మగారు అక్కడ పనిచేసే చిన్నపిల్లవాడిని చూసి నవ్వుకున్నారు. తర్వాత అమ్మగారు సార్ తో 'ఏడకి పోయావు, ఇంటికి రా' అన్నారు. సార్ "నాకు ఇచ్చటే బాగుంది, ఇక్కడే ఉంటానన్నారు". భయం వేయదా అని అమ్మగారు అడిగితే అంటే "నాకు భయమేమీ లేద"న్నారు. **సార్ సమాధిలో ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటారని అమ్మగారికీ, మనందరికీ తెలపటం కాదా!**

ఈ క్రింది లీలను బట్టి **సార్ అన్నివేళలా అన్నింటినీ గమనిస్తున్నారనీ, అంతేగాకుండా మనల్ని సరైన మార్గంలో నడిపిస్తున్నారని తెలుస్తోంది! శ్రీ సార్ నిత్యసత్యులు.**

దమ్మపేట వాస్తవ్యులు దారా నాగేశ్వరరావు గారు గొలగమూడిలో ఉన్న ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు స్వామి సమాధి మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. 2017 సం|| ఒక ఆదివారం ఉదయం నిద్ర లేచినా మందిరంలో ప్రదక్షిణలు చేయనీయకుండా గేట్లు వేసి ఉంటారని పడుకునే ఉన్నారు. ఆయనకు కలలో "శ్రీ సాయి మాస్టర్ నిలయంలో వుండే తిరుపతయ్య గారు కనపడి ఆయనతో " టైం అయ్యింది. వెళ్లి ప్రదక్షిణలు చేయండి" అని చెపుతున్నాడు. దానికి ప్రత్యుత్తరంగా నాగేశ్వరరావుగారు ఇవాళ ఆదివారం గేట్లు వేసుంటాయి అని చెప్పారు. అంతలోనే సార్ శ్రీ సాయి మాస్టర్ నిలయం లోపల నుండి వస్తూ నాగేశ్వరరావుగారితో **"ఏం అక్కడ (స్వామి గుడి చుట్టూ) చెయ్యలేకపోతే ఇక్కడ (సార్ సమాధి వద్ద) చేయొచ్చు కదా!"** అని సార్ సమాధిని చూపెట్టారు". నాగేశ్వరరావుగారు వెంటనే లేచి సార్ సమాధికి ప్రదక్షిణలు చేసారు. ఈ లీల ద్వారా **"సార్ అందరి హృదయాలలో ఉండి వారు చేసే పనులు సాక్షిగా చూస్తున్నారు, ఏదైనా తప్పు చేయబోతుంటే అదీ**

**ముఖ్యంగా ఒప్పుకున్న పని చేయకపోతే సరి దిద్దుతున్నారు. అంతేగాకుండా స్వామి సమాధి దగ్గర ప్రదక్షిణలు చేయలేకపోతే తమ సమాధికి చేయమని చెప్పటం ద్వారా మనకు సార్ సమాధి స్వామి సమాధి వంటి పవిత్ర ప్రదేశమని తెలిపి, ఆ సన్నిధిని తగు శ్రద్ధతో మన సాధనల ద్వారా సద్వినియోగం చేసుకోమంటున్నారు"** అని తెలుస్తోంది.

గిరిజ గారు (USA), తన అనుభవాన్ని ఇలా చెబుతున్నారు:

2000 సం|| లో మా వారు వాషింగ్టన్ లో ఉద్యోగం వదిలేసి సియాటెల్ యూనివర్సిటీ లో జాయిన్ అయ్యారు. అక్కడ రీసెర్చ్ చేయడానికి కూడా అవకాశం ఉండటం వల్ల, మావారు డాక్టర్ cum టీచర్ గా పని చేస్తున్నారు. అక్కడ చేరిన అపార్ట్మెంట్లో కొత్త మేనేజర్ ఏదో రూల్స్ మాట్లాడుతూ చాలా హెడ్ఏక్ గా తయారయ్యాడు. ఏ కారణం లేకుండా మమ్మల్ని పదివేల డాలర్లు (సుమారు 7 లక్షల రూపాయలు) కట్టమన్నారు. అలా చెప్పిన తర్వాత ఒకరోజు online సత్సంగం జరుగుతుంటే నేను సార్ తో 'మీరు డబ్బులు తీసుకోండి, కానీ మీరు వాళ్లకి డబ్బులు వెళ్లనివ్వవద్దు' అని మ్రొక్కుకున్నాను. ఆగస్టు 2021 సత్సంగ సభ్యులు మదన్ కుమార్ (సూళ్లూరుపేట) వెంకయ్య స్వామి మందిరానికి దక్షిణ ఇచ్చేవారు ఇవ్వండి, అని వాట్సాప్ లో మెసేజ్ పంపించారు. అది చూసి భగవంతుడు మా కోసం అలాంటి ఏర్పాటు చేశాడా? అనుకొని మేము దక్షిణ సమర్పించుకున్నాము. కొన్ని రోజుల తర్వాత అదే మేనేజర్ మాతో మాట్లాడుతూ ఎందుకు టెన్షన్ పడతారు, మినిమం ఫీజ్ పే చేయండి అది సరిపోతుంది అన్నారు. మేము అలానే చేసాము. పదివేల డాలర్లు పే చేయమని చెప్పిన దానికి చాలా తక్కువ పే చేసి బయట పడ్డాము. ఈ సంఘటనలతో "కర్మ విధ్వంసకాయ నమః" అన్నట్లు వారి కృప మాకు అనుభవం అయ్యేలా చేసారు.

---

2015లో సుబ్బరామయ్య సార్ గారితో ఒకసారి ఫోన్ లో మాట్లాడాను. మాట్లాడుతూ (ఈ సారి ఇండియా వచ్చినప్పుడు) మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను సార్ అంటే, సార్ నవ్వి " అప్పటి దాకా ఉండాలి కదా" అని అన్నారు. తర్వాత 2017 లో సమాధి అయిన తర్వాత అనిపించింది. అంటే సార్ కి ఎప్పుడు శరీరం వదిలేది కూడా తెలుసు అని!

సుబ్బరామయ్య సారు సమాధి అయ్యాక ఒకరోజు వెంకయ్య స్వామి గ్రంథంలో స్వామి సమాధి అయిన సన్నివేశం చదువుతున్నాను. దాంట్లో

స్వామి శరీరం వదిలేసిన తర్వాత కూడా ఆయన శరీరం ఎంతో మృదువుగా, ప్రాణ సహితంగా ఉంది అని చదివాను. ఆ తరువాత కలలో సుబ్బరామయ్య సార్ గారు కనిపించి నన్ను "బాత్రూంకి తీసుకెళ్తావా, అమ్మా!" అని అడిగారు. మీరు మా నాన్నగారు లాంటి వారు, తప్పకుండా తీసుకు వెళతాను, అని బాత్ రూం కి తీసుకెళ్లి బయటకు వచ్చాను. కొంచెంసేపు తర్వాత సార్ పిలిస్తే సార్ ని బాత్రూం నుండి తీసుకు వచ్చేటప్పుడు సార్ చర్మం స్పర్శ వెంకయ్య స్వామి బుక్ లో వ్రాసినట్లు ఉండటంతో చాలా ఆశ్చర్యపడ్డాను. **సార్ దర్శనం మాత్రమే కాకుండా భౌతికంగా ఉన్న అనుభూతి ఇప్పటికీ ఉన్నది. ఇదంతా సుబ్బరామయ్య సార్ గారి కృప!**

హైదరాబాద్ వాస్తవ్యులు వీరప్రతాప్ గారు ఇలా తెలుపుతున్నారు: సార్ భార్యగారికి (అమ్మగారు) సార్ కలలో కనపడిన విషయాన్ని జూన్ 29వ తేదిన తన భార్యతో చెప్పాడు. ప్రతాప్ భార్య పడుకోబోయే ముందు 'సార్ నాకు దర్శనం ఇస్తారా? అక్కడికి వెళ్లేవారికి మాత్రమే ఇస్తారు కాబోలు' అని మనస్సులో అనుకుంది. రాత్రి కలలో సార్ కనిపించి ఇలా చెప్పారు: **"అక్కడికి వస్తేనే దర్శనం ఇస్తాను అని కాదు, కల్మషం లేని మనస్సుతో ఎవరు ఎక్కడ అనుకున్నా వాళ్ళకు దర్శనం ఇస్తాను. కల్మషం లేని మనస్సు ఎవరికి ఉంటుందో వారికి నా ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది.**" తన భవిష్యత్ గురించి భయమేస్తోంది" అని ఆమె అన్నదానికి సార్ ఆమెకు 40సం||లు అప్పుడు, 50సం||లు అప్పుడు, 60సం||లు అప్పుడు ఆమె, ఆమె కుటుంబం ఎలా వుంటారో చూపించి, చూడు ఇక్కడ ఎంత సంతోషంగా ఉన్నారో, ఏమీ దిగులుపడకు అని చెప్పారు. తను ఏమన్నా తప్పు చేసానా అని సార్ ని అడిగితే ఆమె తలమీద చేయి వేసి "ఏం తప్పు చేయలేదు తల్లీ!" అని ఆశీర్వదించారు. సార్ నిత్యసత్యులని ఆమె ఆనందముగా ఉంటుందని తెలిపారు.

సార్ చివరి రోజుల్లో సంవత్సరం పైగా కోటేశ్వరరావు సార్ కు స్నానం చేయించేవారు. సమాధి అనంతరం కూడా రోజూ అభిషేకానికి, ఉదయ హారతికి వచ్చి సార్ ను సేవించుకొన్నారు. 2018 లో మధ్య జరిగిన ఈ క్రింది అద్భుతమైన అనుభవం సార్ ఇప్పటికీ శ్రద్ధతో వారి సమాధిని, వారిని సేవించే వారిపై తమ దృష్టి అంతకంటే ఎక్కువగా నిలుపుతారని తెలుపుతోంది.

2018 మే నెల ఒకరోజు ఒంగోలులో నివసించే తిరుమలశెట్టి నారాయణకి సార్ కలలో కనపడ్డారు. స్వప్న వృత్తాంతం

సార్ : "వాడు వారం రోజులు నుండి రావట్లేదు. నాకు తెలుసు ఎందుకు రావట్లేదో "

నారాయణ : ఎవరు సార్?

సార్ : "వాడేరా ఒళ్ళు తుడుస్తాడు కదరా వాడే. నువ్వు అయినా రావచ్చు కదా" అన్నారు.

నారాయణ వెంటనే బయలుదేరి సార్ సమాధి దర్శనం చేసుకున్నాడు. ఎప్పుడూ ఉదయం అక్కడ ఉండే కోటేశ్వరరావు లేకపోయేటప్పటికి, సార్ స్వప్నంలో జరిగిన సంభాషణ అర్ధమైంది. కోటేశ్వరరావుకి ఫోన్ చేసి 'ఏం! సార్ దగ్గరకు రావట్లేదు?' అని అడిగితే కోటేశ్వరరావు 'వారం క్రితం కుడి చేయి భుజం పట్టేసింది, నారాయణ! మందులు వాడుతున్నా తగ్గట్లేదు' అని చెప్పారు. నారాయణ తనకు జరిగిన స్వప్న వృత్తాంతం చెప్పాడు. వెంటనే నొప్పి అయినా కోటేశ్వరరావు సార్ అభిషేక సేవకు వెళ్ళటం మొదలు పెట్టాడు. మూడవ రోజుకు ఏ మందులూ లేకుండా నొప్పి తగ్గిపోయింది. ఈ సంఘటన శ్రీ సాయినాధుడు సమాధి అనంతరం దాసగణుకు, జోగ్ కు స్వప్న దర్శనమిచ్చి 13 రోజుల, 40 రోజుల కార్యం చేయించుకున్నట్లు ఉంది. అంటే **సార్ నిర్నిద్రులై ఎవరు సేవ చేస్తున్నారు? ఎవరు ఎప్పుడు ఏమారుతున్నారు? అని ఇప్పటికీ మన అభివృద్ధిని చూడటమే కాక తన ప్రత్యేక పద్దతిలో సరిచేసి సేవా భాగ్యం కల్గిస్తూ, ఆ సేవ ద్వారా అన్ని ఇబ్బందులు తొలగిస్తామని తెలియచేస్తున్నారు. ఓం సన్మాత్రాయ నమః.**

సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ కార్యక్రమాలు ఏవి చేసేటప్పుడైన శ్రీ సార్ కు ముఖతా నివేదించుకొని సార్ ఆశీస్సులు వాచా ఇచ్చిన తరువాతనే మొదలు పెట్టడం సాయి మాస్టర్ ముఖ్య నిర్వాహకులైన వేణుగోపాల్ గారికి అలవాటు. సార్ మొదటి ఆరాధనకు (జూన్ 9, 2018) ఇంకా కొన్ని రోజులు ఉంది. ఆరాధన కార్యక్రమాలు ఎలా జరుగుతాయని వేణుగోపాల్ గారు ఉద్విఘ్నతతో ఉన్నారు. అలవాటుగా సార్ కు నివేదించుకొంటున్నా, సార్ మాటగా భౌతికంగా శుభాశీస్సులు పొందలేము కదా? అని వెలితిగా ఉన్నారు. ఒకరోజు ఉదయం స్నానం చేస్తుంటే భౌతికంగా ఉన్నప్పటి సార్ మాటగా హృదయానికి చాలా స్పష్టంగా "అంతా బాగా జరుగుతుంది" అని వినపడింది. అంతే వెంటనే వేణుగోపాల్ గారికి మనస్సు ప్రసన్నం అయ్యింది. అలానే అన్ని కార్యక్రమాలు సజావుగా జరిగాయి. ఆరాధనలో అందరూ తమ వీలును బట్టి ఒకటి, రెండు రోజులు ముందర వచ్చి తమ ఇంటిలో పనిలాగా సేవ చేసుకోగలిగారు. సార్ సత్సంగం, పూజ, సార్ తో పాటు సార్ కట్టించిన భవనాల సందర్శనం

(చిత్రంగా ఆ రోజు (జూన్ 9) మధ్యాహ్నపు ఎండ చాలా తక్కువై పోయింది!) , భజన, సార్ యొక్క వీడియోలు మొదలైన కార్యక్రమాలలో అందరకీ సార్ తో ఉన్నామనే భావన కలిగింది.

సమాధి అయిన కొద్దిరోజులకు ఒకసారి అమ్మగారు రాత్రి 10:30 నుండి 11:00 గంటలకు అన్నం పెట్టి, బాబాకు దీపారాధన చేసి శేషయ్యకు పెట్టిన తర్వాత అమ్మగారు మరలా తిందాము అనుకున్నారు. అమ్మగారికి ఏమీ చేయలనిపించక బాధగా కుర్చీలో పడుకుంటే సార్ కలలో కనపడి "ఎందుకు ఏడ్చేది? నీవేడుస్తుంటే నేనేం చేసేది? నేను యాడికి పోయాను. వచ్చేసాను" అని మంచంలో పడుకున్నారు. అమ్మగారిని పిలిచి కాలునొప్పి ఎలా ఉందని అడిగి ఒకసారి నొక్కి చూసి, దేవుడికి పెట్టావు కదా! ఇడ్లీ తినేసి పడుకోమని చెప్పారు. మెలకువ వచ్చేసరికి ఇడ్లీ తినలేదని వంటింట్లో ఉందని గుర్తొచ్చింది. **ఇలా మనం చేసే ప్రతి పని చూస్తూ భగవంతునికి చేసే దానిని ప్రోత్సహిస్తూ తను ఆశ్రయించిన వారి చింతను అంతకు ముందులాగానే తొలగిస్తూ ఉన్నారు. నిత్య సత్యులు శ్రీ సార్.**

మరో సారి అమ్మ గారి కమ్మలు పోయాయి. పడుకున్నప్పుడు పడిపోయి ఉంటాయనుకున్నారు. వెతికినా దొరకలేదు. చివరకు సార్ కు విన్నవించుకుంటే మరురోజు ఉదయం వంటిట్లో కనపడ్డాయి.

ఇప్పటికి సార్ సాంగత్య, మధుర స్మృతులను తలచుకుంటూ అమ్మ గారు కళ్ళు చెమరుస్తుండటం అమ్మగారికీ, సార్ కు గల అనుబంధాలను తెలుపుతాయి. **వారి ఆదర్శ జీవితాలు మనకు చక్కటి మార్గదర్శకాలు.**

సార్ తమ దగ్గర ఉన్న భక్తులను ప్రోత్సహించి మహనీయుల లీలలను సేకరింపచేసి ముద్రించేవారు. ముద్రించే ముందర సార్ గ్రంధస్థం చేసి ఎలా వ్రాయాలి, ఏ విషయాలను ఎక్కువ ప్రస్తావించాలి అనేది చెపుతూ ప్రూఫ్ రీడింగ్ చేస్తారు. శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి భక్తుల లీలలను ప్రసాద్ చే సార్ సంకలనం చేయించారు. రెండవ ముద్రణకు ముందరే సార్ మహా సమాధి చెందారు. 2018 లో ముద్రణకై శ్రీ దర్గాస్వామి ఆశీస్సులు కోసం వెళుతున్నానని ప్రసాద్, వేణు గోపాల్ గారికి చెపితే ఆయన "ఒక కాపీ పుస్తక రూపంలో ప్రింట్ చేయించి దర్గాస్వామి ఆశీస్సులు తీసుకో" మన్నారు. ఆ రోజు రాత్రి ప్రసాద్ కి కల: సార్ వారింటి పెరట్లో ఉన్నారు. ప్రసాద్ ఏదో పని మీద ఇంటి ముందరకు వస్తూ "అరెరే సార్ కి ప్రూఫ్ రీడింగ్ చేయమని బుక్ ఇస్తే బాగుంటుందని, వెళ్లి బుక్ ఇచ్చాడు". తర్వాత రోజు ఉదయం నిద్ర లేచిన తర్వాత స్ఫురించినది ఏమిటయ్యా అంటే "ప్రతిసారి సార్ అనుమతి, ఆశీస్సులకై ఒక కాపీ ప్రూఫ్

రీడింగ్ కు మొదట ఇవ్వటం అలవాటు. కానీ **ప్రసాద్ సార్ సమాధి అయ్యారు అనే స్ఫురణలో ఉన్నాడు (అనుకుంటున్నాడు). కానీ ఆయన నిత్యసత్యులనే విషయం మరచిపోయినా సార్ అనంత కరుణతో గుర్తు చేసారు"**. ప్రసాద్ అలానే ఒక కాపీ సార్ సమాధి దగ్గర పెట్టి విన్నవించాడు. సార్ దయ వలన దర్గాస్వామి ఆశీస్సులు కూడా లభించి ఆ గ్రంథం ముద్రితమైనది. కొసమెరుపు ఏమిటంటే, దర్గాస్వామి కొన్ని రోజుల పాటు ఆ గ్రంధాన్ని ప్రతిరోజూ తమ సన్నిధిలో కొంతసేపు ఉన్న భక్తుల చేత సుమారు 20-30 నిముషాలు చదివించి వినిపించుకున్నారు, ఆ రీతిన తమ విశేష ఆశీస్సులు ఇచ్చారు.

జగదీశ్ గారు, మద్రాసు, ఇలా చెపుతున్నారు: 2018 ఏప్రిల్ లో స్కూల్ వార్షికోత్సవానికి వచ్చినప్పుడు అందరూ ఉండమన్నా మా పాపకు స్కూల్ వర్క్ ఉందని రాత్రి బయలుదేరి చెన్నైకి కారులో వెళ్తున్నాము. అప్పటికే కారు బ్యాటరీ వీక్ గా ఉండటం వల్ల start చేయటానికి తోయవలసి వచ్చింది. అందుకు ఒకసారి స్టార్ట్ అయ్యాక మరల ఆపకుండా నడుపుతున్నాను. సుమారు 80 కిలోమీటర్ల తర్వాత టీ త్రాగుదామని కారుని ఇంజను ఆపకుండా పక్కకు నిలిపాను. టీ త్రాగి వచ్చి చూస్తే కారు వెనుక కుడి వైపున డోర్ లాక్ అవ్వకుండా ఉండటమేగాక, ఎవరో అదృశ్యంగా పట్టుకున్నట్లు పట్టి ఉంది. ఆ డోర్ కి ఆనుకుని మా పెద్ద పాప నిద్ర పోతోంది. 90 కిలోమీటర్ల స్పీడ్ తో వెళ్ళుతున్నా, స్పీడ్ బ్రేకర్ లు ఎన్ని వచ్చినా, టర్నింగ్ లు ఎన్ని తిప్పినా డోర్ రాకపోవటం, మా పాపకు ఏ గండం లేకుండా చేసిన సార్ కి, స్వామికి ఏమి ఇచ్చినా వారి ఋణం తీర్చుకోలేమని తెలుపుతూ సార్ సమాధిని వీలైనంతగా దర్శనం చేసుకుంటారు.

మార్చి 2018 లో వేణుగోపాల్ గారి తమ్ముడు తన స్నేహితుడైన నారాయణతో మాట్లాడుతూ 'సర్లే సార్ ఆరాధనకు వస్తాలే' అని చెప్పాడు. తర్వాత మర్చిపోయాడు. జూన్ 8 వ తారీఖున అతని కలలో సార్ కనపడి "ఆరాధనకు వస్తానని మాట ఇచ్చి మర్చిపోయావే ?" అని హెచ్చరించారు. ఆరాధనకు వచ్చి అతను సార్ దర్శనం చేసుకున్నాడు.

శ్రీ సార్ సమాధి అయ్యాక సాయిసుబ్రహ్మణ్యం కి తరచూ స్వప్నంలో శ్రీ సార్ దర్శనం అయ్యేది. ఒక సంవత్సరం అలా అయ్యాక కొన్ని నెలల పాటు సార్ దర్శనం స్వప్నంలో కాలేదు. ఒక రోజు సాయి మనస్సులో శ్రీ సార్ ఈ మధ్య దర్శనం ఇవ్వలేదే! అనుకొని పడుకున్నాడు. ఆ రోజు రాత్రి సాయికి శ్రీ సార్ స్వప్న దర్శనం ఇవ్వటం – స్వప్నంలోనే సార్ కు నమస్కరించు కోవటం

జరిగింది. ఇలానే మరోసారి కూడా స్వప్నదర్శనం ఇచ్చారు. **శ్రీ సార్ స్మృతి మాత్ర ప్రసన్నులు అని సమాధి తరువాత కుడా మరల మరల ఎరుక పరుస్తున్నారు.**

అక్టోబర్ 20, 2018 విజయదశమి పండుగ రోజులు. ఒక రాత్రి స్వప్నంలో నేను, ప్రసాద్ ఒక చోట (తిరుచానూరు ప్రదేశం అనుకుంటా) వీధిలో నడుస్తున్నాము. అచట పెద్ద అమ్మవారి ఆలయ ద్వారం కనబడింది, మూసివేయబడి ఉంది అనుకునేంతలో ఎవరో లోపల నుండి తలుపు తెరిచారు. లోపల గర్భ గుడి ద్వారం మూసి ఉంది బయట నుండే దండం పెట్టుకుందామని అచట నుండి దండం పెట్టుకుంటే లోపల ద్వారంలో అమ్మవారి దర్శనం అయింది. క్షణాల్లో అమ్మవారి రూపం మారి శ్రీ సార్ గా అచ్చట దర్శనమిచ్చారు. అలా శ్రీ అమ్మ వారి దర్శనం, శ్రీ సార్ సకల దేవతా స్వరూపముగా దర్శనమిచ్చి ఆశీస్సులు అందించారు.

అక్టోబర్ 30, 2019 పూర్ణిమ ముందు రోజు రాత్రి శ్రీ సార్ స్వామి సమాధి మందిరంలో సాయి శివ తో శ్రీ స్వామివారికి అభిషేకం చేస్తున్నారు. నేను ఇంకా స్నానం చేయకపోవటంతో బయట నుండి చూస్తున్నాను. అంతలో సంపత్ నన్ను పిలిచాడు. సంపత్ శ్రీ సార్ ను ఏదో సందేశం కోరుతూ లెటర్ వ్రాసాడని దాని గూర్చి చెబుతున్నాడు. తర్వాత నేను మరలా సమాధి మందిరం లోకి వెళ్ళేటప్పటికి అభిషేకం పూర్తి అయ్యింది. శ్రీ సార్ బయట కొంత సేపు కూర్చుని వారి సన్నిధి ప్రసాదించారు. ఇది జరిగిన మాసం e-magzine కి శివ మొదటి సారిగా ఎడిటోరియల్ వ్రాయటం శ్రీ సార్ దగ్గర ఉండి e-magzine నడుపుతున్నారు, మన చేత చేయిస్తున్నారు అని, ఈ సేవ స్వామి వారి సమాధి అభిషేకంతో సమానం అని తెలుపుతున్నారు అని అనిపించింది. **శ్రీ సార్ దగ్గర ఉండి మనచే సేవ మంచిపనులు చేయిస్తున్నారు అనేది స్పష్టముగా ఈ అనుభవంతో తెలుపుతున్నారు.**

2019 లో ఒకసారి సాయి కి ఆఫీస్ లో కొందరి భిన్న అభిప్రాయాల వల్ల, దాని ఆలోచన వల్ల నిద్ర సరిగ్గా పట్టక ఆ రోజు 3 గంటలకు మెలకువ వచ్చింది. అప్పుడు పూజ రూమ్ లో పటాల వద్ద కూర్చొని శ్రీ సార్ తో విన్న వించు కుంటూ సందేశం కోసం శ్రీ సార్ లెటర్స్ బుక్ తెరిస్తే అది లాస్ట్ పేజి లోని "శ్రీ భరద్వాజ మాస్టారి రచనలు" అని వరుసగా మాస్టారి రచనలు వున్నాయి. శ్రీ సార్ మాస్టారి రచనలు చదవమంటున్నారు అని అనిపించింది. కాని ఇది చివరి పేజి కదా సంపూర్ణ వాక్యం కూడా లేదు అని మధ్య మరో పేజి తీసాడు. అచ్చట శ్రీ సార్ రాజు కు వ్రాసిన లెటర్ లో పూర్తి వాక్యం తో "మాష్టారి చరిత్రలు, మరల మరల చదువు. పారాయణాలు అని తొందర పడవద్దు. వారి

రచనలలోని సత్యం హృదయగతం చేయమని ప్రార్ధించు" అని వుంది. శ్రీ సార్ దయతో వారి సందేశం మరింత స్పష్టంగా వెంట వెంటనే అనుమానం లేని రీతిన తెలియ పరిచారు అనిపించింది. శ్రీ సార్ భౌతికంగా ఉన్నప్పుడు సాయి తో ఒక సందర్భంలో నీకు మాష్టారి చరిత్రలు అన్ని ఇంకో రీడింగ్ ఇప్పించాలి అన్నారు కాని, తరువాత ఆ ప్రస్తావన మరల రాలేదు. సార్ సమాధి అనంతర సందేశం వారి పూర్వ ఆదేశాన్ని మరల తెలపడం (దృఢ పరచడం) శ్రీ సార్ నిత్య సత్యులు అని, స్మృతి మాత్రప్రసన్నులు అని తెలుపుతోంది.

ఈ సందర్భము లోనే ఆఫీస్ లో ఒక నిర్ణయం కోసం, "ఇప్పుడు ఉన్న పొజిషన్లో మార్పు కోసం ప్రయత్నం చేయాలా ?" అని శ్రీ సార్ ను (ఫోటో ముందు కూర్చొని) మనసులో ప్రశ్నిస్తే" వెంటనే సమాధానంగా "నీవు అడిగితే ఆ పొజిషన్ లో ఉంచడం జరిగిందా? మరి దాని మార్పు కోసం నువ్వు ప్రయత్నం చేయడం ఏమిటి?" అని హృదయం లో పలికారు, ఆత్మ ప్రేరణాధికారి అయిన ఆ సద్గురు మూర్తి. కొద్ది రోజులలోనే ఆ పరిస్థితులు అన్ని సద్దుకోవటమే కాక ఆ పొజిషన్ లో ఉండి తన కర్తవ్యం నిర్వహించడం వల్ల వాళ్ళ డిపార్టుమెంటు కు ఎంతో లాభం చేకూరింది. **శ్రీ సార్ సమాధి అనంతరం కూడా ఇలా అడుగు అడుగునా వారి సహాయము - సందేశముల తో నడిపిస్తున్నారు.**

కిడ్స్ (చిన్నపిల్లల) సత్సంగంలో శ్రీ భరద్వాజ మాస్టర్ చిన్న పుస్తకాలు చదువుతున్న రోజులవి. ఒక రాత్రి స్వప్నంలో నేను పూజ చేసుకుంటుండగా శ్రీ మాస్టారు తెల్ల పంచ కట్టుతో వచ్చారు. శ్రీ మాస్టారికి నమస్కరించిగా ఆశీస్సులు ఇచ్చారు. ఇలా కిడ్స్ సత్సంగం లో మాస్టారి పుస్తకం చదువుకుంటూ ఉంటే, ప్రార్ధన లేకుండానే సత్సంగానికి వారి ఆశీస్సులు ప్రసాదించారు. సర్వజ్ఞులు, నిత్య సత్యులు శ్రీ మాస్టారు.

అలానే కిడ్స్ (చిన్నపిల్లల) సత్సంగంలో వెంకయ్య స్వామి వారి పుస్తకం అయ్యాక శ్రీ దర్గాస్వామి వారి పుస్తకం చదువుకుందామని అనుకున్నాము. సరిగ్గా సమయానికి (ముందురోజు రాత్రి) శ్రీ దర్గా స్వామివారు ఆశీస్సులు అందించిన విధానం ఇలా ఉంది: నేను, ప్రసాదు ఒకచోట ఉన్నాము. రాత్రి కావస్తోంది. శ్రీ దర్గా స్వామివారు అక్కడికి ఒంటరిగా వచ్చారు. స్వామికి నమస్కరించి మాట్లాడుతుండగా ప్రసాదు ఆ పక్క ఇంటికి వెళ్లి ఒక మంచం తీసుకువచ్చి వేసాడు. స్వామి ఆసీనులయ్యారు. కొందరు భక్తులు వచ్చారు. నేను అన్నం మొదలగునవి సమకూర్చుటకు వెళ్ళటం జరిగింది. వస్తుంటే శ్రీ దర్గా స్వామి వారు దారిలో మరలా ఎదురొచ్చారు. స్వామివారికి పాద

నమస్కారం చేసుకోలేదే! (ఛాన్స్ పోయింది) అనుకుంటూనే స్వామికి వారిచ్చిన స్వప్న దర్శనం గురించి చెబుతున్నాను. స్వామివారు ఆశీస్సులు ఉన్నాయి అన్నారు. ఈరీతి దర్గా స్వామి వారి పుస్తక పఠనానికి వారి ఆశీస్సులు ప్రసాదించారు.

బెంగళూర్ వాస్తవ్యులు ప్రసాద్ ఇలా తెలుపుతున్నారు. సార్ తనను ఉల్లిపాయలు తినొద్దు అని 2014 సం||లో చెప్పియున్నారని, అప్పటినుండి తను తినకూడదు అని అనుకున్నా దాని మీద వ్యామోహంతో ఇంట్లో వాళ్ళు ఎప్పుడైనా చేసినప్పుడు లేక ఇతర సందర్భములలో నెలకు రెండు మూడు సార్లు ఉల్లిపాయ తినటం జరిగేది. సార్ సమాధి చెందిన తర్వాత కూడా తింటూ సార్ మాట ఆచరించ లేకపోతున్నానే అని బాధపడడం జరిగేది. కానీ చిత్రంగా 2019 జూలై ఆగస్టు నుంచి తను ఇంక ఉల్లిపాయ తినకుండా ఉండాలి అని చెప్పి నిర్ణయించుకొన్నారు, అప్పటినుండి ఆ నియమము సహజ సిద్ధమైపోయింది. ఉల్లిపాయ మీద వ్యామోహం లేకుండా పోవటం అనేది సార్ యొక్క కృపయని! ఇలానే సార్ బంగాళదుంపలు కూడా తనను తినవద్దని (2014 లో) వాటి వల్ల పెద్ద వయస్సులో మోకాళ్ళ నొప్పుల ఇబ్బంది వస్తుంది అని చెప్పారు. చాలా చిత్రంగా 2019 లోనే అతనికి బంగాళదుంపలు తినటం మానేయటం జరిగింది.

ప్రసాద్ 28 నవంబరు 2019 న బెంగళూరు నుండి హైదరాబాదు బయలుదేరాడు. తర్వాత రోజు ప్లాన్ ప్రకారం తన పిన్ని వాళ్ళ ఇంటికి వెళ్లి ఒక కాన్ఫరెన్సుకి వెళ్ళాలి. ఉదయం పూట సమయం సరిపోదు కానీ నాంపల్లి బాబా దగ్గరికి వెళితే బాగుంటుంది అనుకున్నారు. ఇంటి నుండి బయలుదేరే ముందు సార్ కి నమస్కారం చేసి మీ సేవ చేసేటట్లు అనుగ్రహించండి అని ప్రార్థన చేసారు. అతను గంట 20 నిమిషాల ముందుగా రైల్వే స్టేషన్ కి బయలుదేరినా ట్రైన్ వెళ్ళిపోయింది. అప్పటికప్పుడు బస్సు టికెట్ రిజర్వేషన్ చేసుకుని హైదరాబాద్ లో స్నేహితుడైన రామకృష్ణ వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడి నుండి నాంపల్లి బాబా సమాధి మందిరం ఒకటిన్నర కిలోమీటర్ల దూరం మాత్రమే. నాంపల్లి బాబా సమాధి మందిరాన్ని దర్శనానికి వెళుతూ రామకృష్ణ రూమ్ లో ఉన్న ధునీవాలా దాదా గారి చరిత్ర గ్రంథం తీసుకెళ్లాడు. అక్కడ పూజారి అప్పారావు గారు ప్రసాద్ చేతిలో ఉన్న పుస్తకం చూసి 'ఇవాళ ధునీవాలా దాదా గారి సమాధి చెందిన రోజు. పొద్దున్నే అనుకుంటున్నాను ఈ రూపంలో ఆయన వచ్చేసారు అని చెప్పి పుస్తకం తీసుకుని కళ్ళకద్దుకుని, ఆ రోజు సుధీంద్రబాబు గారి సమాధి చెందిన రోజు కూడాను' అని చెప్పారు.

అట్లా ఇద్దరు మహనీయులు సమాధి చెందిన రోజు నాంపల్లి బాబా గారి దర్శనం చేసుకోవటం తన యొక్క అదృష్టమని, అంతేకాకుండా ఆ రోజు సాయంత్రం శ్రీ భరద్వాజ మాస్టర్ గారి సతీమణి దర్శనానికి వెళ్లి అక్కడ కొంచెం సేపు ఉండటం సార్ యొక్క కృప వల్ల మాత్రమే సాధ్యమైనదని సార్ కి మనస్ఫూర్తిగా నమస్కారములు తెలుపుతున్నాడు.

2019, ఆగస్టు ఎనిమిదో తారీఖున తెల్లవారుజామున 4:30 కి ప్రసాద్ నిద్ర లేచి వాలు కుర్చీలో కూర్చొని స్వామి వంక చూస్తూ మరలా నిద్రలోకి జారిపోయాడు. కలలో ప్రసాద్ రెడీ అయ్యి సార్ దగ్గరికి వచ్చాడు. సార్ అతనితో **అవధూత లీల చదువు** అని చెప్పారు. అతను సార్ కూర్చున్న వెనకాల గదిలోకి వెళ్లి వెతికితే అక్కడ పుస్తకం కనబడలేదు. వెంటనే ప్రసాద్ కు నిద్ర నుంచి మెలకువ వచ్చింది. అవధూత లీల తీసుకుని చదవడం స్టార్ట్ చేశాడు. అంటే ఆగస్టులో వెంకయ్య స్వామి ఆరాధన ఉంది. దానికి ముందర స్వామి చరిత్ర పారాయణ చేయడం మంచిది అని సార్ చెప్పినట్లు ఉంది. సార్ గుర్తు చెయ్యక పోతే ప్రసాద్ పారాయణ చేసేవాడు కాదు. కానీ సార్ అనంత కృపతో ప్రసాద్ కు ఆరాధన ముందు ఏమి చేయాలో అది నేర్పిస్తున్నారు.

పొత్తూరి వెంకటేశ్వర రావు (హైదరాబాద్) భార్య స్కూటర్ ని ఇంటి బయట పార్క్ చేసి తాళం తీసుకోవటం మర్చిపోయింది. తర్వాత రోజు తాళాలు కనపడక పోయేసరికి ఆమెకు భయమేసి సార్ కి నమస్కరించి మీరే రక్షించాలి అని చెప్పుకుని స్కూటీ దగ్గరకు వెళ్ళి చూస్తే అక్కడ తాళాలు లేవు. వెతుకుతూ ఉంటే ఎదురింటి గోడమీద స్కూటీ తాళం ఉన్నది.

వెంకటేశ్వరరావు 2019 సం||లో ఒక రోజు హాఫ్ డే లీవ్ పెట్టారు. అప్పుడు ఆయన ముఖ్యంగా రెండు పనులు చేయాలి. అవి ఏమిటి అంటే 1. పేపర్ వాల్యుయేషన్ చేయాలి 2. ఇంకోటి పేపర్ మోడరేషన్ చేయాలి అంటే ఇంకొకరు డిజైన్ చేసిన పేపరును రివ్యూ చేసి దాన్ని కరెక్ట్ చేయాలి. సామాన్యంగా అలా చేయటానికి మూడు రోజులు టైం ఉంటుంది. కానీ ఈ రెండు పనులలో ఏమి చేయాలని చీట్లువేస్తే పేపరు మోడరేషన్ చేయమని వచ్చింది. తను వెళ్ళి సార్ మోడరేషన్ చేయమని చీట్ల ద్వారా చెప్పారని పూర్తిచేయడం జరిగింది. కాని అంతకు ముందు రోజు కాలేజీలో ఒక కొత్త సర్క్యులర్ వచ్చింది. దాంట్లో ఒక్క రోజులో పేపర్ మోడరేషన్ (సింగిల్ సిట్టింగ్) లో చేయాలి అని చెప్పి, ఆ విధముగా చేయని వాళ్ళకి మెమో ఇచ్చారు. అంటే మన వెన్నంటి వుండి ఎంతో సూక్ష్మమైన విషయాలలో కూడా నడిపిస్తున్నారని

అని తెలుస్తోంది. అట్టి **సద్గురువుపై ప్రతి (చిన్న) విషయానికీ ఆధారపడటమే మన ఉద్ధరణకు, వారి కృప అనుభవించుటకు కావలసినది.**

వెంకటేశ్వరరావు గారు సార్ దగ్గర చీట్లు పెట్టి ఆ ఆజ్ఞల ప్రకారం 2019 లో ఇల్లు కట్టిస్తున్నారు. చాలా రోజుల పాటు అనుకున్న విధంగా కట్టుబడి జరగట్లేదు. దాన్ని చూసి వెంకటేశ్వరరావు గారు సార్ పటం దగ్గర 'ఏమిటి సార్! మీరు చెప్పినట్లు చేయిస్తుంటే కూడా పని సరిగ్గా జరగట్లేదు' అని వాపోయాడు. తర్వాత సోమవారం వస్తామన్న బేలుదారు శుక్రవారం వచ్చి ఆదివారం కూడా పనిచేస్తూ ఒక వారం లోపల అంతకు ముందు జరగని పని కూడా పూర్తిచేశాడు. దానితో సార్ నిత్య సత్యులు అని వెంకటేశ్వర రావుకు ధృడపడింది.

చెన్నైలో వుండే శేషు కృష్ణ గారు 2019 నవంబర్ నెలలో శ్రీ గురుచరిత్ర పారాయణ చేశారు. పూర్తయిన రోజు రాత్రి సార్ కలలో కనపడి "శేషుకృష్ణ, ఏ పని చేస్తున్నా భగవంతుని, మాస్టర్ ని గుర్తుంచుకో" అని చెప్పారు. **గురు చరిత్ర పారాయణ చేస్తే సార్ కనపడటం అంటే సార్, శ్రీ దత్తాత్రేయుడు అని చెప్పి నమ్ముతున్నా**నని తెలుపుతున్నారు.

శ్రీ సార్ స్మృతిమాత్ర ప్రసన్నులు, స్మృతి రహిత ప్రసన్నులు కూడా అని ఈ లీల తెలుపుతోంది. జి. రవి, తిరుపతి, 2019సం|| ఒక సందర్భంలో అప్పటి పరిస్థితులు మానసికంగా కష్టంగా తోచి మనసులో భగవంతుని అండ ఉండే ఇలా జరుగుతోందా? లేక నా కర్మ వల్ల భగవంతుని అనుగ్రహానికి దూరంగా వెళ్లి పోతున్నానా? అనుకున్నాడు. ఆ రోజు రాత్రి శ్రీ సార్ స్వప్నంలో కనపడి **"కష్టాలు వస్తుంటే భగవంతుని అనుగ్రహం ఉన్నట్లా ? లేనట్లా?"** అని అడిగారు. రవి "కష్టాలు భగవంతుని అనుగ్రహానికి గుర్తు" అన్నాడు. శ్రీ సార్ అదృశ్యం అయ్యారు. ఇలా శ్రీ సార్ తో అనుబంధం గల వారికి శ్రీ సార్ ను ఉద్దేశించి ప్రార్థించినా, లేకున్నా వారికి తగు అనుభవం ఇచ్చి సందేహం తీర్చడం లో వారి దయ, ప్రేమ గుర్తించగలము.

శ్రీ సార్ లెటర్ ల ద్వారా తన సన్నిధి ప్రసాదించి తగు సమయంలో తగిన ఆదేశం ఇవ్వటం సాయి శివకు శ్రీ సార్ భౌతికంగా ఉన్నప్పుడు బాగా అనుభవం. 2019 సం||లో సాయి శివకు వచ్చిన స్వప్న సందేశం శ్రీ సార్ భోధనా దక్షతను, మనను అప్రమత్తులై శుభ్రమార్గంలో నడిపించే రీతిలో ఇప్పటికీ ఏమాత్రం కొదవ లేదని తెలుపుతోంది. సాయి శివ కలలో "ఒక రోజు తను శ్రీ సార్ వద్దకు గొలగమూడి వెళ్ళాడు. సార్ కుర్చీలో కూర్చొని ఉన్నారు. శివను రమ్మని కూర్చోమని చెప్పారు. శివతో ఇంక T.V. చూడవద్దు అని చెప్పి

ఒక పుస్తకం తెప్పించి అందులో 'ఇంక T. V చూడను' అని వ్రాయించారు. తరువాత ఒక శ్లోకం కూడా వ్రాయించారు". శివ తనకు అంతగా చూడాలని ఉన్నా, లేకున్నా అప్పుడప్పుడు T.V సీరియల్స్ అవి చూడటం మామూలుగా జరుగుతోంది. శ్రీ సార్ మనం ఆదమరచిన క్షణాలను, లోపాలను గుర్తింప చేసి, తోడుండి ఎప్పటిలానే స్మృతి రహిత ప్రసన్నులుగా సరి చేస్తున్నారని గుర్తించాడు. ఇదివరలో "శ్రీ నాంపల్లిబాబాగారు స్వప్న దర్శనం ఇచ్చినప్పుడు, శివ తనకు ఏ మహాత్ములూ భౌతిక దర్శనం ఇవ్వలేదని అనుకుంటే, మరురోజే శ్రీ సార్ లెటర్ లో "మహాత్ముల స్వప్న దర్శనం, భౌతిక దర్శనంతో సమానమే" అన్న సందేశంతో లెటర్ రావటం శివకు గుర్తు వచ్చింది.

**శ్రీ సార్ మనకు నియమపాలన చేయించడంలో ఎన్ని మార్గాలు అవలంబిస్తారో** ఈ క్రింది అనుభవం కూడా తెలుపుతోంది.

2019 లో ఒకసారి సాయి సుబ్రహ్మణ్యం అపుడపుడు ఇంటర్నెట్ చూస్తూ సమయం వ్యర్థం అవుతోంది అని "వారం రోజులు ఇంటర్నెట్ జోలికి పోనని" నియమము పెట్టుకున్నాడు. మూడు రోజులు అయ్యాక పాలు మారి మరల ఇంటర్నెట్ లో ఏవో చూడటంతో కాలం వ్యర్థం చేయటమే కాక పెట్టుకున్న నియమం ప్రక్కకు తోసి వేసాడు. పైగా సార్ ఉన్నప్పుడైతే హెచ్చరించేవారు, సార్ సన్నిధి తోనో, అనారోగ్యం పెట్టి అయినా బయట పడవేసే వారు. ఇప్పుడు ఎలా బయట పడేది ? అనుకున్నాడు. మరో రెండు మూడు రోజులలో తనకు కొంత అనారోగ్యం రావటం, ఆ అనారోగ్యం తను పెట్టుకున్న నియమం, ఉల్లంగించడం (శ్రీ సార్ కు ఇచ్చిన మాట తప్పటం) వల్లనే నని శ్రీ సార్ గుర్తింపు కలుగ చేసారు. శ్రీ సార్ కు సాయి క్షమాపణ చెప్పుకున్నాక మరల రెండు, మూడు రోజులలో ఆరోగ్యం చేకూరింది. సార్ భౌతికంగా ఉండగా తనను నియమ పాలన చేయించుటకు మొండి ఎద్దుల సేద్యం ఉదాహరణ చెబుతూ అవసరమైన సమయాలలో అలానే చేయించేవారు. ఇప్పటికి అంత స్పష్టంగా నడిపిస్తూ మనలను ఉద్ధరిస్తున్న సార్ కు హృదయ పూర్వక కృతజ్ఞతలు.

సార్ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మన వెన్నంటే ఉన్నారని, మన తప్పులు సరిదిద్దుతూ ఉంటారని తెలిపే ఈ మధ్యనే జరిగిన ఒక సంఘటన. 2018 ఫిబ్రవరి లో నగేష్ కొన్ని సార్ వ్రాసిన లెటర్స్ 3 పేజీలు శ్రీ రామకృష్ణ బట్టుకి ఇచ్చి టైపు చేసిపెట్టమన్నాడు. అతను ఒప్పుకుని చెప్పిన తేది తర్వాత కూడా ఆ పని పూర్తి చేయలేదు. ఆ రోజు రాత్రి కలలో అతని మీసం సగం

తీసేసినట్లున్న అతని ముఖం అద్దంలో రెండు సార్లు చూపించారు. దాంతో సార్ చేసిన హెచ్చరిక అర్థమై, మరురోజు వెంటనే శ్రీ రామకృష్ణ బట్టు ఆ టైపింగ్ పని పూర్తి చేసి పంపించాడు.

బట్టు వాళ్ళ పాపకు 4 సంవత్సరాలు. అన్నం తిన్న తర్వాత ఐస్ క్రీం తినటం అలవాటు. ఐస్ క్రీం ఇవ్వకపోతే ఏడుస్తుంది, విసిగిస్తుంది. ఒకరోజు రాత్రి బట్టు, వాళ్ళ పాప బయట నుండి ఐస్ క్రీం తీసుకు వచ్చారు. అన్నం తిన్న తర్వాత ఐస్ క్రీం తినాలని ఆలోచన. ఇంటికి రాగానే refrigerator లో పెట్టారు. బట్టు భార్య బట్టుతో 'ఎందుకు తీసుకు వచ్చారు. దానికి జలుబు చేస్తుంది' అని చెప్పేసరికి బట్టు 'ఎందుకు తీసుకు వచ్చాము, పిల్లకి ఏమైనా అయితే బాగుండదు కదా' అని అనుకుంటూ సార్ ని మనస్సులో తలచుకుంటూ 'సార్! మీరు సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు. మేము చేసే ప్రతి పని చూస్తున్నారు కదా అలా అయితే పిల్ల ఐస్ క్రీం అడగకుండా మరిపించ గలరా?' అని అనుకుంటూ, అయినా ఇంత చిన్న విషయాలు సార్ కి చెప్పకూడదు అనుకున్నాడు. అన్నం తిన్న తర్వాత refrigerator ముందరే కూర్చుని తినే పిల్ల ఆటల్లో పడి ఐస్ క్రీం విషయం మరిచిపోయింది. ఆ చిన్న సంఘటనతో **సార్ నిరంతరం మనం చేస్తున్న పనులు, ప్రార్థనలు చూస్తూ మనకు శ్రేయస్కరమైనది చేస్తున్నారనే నమ్మకం దృఢపడింది.**

శ్రీ రామకృష్ణ బట్టు దాదాపు 6 సంవత్సరముల నుండి సినిమా థియేటర్ కి వెళ్ళలేదు. 2019 లో వాళ్ళ అమ్మగారు చెన్నైలోఉంటే, ఆమెకు మనోరంజకంగా ఉంటుంది కదా సినిమాకి తీసుకు వెళ్ళేదామనుకున్నాడు. అందుకని పర్మిషన్ కోసం అమ్మగారికి (సార్ ధర్మపత్ని) చెపితే వెంటనే అమ్మగారు "ఈయన మమ్మల్ని సినిమా థియేటర్ లో దించి సినిమా అయిన తర్వాత వచ్చి తీసుకు వచ్చేవారు" అని చెప్పారు. బట్టు పర్మిషన్ రాలేదని కొంచెం బాధ పడ్డాడు. కొన్ని వారాల తర్వాత మే 2019లో సార్ దగ్గర చీట్లు పెడితే సార్ సినిమాకు వెళ్ళవద్దని చెప్పారు. బట్టుకు సినిమా థియేటర్ కు వెళ్లకూడదని పట్టుదల పెరిగింది. పైగా అమ్మగారి మాట, సార్ మాట ఒక్కటే అని విశ్వాసం దృఢపడింది.

అంతేగాకుండా చీట్లు పెట్టిన రోజు రామకృష్ణ బట్టు సార్ తో మనస్సులో మాట్లాడుతూ సార్ మీరు చెప్పినట్లు సినిమా కి వెళ్ళలేదు కదా! మరి నాకు ప్రమోషన్ ఇస్తారా? అని అడిగాడు. తర్వాత దాని గురించి అతను మర్చిపోయాడు. రెండు నెలల తర్వాత ఆగస్టు మొదటి వారంలో రామకృష్ణ బట్టుకు ఆఫీసులో ప్రమోషన్ వచ్చింది. ఆఫీసులో చాలా కాంపిటీషన్ ఉంది,

కానీ రామకృష్ణ బట్టుకు ప్రమోషన్ రావడం సార్ కృపగా భావిస్తున్నాడు. రామకృష్ణ బట్టు మనసులో అనుకున్న దానికి సార్ విని దానికి తగ్గట్లు స్పందించి ఆయన కృప వహిస్తున్నారు.

ఆగస్ట్ 4 వ తేదిన (2019) ఆదివారం ఉదయం సత్సంగంలో రామకృష్ణ బట్టు తన ప్రమోషన్ గురించి చెప్పినప్పుడు హైమవతికి (హైదరాబాద్) ఒక అనుమానం వచ్చింది. అది ఏమిటంటే 'సార్! మీరు నన్ను కూడా చూస్తున్నారా?' అని. సత్సంగం అయిన తర్వాత హైమవతి ఓ గంట సేపు పడుకున్నది. అప్పుడు కలలో, "సార్ మంచం మీద కూర్చున్నారు. హైమవతి సార్ దగ్గరికి వెళ్లింది. సారు ఆమెను ఒక చిన్న పిల్లని తీసుకుని ముద్దు పెట్టుకున్నట్లు ఆమె చుట్టూ చేయి వేసి ప్రోత్సహించినట్లు తట్టి ముందరకి వచ్చి ఆమె బుగ్గ మీద రెండుసార్లు ముద్దు పెట్టారు". దానితో సార్ ఆమెను కూడా గమనిస్తున్నారని తెలుసుకుని ఆనందపడింది. ఆమె అనుకోగానే సార్ స్వప్నదర్శనం ఇవ్వటం కేవలం ఆయన కృప.

గురుభక్తి లో స్థిరమైన శ్రీ సార్ పొందిన స్థితిని ప్రకటం చేసే అరుదైన సంఘటన: శ్రీ సార్ మృత్యువు పై ఘన విజయం

శ్రీ వెంకయ్య స్వామి సన్నిధిలో 40 రోజులు గడపాలి అనుకొని శ్రీ భరద్వాజ మాష్టారి ప్రత్యక్ష భక్తులైన శ్రీ చింతా లక్ష్మి నారాయణ గారు (హైదరాబాద్), వారి ధర్మ పత్ని చింతా లక్ష్మి గార్లు గొలగమూడి లో సార్ సమాధి మందిరం దగ్గరలో 2018 డిసెంబర్ చివరి వారం నుండి ఉంటున్నారు. చింతా లక్ష్మి గారు శ్రీ సార్ సమాధిని రోజూ దర్శించుకోవటం, సమాధికి ప్రదక్షిణలు చేయటం వారి నిత్య విధిలో భాగంగా ఈ 40 రోజులు చేస్తున్నారు. శ్రీ సార్ గురుపాదుకా (సామూహిక) పూజ డిసెంబర్ 30 వ తేదిన చేసుకోవటం లో కూడా వారు పాలు పంచుకొన్నారు. ఆ పూజలో సార్ పాదుకలకు, సార్ భౌతికంగా ఉన్నప్పుడు ధరించిన రబ్బరు చెప్పులకు కూడా పూజ చేయటం శ్రీ చింతా లక్ష్మిగారు చూచి, వారికి సార్ తో గల చనువు వల్ల, శ్రీ భరద్వాజ మాస్టారిని వారు సేవించుకొనేటప్పుడు సార్ కూడా వారి సహా భక్తులుగా, గురు బంధువులుగా గల పరిచయం వల్ల వీళ్ళకు పిచ్చా! ఏమిటి? రబ్బరు చెప్పులు తెచ్చి సమాధి మీద పెట్టారు అనుకున్నారు. వారికి శ్రీ సార్ పై కూడా గల గౌరవం, గురుభావంతో ప్రదక్షిణలు రోజూ చేస్తున్నారు.

2019 జనవరి8 వ తారీఖున (మంగళవారం) వారు ప్రదక్షిణ చేస్తుంటే ఉన్నట్టుండి శ్రీ సార్ వారి ఇంటి వైపు నుండి సమాధి వద్దకు వస్తూ బావి దగ్గర నిలుచుని భౌతికంగా మధ్యాహ్నం అప్పుడు కనబడ్డారు. మరల తొంగి చూసినా

సార్ భౌతికం గా వస్తున్నారు. అంతలోనే మరో సెకనులో అదృశ్యమైనారు. ఏదో నా భ్రమ ఏమో అని ఆ రోజు ఎవరికీ చెప్పలేదు.

మరల 2019 జనవరి 10 వ తారికు(గురువారం) రోజు స్పష్టంగా భౌతిక దర్శనం ప్రసాదించారు. మరల ఒక సెకను కనపడి తరువాత అదృశ్యమైనారు. ఈ రీతి శ్రీ సత్-చిత్-ఆనంద స్వరుపులైన శ్రీ సార్ దయతో వారి నిజతత్వాన్ని ఎరుకపరిచారు.

పరంధామయ్యగారు సార్ సమాధి మందిరంలో పూజారిగా ఉంటున్న రోజులలో ఒకరోజు సాయంత్రం శ్రీ వెంకయ్యస్వామి భజన మందిరంలో భజన చేస్తున్నాడు. సార్ భజన మందిరం ద్వారం దగ్గర పరంధామయ్యకు కనబడ్డారు. వెంబడే సాయం ఆరతి 6:15 PM కి ఉంది కదా, మర్చిపోయనే సార్ గుర్తు చేసారు అని పరంధామయ్య సార్ సమాధి వద్దకు వచ్చి సాయం ఆరతి ఇచ్చాడు.

సూళ్ళూరుపేట వాస్తవ్యులు మదన్ కుమార్ కి, మహనీయులు గురించి, దైవం గురించి శ్రీ భరద్వాజ మాస్టర్ గారి రచనలు, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారి రచనలు చదివాక భగవంతుడు అంటే అప్పటి వరకు ఉన్న అపోహలు కొంచెం తొలిగాయి. **భగవంతుడు మనకు సర్వకాల సర్వావస్థలయందు తోడు ఉండి మనకు ఏది మంచో అదే చేస్తారు అనే భావం నిదానంగా దృఢ పడసాగింది.**

ఒకసారి మదన్ కి తన బంధువులతో ఆర్థిక లావాదేవీల విషయంలో ఏవో మనస్పర్ధలు వచ్చాయి. ఈయన కుటుంబ సభ్యులు తాడో పేడో తేల్చుకుందాం అంటారు. కానీ ఇతను కల్పించుకొని "ప్రతిదానికి అలా అనడం సబబు కాదు, నేను వెళ్లి మాట్లాడుతాను సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందాం" అని చెప్పాడు. ఇతను చెప్పినట్లే తన బంధువులతో (అప్పటివరకు గత కొంతకాలంగా వారి కుటుంబ సభ్యులతో సఖ్యతగా లేనివారితో) సామరస్యంగా మాట్లాడి వచ్చాడు. మూడు నెలలు గడిచినా ఫలితం లేదు. ఈయన కుటుంబంలో ఇతన్ని నిందించడం మొదలుపెట్టారు, అదేమంటే వీరి మంచి తనాన్ని అవతలి వారు చేతకానితనంగా తీసుకుంటున్నారు, అంతా ఇతని వల్లే అని.

అప్పుడు సార్ కి అతను బాధతో తన పరిస్థితిని ఇలా చెప్పుకున్నాడు. "వెంకయ్య స్వామి వారు, మీరు నా జీవితంలోకి వచ్చాక నా ఆలోచనా విధానం మారిపోయింది (అంతకుముందు చాలా ఆవేశం, ఎలాగైనా మాట

నెగ్గించుకోవాలి అనే గుణాలు ఎక్కువగా ఉండేవి). మా వాళ్లు నాతో పాటు, నేను నమ్మే మిమ్మల్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎలాగైనా మీరే మీ సర్వసమర్థత్వాన్ని నిరూపించుకోవాలి" అని ప్రార్థించాడు

ఈ విషయంలో చాలా చిత్రంగా శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు తమ సర్వసమర్థతను, "నన్ను నమ్మిన వారి కోసం ఏమైనా చేయగలను" అని నిరూపించారు. అవతలి వారి హృదయాలను ఎలా ప్రేరేపించారో ఏమోగాని ఊహకందని విధంగా వారు పాత పగలు, పట్టింపులు అన్నీ మరిచిపోయి, ఇతని కుటుంబంతో చక్కగా కలిసిపోయి, వీళ్ళకు ఇవ్వవలసిన డబ్బులు కూడా ఇచ్చారు. . కానీ ఈ జటిల సమస్య అంత త్వరగా పరిష్కారం అవుతుందని తను కలలో కూడా ఊహించలేదు, ఎందుకంటే వారి కుటుంబాల మధ్య మనస్పర్థలు అంతగా పెరిగిపోయాయి. అప్పటి నుంచి వీరి కుటుంబంలో కూడా శ్రీ స్వామి వారి మీద, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారి మీద నమ్మకం బలపడింది.

---

సూళ్లూరుపేట నివాసి మదన్ కుమార్ **"అమ్మగారు సుబ్బరామయ్య సార్ పార్వతీ పరమేశ్వరుల స్వరూపం"** అని చెపుతున్నారు.

ఒకప్పుడు కుటుంబ సమస్యలతో మదన్ కు మనసు చికాకుగా ఉండింది. కానీ నిత్య పారాయణ మాత్రము క్రమం తప్పకుండా చేస్తూ ఉండేవాడు. ఒకనాటి రాత్రి కలలో సుబ్బరామయ్య సార్ వారి ఇంట్లో చెక్క కుర్చీ లో కూర్చుని, తెల్లటి వస్త్రాలు ధరించి కనిపించారు. మదన్ వెంటనే 'సుబ్బరామయ్య సార్ సమాధి అయ్యారు కదా! నాకు ఇప్పుడు భౌతికంగా కనిపిస్తున్నారు, నేనెంత అదృష్టవంతుడిని అని వెంటనే సార్ కాళ్ల మీద పడి 'సార్ చాలా ఇబ్బందిగా ఉంది, నా వల్ల కావట్లేదు' అని కన్నీటితో అప్పటి అతని సమస్యలు చెప్పుకున్నాడు. దానికి సార్ "అన్నింటికీ నీవు ఎందుకు బాధ పడతావు? మీ అమ్మానాన్న ఏం చేస్తున్నారు? వాళ్లు చూసుకుంటారులే!" అని అభయమిచ్చారు. అంతటితో మదన్ మనసు స్థిమిత పడి, సారే అతని అమ్మా నాన్నలకి హృదయ ప్రేరణ పెట్టి వారిని చక్కగా నడిపిస్తారు అని ధైర్యం వచ్చింది.

సార్ ఈ విధంగా భౌతికంగా కనిపించడం, అతని సమస్యలన్నింటిని సార్ కి చెప్పుకోవడం ద్వారా అతను సంభ్రమాశ్చర్యాలతో ఉంటే, కలలోనే అమ్మగారు (సార్ వాళ్ళ ధర్మపత్ని) మాత్రం గుమ్మం దగ్గరికి వచ్చి "ఈరోజు మీకు ఏ కూర కావాలి?" అని సార్ ని అడుగుతున్నారు. అమ్మగారు సార్ ని ఈ విధంగా అడిగేటప్పుడు చాలా సాధారణంగా ఉన్నారు, అంటే అమ్మగారికి సార్

నిత్యమూ భౌతిక దర్శనం ఇస్తున్నారు కాబోలు అందుకే ఇంత సాధారణంగా మాట్లాడగలుగుతున్నారు అనిపించింది. అంతటి భాగ్యం కలగాలంటే అమ్మ గారు కూడా సార్ స్థితిని పొంది ఉండాలి, "అమ్మగారు సార్ వేరు కాదు, వారు ఆదిదంపతులయిన పార్వతీ పరమేశ్వరుల స్వరూపం" అనిపించింది.

శ్రీరామకృష్ణ బట్టు ఇలా చెప్తున్నారు :

నేను ఆఫీసుకు లేటుగా వెళితే ఆ పూట అన్నం తినకుండా ఉండే నియమం పెట్టుకున్నాను. కొన్ని రోజులు గడిచింది. తర్వాత నాకొక అనుమానం వచ్చింది ఇదంతా నేను అనవసరంగా పెట్టుకున్న నియమమా లేదా సార్ కి అదేశంగా పెట్టుకున్నానా అని అనుమానం వచ్చింది. అందువలన నేను వెంటనే సార్ తో మనస్సులో "సార్! పెట్టుకున్న నియమం మీకు ఇష్టమైతే ఎదురుగా వచ్చే కారు నెంబర్ చివర్లో 0 ఉంటే ఈ నియమాన్ని హృదయ పూర్వకంగా పాటిస్తాను" అని చెప్పుకున్నాను. చాలా చిత్రంగా ఎదురుగుండా వచ్చే కారు యొక్క నెంబర్ చివర్లో జీరో ఉన్నది. అంతే ఆ సూచన సారు ఆజ్ఞాపించింది అన్నట్లు తీసుకొని ఆఫీస్ కు లేటుగా వెళ్లకుండా ఉండేది ఒకవేళ లేటుగా వెళితే ఆ పూట అన్నం తినకుండా పాటిస్తున్నాను. నియమం పెట్టుకున్న తర్వాత ఆఫీసుకి లేటు గా వెళ్ళేది నెల రోజుల్లో ఒకటి రెండు రోజులకు వచ్చింది. అంతకు ముందు దాదాపు 4 - 5 రోజులు లేటుగా వెళ్లేవాడిని.

2019 జులై 7వ తేదీన మా అబ్బాయి సైకిల్ మీద వస్తూ రాయి తగిలి క్రిందపడితే తెలిసిన వాళ్ళు హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ముందు పళ్ళు ఉడిపోవటం వల్ల, చెన్నె రామచంద్ర మెడికల్ సెంటర్ లో అడ్మిట్ అయ్యి, చిన్న సర్జరీ చేయించుకుని వారం రోజులు ఉండాల్సి వచ్చింది. ఇంత పెద్ద ప్రమాదం లో కూడా వాడికి నొప్పి లేకుండా చేయటం కేవలం సార్ కే చెల్లింది. ప్రతిరోజూ నర్స్ వచ్చి painkiller voveran ఇంజెక్షన్ ఇస్తానంటే వద్దు, నాకు నొప్పి లేదు అనేవాడు. మిగతా ఇంజెక్షన్ మాత్రం చేయించుకునే వాడు. అంటే **మన జాతకం వల్ల గాని, ఆలోచనలు, కర్మ వల్ల గాని ప్రమాదం జరగవలసి ఉండి జరిగినా, కొండంత ని గోరంత గా మార్చి రక్షిస్తారు.**

అమ్మగారు ఒక ఆదివారంనాడు నెల్లూరు లో ఉన్న వాళ్ళమ్మాయి (సుమతి అక్క) వాళ్ళ ఇంట్లో నుంచి బయలుదేరి గొలగమూడికి సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత వచ్చారు. అప్పుడు వచ్చిన అమ్మ గారు నాతో “ఇంట్లో కొన్ని పనులు ఉన్నాయి. నువ్వు చేసి పెడతావా? కానీ నువ్వు చేసే సరికి లేట్ అవుతుంది మరి నీకు ఇబ్బంది అవుతుందేమో” అని అడిగారు.

అలాగే అమ్మగారు నేను పనిచేసి బయలుదేరి వెళతాను. ఎట్లాగు నేను గుంటూరు వెళ్ళాలి రాత్రి రెండు గంటలకి కూడా గుంటూరుకి ట్రైన్స్ ఉంటాయి. అందువలన ఇబ్బంది లేదు అమ్మగారు అని చెప్పాను. అమ్మ గారే నాతో రైళ్లు ఉంటాయిలే గాని, నీకు రాత్రిపూట ఆటోలు ఎక్కడ దొరుకుతాయి అన్నారు. కానీ పని చేసి మధ్యలో బయటకు వచ్చిన తర్వాత ఒక ఆలోచన వచ్చింది. ఆటో బాడుగ మాట్లాడుకుని వెళదాము అని వాకబు చేస్తే ఆటో లు రాత్రుళ్ళు బాడుగకు రావట్లేదు అని చెప్పారు. సరే సార్. అంతా మీ ఇష్టం. ఎలా కుదిరితే అలా జరిపించండి అనుకున్నాను. ఇంతలో వేణుగోపాల్ సార్ వాళ్ళ పెద్దబ్బాయి సాయి నన్ను చూసి మాట్లాడుతూ మా నాన్నవాళ్ళు పిఠాపురం వెళ్లి వస్తున్నారు అందువలన రాత్రి ఒంటి గంటకి నేను రైల్వే స్టేషన్ కి వెళ్లి ఆయనను తీసుకు వస్తాను అప్పుడు రైల్వే స్టేషన్ దగ్గర మిమ్మల్ని డ్రాప్ చేస్తాను అని చెప్పాడు. అంతే ఆ క్షణం నాకు ఎంతో ఆనందం కలిగింది. **సార్ కి మనం సేవ చేయడానికి పూనుకుంటే, మనకు అవసరమైన సమస్తం సార్ సమకూరుస్తారు అని చక్కగా అర్థం అయింది.**

ఇలాగే, ఇదివరకు ఒకసారి గొలగమూడి నుండి అమ్మగారి దర్శనం కోసం నెల్లూరు (సుమతి అక్క వాళ్ళ ఇంటికి) వెళ్లటమా లేక సదుపాయంగా వేణుగోపాల్ సార్ కార్లో మద్రాస్ వెళ్ళటమా అని ఆలోచించి, అమ్మ గారి దర్శనానికే వెళ్ళాను. చక్కగా దర్శనం అయినాక ఫోన్ చేస్తే, వేణుగోపాల్ సార్ వాళ్ళ అత్త గారిని దింపటం కోసం నెల్లూరు వచ్చారు అని తెలిసి, నేను అయ్యప్ప గుడి దగ్గర వాళ్లని కలుసుకుని హాయిగా కార్లో మద్రాస్ చేరుకున్నాను.

నేను కళ్ళజోడుని ఐదు వందల రుపాయలకు కొన్నాను. మా ఆఫీస్ లో కళ్ళజోడు కొనుక్కున్నప్పుడు బిల్లు పెట్టుకోవచ్చు. ఎంత బిల్లు పెడితే అంత డబ్బులు ఇస్తారు. నేను అందువలన 500 రూపాయలు కళ్ళజోడు కి ఐదు వేల రూపాయల బిల్లు పెట్టి డబ్బులు తీసుకున్నాను. ఆ తర్వాత నుండి నాకు కళ్లు తిరగటం ప్రారంభం అయింది. కొన్నాళ్ళ తర్వాత నేను తట్టుకోలేక వెంకయ్య స్వామి! ఇది నేను 500 రూపాయలకు 5000 రూపాయలు తప్పుడు బిల్లు పెట్టడం కారణం అయితే 5000 రుపాయలు మీకు దక్షిణగా ఇచ్చేస్తాను అని చెప్పుకున్నాను. అంతే స్వామికి చెప్పుకున్న తరువాత రోజు నుండి, కళ్ళు తిరగటం పోయింది.

సార్ భౌతికంగా మన మధ్య ఉన్నప్పుడే ఒక రోజు రాత్రి నాకు కలలో కనబడి అన్నం వడ్డించి పిలిస్తే నేను గుడికి వెళ్లి వస్తాను అని అంటే చెప్పులు

వేసుకుని వెళ్ళు అని చెప్పారు. నేను మందిరం నుండి వస్తూ ఒకరితో ఎక్కువ సేపు కబుర్లు చెప్పాను. సార్ దగ్గరకి వెళ్లి కాళ్ళు కడుక్కొని వస్తానని చెప్పి వెళ్ళాను. తర్వాత సార్ అక్కడ లేరు. అన్నం తినే అవకాశం కోల్పోయాను. తెల్లవారిన తర్వాత అయ్యో ఎంత అదృష్టం పోయిందో అనిపించింది. గొలగమూడికి వచ్చినప్పుడు సార్ కి చెప్పి సార్ మీరు పెట్టిన అన్నం తినలేకపోయాను కానీ నిజ జీవితం లో అలా జరగకుండా చూడండి అని చెపితే సార్ మొదట మౌనంగా ఉన్నారు. తరువాత మళ్ళీ సారొక్కరే ఉన్నప్పుడు ప్రార్థిస్తే, "సరే" అన్నారు.

సార్ 2017 లో సమాధి అయ్యారు. 2019 నవంబర్ లో నాకు కలలో "ఒక రూములో సార్ మంచం మీద విష్ణుమూర్తి లాగా పడుకున్నారు. అమ్మగారు లక్ష్మీదేవి లాగా కాళ్ళు నొక్కుతున్నారు. వేణు రాలేదా అని అడిగారు. అంతలోనే వేణుగోపాల్ గారు వచ్చారు. తర్వాత క్రింద కూర్చుని అన్నం పెట్టారు. ఇంకా ఎవరైనా ఉన్నారేమో పిలువు అన్నారు. వేరే వాళ్ళు వస్తే వాళ్ళకి కంచం ఇవ్వాలని నేను త్వరగా తింటున్నాను". ఈ కలతో నాకు సార్ "సర్వమూ చూసుకుంటాను" అని చెప్పినట్లు ఉన్నది. సమాధి తర్వాత కూడా నాకు ఏమి కావాలో చూస్తూ, నాకు ఇచ్చిన మాటని నెరవేర్చారు.

చిత్తరంజన్ గారు హైదరాబాద్ లో నాంపల్లిబాబా గారి దర్శనం చేసుకుంటూ ఉండేవారు. తన స్నేహితుడు రామకృష్ణ ద్వారా గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామి, సార్ ల దర్శనం చేసుకున్నారు. సార్ వ్రాసిన గ్రంధాలు తీసుకుని చదువుకుంటుండే వారు. ఒకరోజు హైదరాబాద్ నుండి ఇండోర్ కు ఇండిగో flight లో వెళుతూ మనస్సులో "నా ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోకూడదు. సాయిబాబాను కూర్చో పెడతాను" అనుకున్నారు. మనస్సులో అనుకున్నట్టే వారి ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోలేదు. ఆ ప్రయాణంలో "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" శ్రీ సార్ జీవిత చరిత్ర గ్రంథం పారాయణ చేశారు. కొన్ని రోజులకు సార్ ఇప్పుడు లేరు కదా అనుకుంటే ఆనాటి రాత్రి వారి కలలో "ఒక ఇంటి మధ్యలో సార్ ఇటుకరంగు షర్టు, గళ్ళ లుంగీ, గడ్డంతో కూర్చుని ఉన్నారు. సార్ ముఖం pleasing గా ఉంది". తర్వాత రోజు నుండి చిత్తరంజన్ మనస్సు ప్రశాంతంగా ఉంది.

ఈ లీలలను బట్టి **సార్ అన్నివేళలా అన్నింటినీ గమనిస్తున్నారనీ, అంతేగాకుండా అవ్యాజ కరుణ, అనుగ్రహంతో మనల్ని సరైన మార్గంలో అనుక్షణం నడిపిస్తున్నారని తెలుస్తోంది! శ్రీ సార్ నిత్యసత్యులు.**

# మా ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | అవధూత లీల– (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) | 40 రూ॥ |
| 2 | అవధూత లీల (ఇంగ్లీషు) | 30 రూ॥ |
| 3 | అవధూత లీల (తమిళం) | 60 రూ॥ |
| 4 | అవధూత బోధామృతం – శ్రీస్వామివారి బోధలు | 15 రూ॥ |
| 5 | శ్రీ స్వామి సన్నిధి – శ్రీ స్వామివారితో వారి సేవకులఅనుభవాలు | 15 రూ॥ |
| 6 | భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) | 5 రూ॥ |
| 7 | శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) | 5 రూ॥ |
| 8 | గురుస్తుతి | 10 రూ॥ |
| 9 | చూచి నేర్చుకో | 15 రూ॥ |
| 10 | శ్రీ మాస్టారుగారి బోధామృతం (నాకు తెలిసిన మాస్టారు 1,2 భాగములు – శ్రీ మాస్టారి మంచి మాట) | 60 రూ॥ |
| 11 | శ్రీ ధునివాలాదాదా చరిత్ర | 15 రూ॥ |
| 12 | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము | 10 రూ॥ |
| 13 | శ్రీ బూర్లె రంగన్నబాబుగారి దివ్యచరితము | 10 రూ॥ |
| 14 | శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర | 6 రూ॥ |
| 15 | శ్రీ పూండీ స్వామి వారి దివ్యచరిత్ర | 15 రూ॥ |
| 16 | శ్రీ యర్ర దర్గాస్వామి వారి దివ్యచరిత్ర | 5 రూ॥ |
| 17 | శ్రీ నరోపా గారి జీవిత చరిత్ర | 2 రూ॥ |
| 18 | వార్తాలాపము | 250 రూ॥ |
| 19 | దైవం మానుష రూపేణ (దర్గాస్వామి చరిత్ర) | 50 రూ॥ |
| 20 | శ్రీ నాంపల్లిబాబా గారి దివ్యలీలలు | 10 రూ॥ |
| 21 | శ్రీ వెంకయ్యస్వామి ఆరతులు | 5 రూ॥ |
| 22 | శ్రీ అవధూతేంద్రస్వామి దివ్యలీలలు | 6 రూ॥ |
| 23 | శ్రీ నల్లమస్తాన్‌బాబా గారి దివ్యలీలలు | 6 రూ॥ |

## 5 రూపాయి పుస్తకములు

1. శ్రీ వెంకయ్యస్వామి పూజ
2. శ్రీ స్వామివారి భజన పాటలు
3. నమ్మలేని పచ్చి సత్యాలు
4. అమృత వాక్కులు
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమ
7. సర్వ సమర్థుడు
8. వెన్నెలపూలు – శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం
9. దివ్యలీలలు
10. బోధ యజ్ఞాయనమ:
11. ధర్మమూర్తి
12. పిలిచిన పలికే దైవం
13. శ్రీ స్వామికృప
14. మౌనబోధ
15. వాళ్ళు వుండేదాన్ని బట్టి కదయ్యా మనముండేది!
16. స్వామి అనుగ్రహము
17. మాస్టరుగారి సత్సంగము
18. శ్రీ మాస్టారి మంచి మాట
19. మృత్యువుపై ఘన విజయము
20. శ్రీ భరద్వాజగారితో భక్తులఅనుభవాలు
21. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాస్టారు గారు
22. శ్రీ మాస్టరు చూపిన సాయి మార్గం
23. శ్రీ దర్గాస్వామి వారి చరిత్ర – 2వ భాగము
24. శివుని ఆజ్ఞ - 10 రూ॥
25. శ్రీ మాయి అమ్మ
26. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర

ప్రతులకు వ్రాయండి – శ్రీసాయి మాస్టరు సేవా ట్రస్టు, గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321

# సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ సూక్తులు

1. శ్రమతో సేవ - సేవతో కైవల్యం.
2. భగవంతుడు మననుంచి కోరేదేమిటి ?
   I. కాలం II. మనస్సు III. కృతజ్ఞతా భావం
3. పారాయణ, మననం ద్వారా మనలోని రాగ, ద్వేషాలు పలుచబడతాయి.
4. ఎవరి ధర్మాన్ని వారు త్రికరణశుద్ధిగా ఆచరిస్తే వారికి కలిగేదంతా ఆనందమే.
5. మనం లోకాన్ని ఉద్ధరించగలమా? మన కర్తవ్యం మనం చేసుకుంటూ పోవాలి.
6. ఇష్టాయిష్టాలు లేకుండా జీవించడం అభ్యసిస్తే ధ్యానం చాలా సులభంగా కుదురుతుంది.
7. నిత్యం సద్గురువు మనకు ఇచ్చిన అనుభవాలు తలచుకొని పులకించే పూజే పూజ.
8. నీకు సద్గురువు తోడు ఉండాలంటే మొదట విమర్శలు, కబుర్లు మానాలి.
9. ఎప్పుడంటే అప్పుడు, ఎవరు పెడితే వారి దగ్గర, ఎంత పడితే అంత, తినటం మానాలి.
10. సద్గురు కృప పొందాలన్న ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి.
11. ఆలోచనలన్నీ అహంకారమే !
12. ప్రతిదానికి హృదయపూర్వకమైన ప్రార్ధనే సాఫల్యమివ్వగలదు.

**మరుపే మరణం!**